
స్ఫూర్తి ప్రదాతలు

బొల్లోజు బాబా



స్ఫూర్తి ప్రదాతలు

బొల్లోజు బాబా

ఇండెక్స్

మనవి మాటలు


ఈ పుస్తకంలోని వ్యాసాలన్నీ నేను వివిధ సందర్భాలలో, వివిధ పత్రికలు, సంపుటుల కోసం రాసినవి. కొన్ని పుస్తకాలలో భాగంగా ప్రచురితమయ్యాయి. మరికొన్ని ఆయా సందర్భాలకు మాత్రమే రాసినవి. వాటన్నింటినీ ఇప్పుడు ఒకే చోట చేర్చి ఈ పుస్తక రూపంలో మీ ముందుకు తెస్తున్నాను.

ఈ వ్యాసాల్లో చర్చించిన ప్రతి వ్యక్తి సమాజానికి స్ఫూర్తిప్రదాత. కాలిన్ మెకంజీ, జేమ్స్ ప్రిన్సెప్, కావలి సోదరులు, దడాల రఫేల్ రమణయ్య, అల్లూరి సీతారామరాజు, అయోతీ థాస్, ఇస్మాయిల్, డా. చిరంజీవిని కుమారి లాంటి వారు చరిత్ర, సామాజిక చైతన్యం, సాహిత్య రంగాలలో సేవలందించారు.

వారి జీవితాలు, కృషి, సాధనలు ఎందరికో స్ఫూర్తి. వారి స్మృతికి నివాళులు

బొల్లోజు బాబా
14/04/2026

కల్నల్ కాలిన్ మెకంజీ
(1754-1821)



సర్వేయర్ జనరల్‌గా ఉంటూనే వేలకొద్దీ కైఫియత్‌లను సేకరించి స్థానిక చరిత్రలను పదిలపరిచిన మహనీయుడు. ఈయన సేవలు మన చరిత్ర నిర్మాణానికి బలమైన పునాదులు.

కల్నల్ కాలిన్ మెకంజీ

కాలిన్ మెకంజీ 1754లో స్కాట్లాండ్‌లోని Stornoway, Isle of Lewis లో జన్మించాడు. 2 సెప్టెంబర్ 1783న ఈస్టిండియా కంపనీ ఉద్యోగిగా మద్రాసులో అడుగుపెట్టాడు. అది మొదలు 1821లో కలకత్తాలో చనిపోయేవరకూ మెకంజీ ఇండియాలోనే ఉన్నాడు. 1784-90ల మధ్య ఇతను రాయలసీమ-కృష్ణా పరిసర ప్రాంతాలలో కంపనీ సైనిక ఇంజనీరుగా పనిచేసాడు. 1799లో టిపు సుల్తాను ఓటమి కారణంగా కంపనీ పరమైన కర్ణాటక జిల్లాలను, నిజాం దఖలు పరచిన సీడెడ్ జిల్లాలను సర్వే చేసే బాధ్యతను కంపనీ మెకంజీకి అప్పగించింది.

ఆ సమయంలో సర్వే నిమిత్తం కృష్ణా దిగువ ప్రాంతాలను విస్తృతంగా పర్యటించాడు. ఏలూరుకు చెందిన కావలిసోదరుల సహాయంతో మెకంజీ అనేక స్థానికచరిత్రలను, శాసనాలను సేకరించాడు.

స్థానికులు వారి గ్రామచరిత్రను, సరిహద్దులను, దేవాలయ భూముల, పాలకుల వివరములను తాళపత్రములపై వ్రాసి ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేస్తూ భద్రపరచుకొనేవారు. వీటిని దండెకవిలెలు అనేవారు. ఇవి ఆ గ్రామకరణాల వద్ద ఉండేవి. మహమ్మదీయపాలనలో వీటిని కైఫియ్యతులు అనే పేరుతో వ్యవహరించటం మొదలైంది. కైఫియత్ అనే ఉరుదూ పదానికి సంగతులు, విశేషములు అని అర్ధం ఇవి మెకంజీని ఆకర్షించాయి. వాటిని విస్తారంగా సేకరించాడు. తాను సేకరించిన చారిత్రిక సమాచారాన్ని తన మిత్రులతో తరుచూ పంచుకొంటూ చర్చిస్తూ ఉండేవాడు మెకంజీ.

అప్పటివరకూ హిందువులకు చరిత్రను దాచుకోవాలనే శ్రద్ధలేదు అని వాదించిన బ్రిటిష్ చరిత్రకారులను శతాబ్దాలుగా స్థానికులు భద్రపరచుకొన్న

ఈ కైఫియ్యతులు విస్మయపరచాయి. హిందువుల చరిత్రను వ్రాయటానికి హిందువుల మూలాలను శోధించాలి తప్ప పెర్షియన్ మూలాలు కాదు అని మెకంజీ వాదించేవాడు.

ఈస్ట్ ఇండియా కంపనీ 1810లో ఇతనిని మద్రాసు ప్రెసిడెన్సీ సర్వేయర్ జనరల్‌గా నియమించింది. 1811లో జావా ద్వీపంపై ఈస్ట్ ఇండియా Å£ంపనీ సైన్యం దండయాత్ర చేసినపుడు మెకంజీ కూడా ఉద్యోగరీత్యా కంపనీసైన్యాన్ని వెంబడించవలసి వచ్చింది. అక్కడ 18 నవంబరు, 1812న డచ్ సంతతికి చెందిన Petronella jacomina Bartels ను వివాహమాడాడు.

1815లో తిరిగి ఇండియా చేరుకొన్నాకా మెకంజీ భారతదేశ సర్వేయర్ జనరల్‌గా నియమించబడ్డాడు. కలకత్తా సెయింట్ జార్జి కోటలో ఇతని ఆఫీసు. అక్కడకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ ` అప్పటిదాకా ఆంధ్ర, తమిళ, కర్ణాటక ప్రాంతాలలో సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించటం కొరకు మద్రాసులో ఉండేందుకు కంపనీ అనుమతి తీసుకొని 1817 వరకూ మద్రాసులోనే ఉన్నాడు.

1817లో మెకంజీ తన మిత్రుడైన అలెగ్జాండర్ జాన్‌స్టన్ కు వ్రాసిన ఒక లేఖలో ఈ స్థానిక చరిత్రలను సేకరించటంలో తన ఉద్దేశాలను, నిబద్ధతను, కష్టాలను ఇలా చెప్పుకొన్నాడు1 .

1. 1799 లో కంపనీకి సంక్రమించిన ప్రాంతాల హద్దులను నిర్ణయించే పని నాకు అప్పగించినపుడు- సరిహద్దులే కాక ఆ ప్రాంత చరిత్ర, భౌగోళిక స్వరూపాన్ని కూడా అధ్యయనం చేస్తానని నేను చెప్పిన ప్రణాళికను కంపనీ ఆమోదించి ముగ్గురు గుమస్తాలను, ఒక నాచురలిస్ట్‌ను నాకు సహాయకులుగా ఇచ్చింది. కానీ 1801లో వీరిని తొలగించటంతో నా ప్రణాళికలన్నీ భగ్నమయ్యాయి. ఈ ప్రాంతాల జీవరాశిని రికార్డు చేద్దామనే నా ఆలోచన ఫలించలేదు. అంతే కాక నా జీతం, నాకు ఇచ్చే కంటింజెన్సీ డబ్బులు కూడా తగ్గించేసారు. దీనివల్ల నా ప్రణాళిక దాదాపు కుంటుపడింది.
2. అయినప్పటికీ నేనీ పనులు చేయగలిగాను

జైనులు, బుద్ధులు వేరు వేరు అని నిర్ధారించగలిగాను (అప్పట్లో వీటిని హిందూమతంలో అంతర్భాగాలుగా భావించేవారు).

ప్రాచీన మతసాంప్రదాయాలైన లింగాయత్, శైవం, పాండరం, మఠాలు వివిధ శాఖలు వాటి పుట్టుపూర్వోత్తరాలు స్పష్టపరిచాను.

సుమారు మూడువేల వివిధ శిలాశాసనాలు, తామ్రపత్రాలకు
నకళ్ళు తీయించాను

ఢిల్లీ నుంచి కేప్ కొమరిన్ దాకా ఉన్న Veeracul, Maastie culls లోని పురాతనజాతుల సంస్కృతిని వెలికితీసాను. (పైన చెప్పిన అన్ని అంశాలను మెకంజీ మొత్తం 12 రీసెర్చ్ పేపర్లుగా ఆసియాటిక్ జర్నల్ లో ప్రచురించాడు)

3. కొన్నాళ్ళు మద్రాసులోనే ఉంచమని కోరటానికి కారణాలు ఈ లేఖలో ఇలా చెప్పుకొన్నాడు మెకంజీ - "నాకు సహాయకులుగా ఉన్న వ్యక్తులతో నా అనుబంధం వ్యక్తిగతమైనది. వాళ్ళు ఈ ప్రాంతపు స్థానికులు, కలకత్తాకు నాతోపాటు వచ్చి వాళ్ళు జీవించలేరు. మేము సేకరించిన విషయాలను కేటలాగ్ చేయాలి. చాలా వాటిని అనువదించాలి. ఇది కలకత్తాలో సాధ్యపడదు. నేను ఇంగ్లాండు వెళ్ళేలోగా కనీసం స్థానిక వ్రాతప్రతులు, పుస్తకాలు, శాసనాల సంక్షిప్తసమాచారాన్ని పుస్తక రూపంలో చూడాలని నా కోరిక. దీనికి నా ఆరోగ్యం సహకరించకపోవచ్చు. కనీసం విద్యావంతులకు తదుపరి పరిశోధనలకు వీలుగానైనా వీటిని కేటలాగ్ చేయించాలి. [1]

అలా ఇంగ్లాండు వెళ్లాలని ఆశపడ్డ మెకంజీ పాపం వెళ్ళనే లేదు. మెకంజీ సేకరణలు శిథిలమౌతున్నాయని గమనించిన సి.పి. బ్రౌన్ 1840లలో సుమారు 419 వాల్యూములకు నకళ్ళు తయారు చేయించాడు. వాటికి మరలా తిరిగి 1940-65ల మధ్య మరోసారి నకళ్ళు తీయించటం జరిగింది. [2] ఆంధ్రప్రదేష్ ఆర్చైవ్స్ విభాగం వారు 1970 లలో మెకంజీ సేకరణలను మైక్రోఫిల్ములుగా మార్చారు. నేడు మద్రాసు లైబ్రేరీలో ఉన్న తెలుగు మెకంజీ కైఫియ్యతుల వ్రాతప్రతులు చదవటానికి వీల్లేని విధంగా పూర్తిగా పాడయిపోయాయి .

****

మెకంజీ సేకరణా విధానం

మెకంజీకి భారతీయ భాషలు రావు. దీనికి కారణం ఇతని ఉద్యోగమే. మెకంజీ ఒక సర్వేయరు. ఇతని ఉద్యోగం విపరీతమైన శారీరిక శ్రమ, నిత్యం ప్రయాణాలతో కూడుకొని ఉండేది. ఒక చోట స్థిరంగా, స్థిమితంగా కూర్చుని గురుముఖంగా బారతీయ భాషలను అధ్యయనం చేసే అవకాసం అతనికి ఎన్నడూ రాలేదు. భారతీయభాషలు నేర్చుకోలేకపోవటం తన బలహీనత అయినప్పటికీ తన వద్దనున్న పండితులు బహుభాషాకోవిదులు కనుక ఆ లోపం పెద్దగా ఇబ్బంది పెట్టలేదు అని చెప్పుకొన్నాడు మెకంజీ.

సర్వే అనేది స్థానికంగా వెళ్ళి చేయాల్సినపని. అందువలన ఇతనికి ఆయాప్రాంతాలలో స్వయంగా పర్యటించే అవకాశం వచ్చింది. దీనిని వినియోగించుకొని ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలలో అసంఖ్యాకమైన కైఫియ్యతులను, తాళపత్ర కావ్యాలను, శాసనాల ప్రతులను, ప్రాచీన ఆలయచిత్రాలను, నాణాలను సేకరించగలిగాడు. గ్రామాలనుంచి సేకరిస్తున్న కైఫియత్తులతో భారతదేశ చరిత్రను తెలుసుకోవచ్చునని మెకంజీ నమ్మాడు. గ్రరామ చరిత్రలేకాక, ఆయాప్రాంతాలలోని వృక్ష, జంతురాశి, ప్రజల అలవాట్లు ఆచారాల గురించి కూడా సమాచారం సేకరించాలని అనుకొన్నాడు మెకంజీ.

ఇతను నియమించుకొన్న ఉద్యోగుల జీత భత్యాలు కంపనీ భరించేది. ఇది లక్షరూపాయిల మేరకు అయినట్లు రికార్డులు చెపుతున్నాయి. క్రమేపీ కంపనీ డబ్బులు ఇవ్వటం మానేసాకా ఒకానొక దశలో వారికి జీతాలు మెకంజీయే స్వయంగా ఇచ్చాడు. మెకంజీ సేకరణలలో ఎక్కువ భాగం ఈ విధంగా స్వయంగా సేకరించినవే.

****

కాలిన్ మెకంజీ స్వయంగా చిత్రకారుడైనప్పటికీ ఇతనివద్ద వివిధ చిత్రకారుల బృందమొకటి ఉండేది. వీరు మెకంజీ ఆదేశాలకనుగుణంగా అనేక చిత్రాలను లిఖించారు. మెకంజీ గీయించిన చిత్రాల ఆధారంగా Illustrating India, The Early Colonial Investigations of Colin Mackenzie పేరుతో Jennifer Howes 2010 లో ఒక పుస్తకాన్ని వెలువరించింది. ఈ పుస్తకంలో ఆమె కొన్ని వందల మెకంజీ డ్రాయింగ్స్ ని తీసుకొని, వాటి చారిత్రిక నేపథ్యాన్ని ఆ చిత్రంలో ఉన్న లోతైన విశేషాలను అద్భుతంగా వర్ణించింది.

మెకంజీ వద్ద సహాయకులుగా ఉన్న కావలిసోదరులకు తిరిగి మరలా సహాయకులు ఉండేవారు. అలాగ కావలి వెంకట లక్ష్మయ్య వద్ద నారాయణ రావు, నిట్టల నారాయన, ఆనందరావు, నరసింహులు, సీతయ్య అనే అనుయాయిలు ఉండేవారు. వీరిని వివిధ ప్రాంతాలు పంపించి అక్కడి వివరాలను రిపోర్టులు రూపంలో తెప్పించుకొనేవారు. అలా నారాయణరావు అనే వ్యక్తి పంపిన అనేక రిపోర్టులు మెకంజీ కైఫియ్యతులలో లభిస్తాయి. ఇతని రిపోర్టులలో ఆయా ఊర్లకు ఎలా వెళ్ళిందీ, ఎంతదూరం, ఎక్కడ బసచేసాడు, ఎంతెంత ఖర్చయింది లాంటి వివరాలు కూడా ఉండటం విశేషం.
ఎక్కడకు వెళ్లాలి, ఏం సేకరించాలి అనే విషయాలపట్ల మెకంజీ చాలా స్పష్టంగా వీరందరికీ దిశానిర్ధేశం చేసే వాడు. ఒకసారి మెకంజీ వెంకటలక్ష్మయ్యను మహాబలిపురం పంపిస్తూ - “నువ్వు అక్కడ మొదటగా ఆలయప్రధాన అర్చకులను, ఊరిపెద్దలను కలుసుకో, వారితో మర్యాదగా వ్యవహరించు, వారి విశ్వాసాన్ని చూరగొను, నీపని తప్ప మరే ఇతర విషయాలలోను తలదూర్చకు, అక్కడి వివరాలు ప్రతీరోజు డైరీలో రాయి, అక్కడి భవనాలు, శిల్పాలు, ఆసక్తి కలిగించే అంశాలు అన్నింటినీ నమోదు చెయ్యి, వారితో పరిచయం పెంచుకొన్నాక మొదట వ్రాతప్రతులు సేకరించు, తరువాత శాసనాలు, ఆ పిదప ఆ ప్రాంతంలో గతంలో జరిగిన ఆసక్తికర ఉదంతాలను అడుగు - అంటూ ఖచ్చితమైన సూచనలు ఇచ్చాడు. [3]

కొన్ని చోట్ల స్థానికులు సమాచారాన్ని పంచుకోవటానికి ఇష్టపడక మెకంజీ అనుచరులను అటకాయించిన సంఘటనలు ఎదురయ్యేవి. తమిళనాడులోని ఈరోడ్ నుంచి నిట్టల నాయిన 10 మార్చ్, 1807న వ్రాసిన ఒక ఉత్తరంలో “ఇక్కడ సమాచారం ఇవ్వకుండా ఇద్దరు బ్రాహ్మలు నన్ను బెదిరిస్తున్నారు, మీరీ విషయాన్ని కలక్టరుగారికి చెప్పి నాకు మార్గం సులభం చేస్తే తప్ప ఇక్కడి శాసనాల వివరాలను సేకరించలేను” అని వ్రాసాడు. మెకంజీ బహుసా M. Gorrow అనే కలక్టరుకు ఈ విషయం చెప్పి ఉంటాడు. ఏప్రిల్ 18 న నిట్టల నాయన వ్రాసిన మరో ఉత్తరంలో “కలక్టరు M. Gorrow గారి చొరవవల్ల నేను ఇక్కడ 20 శాసనాలు, కొన్ని తామ్రపత్రాలు, చాలా గ్రామాల కైఫియత్తులను సేకరించాను” అని చెప్పాడు.

మొదట్లో మెకంజీ సేకరిస్తున్న స్థానిక చరిత్రలను సమకాలీన బ్రిటిష్ చరిత్రకారులు పెద్దగా పట్టించుకొనేవారు కాదు. వాటిని పురాణగాథలని వాటికి చారిత్రిక విలువ ఉండదనీ తీసిపారేసేవారు. కానీ HH Wilson, Charles Wilkins లాంటి చరిత్రకారులు మెకంజీ చేస్తున్న ఈ ప్రయత్నం చాలా గొప్పదని, దీని ద్వారా భారతదేశ చరిత్ర, సంస్కృతులను అర్ధంచేసుకొనే అవకాసం చిక్కుతుందని సమర్ధించారు. శాసనాలలో, తామ్రపత్రాలలో దానం ఇచ్చిన రాజు వంశావళి ద్వారా హిందువులచరిత్రను నిర్మించవచ్చు Mark wilks అనే మరో చరిత్రకారుడు గమనించాడు.

ఈ నేపథ్యంలో తన అనుచరులు తనకు కావాల్సిన సమాచార సేకరణలో వివిధ చోట్ల ఎదుర్కొంటున్న సమస్యలను ఈస్ట్ ఇండియా కంపనీ బోర్డు సభ్యులకు చెప్పి వారిని తన బృహత్ యత్నానికి సహాయపడవలసినదిగా మెకంజీ కోరి ఉంటాడు. కంపనీబోర్డు సానుకూలంగా స్పందించి తమ ఆధీనంలో ఉన్న జుడిషియల్, మెడికల్, రెవెన్యూ అధికారులకు 14 ఫిబ్రవరి 1808న ఒక మెమో జారీచేసి మెకంజీ చేస్తున్న సేకరణలకు సహకరించమని కోరింది. [4] ఆ మెమో లో ఏయే అంశాలలో సహాయపడాలో స్పష్టంగా తెలిపింది. అవి 1.వంశావళులు. 2. దండకవెలలు. 3. కాలజ్ఞానం సంగతులు (భవిష్యత్తును ఊహించి చెప్పే విషయాలు). 4. చరిత్రలు (ప్రసిద్ధిగాంచిన కథలు, పాత్రలు). 5. పన్ను వసూళ్ల వివరాలు. 6. ఒక గ్రామంలో ఉండే కుటుంబాల సంఖ్య, గ్రామజనాభాలో కులాల వారి విభజన. (ఇది చాలా విలువైన సమాచారం. మరి ఎందుచేతనో ఈ వివరాలు ఏ కైఫీయత్తులోను కనిపించలేదు) 7. గుడులు, గుడిమాన్యాలు, మఠాలు మఠాధిపతులు, స్థలపురాణాలు. 8. శాసనాలు, తామ్ర పత్రాలు. 9. దానపత్రాలు. 10. పురాతన దేశ, విదేశీ నాణాలు. 11. ప్రాచీన ప్రధానపట్టణాలలో నేటికీ ఉన్న పాత భవనాలు, శిథిలమౌతున్న ఆలయాల చిత్రాలు. 12. వీరకల్ లు (వీరుల స్మారకంగా నిర్మించే శిలా విగ్రహాలు) 13. వివిధ శిల్పాల, నగిషీల చిత్రాలు.

ఈస్ట్ ఇండియా కంపనీ మెకంజీ పట్ల మొదట్లో కొంత ఉదాసీనతచూపినా పై మెమోద్వారా అతని కృషిని గుర్తించి సహాయపడినట్లు గ్రహించవచ్చు. ఒక

గ్రామంలో పైన చెప్పిన అన్ని రకాల వివరాలు లభించకపోవచ్చు. కానీ పై సూచనలు మెకంజీ అనుచరులకు ఒక చెక్ లిస్ట్ లా ఉపయోగపడి ఉంటుంది.
****

1797లో అమరావతి స్థూపాన్ని గుర్తించిన మొదటి యూరోపియన్ కాలిన్ మెకంజీ. ఒక స్థానిక జమిందారు అమరావతిలో తాను చేపట్టిన భవన నిర్మాణం చేయటానికి రాయి కొరకు "దీపాల దిన్నె" గా స్థానికులు పిలుచుకొనే ఒక ఎత్తైనగుట్టను తవ్వించటం మొదలుపెట్టాడు. ఈ తవ్వకాలలో అక్కడ పాలరాతి ఫలకాలు అనేకం ఉన్నట్లుగా గుర్తించారు. ఈ వార్త కాలిన్ మెకంజీ దృష్టికి రావటంతో 1796లో అమరావతి వచ్చి అక్కడ తొంభై అడుగుల వ్యాసంతో ఇరవై అడుగుల ఎత్తులో పాలరాతినిర్మాణం ఉందని గుర్తించాడు. ఆ ప్రాంతంలో లభించిన కొన్ని శిథిలాలచిత్రాలతో కూడిన ఒక వ్యాసాన్ని వ్రాసాడు. [5]

అనేక ఉద్యోగ ఒత్తిళ్ల వల్ల మరలా 1816కి కానీ మెకంజీ అమరావతి రాలేదు. అప్పుడు కూడా తన అనుచరులను, చిత్రకారులను ఆ ప్రాంతంలో పెట్టి తిరిగి వెళిపోయాడు. వీరు అమరావతి కట్టడం యొక్క అనేక చిత్రాలను రెండేళ్లపాడు గీస్తూనే ఉన్నారు. మెకంజీకి 1818 లో తిరిగి అమరావతికి వచ్చాడు. అక్కడ ఆ జమిందారు ఒక చెరువును నిర్మించటం వలన అమరావతి స్థూపం మరింత శిథిలమై కన్పించింది మెకంజీకి. అనేక ఫలకాలు చెల్లాచెదురుగా ఆ చెరువుగట్టున పడిఉండటాన్ని గమనించాడు. అక్కడ తవ్వకాలు జరిపించి బాగున్న ఫలకాలను భద్రపరచమని మచిలీపట్నం పంపించాడు.

మెకంజీ చిత్రకారులు 1798-1818ల మధ్య చిత్రించిన 132 అమరావతి ఫలకాలలో 81 ఫలకాలు 1845 నాటికే అదృశ్యమైపోయాయి. డ్రాయింగ్స్ మాత్రమే మిగిలాయి.[6]. వాటి ఆధారంగా Elliot, Sewell లాంటి ఆ తదుపరి చరిత్రకారులు అమరావతి స్థూపస్వరూపాన్ని నిర్ణయించారు. [7]

అమరావతి స్థూపాన్ని మెకంజీ మొదట్లో జైన నిర్మాణంగా భావించాడు. అమరావతిపై వ్రాసిన మొదటి వ్యాసంలో దాన్ని జైన ఆలయంగా పేర్కొన్నాడు. 1818 లో తవ్వకాలు జరిపినపుడు అది బౌద్ధమత సంబంధమైనదనే

అనుమానం కలిగింది మెకంజీకి. అప్పట్లో సాంచీ స్తూపంపై పరిశోధనలు చేస్తున్న Edward Fell కు బౌద్ధ నిర్మాణాల వివరాలు పంపమని కోరాడు. ఆ వివరాల ఆధారంగా వ్రాసిన రెండవ వ్యాసంలో మెకంజీ జైన మత ప్రస్తావన తేలేదు. ఇదేసమయంలో మెకంజీకి ఉదరసంబంధ అనారోగ్యం మొదలైంది. మద్రాసులో పదివేల వరహాల విలువచేసే భవనాన్ని మెకంజీ అద్దెకు ఇచ్చేసి 1817లో కలకత్తాకు వెళ్ళిపోయాడు. 1820 నాటికి ఇతని ఆరోగ్యం మరింత క్షీణించింది. గాలి మార్పు కొరకు ఒరిస్సా వెళ్లాడు. అక్కడ పూరీ జగన్నాధ ఆలయం, రధయాత్ర, చిల్కా సరస్సుల డ్రాయింగ్స్ సేకరించాడు. తిరిగి కలకత్తా వచ్చేసాడు. తీవ్ర అనారోగ్యం వల్ల తన సేకరణలపై పెద్దగా దృష్టి నిలపలేకపోయేవాడు. ఉప్పుగాలిని పీల్చితే రోగం నయమౌతుంది అన్న వైద్యుల సలహామేరకు హుగ్లీ నదిపై రోజూ 12 మైళ్ల దూరం పడవ సవారి చేసేవాడు. 8 మే 1821న అలా పడవప్రయాణం చేస్తూ పడవలోనే మరణించాడు. [8]

మెకంజీ సేకరించిన ప్రతులు సుమారు "14 భాషలకు" సంబంధించినవి. వీటిని మెకంజీ కూడా సంపూర్ణంగా పరిశీలించలేదు. వాటిని ఎప్పటికైనా స్థిమితంగా కూర్చొని క్రోడీకరించాలని అనుకొని తనదారిలో కనిపించిన ప్రతి చిన్న అంశాన్నీ జీవితాంతం సేకరించుకొంటూ పోయాడు.

మెకంజీ మరణం తరువాత

మెకంజీ చనిపోయేనాటికి అతని భార్య పెట్రొనెల్లా వయసు ఇరవై
ఏళ్ళు. ఈమె తన స్వస్థలమైన Isశ్రీవ శీf Lawఱs లో ఉంటున్న తన అక్క మేరి వద్ద ఉండేటట్లు మెకంజీ తనవీలునామాలో ఏర్పాట్లు చేసాడు. పెట్రొనెల్లా 1823లో Robert Fulcher అనే సైనికాధికారిని పెళ్ళి చేసుకొని కొంతకాలం ఇండియాలో ఉండి 1828లో భర్తతో పాటు లండన్ వెళిపోయింది.

మెకంజీ సొంతడబ్బులతో పెట్టికొనుక్కొన్న పుస్తకాలు, పురావస్తువుల విలువ సుమారు లక్షరూపాయిలు ఉండొచ్చని విలువకట్టారు. వీటన్నింటిని ఇరవైవేల

రూపాయిలకు మెకంజీ భార్య కంపనీ ప్రభుత్వానికి ఇచ్చివేసింది. బహుసా విడివిడిగా వ్యక్తుల వద్ద ఉండే కంటే ఒకచోట ఉంటాయని భావించిందేమో.
మెకంజీ మరణించాక అతని స్థానంలోకి వచ్చిన అధికారికి దాదాపు "లక్ష పేజీల" వరకూ ఉన్న ఈ వ్రాతప్రతులను, ఇతరసేకరణలను ఎలా మదింపువేయాలో అర్ధంకాలేదు. వాటిని ఏంచేయాలో తెలియక కంపనీ అధికారులు తలలు పట్టుకొని కూర్చునేవారు. అలాంటి సమయంలో మెకంజీ మిత్రుడు H H Wilson అనే అధికారి, వీటిని క్రోడీకరించటానికి ముందుకురాగా కంపనీ బోర్డు వెంటనే అనుమతినిచ్చింది.
విల్సన్ మెకంజీ సేకరణలను పరిశీలించి వాటిలో - 2070 స్థానిక చరిత్రలుబీ 8076 శాసనాలుబీ పన్నెండు భారతీయ భాషలకు చెందిన 1568 కావ్యాలు, తెలుగులో ఉన్నవి 176; 2159 ఇంగ్లీషు అనువాదాలు; 79 పటాలు; 2630 డ్రాయింగ్స్; 106 ఇమేజెస్; 6218 నాణాలు అంటూ వేరుచేసి వాటికి ఇండెక్స్ నంబర్లు ఇచ్చి మొత్తం ఆ వివరాలతో 1828లో Meckenzie Collection - A Descriptive Catalogue of the Oriental Manuscripts and Other articles అనే రెండు వాల్యూములు వెలువరించాడు. పైన చెప్పిన సేకరణలలో చాలా మట్టుకు బ్రిటిష్ లైబ్రేరీకి, కొన్నింటిని మద్రాసు లైబ్రేరీకి తరలించారు.
విల్సన్ ఈ పుస్తకానికి వ్రాసిన ముందుమాటలో- వీటన్నింటిలో శాసనాలు, స్థానికచరిత్రలు ముఖ్యమైనవని, వీటిని మరింత శోధించవలసి ఉందని బావించాడు. తెలుగు సాహిత్యంలో ఎక్కువగా సంస్కృత అనువాదాలు ఉన్నాయని, కొద్దిగా మాత్రమే స్వతంత్ర రచనలు లభించాయని అన్నాడు. మెకంజీ కృష్ణా నదికి దక్షిణభాగం (రాయలసీమ ప్రాంతం) నుంచి ఎక్కువ సేకరణలు జరిపినట్లు ఉత్తరభాగం నుంచి పెద్దగా సేకరణలు లేనట్టు గుర్తించాడు. బహుసా ఆ కారణం వల్లనే కడపజిల్లా కైఫియ్యతులు ఏడు సంపుటాలుగా మనకు లభించినట్లుగా ఇతర కోస్తా జిల్లాల కైఫియ్యతులు లభించవు.
ఆ తరువాత William Taylor మద్రాసు లైబ్రేరీలోఉన్న మెకంజీ వ్రాతప్రతులకు సంక్షిప్తానువాదం చేసి Examination and analysis of the

mackenzie manuscripts deposited in the madras library అనే పేరుతో 1862లో మూడు వాల్యూములు వెలువరించాడు.

విల్సన్, టేలర్ చేసిన కేటలాగులను సమన్వయపరుస్తూ T.V. Mahalingam,1976 లో Mackenzie Manuscripts: Summaries of the Historical Manuscripts in the Mackenzie Collection పేరుతో రెండు వాల్యూములను వెలువరించాడు.

కాలిన్ మెకంజీ ప్రాసంగికత

భారతీయులు చరిత్రను రకరకాల రూపాల్లో భద్రపరచుకొన్నారని మెకంజీ గ్రహించాడు. ఏఏ చోట్ల భారతదేశచరిత్ర నిక్షిప్తమై ఉందో కూడా మెకంజీ గుర్తించాడు. వాటిని తన జీవితకాలం అకుంఠిత దీక్షతో శ్రమించి సేకరించాడు.

విల్సన్ అన్నట్లు మెకంజీ సేకరణలలో శాసనాలు, కైఫియ్యతులు ముఖ్యమైనవి. వీటిద్వారా అప్పటి సామాజికవ్యవస్థ, సాహిత్యం, ఆనాటి పాలకుల వంశావళి, ఆలయాలు, వాటికి ఇచ్చిన దానాలు, వాటి మాన్యాలు, ఆ ప్రాంతంలో పండే పంటలు, ప్రజలుకట్టిన పన్నులు, ఆ గ్రామ పుట్టుపూర్వోత్తరాల గురించిన కథలు, ఆనాటి గాథలు, విశ్వాసాలు, ఆచారవ్యవహారాలులాంటి అనేక సంగతులు తెలుస్తాయి. మెకంజీ వీటిని సేకరించి ఉండకపోతే చాలాస్థానిక విషయాలు కాలగర్భంలో కలిసిపోయిఉండేవి. ఈ కైఫియ్యత్తులు స్థానికులు వ్రాసుకొన్న చరిత్రలు. నేడు సబ్ ఆల్టర్న్ చరిత్రల అధ్యయనం ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా జరుగుతున్నది.

నేడు చరిత్రను మూడు కోణాలలో అధ్యయనం చేస్తున్నారు

1. చరిత్రను స్థలము, కాలము, అక్కడి ప్రజల సంస్కృతులను దృష్టిలో ఉంచుకొని చూడటం.
2. చారిత్రిక దస్తావేజులను ఆ దేశ స్మృతులుగా గుర్తించటం
3. వివిధ శాస్త్రాలు పరస్పరసహకారం అందించుకొని చరిత్రను నిర్మించటం.

పై మూడు కోణాలలోంచి చరిత్రకారులు నెరేటివ్స్ ను నిర్మిస్తున్నారు. చరిత్రలో జరిగిన వివిధ సంఘటనలద్వారా మానవజాతి గమనం ఇలా నడిచింది అని చెప్పే కథనాలను హిస్టారికల్ నెరేటివ్స్ అంటున్నారు. ఇది ఒకరకంగా Civil history of Mankind.. దీనిలో ఆధారాలను సేకరించటం ఒక ఎత్తు అయితే వాటిని విశ్లేషించటం మరొక ఎత్తు.

దక్షిణభారతదేశ చరిత్రను అధ్యయనం చేసే చరిత్రకారులకు మెకంజీ సేకరణలు రెండువందల ఏళ్లతరువాత కూడా ఇంకా తరగని గనిలాగ ఉన్నాయి.

ఇటీవలికాలంలో యూరోపియన్ చరిత్రకారుల దృష్టి బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న అపారమైన మెకంజి సేకరణలపై పడింది. వాటిపై గొప్ప రీసర్చ్ జరుగుతోంది. Jennifer Howes, Philip Wagnoner, Dirks Nicholas, Nick Barnard, Rama Sundari Mantena, Sushma Jansari లాంటి చరిత్రకారులు మెకంజీ సేకరణలపై గొప్ప పరిశోధనలు చేసి పుస్తకాలు వ్రాస్తున్నారు.

ఉపసంహారం

కాలిన్ మెకంజీ దిగువమధ్యతరగతికి చెందిన కుటుంబంనుంచి వచ్చాడు. ఇతని తండ్రి ఒక పోస్ట్ మాస్టర్.

మెకంజీ ఆరు అడుగుల రెండు అంగుళాల పొడవుతో బలమైన దేహంతో ఉండేవాడట. మెకంజీ 57 ఏండ్ల వయసులో జావాయుద్ధంలో పాల్గొన్న నాటి ఒక సంఘటనను అతనితో పాటు ఆ యుద్ధంలో పాల్గొన్న ఒక యువసహచరుడు చెప్పిన ఒక ఉదంతమిది. "ఒకరోజు అకస్మాత్తుగా చాలా సమీపంనుంచి మాపై శతృవుల దాడి జరిగింది. ఏం చేయాలో పాలుపోని నేను, ఆ ముసలాయన (మెకంజీ) జేబులో రెండు రైఫిల్స్ పెట్టి అతని తలరాత బాగుంటే తప్పించుకొంటాడు అని వదిలేసి మేం మా స్థావరాలవైపు పరుగులు తీసాం. ఆశ్చర్యకరంగా అతను మాకన్నా వేగంగా పరిగెత్తి, పొడవైనదేహంతో నీళ్లల్లో ఈదుకొంటూ మమ్ములను దాటుకొని శిబిరాన్ని చేరుకొన్నాడు. అప్పుడు అతని శరీర సామర్ధ్యం, హృదయ సామర్ధ్యంతో సమానమని మాకు అర్ధమైంది"

****

మెకంజి ప్రతినెలా తన జీతంలో చాలా భాగం లండన్ లో ఉండే తన మిత్రుడైన Thomas Anderson ద్వారా స్కాట్లాండ్‌లోని తనకుటుంబానికి పంపించేవాడు. 1793 లో వ్రాసిన ఒక ఉత్తరంలో - తండ్రికి 50 పౌండ్లు, అక్కకు 25 పౌండ్లు, మేనత్తకు 10 పౌండ్లు అందచేయమని చెపుతాడు. 1796లో వ్రాసిన మరో ఉత్తరంలో తాను పంపుతున్న వంద పౌండ్లతో ఆర్ధిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తన తండ్రిని చిక్కుల్లోంచి బయటపడేయమని కోరాడు. వీలైతే స్వయంగా వెళ్లి ఎలా మంచిదనిపిస్తే అలా సమస్యను పరిష్కరించమని అభ్యర్ధించాడు. మెకంజీ లేఖలలో తాను స్వస్థానికి వెళ్లాలన్న కోర్కెను పదే పదే చెప్పుకొనేవాడు. ఇండియాలో అడుగుపెట్టిన తరువాత ఒక్కసారికూడా ఇంగ్లాండ్ వెళ్ళకుండానే చనిపోయాడు. మెకంజీ సమాధి కలకత్తా లోని South Park Street Cemetery లో కలదు.

మెకంజీ చెల్లెలు మేరీమెకంజీ స్కాట్లాండ్ లో ఉండేది. తమ కుటుంబసభ్యుల కొరకు ఈమె 1823 లో అక్కడ ఒక సమాధి మందిరాన్ని కట్టించింది. మెకంజీ తల్లిదండ్రులు అక్కడే ఖననం చేయబడ్డారు. అక్కడ ఖననం చేయబడని కల్నల్ మెకంజీ సమాధిఫలకాన్ని మేరీ వేయించింది. దీన్ని నేటికీ అక్కడ చూడవచ్చును. ఆరుద్ర అక్కడకు వెళ్లి ఆ విశేషాలు సమగ్రాంధ్రసాహిత్యచరిత్ర లో పొందుపరచాడు.

మేరీ తన తమ్ముడిని 29 ఏండ్ల వయసులో ఉన్నప్పుడు చూడటమే. మెకంజీ భారతదేశంలో ఏమి సేకరించాడో కళ్ళారా చూడలేదు. ఉత్తరాల ద్వారా, సన్నిహితులు చెప్పే విషయాల ద్వారా మాత్రమే ఆ అక్కాతమ్ముళ్ళ అనుబంధం కొనసాగింది. ఆ పరిమితజ్ఞానంతోనే ఆమె వేయించిన మెకంజీ జ్ఞాపికాఫలకంలోని

ఈ వాక్యాలు...

"నాలుగుదశాబ్దాల పాటు భారతదేశంలో ప్రాచీన చరిత్ర, సాహిత్యం, పురావస్తువుల సేకరణలో- మానవశ్రమకు, అన్వేషణకు మించి చేసిన విశేషకృషి వల్ల నేడు ఎంతో విలువైన అపారసంపద ప్రపంచానికి కానుకగా మిగిలి ఉన్నది"

మెకంజీ సార్థకజీవనానికి అద్దంపడతాయి.

February 9, 2020

References

1. మెకంజీ మరణానంతరం Alexander Johnston వ్రాసిన ఒక వ్యాసంలో 1817 లోనే మెకంజీ తన సేకరణలను 17 విభాగాలుగా విభజించుకొని సుమారు పదిపేజీల నోట్సు రాసుకొన్నాడని అన్నాడు. Royal Asiatic society, Journal 1834 vol 1

2. 1940-50ల మధ్య ఎస్. గంగిరెడ్డి, జి. నరసింహశర్మ, కె.వి జోగయ్య, కె. శేషాచార్లు, షేక్ అబ్దుల్ ఖాదర్, పి. సీతారామమూర్తి లాంటి వారు మెకంజీ కలక్షన్లను తిరిగి కాపీ చేసారు. 1950-65ల మధ్య వై.వి చలపతి, పి. లలిత, పి.శాంత, జి. సావిత్రి, ఎన్. పాప, డి. మధుసూధనరావులు కాపీ చేసారు. అరవైల తరువాత తీసిన నకళ్లకు verified by ఎన్. వెంకటరావు అని సంతకం ఉన్నది.

3. Origins of Modern Historiography in India – by Rama Sundari Mantena p. 67

4. Origins of Modern Historiography in India, Annexure II, by M. Rama Sundari

5. 1807 Asiatic Researches Vol IX


6. Colin Mackenzie and the Stupa at Amaravati, Jennifer Howes

7. Sculptures From Amaravati In The British Museum by Barrett, Douglas

8. Illustrating India, Jennifer Howes

జేమ్స్ ప్రిన్సెప్

(1799 – 1840)



అశోక చక్రవర్తి శాసనాలను, బ్రాహ్మి లిపిని అర్థం చేసుకోవడంలో ఈయన చేసిన కృషి అమోఘం. భారతదేశ ప్రాచీన చరిత్రను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత ఈయనదే.

విస్మృత సామ్రాజ్యాన్ని వెలికితీసిన పండితుడు -జేమ్స్ ప్రిన్సెప్

జేమ్స్ ప్రిన్సెప్ ఈస్ట్ ఇండియా కంపనీ వ్యాపారి జాన్ ప్రిన్సెప్ కుమారుడు. జాన్ ప్రిన్సెప్ 1771 లో భారతదేశం వచ్చి నీలిమందు వ్యాపారం చేసి బాగా డబ్బు గడించాడు. ఇతను 1787 లో ఇంగ్లాండుకు తిరిగి వెళిపోయి కంపనీ వ్యాపారిగా స్థిరపడ్డాడు. పార్లమెంటు సభ్యుడు కూడా అయ్యాడు. తరువాత వ్యాపార ఒడిదుడుకులవల్ల నష్టాలపాలయ్యాడు. భారతదేశంతో జాన్ ప్రిన్సెప్ కు ఉన్న వ్యాపార సంబంధాలను ఉపయోగించుకొని తన సంతానానికి ఈస్ట్ ఇండియా కంపనీలో వివిధ హోదాలలో ఉపాధులు ఏర్పాటు చేసాడు. ఇతని పదవ సంతానంగా (ఏడవ కొడుకు) జేమ్స్ ప్రిన్సెప్ 20, ఆగస్టు, 1799 న బ్రిస్టల్ లో జన్మించాడు. కొంతకాలం ఆర్కిటెక్ట్ విద్య అభ్యసించాడు. భారతదేశ టంకశాలలో నాణ్యత పరిశీలించే అధికారి ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని తెలిసి జాన్ ప్రిన్సెప్, ఇతనిని లండన్ రాయల్ మింట్ లో నాణాల నాణ్యత పరిశీలించే అధికారిగా పనిచేసే రాబర్ట్ బింగ్లీ వద్ద ఆ విద్యలో తర్ఫీదు పొందమని

పంపించాడు. అలా జేమ్స్ ప్రిన్సెప్ నాణాల నాణ్యత పరిశీలించే నైపుణ్యాన్ని పొంది, 1819 లో భారతదేశంలోని ఈస్ట్ ఇండియా కంపనీ కలకత్తా టంకశాలలో నాణ్యత అధికారిగా ఉద్యోగాన్ని పొందాడు.

జేమ్స్ ప్రిన్సెప్, హూగ్లి అనే ఓడలో ప్రయాణించి 15, సెప్టెంబరు 1819 న కలకత్తా నేలపై అడుగుపెట్టాడు. అప్పటికే ఇండియాలో పనిచేస్తున్న ఇతని సోదరులు విలియం తోబి, హెన్రి తోబిలు జేమ్స్ ప్రిన్సెప్ కు సాదరంగా ఆహ్వానం పలికారు. కలకత్తా టంకశాలలో ఇతనిని HH Wilson కు సహాయకుడిగా నియమించారు. (Colin Mackenzie మరణించాక అతను సేకరించిన సుమారు లక్షపేజీల రాత ప్రతులను, పదివేలకు పైగా నాణాలు ఇతర సేకరణలను క్రోడీకరించి కేటలాగ్ చేసిన వ్యక్తే ఈ HH Wilson). కలకత్తా వచ్చిన కొత్తలో, జేమ్స్ ప్రిన్సెప్ కొన్ని Asiatic Society [1] మీటింగులకు హాజరై అవి తనకు పెద్దగా ఆసక్తి కలిగించలేదని తండ్రికి రాసిన ఒక ఉత్తరంలో తెలిపాడు. స్థానిక ప్రముఖులైన ద్వారకానాథ్ టాగూర్ (రవీంద్రనాథ్ టాగూర్ తాతగారు), రాజా రామమోహన్ రాయ్ లను కలుసుకొన్నాడు. ఆధునిక రసాయిన శాస్త్రంలో జేమ్స్ ప్రిన్సెప్ కు ఎక్కువ అభిరుచి ఉండేది. ఈస్ట్ ఇండియా కంపెనీని ఒప్పించి కలకత్తాలో ఒక ఆధునిక సైన్స్ లాబొరేటరీని స్థాపింపచేసి Salt, Opium, Nitre లాంటి వివిధ పదార్ధాల లక్షణాలపై ప్రయోగాలు చేయాలని భావించేవాడు. Asiatic Society మీటింగులో ఒకనాడు జేమ్స్ ప్రిన్సెప్ “ఆధునిక శాస్త్రీయ ఆవిష్కరణలు” అనే అంశంపై చేసిన ప్రసంగం ఆనాటి కలకత్తా సమాజంలోని ఉన్నతవర్గాలలో ఇతనికి గొప్ప పేరు తెచ్చింది.

1. బెనారస్ లో ఉద్యోగం

బెనారస్ లో కొత్తగా స్థాపించిన టంకశాలకు జేమ్స్ ప్రిన్సెప్ ను 1820లో అధికారిగా నియమించటం జరిగింది. కలకత్తానుండి 800 మైళ్ళ దూరంలో ఉన్న బెనారస్ కు పడవపై బయలుదేరి నవంబరులో చేరుకొన్నాడు. బెనారస్ టంకశాలలో నాణ్యతాధికారిగా బాధ్యతలు స్వీకరించాడు. కొత్తగా నిర్మించిన తన అధికారిక నివాసం ఆకర్షణీయంగా లేదని కొన్ని ఆర్కిటెక్చరల్ మార్పులు

చేయించాడు జేమ్స్ ప్రిన్సెప్. ఈ మార్పులు బెనారస్ లో విధులు నిర్వహిస్తున్న ఇతర యూరోపియన్ అధికారులకు తెగనచ్చేసాయి. జేమ్స్ ప్రిన్సెప్ భవన నిర్మాణ సామర్ధ్యం పట్ల గౌరవాభిమానాలు పెరిగాయి. ఆర్కిటెక్చర్ కు సంబంధించి ఇతనిని సలహాలు అడగసాగారు. తన అధికారిక నివాసంలో సైన్సు ప్రయోగాలకొరకు ఒక లాబొరేటరీని ఏర్పాటుచేసుకొన్నాడు. ఈ ప్రయోగశాలలో జేమ్స్ ప్రిన్సెప్ -నాణెముల కొరకు లోహములు కరిగించే కొలిమిలో ఉష్ణోగ్రతను ఖచ్చితంగా గణించే Pyrometer అనే పరికరాన్ని, ఒక వడ్లగింజలో వెయ్యోవంతు బరువు తూచగల సున్నితపు త్రాసుని కనుగొన్నాడు. ఈ ఆవిష్కరణల వల్ల జేమ్స్ ప్రిన్సెప్ కు 1828 లో Royal Society లో శాస్త్రవేత్తలకు లభించే ఫెలోషిప్ లభించింది.

జేమ్స్ ప్రిన్సెప్ తెల్లవారు జామునే నిద్రలేచి బ్రేక్ ఫాస్ట్ సమయానికి ఆఫీసుపనులన్నీ ముగించుకొని, మూడు మైళ్ళ దూరంలో ఉన్న టంకశాలకు వెళ్ళి అక్కడ తనిఖీలు నిర్వహించి, పనులు పురమాయించి, ఎండవేడిమి పెరగకుండా ఉదయం పదిగంటల సమయానికల్లా తన బంగ్లాకు చేరుకొనేవాడు. ఇక రోజంతా ఖాళీ. తనకు నచ్చిన పనులు చేసుకొనే వెసులుబాటు చిక్కేది. ఆ విధంగా చిక్కిన సమయంతో బెనారస్ లో జేమ్స్ ప్రిన్సెప్ అనేక పనులు చేయగలిగాడు. అవి

1. రెండేళ్లపాటు శ్రమించి బెనారస్ పట్టణ మేప్ ను చిత్రించాడు.
2. స్థానిక యురోపియన్లు, ఈస్ట్ ఇండియా కంపనీ ఉమ్మడి వ్యయంతో ఒక చర్చి నిర్మాణం గావించాడు.
3. 1823 లో కంపనీకి అధికలాభాలు వచ్చిన సందర్భంగా దేశంలోని కొన్ని ప్రాంతాలను అభివృద్ధి పరచటానికి నిధులు ఇస్తాం ప్రతిపాదనలు ఇవ్వండి అని అధికారులను కోరింది. అలా బెనారస్ అభివృద్ధి కమిటీకి జేమ్స్ ప్రిన్సెప్ సెక్రటరీ. నగర సుందరీకరణలో భాగంగా భవనాలకు హాని కలుగకుండా రోడ్లు వెడల్పు చేసే ప్రతిపాదనలు పంపి ఆ పనులను స్వయంగా పర్యవేక్షించాడు.
4. బెనారస్ లో గుంటలు, పల్లపు ప్రాంతాలు అధికం. వానాకాలంలో వాటిలో నీరు చేరి పట్టణం అంతా మురికిగా అపరిశుభ్రంగా మారేది. దీనికి

పరిష్కారంగా నగర సుందరీకరణ నిధులతో మురుగు నీరు పారటానికి భూగర్భ సొరంగాన్ని తవ్వించాడు. ఈ సొరంగం పట్టణంలో అనేక ఏడంతస్తుల భవనాలకు క్రిందుగా, వాటి పునాదులకు ఏ మాత్రం నష్టం కలగకుండా నిర్మింపచేసి పలువురి మన్ననలు పొందాడు.

5. బెనారస్ ప్రజలు ఇతనికి కొంత భూమిని కానుకగా ఇవ్వగా, దానిని చదును చేసి, స్థానికి మార్కెట్ నిర్వహించుకొనటానికి తిరిగి దానంగా ఇచ్చివేసాడు. పట్టణ మధ్యలో ఉన్న ఆ స్థలం అప్పటికే ఎంతో విలువైనది కాగా జేమ్స్ ప్రిన్సెప్ ఆనాటికి ఒక సాధారణ కంపనీ ఉద్యోగి.

6. బెనారస్ లో ఔరంగజేబు నిర్మించిన ఒక మసీదు (ఆలంగిరి మసీదు) శిథిలావస్థకు చేరగా జేమ్స్ ప్రిన్సెప్ దాని పునాదులను బలపరచి పునర్నిమింపచేసాడు.

7. బెనారస్, కలకత్తా రహదారిపై ఒక ధనవంతుడైన హిందూ వ్యాపారి తానే ఖర్చులు పెట్టుకొంటాను అనే కోరికపై, Karamnasa నదిపై లక్షరూపాయిల వ్యయంతో ఒక వంతెనను నిర్మించాడు. మొదట్లో కంపనీ ఇంజనీర్లు అక్కడి నేల మంచిది కాదని, వరదల వల్ల కొట్టుకొనే పోయే ప్రమాదం ఉందని వంతెన నిర్మాణాన్ని వ్యతిరేకించారు. ఆ నదిని హిందువులు దాటటం ప్రమాదమని, ఒక బ్రాహ్మణుని వీపున కూర్చుని మాత్రమే ఆ నదిని దాటాలని, స్థానికులలో ఒక విశ్వాసం ఉండేది. వంతెన కడితే అలా ఆ నదిని దాటించే బ్రాహ్మణులు తమ ఆదాయం కోల్పోతారనే కారణం వల్ల కూడా ఆ వంతెన నిర్మాణానికి కొందరు అభ్యంతరం పలికారు. ఇన్ని ప్రతికూలతల మధ్య జేమ్స్ ప్రిన్సెప్ వారందరినీ ఒప్పించి వంతెన నిర్మించి అది భారీ వరదలను కూడా తట్టుకొని నిలబడగలదని నిరూపించాడు.

8. మొదటిసారిగా బెనారస్ పట్టణ జనాభా లెక్కలు తీయించాడు.

9. ప్రిన్సెప్ అద్భుతమైన చిత్రకారుడు. బెనారస్ వీధులు ఘాట్ ల చిత్రాలను స్వయంగా గీసి 1825 లో ఇంగ్లాండుకు పంపగా వాటిని Illustrations of Benares పేరుతో పుస్తకరూపంలో ముద్రించారు కాశీ విశ్వనాథుని ఆలయంలోపలికి కొంతమేరకు చొచ్చుకొని కట్టిన చారిత్రాత్మక జ్ఞానవపి మసీదు చిత్రం జేమ్స్ ప్రిన్సెప్ లిఖించినదే.

2. కలకత్తాకు బదిలీ

గవర్నర్ విలియం బెంటింగ్ కలకత్తాలోని టంకశాలను విస్తరింపచేసి, బెనారస్ లోని టంకశాలను మూసివేయించటంతో జేమ్స్ ప్రిన్సెప్ 1830 లో బెనారస్ నుంచి కలకత్తాకు బదిలీ చేయబడ్డాడు. అప్పటికి కలకత్తాలో జేమ్స్ ప్రిన్సెప్ సోదరుడు విలియమ్ తోబి Palmer & Co పేరుతో నడుపుతున్న ఒక ఫైనాన్స్ కంపనీ మూడు మిలియన్ రూపాయిల మేరకు దివాళాతీయటంతో అతని ఆస్తులన్ని ప్రభుత్వం జప్తుచేసి వేలంవేసింది. దానితో రోడ్డునపడ్డ తోబి కుటుంబాన్ని తనవద్దే ఉంచుకొని పోషించసాగాడు జేమ్స్ ప్రిన్సెప్.

Salt water lake canal పనులను పర్యవేక్షించి తిరిగి వస్తుండగా గుర్రంనుంచి పడిపోయి అపస్మారక స్థితిలోకి చేరి, తిరిగి కోలుకోక, 1830 లో జేమ్స్ ప్రిన్సెప్స్ మరొక సోదరుడైన థామస్ మరణించాడు, కలకత్తా చుట్టూ ఉండే కాలువలను బాగుపరచి జలరవాణాకు ఉపయోగపడేలా చేసే ప్రాజెక్టు అది. సోదరుని మరణంతో అది అర్ధాంతరంగా ఆగిపోయింది. గవర్నరు విలియం బెంటింగ్ సూచనతో ఆ పనిని ప్రిన్సెప్స్ చేపట్టి పూర్తి చేసాడు.

జేమ్స్ ప్రిన్సెప్ 1830 లో లూసీ అనే ఒక అమ్మాయిని ప్రేమించాడు ఆమె మరొకరిని ఇష్టపడుతున్నదని తెలిసి తన ప్రేమను వెల్లడించక హృదయంలోనే దాచుకొని, చాలాకాలం పెళ్ళిచేసుకోకుండా

ఉండిపోయాడు. చాన్నాళ్ల తరువాత, 25 ఏప్రిల్, 1835 న బెంగాల్ ఆర్మీ కల్నెల్ కూతురు Harriet ను వివాహం చేసుకొన్నాడు. వీరికి ఒక కొడుకు, కూతురు కలిగారు. కొడుకు చిన్నతనంలోనే చనిపోయాడు.

3. ఆసియాటిక్ సొసైటీ కి దిశానిర్ధేశం

1831 లో తన పై అధికారి HH Wilson సలహామేరకు Asiatic Society లో మెంబరుగా చేరాడు.

Asiatic Society లో చేరగానే జేమ్స్ ప్రిన్సెప్ ని ఆకర్షించినవి అక్కడ గుట్టలు గుట్టలుగా పేరుకొని ఉన్న కొన్ని వేల పాత నాణాలు. ఇవన్నీ కంపనీ ఆధీనంలో ఉన్న బారతదేశపు వివిధ ప్రాంతాలలో తవ్వకాలద్వారా లభించిన నాణాలు. వీటిని ఆయాప్రాంతాల కంపనీ అధికారులు పరిశోధనల నిమిత్తం కలకత్తాలోని ఆసియాటిక్ సొసైటీ కి పంపించే వారు. వీటిలో అనేక బంగారునాణాలు

కూడా ఉండేవి. వీటన్నిటిని జేమ్స్ ప్రిన్సెప్ అధ్యయనం చేయటం మొదలుపెట్టాడు. శాస్త్రీయదృక్పథంతో Numismatics ని చూడనారంభించాడు. ఆ నాణాలను క్రోడీకరించి వాటిని పెర్షియన్, బాక్ట్రియన్, హిందూ, గ్రీకు, సింహళ అంటూ వివిధ రకాలుగా వర్గీకరించి అనేక వ్యాసాలు రాసాడు.

ఆరేళ్ళ కాలంలో రాసిన ఆ వ్యాసాలను, జేమ్స్ ప్రిన్సెప్ మరణానంతరం Essays on Indian Antiquities, Historic, Numismatic and Palaeographic, James Prinsep, అంటూ రెండు వాల్యూముల పుస్తకాలుగా తీసుకొని వచ్చారు.

1832 లో HH Wilson ఆక్స్ ఫర్డ్ లో సంస్కృతం బోధించడానికి కలకత్తాను విడిచి వెళిపోయాకా జేమ్స్ ప్రిన్సెప్ కలకత్తా టంకశాలకు ప్రధానాధికారిగా, ఆసియాటిక్ సొసైటీకి సెక్రటరీగా బాధ్యతలు చేపట్టాడు.

టంకశాల అధికారిగా విధులు చేపట్టాక జేమ్స్ ప్రిన్సెప్ తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పు-అంతవరకూ ముద్రిస్తున్న వెండిరూపాయిలకు బదులు మొదటి సారిగా రాగి రూపాయి నాణాలను తీసుకురావటం. ఈ రాగి నాణానికి ఒకవైపు బ్రిటిష్ చక్రవర్తి విలియం IV యొక్క శిరస్సు, మరొకవైపు ఈస్ట్ ఇండియా కంపనీ పేరు



ప్రిన్సెప్ డిజైన్ చేసిన భారతదేశపు తొలి కాపర్ రూపాయి నాణెం 1835

కలదు. జేమ్స్ ప్రిన్సెప్ స్వయంగాఈ నాణాన్ని డిజైన్ చేసాడు. ఇది 1835 నుండి చలామణిలోకి వచ్చింది. ఈ నాణాలను ముద్రించటానికి మొదటి సారిగా ఆవిరి యంత్రాన్ని వినియోగించాడు.

జేమ్స్ ప్రిన్సెప్ ఆసియాటిక్ సొసైటీకి సెక్రటరీగా బాధ్యతలు తీసుకున్న అనంతరం, సొసైటీ పేరును Asiatic Society of Bengal గా మార్పు చేసాడు. ఈ సొసైటీకి Asiatick Researches పేరుతో ఒక అధికారిక పత్రిక ఉండేది. అదే కాలంలో Gleanings of Science అనే ఒక పత్రిక మూతపడే స్థితికి వచ్చింది. జేమ్స్ ప్రిన్సెప్ Asiatick Researches మరియు Gleanings of Science అనే ఈ రెండు పత్రికలను విలీనం చేసి Journal of the Asiatic Society of Bengal (JASB) అనే కొత్త పేరుతో కొనసాగించాడు. దేశవ్యాప్తంగా ఉన్న ఔత్సాహిక చరిత్రకారులకు భారతదేశ చరిత్ర, సంస్కృతులను ప్రతిబింబించే తమ పరిశోధనా పత్రములు పంపమని, JASB ని వేదికగా చేసుకొమ్మని పిలుపునిచ్చాడు.

కలోనియల్ పీరియడ్ లో భారతదేశం ఇంకా ఇతర ప్రాంతాలనుంచి అనేక చారిత్రిక, సాంస్కృతిక అంశాలకు సంబంధించిన కొన్ని వేల లోతైన పరిశోధనా వ్యాసాలు ఈ జర్నల్ లో ప్రచురించబడ్డాయి. భారతదేశ చరిత్రను అభూతకల్పనలతో కాక శాస్త్రీయంగా మదింపు వేయటంలో ఈ పత్రిక పాత్ర ఎనలేనిది. ఈ సొసైటీ నేటికీ The Asiatic Society పేరుతో కొనసాగుతున్నది.

ఆసియాటిక్ సొసైటీకి సెక్రటరీగా దాని అధికారిక జర్నల్ కు ఎడిటర్ గా బాధ్యతలు నిర్వహించే క్రమంలో, జేమ్స్ ప్రిన్సెప్ లోని జ్ఞానతృష్ణ రెక్కలు తొడిగి విహరించటం ప్రారంభించింది. దేశం నలుమూలలనుంచి అనేక శాసన ప్రతులు, నాణాలు, శిల్పాల నకళ్ళు ఇతర ఆర్కియలాజికల్ ఆవిష్కరణలు నిత్యం సొసైటీకి రిపోర్టుల రూపంలో అందేవి. గొప్ప మేధావులు తమ పరిశోధనలను జర్నల్ కు ప్రచురణకొరకై పంపేవారు. వారి అందరితో ప్రిన్సెప్ కు పరిచయాలు కలిగాయి. ఈ నేపథ్యంలో జేమ్స్ ప్రిన్సెప్ లో భారతీయ ప్రాచీన

విజ్ఞానం చరిత్ర పట్ల ఎనలేని ఆసక్తి మొదలైంది. తనకాలాన్ని, మేధను భారతదేశ పాచీనచరిత్రను అధ్యయనం చేయటానికి వెచ్చించాలని నిర్ణయించుకొన్నాడు.

జేమ్స్ ప్రిన్సెప్ అంతవరకూ సమాజానికి అందించిన సేవలు ఒక ఎత్తు అయితే, అర్ధంకాకుండా ఒక మిస్టరీగా ఉన్న బ్రాహ్మి లిపిని అర్ధం చేసుకోవటం మరొక ఎత్తు. ఈ పనివల్ల జేమ్స్ ప్రిన్సెప్ భారతదేశ చరిత్రలో అత్యంత ప్రభావశీలమైన వ్యక్తిగా వినుతికెక్కాడు.

4. ప్రాచీన భారతదేశ చరిత్రకు తాళంచెవి బ్రాహ్మి లిపి

కొందరి అసూయ, ద్వేషం కారణంగా మృతప్రాయంగా మారిన ఒక లిపిని జేమ్స్ ప్రిన్సెప్ తిరిగి బతికించాడు. రోసెట్టా స్టోన్ పురాతన ఈజిప్షియన్ సంస్కృతి గురించిన మన అవగాహనను మార్చినట్లు, బ్రాహ్మి లిపిని అర్ధం చేసుకోవటం ద్వారా వందలసంవత్సరాలుగా దాచబడిన ప్రాచీన భారతదేశ చరిత్ర ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది.

కొందరి అసూయ ద్వేషం కారణంగా విస్మృతమైన ఒక మహా సామ్రాజ్యాన్ని జేమ్స్ ప్రిన్సెప్ తిరిగి సజీవంగా నిలిపాడు. అశోక చక్రవర్తి అఖండ భారతదేశ నిర్మాత. కాశ్మీరు, నేపాల్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేష్, తమిళనాడుల వరకూ ఇతని సామ్రాజ్యం విస్తరించిఉంది. తన రాజ్య సరిహద్దుల వద్ద తన శాసనాలు వేసిన స్తంభాలను పాతించాడు. అయినప్పటికీ ఇతని పేరు హిందూదేశ చరిత్రలో కనిపించదు. ఏ పురాణాలూ ఇతన్ని కీర్తించవు. ఏ రాజవంశావళులు ఇతనికి సరైన స్థానం ఇవ్వవు. అలాంటి అశోకచక్రవర్తి పేరును మరలా చరిత్రలో తిరగరాయించిన వ్యక్తి జేమ్స్ ప్రిన్సెప్.
కొందరి అసూయ ద్వేషం కారణంగా నేలపొరల్లోకి నెట్టబడిన ఈ దేశ వారసత్వమైన బౌద్ధమతం మరలా పునరుజ్జీవం పొందటంలో జేమ్స్ ప్రిన్సెప్ పాత్ర విస్మరింపరానిది.

పై మూడు పనులు భారతదేశ చరిత్రకు జేమ్స్ ప్రిన్సెప్ ఇచ్చిన కాన్కలు. 18వ శతాబ్దం వచ్చేసరికి దేశంనలుచెరగులా కనిపించే అశోకుని స్తంభాలు, శాసనాలు దానిలో ఉండే భాష , ఎక్కడ తవ్వినా బయటపడే బౌద్ధ విగ్రహాలపట్ల ఎవరికీ అవగాహన ఉండేది కాదు. స్వతహాగా జిజ్ఞాసకలిగిన కొందరు ఈస్ట్ ఇండియా కంపనీ అధికారులు వీటిగురించి తెలుసుకోవాలని ప్రయత్నించినా అశోకస్తంభం భీమసేనుడి గధ అని, దానిపై అర్ధంకాని రాత బ్రహ్మ రాత అని, బుద్ధుని విగ్రహాలు విష్ణుమూర్తి పదో అవతారమనీ కానీ బౌద్ధం ఒక దారితప్పిన మతమని పొంతనలేని సమాధానాలు వచ్చేవి తప్ప సరైన వివరాలు ఎవరూ చెప్పే వారు కాదు. బ్రాహ్మి లిపిని డెసిఫర్ చేయటం ద్వారా ఈ మొత్తం అజ్ఞానాన్ని బద్దలుగొట్టాడు జేమ్స్ ప్రిన్సెప్.

***

భారతదేశములో లిపి అనేది కనీసం సింధులోయనాగరికత నుంచి కనిపిస్తుంది (3300 BCE to 1300 BCE). లిపి వేరు భాషవేరు. ఇంగ్లీషు, ఫ్రెంచి, ఇటాలియన్, జర్మన్ లాంటి భాషలు రోమన్ లిపిలో రాస్తారు. హింది, సంస్కృతం, మరాఠి, నేపాలి, సింధి లాంటి భాషలు దేవనాగరి లిపిలో రాస్తారు. అదే విధంగా పాలి, గాంధారి, మాగధి భాషలు బ్రాహ్మి లిపిలో రాసేవారు.

ప్రాచీన భారతదేశంలో BCE 5వ శతాబ్దమునుంచి బ్రాహ్మి లిపి వాడుకలో ఉంది. ఈ లిపిని భారతదేశ మూలవాసుల లిపిగా చెబుతారు. BCE 3 వ శతాబ్దం, అశోకుడు కాలంలో ఇది ఉచ్ఛస్థితిలో ఉంది. అందుకనే అశోకుని శాసనాలు అన్నీ బ్రాహ్మి లిపిలో ఉన్నాయి. ప్రాచీన బ్రాహ్మిని అశోక బ్రాహ్మి అంటారు. ఈ లిపిని అప్పట్లో సామాన్యులు కూడా చదవగలిగేవారు. (see. Child learning brahmi, Terracotta sculpture from BCE 2 centuary) కానీ క్రమేపీ ఈ లిపి నుండి తమిళబ్రాహ్మి, గుప్త బ్రాహ్మి, కళింగ బ్రాహ్మి, భట్టిప్రోలు బ్రాహ్మి లాంటి అనేక స్థానిక రూపాలు రావటం వల్ల CE4 వ శతాబ్దము నాటికే ప్రజలు క్రమేపీ మూలరూపమైన అశోకబ్రాహ్మి లిపిని మరచిపోయారు.

నాలుగో శతాబ్దంలో భారతదేశంలో ప్రయాణించిన చైనా యాత్రికుడు ఫాహియాన్, పాటలిపుత్రలోని బ్రాహ్మిఅశోక స్తంభంపై ఉన్న విషయాలు

అంటూ ఎవరో స్థానికులు చెప్పిన ఏవేవో సంబంధం లేని కథలను నమోదు చేసాడు. అంటే ఆ సమయానికే బ్రాహ్మి లిపిని చదవగలిగే పరిస్థితిలేదని భావించాలి. [2]. ఏడవ శతాబ్దపు హుయాన్ త్సాంగ్ కూడా అశోక స్తంభాలను వర్ణించాడు తప్ప వాటిపై బ్రాహ్మి లిపిలో ఉన్న విషయాలను చెప్పలేదు. [3]

****

ఫిరోజ్ ఖాన్ తుగ్లక్ (1309-1388) హర్యానలోని తోప్రా వద్ద 42 అడుగుల పొడవు ఉన్న ఒక అశోక స్తంభం చూసి ఆశ్చర్యపడి, దాన్ని ఢిల్లీకి తీసుకొని రమ్మని ఆదేశించాడు. దాన్ని 42 చక్రాల భారీ వాహనంపై యమున నదీ తీరం వద్దకు చేర్చగా, అక్కడినుంచి పడవలమీద డిల్లీకి తరలించారు. ఆ స్తంభంపై ఉన్న వాక్యాలకు అర్థం ఏమిటో తెలుసుకోవాలని ఫిరోజ్ ఖాన్ భావించాడు.

ఫిరోజ్ షా ఢిల్లీకి తరలించిన అశోక స్తంభం





కొందరు పండితులను పిలిపించి వాటిని చదవమన్నాడు. ఆ పండితులు ఆ స్తంభం భీమసేనుడి చేతి కర్ర అని; భారత యుద్ధం ముగిసాక దాన్ని తోప్రా లో విడిచిపెట్టాడని; దానిపై "ఈ స్తంభాన్ని ఫిరోజ్ ఖాన్ అనే చక్రవర్తి వచ్చి కదిపే వరకూ దాన్ని ఎవరూ కదిలించలేరు" అనే వాక్యాలు ఉన్నాయని చెప్పారట. ఇది ఆ పండితుల మోసకారితనమే కాక, బ్రాహ్మిలిపి చదవగలిగే వారు పండితులలో కూడా ఎవరూ లేరనే విషయాన్ని తెలియచేస్తుంది.

18 వ శతాబ్దం వచ్చేసరికి భారతదేశ చరిత్రను తెలుసుకోవటానికి ఎంతో మంది యూరోపియన్స్ ఏ ప్రతిఫలాపేక్ష లేకుండా వారి కాలాన్ని, మేధను వెచ్చించే వారు. వీరికి ప్రాచీన శాసనాలు కొరుకుడు పడేవి కావు. ముఖ్యంగా బ్రాహ్మి లిపిలో ఉన్న శాసనాలు. ఈ నేపథ్యంలో Charles Wilkins 1781 లో 9వ శతాబ్దానికి చెందిన ఒక బ్రాహ్మి శాసనాన్ని చదవగలిగాడు. కానీ ఈ బ్రాహ్మి లిపి ఆధునిక బెంగాల్ లిపితో ఎంతో సారూప్యం కలిగి ఉండటంతో అది సాధ్యమైంది కానీ మరీ ప్రాచీన అశోక బ్రాహ్మిని అర్ధం చేసుకోవటంలో ఈ ముందడుగు ఏమాత్రమూ ఉపయోగపడలేదు. (బ్రాహ్మి లిపి కాలానుగుణంగా మారటం వల్ల నేటి మన తెలుగు, తమిళ, కన్నడ, బెంగాలి, దేవనాగరి లాంటి సమస్త భారతీయ లిపులు ఆవిర్భవించాయి. ఈ మార్పుల వల్ల మూల అశోకలిపికి ఇవి దూరం జరిగిపోయాయి). Charles Wilkins ను ఆదర్శంగా తీసుకొని బ్రాహ్మిలిపిపై William Jones కొంత కృషిచేసినా అది ఫలించలేదు.
****
మరో మూడు దశాబ్దాల వరకూ బ్రాహ్మి లిపిని అర్ధం చేసుకోవటంలో ఏ పురోగతి రాలేదు. ఆ తరువాత 1834 లో జేమ్స్ ప్రిన్సెప్ బ్రాహ్మిలిపిపై పనిచేయటం ప్రారంభించి 5 ఏళ్ళలో వివిధ దశలలో దాన్ని పూర్తిగా డెసిఫర్ చేయటం జరిగింది.

ఎ. మొదటి దశ

జేమ్స్ ప్రిన్సెప్స్ బెనారస్ లో పనిచేస్తున్న సమయంలో ఒకనాడు అలహాబాదు కోటను సందర్శించాడు. కోటవెలుపల ఎండ,వానలకు మగ్గుతున్న ఒక పెద్ద స్తంభాన్ని చూసాడు. దానిపై ఉన్న అక్షరాలు శిథిలమైపోతున్నాయి. ఆ

అక్షరాలలో మొఘల్ చక్రవర్తి జహంగిర్ పేరును గుర్తించి, ఇది చారిత్రికంగా విలువైన స్తంభం అయి ఉంటుందని భావించి అలహాబాదులోనే పనిచేస్తున్న TS Burt అనే అధికారిని ద్వారా, ఆ స్తంభంపై ఉన్న శాసనాల నకలును తెప్పించుకొని అధ్యయనం చేసాడు.

ఆ స్తంభాన్ని స్థానికులు భీముని గధ అని పిలుచుకొంటారు. దీనిపై భిన్నకాలాలో ముగ్గురు చక్రవర్తులు వేయించిన మూడు శాసనాలు ఉన్నాయి. మొదటిది అశోకుడు బ్రాహ్మిలిపిలో వేయించిన శాసనం. రెండవది సముద్రగుప్తుడు (c. 335–375 CE) తన విజయాలను నమోదుచేస్తూ సంస్కృతంలో వేయించిన ప్రశస్థి శాసనం. మూడవది జహంగీర్ పర్షియన్ భాషలో వేయించిన శాసనం. పై మూడు శాసనాలలో బ్రాహ్మి లిపిలో ఉన్న మొదటి శాసనం గురించి Note on Inscription No.1 of the Allahabad Column అనే పేరుతో జేమ్స్ ప్రిన్సెప్1834 లో ఒక వ్యాసం రాసి దాదాపు బ్రాహ్మి లిపి పై ఏర్పడిన ముప్పై ఏళ్ళ నిశ్శబ్దాన్ని ఛేదించాడు. [4]

ఈ వ్యాసంలో జేమ్స్ ప్రిన్సెప్ బ్రాహ్మి లిపి లక్షణాలను కొన్ని ప్రతిపాదించాడు.
1. బ్రాహ్మి లిపి abugida రకపు లిపి అని గుర్తించాడు. అబుగిడా లిపి అంటే - అక్షరాలకు గుణింతాలు, ఒత్తులు ఉంటూ, ఇతర అక్షరాలతో కలిసి సంయుక్తాక్షరాలను ఏర్పరచే లక్షణం కలిగిఉండటం. మన తెలుగు భాష అలాంటిదే. (ఇంగ్లీషు అలా కాదు ఏ అక్షరానికి ఆ అక్షరమే లెక్క.)
2. పై శాసనంలో ఒక్కొక్క అక్షరం ఎన్ని సార్లు వచ్చిందో లెక్కించాడు. ఒక్కో అక్షరం ఐదు రూపాలలో ఉన్నట్లు గుర్తించాడు. కింద ఇచ్చిన ఫొటోలో ర (మ) అనే అక్షరం 32 సార్లు వచ్చిందని, దాని ఇతర రూపాలు ర (మా) 3 సార్లు, ర (మే) 11 సార్లు రావటాన్ని బట్టి ఈ అక్షరాల మధ్య ఒక పాటర్న్ ను గమనించాడు. అది సంస్కృతం కంటే ప్రాకృతబాషకు దగ్గరగా ఉందని భావించాడు.

3. బ్రాహ్మి లిపిలో అచ్చులు హల్లులు ఉంటాయని చెప్పాడు

బి. రెండవ దశ

మొదటి దశలో జేమ్స్ ప్రిన్సెప్ ఆ శాసనంలోని అక్షరాలను గుర్తించగలిగాడు. వాటి పేటర్న్ ను గ్రహించాడు. వాటిని ఎలా పలకాలో తెలియదు. అలహాబాదు శాసనం పై జేమ్స్ ప్రిన్సెప్ రాసిన వ్యాసాన్ని చదివిన Hodgson తాను ఇదివరలో నేపాల్ సమీపంలోని Mathiah and Radhai అనే గ్రామాలనుంచి సేకరించిన కొన్ని శాసనాలుకూడా ఇదే విధంగా ఉన్నాయని భావించి వాటి నకళ్ళను పంపించాడు.

అలహాబాదు, Mathiah and Radhai, ఫిరోజ్ షా (ఢిల్లి) స్తంభ శాసనాలు మొత్తం మూడు బ్రాహ్మి శాసనాలు ప్రిన్సెప్ వద్ద ఉన్నాయి. వాటిని అధ్యయనం చేసి కొన్ని కొత్త విషయాలను గమనించి 1834 లో మరొక వ్యాసాన్ని రాసాడు [5] . దానిలో-

1. త 𑀢 అనే అక్షరానికి య 𑀬 అనేఅక్షరం జతపరచినపుడు 𑀢𑁆𑀬 త్య అనే సంయుక్తాక్షరం ఏర్పడుతుందని గుర్తించాడు. (See Table)
2. ఈ మూడు శాసనాలు 𑀤𑁂𑀯𑀸𑀦𑀁𑀧𑀺𑀬𑁂 𑀧𑀺𑀬𑀤𑀲𑀺 𑀮𑀸𑀚 అనే వాక్యంతో ప్రారంభమౌతున్నాయని గమనించాడు. ఆ వాక్యాలను "దేవనంపియే పియదసి లజ" అని చదవాలని; దాని అర్ధం Beloved of the Gods, King Priyadarsin అని; అది అశోక చక్రవర్తిని సూచిస్తుంది అని ప్రిన్సెప్ కే కాదు అప్పటికి ఎవరికీ తెలియదు. అయినప్పటికీ ఆ వాక్యం గురించి ప్రిన్సెప్ ఇలా ఊహించాడు – "అది అనేక విజయాలు సాధించిన రాజు పేరు కావొచ్చు; లేదా మతసంబంధమైన వాక్యం కావొచ్చు; బౌద్ధులకు లేద బ్రాహ్మణులకు ముఖ్యమైన వాక్యం కావొచ్చు" ఈ మూడు ఊహలు దాదాపు సరైనవే.

Line number	Consonant 1	Consonant 2	Conjunct Consonant
4th	𑀥 (dha)	𑀬 (ya)	𑀥𑁆𑀬 (dhya)
11th	𑀢𑀸 (tA)	𑀬𑀸 (yA)	𑀢𑁆𑀬𑀸 (tyA)
13th	𑀔 (kha)	𑀬 (ya)	𑀔𑁆𑀬 (kya)
28th	𑀬𑁂 (ye)	𑀯𑀂 (vaH)	𑀯𑁆𑀬 (yva)
In multiple lines	𑀬 (ya)	𑀬 (ya)	𑀬𑁆𑀬 (yya)

సి. మూడవ దశ

ఆ తరువాత రెండేళ్లపాటు ఏ రకమైన పురోగతి లేదు. 1836 లో Christian Lassen అనే నార్విజియన్ స్కాలర్ ఇండో బాక్ట్రియన్ రాజు Agathocles (BCE 190) వేయించిన ద్విభాషా నాణాలపై ఒక వ్యాసం రాసాడు [6].

అలెగ్జాండర్ భరతఖండంలోని కొన్ని పశ్చిమ ప్రాంతాలను జయించి వాటిని పరిపాలించుకొమ్మని తన సైన్యాధికారులకు అప్పగించి వెనుతిరిగాడు. అలా గాంధారలో విడిచి వెళ్ళిన సైన్యాధికారుల సంతతి ఈ Agathocles రాజు. ఇతను వేయించిన నాణెంపై ఇతని పేరు ఒకవైపు Basileōs Agathokleous (King Agathocles) అని గ్రీకులోను, మరొకవైపు 𑀅𑀕𑀣𑀼𑀓𑁆𑀮 𑀭𑀚 (Agathukla raja) బ్రాహ్మిలోను ఉన్నాయి. Lassen కు గ్రీకు వచ్చు కనుక గ్రీకు లిపిని బట్టి బ్రాహ్మిలో ఉన్న అక్షరాలను పోల్చగలిగాడు.

1. ఇది చదివిన ప్రిన్సెప్ కు ఎంతో ఉత్సాహం వచ్చింది. ఇతను అప్పటికే ప్రాచీన నాణాల అధ్యయనంలో అథారిటీగా పేరుతెచ్చుకొన్నాడు. ఇతనివద్ద ఉన్న అనేక ద్విభాషానాణాలను Lassen తరహాలో మరలా పరిశీలించి మరికొన్ని బ్రాహ్మి అక్షరాలను అర్ధం చేసుకోగలిగాడు.

2. సాంచి దానశాసనాలు అన్నింటిలో చివర 𑀤𑀸𑀦𑀁 అక్షరాలు ఉన్నట్లు గమనించాడు. ఇవి బహుశా “దానం” అనే పదాన్ని సూచించవచ్చని సరిగానే ఊహించాడు ప్రిన్సెప్. అలా మరో రెండుఅక్షరాలను గుర్తించాడు [7] .

3. బ్రాహ్మి లిపి కొద్దికొద్దిగా తనని తాను తెరుచుకోవటం మొదలైంది. ప్రతిశాసనంలో మొదటి వాక్యం దేవనంపియే పియదసి లజ” అని ఉండటం ప్రిన్సెప్ ను ఆశ్చర్యానికి గురిచేసేది. ఇతను రాజు అయితే ఇతని రాజ్యం భరతఖండమంతటా విస్తరించి ఉందని అర్ధమయింది కానీ దేవానంప్రియ పేరుతో ఏ రాజు పేరు హిందూ పురాణాలలోకానీ, రాజుల వంశానుక్రమణికల్లో కానీ ఎక్కడా ఎంతవెతికిన కనిపించలేదు.

4. ఆ రాజు ఎవరు అనే దానికి సమాధానం - శ్రీలంకలో 3 వ శతాబ్దంలో పాలిభాషలో రచింపబడిన దీపవంశ అనే గ్రంథంలో లభించింది. దీపవంశ గ్రంథాన్ని శ్రీలంకలోని బ్రిటిష్ అధికారి George Turnour అనువదించాడు. అందులో “Piyadassi ... who, the grandson of Chandragupta,

and own son of Bindusara" అనే వాక్యాన్ని పరిశీలించమని అతనే స్వయంగా ప్రిన్సెప్ కు పంపించాడు. దాన్ని వివరిస్తూ George Turnour స్వయంగా ఆసియాటిక్ జర్నల్ లో ఒక వ్యాసం రాసాడు [8]. అలా దేవనంపియే పియదసి అనే వాక్యం అశోక చక్రవర్తిని సంబోధిస్తున్నదని నిర్ధారణ అయింది [9] .

5. బ్రాహ్మి లిపికి పాలి భాషతో ఉన్న సంబంధాన్ని గ్రహించిన జేమ్స్ ప్రిన్సెప్, పాలి భాష తెలిసిన రత్న పౌల అనే సహాకుడినిపెట్టుకొని బ్రాహ్మి లిపిని సంపూర్ణంగా డెసిఫర్ చేసాడు. ఆ తరువాత బ్రాహ్మికి దగ్గరగా ఉండే ఖరోష్టి లిపిని కూడా పరిష్కరించాడు.

6. 1837 లో ప్రిన్సెప్ ఫిరోజ్ షా స్తంభంపైన ఉన్న మొత్తం ఏడు అశోకశాసనాలను పూర్తిగా పరిష్కరించి ఆసియాటిక్ జర్నల్ లో ఒక పత్రం ప్రచురించాడు [10]

7. అప్పటికి నలభై ఏళ్ళుగా అసియాటిక్ సొసైటీ లైబ్రేరీలో పడి ఉన్న గయ వద్దలభించిన రెండు అశోకుని శాసనాలను జేమ్స్ ప్రిన్సెప్ పరిష్కరించి 1837 లో ప్రచురించాడు [11]. ఇది అశోకుడి మనవడైన ధశరధ అనే మగధ రాజు వేయించిన శాసనము.

8. వివిధ శాసనాల ఆధారంగా అశోకుని పాలనలో జరిగిన ప్రముఖ ఘట్టాలను గుర్తించాడు.

9. ప్రిన్సెప్ వివిధ శాసనాలను పరిష్కరించుకొంటూ వెళుతున్న దశలో అన్నిచోట్లా మొదటి వాక్యం "దేవనంపియే పియదసి లజ" (Beloved of Gods, king Piyadasi) అంటూ మొదలై చివరి వాక్యం "హవం అహ" (Thus spake) తో ముగిస్తుందని గమనించాడు. ఈ రెండు వాక్యాలను కలపితే సంపూర్ణ అర్థం ఇలా వస్తుంది. Thus spake King Piyadasi, Beloved of the Gods. (దేవునిచే ప్రేమించబడిన రాజు, పియదాసి ఇలా అన్నాడు)

***

5. అర్ధాంతర నిష్క్రమణ

.

1838 నుంచి జేమ్స్ ప్రిన్సెప్ ఆరోగ్యం క్షీణించసాగింది. మొదట్లో విపరీతమైన తలనొప్పి జ్వరం వచ్చేది. ఇతని వైద్యుడు అది Bilous affection (పైత్యసంబంధి) గా భావించి అలా మందులు ఇచ్చాడు. ఏమాత్రం మెరుగుదల రాలేదు.

వాతావరణ మార్పు జరిగితే ఆరోగ్యం కుదుటపడొచ్చుననే ఆశతో జేమ్స్ ప్రిన్సెప్ తన పరిశోధనా ప్రణాళికలన్నీ హఠాత్తుగా నిలుపుచేసి ఇంగ్లాండుకు బయలుదేరాడు. సముద్రప్రయాణం, ఉప్పుగాలి ఇతని ఆరోగ్యాన్ని మరింత క్షీణింపచేసింది. బాగా కృశించిన స్థితిలో ఇంగ్లాండు చేరాడు. ఒక ఏడాదిపాటు తన సోదరి వద్ద ఉన్నాడు మెదడుకు సంబంధించిన వ్యాధి ముదిరిపోవటంతో 22 ఏప్రిల్, 1840 న నలభయ్యవ ఏట తుదిశ్వాస విడిచాడు.

ఇతను భారతదేశంలో గడిపిన ఇరవై సంవత్సరాలు గొప్ప ఫలవంతమైనవి.

జేమ్స్ ప్రిన్సెప్ మరణవార్త విన్న మిత్రులు చాలా విచారించారు. అందరూ పూనుకొని జేమ్స్ ప్రిన్సెప్ స్మారకార్థం గంగానది ఒడ్డున జేమ్స్ ప్రిన్సెప్ పేరిట ఒక చక్కని భవనాన్ని నిర్మించారు. ఇది నేటికీ కలకత్తాలో ఒక పర్యాటక ప్రదేశంగా నిలిచి ఉంది. అతని పరిశోధనా పత్రాలన్నీ పుస్తకరూపంలోకి తీసుకొని వచ్చారు. National Portrait Gallery (బ్రిటిష్ ప్రముఖుల చిత్రాలు కలిగి ఉండే లైబ్రేరీ) ఇతని కాంశ్య పతకాన్ని ఏర్పాటుచేసారు.

నిరంతరమైన జిజ్ఞాస, మొక్కవోని దీక్ష, ఎదురైన సమస్యను పరిష్కరించాలనే తపన, కఠోర శ్రమ తో కూడిన జేమ్స్ ప్రిన్సెప్ వ్యక్తిత్వం ఏనాటికీ ఆదర్శనీయమే. ఒక భాషను అవగతం చేసుకోవటంలో ఇతను చేసిన కృషి అసామాన్యం. దాదాపు రెండువేల సంవత్సరాలపాటు విస్మృతికి గురయిన అశోకచక్రవర్తిని, భరతఖండం దాదాపు అంతటా విస్తరించిన అతని సామ్రాజ్యాన్ని ప్రపంచానికి తెలియచేసిన జేమ్స్ ప్రిన్సెప్ కృషి చరిత్రలో నిలిచిపోయింది.

సుమారు పదిహేనువందల ఏండ్లపాటు మరుగునపడి, కల్పనలతో కట్టుకథలతో నింపబడిన భారతదేశ సాధికారిక చరిత్రను వెలికి తీసిన జేమ్స్ ప్రిన్సెప్ నిజంగానే ప్రాతఃస్మరణీయుడు.

December 26, 2023

****



Foot Notes

[1] ఆసియా ప్రాంతపు చరిత్ర, సంస్కృతి, భాషలు, శాస్త్రీయ విజ్ఞానము లాంటి అంశాలపై పరిశోధనలు జరిపే లక్ష్యంతో బ్రిటిష్ లాయర్, ఓరియంటలిస్ట్, విలియం జోన్స్ 15 జనవరి 1784 న Asiatic Society అనే సంస్థను స్థాపించాడు.

[2] Ashoka in Ancient India, Nayanjot Lahiri pn 300

[3] Asoka and the Decline of the Mauryas, 2012 Romila Thaper, Preword Asoka pn 8

[4] Note on Inscription No.1 of the Allahabad Column, Journal of Asiatic Society of Bengal, Vol III 1834, pn.114

[5] 'Note on the Mathiah Lath Inscription', JASB, Vol. III, 1834.

[6] Volume 5 of JASB in 1836

[7] J. Prinsep, 'Note on the Facsimiles of Inscriptions from Sanchi near Bhilsa, taken by Captain Ed. Smith, and on the Drawings of the Buddhist Monument, presented by Captain W. Murray', JASB, Vol. VI, 1837

[8] George Turnour, 'Further Notes on the Inscriptions on the Columns at Delhi, Allahabad, Betiah, etc', JASB, Vol. VI, 1837.

[9] నిజానికి అశోకుని పేరుకలిగిన శాసనం, 1915 లో కర్ణాటక, మస్కి అనేచోట దొరికింది. ఇందులో "దేవానాం పియ అశోక" అని ఉంది. అదే విధంగా 1954 లో మధ్యప్రదేష్ , గుజ్జర వద్ద లభించిన మరొక శాసనంలో "దేవానం పియదసి అశోకరాజ" అని ఉంది..

[10] Interpretation of the Most Ancient of the Inscriptions on the Pillar called the Lat of Firuz Shah, near Delhi, and of the Allahabad, Radhia and Mattia Pillar or Lat Inscriptions which agree herewith', JASB, Vol. VI, 1837.

[11] James Princep,Facsimiles of Ancient Inscriptions', JASB, Vol. VI, 1837

References

1. Essays On The Antiquities Of India James Prinsep, Vol. I
2. Ashoka in Ancient India, Nayanjot Lahiri
3. Asoka and the Decline of the Mauryas, 2012 Romila Thaper
4. Ashoka, The search for a lost emperor' by Charles Allen
5. The search for the Buddha : the men who discovered India's lost religion by Allen, Charles
6. Journal of Asiatic Society of Bengal different Volumes
7. Inscriptions of Asoka vol I, by E. Hultzsch,
8.The archaelogy of South Asia, from Indus to Asoka, by Robin Conigham and Ruth Young
9. allthingsindology.wordpress
10. wiki

సర్వాయి పాపన్న

(1650 – 1710)



17వ శతాబ్దపు సామాజిక విప్లవకారుడు పాపన్న జీవితంలోని వీరత్వాన్ని, వ్యూహాలను చారిత్రక కోణంలో విశ్లేషించిన వ్యాసమిది.

సర్వాయి పాపన్న – ఒక చారిత్రిక పరిశీలన

దళితబహుజనులు ఏకమై ఉద్యమిస్తే రాజ్యాధికారం సాధించవచ్చని 17 వ శతాబ్దంలోనే నిరూపించిన విప్లవకారునిగా చరిత్రకారులు సర్వాయి పాపన్నకు పట్టం కట్టారు. చరిత్రలోంచి వ్యక్తులను తీసుకొని వారిద్వారా సమకాలీన రాజకీయ ప్రాసంగిత కలిగిన దృక్పథాన్ని ప్రకటించటం సహజం.

సర్వాయి పాపన్న జీవితం జానపదగాథలలో నిక్షిప్తమై ఉంది. ఇదొక కళాత్మక రూపం. సాధారణంగా కళాత్మక రూపంలో కల్పన ఉంటుంది. కథానాయకుడి చుట్టూ వ్యతిరేక వాతావరణ రూపంలో ఒక ఘర్షణ చిత్రించబడుతుంది. చివరకు ప్రొటగానిస్ట్ మరణించటంతో కథ ముగుస్తుంది. ఆనందోపదేశాలు కళ బాధ్యతలు. చరిత్రను మోసే అవసరం కళకు ఉండదు. అందుచేత ఆ రచయిత కళారూపానికి విరుద్ధంగా ఉండే కొన్ని సామాజిక, చారిత్రిక వాస్తవాల పట్ల అయితే మౌనమైనా వహించాలి లేదా వాటిని వంకరలైనా తిప్పాలి. అందుకే వీరగాథలలో కనిపించే కథానాయకులకు చరిత్రపుస్తకాలలో కనిపించే కథానాయకులకు చాలా వ్యత్యాసం ఉంటుంది.

J.A. Boyle, 1874 లో Telugu Ballad Poetry అనే వ్యాసంలో పాపారాయుని వీరగాథను బళ్ళారికి చెందిన ఒక బోయవాని నోటివెంట విన్నట్లు, అది ఇటీవలే వ్రాసినదని పేర్కొన్నాడు. అందులో పాపన్న తల్లితో తన జీవితాశయాలను ఇలా చెపుతున్నాడు.

తల్లీ కొలువుకు వెళ్లను/
ఎంగిలి ముంత ఎత్తలేను

కొట్టుదును గోల్కొండ పట్టనము
ఢిల్లికి మొజుర్ నవుదును
మూడు గడియల బందరు కొట్టుదును
బంగార కడియాలు పెట్టుదును

ఆ తరువాత సర్వాయి పాపన్న వీరగాథను వచనరూపంగా మార్చి సర్వాయి పాపన్న చరిత్ర పేరుతో 1931 వచ్చింది. ఇది మరింత కాల్పనికతో ఉంటుంది.

***

I. సర్వాయి పాపన్న వీరగాథ

పాపన్న పన్నెండేళ్ల వయసులో చెట్టుక్రింద పడుకొన్నప్పుడు పన్నెండు తలల నాగుపాము అతనికి నీడపట్టింది. అటే పోతున్న కొంతమంది బ్రాహ్మణులు అది చూసి పాపన్న మహర్జాతకుడని, పల్లకిలో తిరుగుతాడని, గోల్కొండను ఏలుతాడని చెపుతారు. (పాపన్న కల్లుగీత వృత్తి చేసే గౌండ కులానికి చెందిన వ్యక్తి. అప్పట్లో సమాజంలోని ఉన్నతవర్గాలకు తప్ప ఇతరులకు పల్లకిలో తిరిగే అర్హత ఉండేది కాదు)

అప్పటినుంచి పాపన్న నోటిమాటకు మహత్యం వచ్చిందట. తాడిచెట్లును కల్లు ఇమ్మని అడిగితే ఒంగి ఇచ్చేదట. తల్లి దాచుకొన్న కొంత సొమ్మును, వెంకటరావు అనే ఒక భూస్వామిని శిక్షించి అతని ధనాన్ని గ్రహిస్తాడు. ఒక ఎరికల ఆమెను పెండ్లిచేసుకొంటాడు. వజ్రనబుద్దు అనే జమిందారుని కొల్లగొడతాడు. గోల్కొండ సైనికులతో తలపడి విజయం సాధిస్తాడు. గోల్కొండకోటపై దాడి చేసి ఆక్రమించుకొంటాడు. తరువాత ముస్లిం సైనికులు చుట్టుముట్టినప్పుడు ఇక చిక్కక తప్పదని తెలుసుకొని కత్తితో తలనరుక్కొని చనిపోతాడు. గోల్కొండ నవాబు ఇతని గొప్పదనాన్ని గుర్తించి రాజలాంఛనాలతో అంత్యక్రియలు జరిపించటంతో కథ ముగుస్తుంది.

సమకాలీన కళ్ళద్దాలు పెట్టుకొని చూస్తే ఈ గాథలో బ్రాహ్మణ వ్యతిరేకత (వర్ణ వ్యవస్థను ధిక్కరించి పల్లకిలో తిరగటం), సామ్రాజ్య వ్యతిరేకత, భూస్వామ్య వ్యతిరేకత, దళితబహుజన రాజ్యాధికార సాధన లాంటి ఊహలు అనేకం కనిపిస్తాయి.

ఉద్వేగాలను నింపుకొన్న గాథలు ప్రాచుర్యంపొందాకా చారిత్రిక వాస్తవాలు మసకబారుతాయి అనేది నిష్ఠురసత్యం.

****

II. చరిత్ర రికార్డులలో సర్వాయి పాపన్న (1650-1710)

1. ఆనాటి రాజకీయ పరిస్థితులు

సర్వాయి పాపన్న 1695 నుంచి 1710 మధ్యలో క్రియాశీలకంగా ఉన్నాడు. ఔరంగజేబు1687 లో గోల్కొండను వశపరచుకొని గోల్కొండ రాజుఅబుల్ హసన్ ను బంధీగా తీసుకొనిపోయి దక్కనును నేరుగా ఢిల్లీ పాలనలోకి తీసుకొచ్చాడు. స్థానికేతరులు అధికారులుగా రావటంతో స్థానిక జమిందార్లు, కులీనులు అసంతృప్తితో ఉండేవారు. పన్నుల భారం అధికమైంది. కరువుకాటకాలు చుట్టుముట్టాయి. ఈ కాలంలో మొఘల్ సామ్రాజ్యం రాజకీయంగా చాలా ఒడిదుడుకులను ఎదుర్కొన్నది. అప్పటికే ఔరంగ జేబుకు తొంభైఏళ్ళు దాటాయి. ఇక చక్రవర్తి రేపోమాపో మరణిస్తాడని దేశం అంతా ఎదురుచూసే పరిస్థితి. వారసత్వ పోరు ఉండనే ఉంది. సామంతులు ఎవరి మట్టుకు వారు స్వతంత్రతను ప్రకటించుకొనే ఆలోచనల్లో ఉన్నారు. కేంద్రంలో కానీ, స్థానీయంగా కానీ బలమైన నాయకత్వం లేదు.

పరిస్థితి ఎంతెలా ఉండేదంటే ఔరంగజేబు 1700 లో Riza Khan అనే సైనికాధికారిని, బీదరు అల్లర్లను కట్టడి చేయమని పంపిస్తే అతను ఇక్కడకు వచ్చి స్వతంత్రాన్ని ప్రకటించుకొని, సమీప సంస్థానాలను ఆక్రమించుకొని, గ్రామాలను దోచుకొంటూ ఆ ప్రాంతాన్ని ఒక నియంతలా ఏలటం మొదలెట్టాడు.

2. పాపన్న రంగ ప్రవేశం

ఇలాంటి అస్థిర పరిస్థితులలో సర్వాయి పాపన్న తెరమీదకు వచ్చాడు. వరంగల్ కు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న తరికొండ గ్రామంలో పాపన్న జన్మించాడు. 1690 ల ప్రాంతంలో పాపన్న ధనికురాలైన తన విధవ సోదరినుండి ధనాన్ని గ్రహించాడు. ఈ డబ్బుతో కొంతమంది అనుచరులను

కూడగట్టుకొని తరికొండపై చిన్న దుర్గాన్ని నిర్మించుకొన్నాడు. అలా పాపన్న నాయకత్వంలో ఈ దండు, దుర్గంలో ఉంటూ రాజమార్గం (Highway) పై హైదరాబాదువైపు వెళ్ళే వ్యాపారస్తులను, ధనిక పరివారాన్ని అటకాయించి దోపిడీలు చేసేది. ఇది చూసిన స్థానిక నాయకులు పాపన్నని తరిగొండనుంచి పంపించివేసారు. అక్కడనుంచి వందమైళ్ల పారిపోయి వెంకటరావు అనే జమిందారు వద్ద జమాదారుగా (head of peons) చేరాడు పాపన్న.

అక్కడ కూడా పాపన్న తన పాతపద్దతులలో దారిదోపిడీలు చేస్తున్నట్లు తెలుసుకొన్న వెంకటరావు ఇతన్ని ఖైదుచేయించాడు. వెంకటరావు భార్య, తనబిడ్డకు అస్వస్థత తగ్గాలని ఖైదీలనందరినీ విడిపించిన సందర్భంలో పాపన్న కూడా విడుదలై తిరిగి జనజీవనంలోకి వచ్చాడు.

3. పాపన్న సాగించిన రాజ్యవ్యతిరేక చర్యలు

పాపన్న తన పుట్టిన ఊరు సమీపంలో షాపూర్ (Shahpur) అనే ప్రాంతాన్ని తన నివాసంగా చేసుకొని మరలా దారిదోపిడీలు కొనసాగించాడు. ఇక్కడ ఇతనికి సర్వాయి అనే మిత్రుడు తగిలాడు. వీరిద్దరి స్నేహం బలపడి కొండపై ఒక బలమైన దుర్గాన్ని నిర్మించి మరిన్ని అరాచక కృత్యాలు చేయటం మొదలెట్టారు. వీరి చర్యలకు ముస్లిమ్, హిందువులు ఇద్దరూ కూడా బాధితులుగా ఉండేవారు. ఈ విషయాలు కొంతమంది ఔరంగజేబుకు తెలియచేయటంతో అతను కాసిం ఖాన్ అనే సేనాధిపతిని పాపన్నని తొలగించమని పంపించాడు. పాపన్నని పట్టుకోవటానికి వెళ్ళిన కాసిం ఖాన్ ను పాపన్న అనుచరులు చంపేయటంతో వీరు మరింత విజృంభించటం మొదలెట్టారు.

1702 లో గోల్కొండ డిప్యూటి గవర్నర్ రుస్తుం దిల్ ఖాన్ స్వయంగా పాపన్నని అంతమొందించటానికి షాపూర్ వచ్చి రెండునెలలపాటు పాపన్న బృందంతో పోరాడాడు. ఈ పోరాటంలో పాపన్న, సర్వాయిలు తప్పించుకోగా, రుస్తుం దిల్ ఖాన్ కోటను ధ్వంసం చేసి హైదరాబాదు తిరిగి వచ్చేసాడు.

రుస్తుం దిల్ ఖాన్ వెళిపోయాక పాపన్న, సర్వాయిలు తిరిగి వచ్చి కోటను మరింత విస్తరించి కట్టుకొని తమ కార్యకలాపాలు కొనసాగించటం

మొదలెట్టారు. ఇదే సమయంలో పాపన్న అనుచరులు- సర్వాయికి, పుర్దిల్ ఖాన్ కి మాటామాటా వచ్చి కొట్లుకొని ఇద్దరూ హతమవటంతో పాపన్న నాయకత్వానికి తిరుగులేకుండా పోయింది. పాపన్న బృందం సమీపంలో ఉన్న కోటలను ముట్టడించి ఆక్రమించుకోసాగింది.

1706 లో రుస్తుం దిల్ ఖాన్ పాపన్నని నిలువరించమని పైన చెప్పిన Riza Khan ను అభ్యర్థించాడు. బహుసా ముల్లును ముల్లుతో తీయాలని గోల్కొండ పాలకులు భావించి ఉంటారు. రిజాఖాన్ కొంతమంది సైన్యాన్ని పంపాడు. పాపన్న ముందు వీరు నిలువలేక వెనక్కి వచ్చేసారు.

ప్రజలనుండి వస్తున్న ఒత్తిడులకారణంగా 1707 లో గోల్కొండ డిప్యూటి గవర్నరు రుస్తుం దిల్ ఖాన్ పాపన్నని పట్టుకోవటానికి సైన్యంతో షాపుర్ వచ్చి పాపన్నతో తలపడ్డాడు. ఈసారి పాపన్న తెలివిగా భారీ ధనాన్ని రుస్తుం దిల్ ఖాన్ కు లంచంగా ఇచ్చి తప్పించుకొన్నాడు. రుస్తుం దిల్ ఖాన్ హైదరాబాదు వెళిపోయాడు.

4. వరంగల్ కోటపై దాడి

రుస్తుం దిల్ ఖాన్ కు లంచమిచ్చి తప్పించుకొన్న పాపన్న తనకు ఇక తిరుగే లేదని భావించి ఏప్రిల్ 1708 లో మూడువేలమంది అనుచరులతో వరంగల్ కోటపై దాడి చేసి, వశపరచుకొని అపారమైన సంపద, వస్తువులను చేజిక్కించుకొని; వేలమంది ధనిక వర్గానికి చెందిన స్త్రీలను బంధీలుగా తనవెంట తీసుకొని పోయాడు.

పాపన్న అనుచరులు వరంగల్ పట్టణాన్ని లూటీ చేసారు. వరంగల్ మేలుజాతి కార్పెట్లకు ప్రధాన వ్యాపార కేంద్రంగా ఉండేది. పెద్ద పెద్ద కార్పెట్లను తీసుకెళ్లలేక ముక్కలు చేసి పట్టుకెళ్లారు.

షాపూర్ కోటలో ఎత్తైన గోడలతో నిర్మించిన ప్రదేశంలో అపహరించిన స్త్రీలను, పిల్లలను బంధించారు. వీరిలో వరంగల్ పట్టణ న్యాయాధికారి భార్య, ఎనిమిదేళ్ల కూతురు కూడా ఉన్నారు. అపహరించిన వారి బంధువులనుండి పెద్దమొత్తాలలో ధనాన్ని వసూలు చేయటానికి ధనవంతుల స్త్రీలను పిల్లలను పాపన్న ఎంచుకొనేవాడు.(ఆ ఎనిమిదేళ్ళ చిన్నిపాప తాత షా ఇనాయత్. ఇతను ఆనాటి సమాజంలో గౌరవనీయుడు.

ఇతను డిల్లీ వెళ్ళి బహదూర్ షా వద్ద తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకొన్నప్పుడు, బహుదూర్ షా పెద్దగా స్పందించలేదు. చేసేదేమీ లేక ఇతను ఇంటికి వచ్చి తన నౌకరులందరికీ కానుకలిచ్చి స్వేచ్ఛగా బ్రతకమని పంపించేసి కొద్దిరోజులకే బెంగతో చనిపోయాడు)

5. భోనగిరి కోటపై దాడి

వరంగల్ కోటపై చేసిన దాడిద్వారా పాపన్న విపరీతమైన ధనాన్ని కూడగట్టాడు. దీనితో ఆంగ్లేయులు, డచ్చివారినుండి 700 తుపాకులు కొన్నాడు. బంగారు పల్లకిలో తిరగటం మొదలెట్టాడు. చుట్టూ 700 మంది సాయుధులైన సైనికులను రక్షణగా పెట్టుకొన్నాడు.

ఆహారధాన్యాలు పెద్దఎత్తున కొంటానని పాపన్న ఒకరోజు వ్యాపారస్తులకు కబురు పెట్టి, వారి ధనాన్ని, వస్తువులను, బండ్లను, పదివేల పశువులను బలవంతంగా లాక్కొని, వారిని బంధించి ఖైదులో పడేయించాడు. ఆ పశువుల సాయంతో చుట్టుపక్కల ప్రాంతాలను సాగుచేయించటం మొదలు పెట్టాడు.

వరంగల్ కోటదాడి తరువాత భోనగిరి కోటపై జూన్ 1708 లో దాడి చేసాడు..

ఉన్నతవర్గాలు వైభవంగా జరుపుకొనే పెళ్ళిళ్లలో పాపన్న మెరుపుదాడులు చేసి స్త్రీలను అపహరించి, వారి బంధువులనుండి అధికమొత్తాలలో ధనాన్ని రాబట్టి సైన్యాన్ని పోషించేవాడు. Kilpak అనే ప్రాంతపు జమిందారు పాపన్నకి లొంగనందుకు తన వద్ద బంధీగా ఉన్న అతని భార్య నాలుకను కోసి అతనికి కానుకగా పంపించి హెచ్చరించాడు.

ఈ దోపిడీలలో హిందువు ముస్లిమ్ అనే వ్యత్యాసం ఉండేది కాదు. అందువల్ల ముస్లిమ్ శ్రీమంతులు, తెలుగు జమిందార్లు పాపన్న అరాచకాలకు బలయ్యి, ఇతని పీడను ఒదిలించమని గోల్కొండకు మొరపెట్టుకొనేవారు.

6. చక్రవర్తి తో సన్మానం

ఔరంగజేబు చనిపోయాకా ఏర్పడిన వారసత్వపోరులో బహదూర్ షా సింహాసనాన్ని చేజిక్కించుకొన్నాడు. ఇది నచ్చని బహదూర్ షా సోదరుడు

Kam Bakhsh హైదరాబాదుకు స్వతంత్ర రాజుగా ప్రకటించుకొన్నాడు. ఇదివిన్న బహదూర్ షా దక్కను వచ్చి అతనితో పోరాడి అంతమొందించి దక్కను సామ్రాజ్యానికి తన చక్రవర్తి స్థానాన్ని స్థిరపరచుకొన్నాడు. ఆ సందర్భంలో బహదూర్ షా హైదరాబాదు ప్రముఖులతో దర్బారు ఏర్పాటు చేసినప్పుడు పాపన్న 14 లక్షల రూపాయిలు కానుకగా ఇచ్చి బహుదూర్ షా చేత సన్మానం పొందాడు. (ఈ ఉదంతాన్ని రికార్డు చేసిన డచ్ రిపోర్టులో పాపన్న ప్రస్తావన den rover servapaper/bandit sarvayi papadu అని ఉంది.)

పాపన్న చేతిలో బలయినవారు ఈ చర్యతో తీవ్ర అసంతృప్తిచెందారు. ముఖ్యంగా పాపన్న వద్ద బంధీలుగా స్త్రీలు, పిల్లల బంధువర్గాలు. వీరంతా కలిసి బహదూర్ షాకు తమ అసంతృప్తిని తెలియచేసారు. వారి విజ్ఞాపనల మేరకు హైదరాబాద్ నూతన గవర్నరైన Yusuf Khan కు పాపన్నని అంతమొందించమని ఆదేశాలిచ్చాడు చక్రవర్తి. Yusuf Khan తిరిగి ఆ పనిని Dilawar Khan అనే సేనాపతికి అప్పగించాడు.

1709 లో పాపన్న ఒక జమిందారుపై దాడిచేయటానికి వెళ్ళినపుడు షాపుర్ కోటలో పాపన్నచే బంధింపబడిన వారు తిరుగుబాటు చేసి చెరనుంచి విడిపించుకొన్నారు. వీరందరికీ నాయకత్వం వహించింది పాపన్న బావమరిది కావటం విశేషం. పాపన్న భార్య తన భర్తలేనప్పుడు బంధీగా ఉన్న తమ్ముడికి, రహస్యంగా ఆకురాయిలను భోజనంలో దాచి అందించగా వాటి సహాయంతో అతను తన సంకెళ్లను తెంచుకొని మిగిలిన వారిని కూడా విడిపించాడు. ఇది తెలుసుకొన్న పాపన్న షాపూర్ కోటకు వచ్చినపుడు అంతవరకూ బంధీలుగా ఉన్నవారు కోటలోంచి ఫిరంగులు కాలుస్తూ పాపన్న అనుచరులపై ఎదురుదాడి చేసారు.

కోపోద్రిక్తుడైన పాపన్న ఆదేశాలతో- కోట గుమ్మాలను తగలపెట్టి, గేదెలను చంపి రక్తంతో తడితడిగా ఉన్న వాటి చర్మాలను తొడుక్కొని ఆ మంటలలోంచి కోటలోకి వెళ్లటానికి ప్రయత్నించారు అతని అనుచరులు. ఇదే సమయానికి దిలావర్ ఖాన్ తనసైన్యంతో పాపన్నని బంధించటానికి అక్కడికి వచ్చాడు. ఇలా రెండు వైపులనుండి దాడి ఎదురవ్వటంతో పాపన్న తరికొండ కోటకు పారిపోయ్యాడు.

7. పాపన్న పతనం

దిలావర్ ఖాన్ పాపన్నని బంధించటంలో విఫలమవటంతో యూసఫ్ ఖాన్, మార్చ్ 1710 లో ఇరవై వేలమంది సైనికులను తీసుకొని తానే స్వయంగా తరికొండ కోటను చేరి పాపన్నతో తలపడ్డాడు. పాపన్న సైనికులకు యూసఫ్ ఖాన్ రెట్టింపు కూలి ఇస్తానని ప్రకటించటంతో అలసిపోయిన చాలామంది పాపన్నని విడిచి యూసఫ్ ఖాన్ సైన్యంలో చేరిపోయారు. పాపన్న కొద్ది నెలలు ప్రతిఘటించి, మందుగుండు అయిపోవటంతో మారువేషం వేసుకొని ఎవరికీ చెప్పకుండా రహస్యమార్గం ద్వారా కోటవిడిచి పారిపోయాడు. అప్పటికి అతని కొడుకులు ఇంకా యూసఫ్ ఖాన్ తో పోరాడుతున్నారు.

పాపన్న మారువేషంలో హసన్నబాద్ అనే గ్రామాన్ని చేరుకొని అక్కడ ఒక కల్లు దుకాణంలో కూర్చొని కల్లు కావాలని అడగగా, ఇతన్ని ఆ దుకాణదారుడు గుర్తుపట్టి సైనికులకు అప్పగించటం జరుగుతుంది. వాళ్ళు పాపన్నని బంధించి యూసఫ్ ఖాన్ వద్దకు తీసుకువెళ్లారు. దొంగిలించిన సొత్తు ఎక్కడదాచాడో చెప్పమని ఎంత హింసించినా పాపన్న ఏమీ చెప్పకపోవటంతో - పాపన్న తలనరకి బహదూర్ షా వద్దకు పంపించి దేహాన్ని హైదరాబాద్ గేట్ కు వేలాడదీయించాడు యూసఫ్ ఖాన్.

అలా పాపన్న కథ 1710 లో ముగిసింది.

****

III. చారిత్రిక పాపన్నకి వీరగాథ పాపన్నకు ఎందుకు ఇన్ని వ్యత్యాసాలు?

పాపన్న జీవితం వీరగాథగా మారటానికున్న కారణాలలో ముస్లింలపై తిరుగుబాటు అనే అంశం ప్రధానంగా వినిపిస్తుంది. కానీ పాపన్న అనుచరులలో హుస్సేన్, తుర్కా హిమాన్, కొత్వాల్ మీర్ సాహిబ్ లాంటి ముస్లిమ్ వ్యక్తులు ఉన్నారు. అంతే కాక పాపన్న దోపిడీ చేసిన వారిలో ముస్లిమ్ ఫౌజ్ దార్ లతో పాటు అనేక మంది హిందు జమిందార్లు కూడా ఉన్నారు. పాపన్న ప్రధాన అనుచరులైన సర్వా హిందువు, పుర్దిల్ ఖాన్ ముస్లిము. కనుక పాపన్న తిరుగుబాటు ప్రత్యేకించి ముస్లిముల ఒక్కరిపైనే కాదని అనుకోవచ్చు.

పాపన్న అప్పటి అగ్రవర్ణ ఆధిపత్య వ్యవస్థపై తిరుగుబాటు చేసాడు అనేది మరొక కారణం. దీనికి ఆధారంగా- పాపన్న అనుచరులలో చాకలి సర్వన్న, మంగలి మన్నన్న, కుమ్మరి గోవిందు, మేదరి యెంకన్న, యెరికల చిట్టేలు, యానాది పశేలు వంటి బలహీన వర్గాల వ్యక్తులు ఉండటం కనిపిస్తుంది.

అప్పట్లో వ్యవసాయ పనులులేని రోజుల్లో సగం ప్రజలు ఖాళీగా ఉండేవారు. వీరందరూ పాపన్నని అనుసరించి ఉండొచ్చు అనే వాదనను త్రోసిపుచ్చలేం. అంతే కాక ఆనాటి సమాజంలో దొంగతనాన్ని వృత్తిగా కలిగిన కులాలు కూడా ఉండేవి. వీరు పాపన్నకి నాయకత్వంలో నడిచారు. వీరికి పాపన్న వ్యవసాయ భూమిని ఇచ్చాడు. అందువల్ల వీరు పాపన్నని ఒక వీరుడిగా జ్ఞాపకం పెట్టుకొని ఉంటారు.

ఇక మరొకవాదన- పాపన్న సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొన్నాడు అనేది. J.A. Boyle, 1874 లో సేకరించిన వీరగాథలో గోల్కొండను, బందరును కొల్లకొడతాను, బంగారు కడియాలు చేయిస్తాను అన్నపదాలు ఉన్నాయి. కొల్లకొడతాను అంటే దొంగతనం చేస్తాను అని అర్ధం. బంగారు కడియాలు చేయిస్తాను అంటే అందులో వ్యక్తిగత లాభాపేక్షే తప్ప సామ్రాజ్య వాదాన్ని అంతమొందిద్దామనే ఉద్దేశాలున్నాయనటం అతిశయోక్తి. అంతేకాక ముఘల్ చక్రవర్తికి 14 లక్షల రూపాయిలు ఇంకా అనేక కాన్కలను ఇచ్చి వారి ప్రాపకం పొందాలని చూడటాన్ని సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోవటంగా ఎలా అర్ధంచేసుకోవాలనే ప్రశ్న ఉదయించక మానదు. ముందుగా అనుకొన్నట్లు వీరగాథలనేవి కళాత్మకరూపాలు. కళకు చరిత్రను మోసే అవసరము, బాధ్యత ఉండదు.

****

IV. పాపన్నని సామాజిక తిరుగుబాటుదారుడు అనుకోవచ్చా?

Eric Hobsbawn అనే చరిత్రకారుడు శ్రామిక వర్గాల తిరుగుబాట్లను విశ్లేషిస్తూ “Social Bandit” అనే ఒక పదాన్ని వాడాడు. అంటే రాబిన్ హుడ్ లా ధనికులను కొట్టి పేదలకు పెట్టే బాపతు అని.

ఈ వీరికి సిద్ధాంత నేపథ్యం ఉండదు. రాజకీయ, ఆర్థిక అస్థిర పరిస్థితులు తలెత్తినప్పుడు వీరు తెరపైకి వస్తారు. వీరికి మార్గం ముఖ్యం కాదు గమ్యం ప్రధానం. ఇలాంటి వ్యక్తుల చర్యలు హింసాపూరితంగా ఉండొచ్చు.

ఇలాంటి వారిని రాజ్యం దోపిడి దారులుగా జమకడితే, సామాన్యజనం వీరులుగా కీర్తిస్తారు. వీరగాథలు అల్లుకొంటారు. పాపన్నని ఈ కోణంలోంచి చూస్తే ఆ కాలానికి ఒక ఉదాత్తపాత్ర పోషించిన ఒక Social Bandit గా భావించవచ్చు.

***

ఉపసంహారం

పాపన్న జీవితాన్ని గమనిస్తే సొంత భార్య, బావమరిది, చివరలో ఇతని అనుచరులు, సాటి కులస్తుడైన కల్లువ్యాపారి కూడా ఇతడిని మోసగించారని అర్ధమౌతుంది. ఇది బహుశా అంతవరకూ పాపన్న చేస్తున్నది పులిస్వారీ అని అతని సన్నిహితులకు అర్ధమై ఉంటుంది. అందుకనే అందరూ చివరలో తనని విడిచిపెట్టేసారు.

వాతావరణం, విద్యావిధానం, మూఢనమ్మకాలు, కట్టుకథల పట్ల మోజు లాంటి కారణాలవల్ల హిందువులలో చరిత్రపట్ల ఉదాసీనత, నిర్లక్ష్యము ఏర్పడ్డాయని అన్న మెకంజీ అభిప్రాయం నేటికీ ప్రాసంగితను కోల్పోలేదు. అందుకనే దేవాలయాల స్థలపురాణాలకు ఉన్న ప్రాధాన్యత చారిత్రిక అంశాలకు ఉండదు.

బహదూర్ షాతో సన్మానం అందుకున్న తరువాత పాపన్న దొంగతనాలకు స్వస్తి చెప్పి తాను ఆక్రమించుకొన్న జమిందారీలను అనుభవించుకొంటూ ఉండినట్లయితె బహుసా రెడ్డి, వెలమ, నాయక రాజుల్లా ఒక రాజవంశాన్ని నిర్మించిన మూలపురుషుడిగా చరిత్రలో నిలిచిపోయేవాడేమో. అప్పుడు సర్వాయి పాపన్న వీరగాథ ఉండేది కాదేమో- అది వేరే విషయం.

సర్వాయి పాపన్న జీవితాన్ని చరిత్ర ఒక వివాదాస్పద వ్యక్తిగా చిత్రించబడినప్పటికీ, ప్రజలు నిత్యం గానం చేసుకొన్న వీర గాథలలో అతన్ని

వీరుడిగా, సామాజిక అసమానతలపై పోరాడిన యోధుడిగా గుర్తుపెట్టుకొన్నారు. అధికారిక పత్రాలు అతని చర్యలను అరాచకాలుగా చిత్రించినా, అల్లూరి సీతారామరాజు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి వీరుల మాదిరిగానే పాపన్న కూడా బలహీన వర్గాల ఆకాంక్షలకు, అణచివేతకు వ్యతిరేకంగా నిలిచిన సాహసవంతుడిగా, విప్లవయోధుడిగా ప్రజల స్మృతిలో నిలిచాడు. రాజ్యం దృష్టికోణంలోంచి అతని చర్యలు తప్పులు కావొచ్చు కానీ ప్రజల హృదయాలలో అవి స్ఫూర్తిదాయక చిహ్నాలుగా మిగిలిపోయాయి. పాపన్న కథలోని కల్పనా గాథలు, అతని సాహసాలు, సామాజిక అసమానతలపై పోరాటం——ఇవన్నీ ఆనాటి సామాన్య జనం ఆశయాలను, కలలను ప్రతిబింబిస్తాయి. అతని జీవితం అణగారిన వర్గాలకు ఆశాకిరణంగా నిలిచింది. అందుకే, ప్రజలు అతన్ని ఒక స్వాతంత్ర్య స్ఫూర్తిగా, అధికార వ్యవస్థలకు వ్యతిరేకంగా నిలిచిన ధీరుడిగా గౌరవించుకొన్నారు.

చరిత్ర అధికారికపత్రాలలో రాయబడింది మాత్రమే సత్యం కాదని మనం గుర్తించాలి. ప్రజలు ఇలాంటి వీరులను ఎలా అర్థం చేసుకున్నారో అనేది కూడా చరిత్రలో భాగమే. ఈ గౌరవం మన పూర్వీకుల నిర్ణయంగా, వారి ఆకాంక్షల ప్రతీకగా గౌరవించాలి . పాపన్న వంటి వ్యక్తులు ప్రజల గుండెల్లో ఎన్నటికీ సజీవంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటారు.

సర్వాయి పాపన్న లాంటి వ్యక్తుల గొప్పతనం వారు తమ కాలానికి ఇచ్చిన సందేశంలో ఉంది. వారిని ప్రజలు ఎలా గుర్తుపెట్టుకొన్నారు అనేదానిలో ఉంది. అంతిమంగా ఇదే మనం గౌరవించవలసిన సత్యం.

(పై వ్యాసాన్ని ఇప్పటికి అందుబాటులో ఉన్న చారిత్రిక ఆధారాలను బట్టి నిర్మించిన నెరేటివ్ గా గ్రహించాలి తప్ప ఎవరి మనోభావాలను గాయపరచటానికి కాదని గ్రహించగలరు-రచయిత)

February 9, 2020

References

1. J. F. Richards and V. Narayana Rao, “Banditry in Mughal India: Historical and Folk Perceptions,”

2. A Social History of the Deccan, 1300–1761 edited By Richard M. Eaton, Chapter 7 Papadu (F L. 1695–1710): Social Banditry In Mughal Telangana

3. The Mughal State 1526-1750 Edited By Muzaffar Alam Sanjay Subrahmanyam


4. The Indian Antiquary, A Journal Of Oriental Research. Telugu Ballad Poetry By J. A. Boyle, Esq., Mos.

5. Khafi Khan, Muntakhab al-lubab (Calcutta, 1874).

6. సర్వాయి పాపన్న పై వికిపీడియా వ్యాసం

7. సర్దార్ సర్వాయి పాపన్న, దళిత బహుజన వీరుడు, కొంపెల్లి వెంకట్ గౌడ్.

సితాఫ్ ఖాన్



చారిత్రక గ్రంథాల్లో గందరగోళానికి గురైన సితాఫ్ ఖాన్ వ్యక్తిత్వాన్ని విశ్లేషించే వ్యాసం. వరంగల్ కోట చరిత్రలో ఈయన పాత్రను చారిత్రక ఆధారాలతో ఇక్కడ చర్చించడం జరిగింది.

ఇద్దరు సితాఫ్ ఖాన్ లు

సీతాఫిఖానుడు, సీతాపతి, సీతడు, సీతాపతి రాజు అనే వివిధ పేర్లతో పిలువబడ్డ సితాప్ ఖాన్ గురించి రాజమహేంద్రవరం, బోయినపూడి, కిమ్మూరు కైఫీయత్తులలో వస్తుంది. ఈ కైఫీయత్తులన్నింటిలో సితాప్ ఖాన్ వృత్తాంతం దాదాపు ఒకే విధంగా ఉంటుంది. కొంత కల్పన, కొన్ని వాస్తవాల కలగలుపు అది.

చరిత్రలో మూడు చోట్ల సితాఫ్ ఖాన్ పేరును స్పష్టంగా పోల్చుకోవచ్చు.

1504 నాటి వరంగల్ శాసనంలోని షితాబు ఖాను. ఇతనే ఖుష్ మహల్ నందు దర్బార్ నిర్వహించేవాడు.

1516 లో శ్రీకృష్ణదేవరాయలను ఎదిరించిన చితాపుఖానుడు 1572 లో ఇబ్రహిమ్ కుతుబ్ షా (మల్కిభరాముడు) కాలంలో, రాజమహేంద్రవరం లో ఓడిపోయి పారిపోయిన సీతాఫిఖానుడు.

పై మూడు సందర్భాల కాలాలను గమనిస్తే మొదటి రెండు చోట్ల కనిపించే సితాఫ్ ఖానుడు ఒకవ్యక్తే కావచ్చుని, రాజమహేంద్రవరంలోని సితాఫ్ ఖాన్ వేరే వ్యక్తి కావచ్చునేది స్పష్టమౌతుంది.

ఎందుకంటే 1504 నాటి శాసనంలోని సితాఫ్ ఖాన్ కు కల భార్యలలో దేవాంబికకు అవధూత ఖాన్, పురాంతక పేర్లతో ఇద్దరు కొడుకులు ఉన్నారు. వీరిలో పురాంతక అనే కొడుకు వివిధ యుద్ధాలలో అనేకమంది వీరులను సంహరించాడట. మరొక భార్య అయిన అనుమాంబ కు అమర, బోగి, రామ

అనే ముగ్గురు కొడుకులు. వీరిలో పెద్దకొడుకు యుద్ధంలో చనిపోయాడట. ఈ వివరాలను బట్టి వరంగల్ శాసనం వేయించిన సితాఫ్ ఖాన్ వయసు నలభై- ఏభై ఏళ్ళ మధ్యలో ఉండొచ్చు. 1516 లో కృష్ణదేవరాయలితో యుద్ధం చేసే నాటికి ఇతనికి అరవై ఏళ్ల వయసు ఉండొచ్చు. అది సంభవమే కనుక వరంగల్ శాసనం వేయించిన సితాఫ్ ఖాన్, కృష్ణదేవరాయలతో యుద్ధం చేసిన సీతాఫ్ ఖాన్ ఒకడే అయ్యే అవకాసాలు ఎక్కువ.

ఇక 1572 లో ఇబ్రహీమ్ కుతుబ్ షా సమకాలీనుడిగా చెప్పబడిన రాజమహేంద్రవరం సితాఫ్ ఖాన్ ఖచ్చితంగా మరొక వ్యక్తి అయి ఉండాలి. ఇతను ఎవరనే ప్రశ్నకు సరైన చారిత్రిక సమాధానాలు కనిపించవు. వరంగల్ సితాఫ్ ఖాన్ ను 1512 లో Quli Qutb-ul-Mulk ఓడించాకా ఇతను ఒరిస్సా పారిపోయి గజపతి రాజుల వద్దకు వెళ్ళితలదాచుకొన్నాడు. బహుసా గజపతి రాజులవద్ద సేనాధిపతిగా కుదిరి ఉంటాడు. అందుకనే కృష్ణదేవరాయలు గజపతి రాజులపై దండెత్తి వస్తున్నప్పుడు నిలువరించటానికి వీరోచితంగా ప్రయత్నించాడు. ఆ యుద్ధంతరువాత ఇతని ప్రస్తావన ఎక్కడా వినిపించదు బహుసా ఆ యుద్ధంలో ఇతను చనిపోయి ఉండాలి.

1572 ల నాటి రాజమహేంద్రవరం సితాఫ్ ఖాన్ వరంగల్ సితాఫ్ ఖాన్ మనవడు అవటానికి అవకాశాలు కనిపిస్తాయి. తాత వలే తనుకూడా గజపతి రాజుల వద్దే కొలువులో ఉండి, సేవలందిస్తూ పేరుతెచ్చుకొని రాజమహేంద్రవరానికి అధికారిగా నియమితుడై ఉంటాడు.

***

I. వరంగల్ సితాఫ్ ఖాన్ హిందువా ముస్లిమా?

వరంగల్ శాసనాన్ని బట్టి సితాఫ్ ఖాన్ ను హిందువుగా పరిగణించాలి. ఎందుకంటే ఈ శాసనంలో – ఇతను భోగి (బోయి ?) కులానికి చెందిన వ్యక్తిగా చెప్పబడ్డాడు. ఇతని భార్యలు, పిల్లల పేర్లన్నీ హిందూ నామాలే. ముస్లిములు నాశనం చేసిన కృష్ణుని విగ్రహాన్ని (పాంచాలరాయుడు), కాకతీయుల కులదైవమైన కాకతి విగ్రహాన్ని తిరిగి పునప్రతిష్ట గావించాడని చెప్పబడింది. అంతే కాక శాసనం ఆఖరున ఏకశిలానగరంలో (వరంగల్) ఉన్న

శివాలయములో నిత్యం పూజలు చేయటం వలన సితాఫ్ ఖాన్ కు ఇన్ని సుగుణాలు, ఐశ్వర్యాలు సిద్ధించాయి అని ఉంది.

Shitab Khan of Warangal అనే పుస్తకాన్ని వ్రాసిన Dr. Hirananda Sastri – సీతాఫ్ ఖాన్ హిందువని, ఇతను బోయకులానికి చెందినవాడు కావొచ్చునని అన్నారు.

దక్కను సుల్తానుల చరిత్రను వ్రాసిన ఫెరిష్టా సితాఫ్ ఖాన్ గురించి "ఖమ్మంమెట్టు రాజు, Fearless infidel (అవిశ్వాసి) అన్నాడు. 1829 లో ఫెరిస్టా రాతలను ఇంగ్లీషులోకి అనువదించిన Col. Briggs కు సితాప్ ఖాను ను హిందువుగా పరిగణించి అతని గురించిన ప్రస్తావనలను అన్నింటిని మూలంలో సితాప్ ఖాను అని ఉన్నప్పటికీ సీతాపతి (Seetaputty) గా అనువదించాడు.

సితాఫ్ ఖాన్ ఒరిస్సాకు చెందిన గజపతి రాజులకు సన్నిహితుడైన హిందువని, ముస్లిం రాజ్యంలో మనుగడకొరకు ముస్లిమ్ పేరు పెట్టుకొన్నాడని అంటారు మరికొందరు చరిత్రకారులు.
సితాఫ్ ఖాన్ హిందు ద్వేషిగా, చతుర్ముఖేశ్వర, ఇంకా ఇతర ఆలయాలను ధ్వంసం చేసినవాడిగా ఏకశిలానగర కైఫియత్తు లో ఉన్నది.

Glimpses of the Nizam's Dominions (1898) లో Campbell, A. Claude వరంగల్ ను చేజిక్కించుకొన్న "మొదటి ముసల్మాన్" సితాఫ్ ఖాన్ అని పేర్కొన్నాడు.

బహుమని సుల్తానులకు సితాఫ్ ఖాన్ ఒక సామంతుగా ఉంటూ ఆ సామ్రాజ్యం కూలిపోతున్న సమయంలో హిందూ రాజుల ప్రాపకం సంపాదించుకొని వరంగల్, హనుమకొండ ప్రాంతాలకు తానొక స్వతంత్ర రాజుగా ప్రకటించుకొన్న renegade Musalman (ముస్లిం మతభ్రష్టుడు) అని అభిప్రాయపడతాడు col T.W. Haig తన Landmarks of the Deccan అనే పుస్తకంలో.

ఇలా పొంతన లేని ఆధారాల వల్ల సితాఫ్ ఖాన్ హిందువా, ముస్లిమా అన్న ప్రశ్నకు నేటికీ స్పష్టమైన సమాధానం లభించదు.

II. కృష్ణదేవరాయలను నిలువరించిన వరంగల్ సితాఫ్ ఖాన్

కృష్ణదేవరాయలు కళింగదేశంపై దండయాత్ర చేసిన సమయంలో 1516 లో సితాఫ్ ఖాన్ తన అరవై వేల మంది సైన్యంతో కృష్ణదేవరాయలును నిలువరించటానికి ప్రయత్నించాడనే విషయం “రాయవాచకం” లో ఇలా ఉంది.

//చితాపుఖానుడనేవాడు అరవై వేలు సింగ్గాణి రౌతులతోడట్టు కనుమ మార్గమున పొయ్యే రౌతు రాణువమీద చిత్త వాన గురిసినరీతి అమ్ములు గురియించ్చగా అంమ్ముల నుండ్డి తప్పించుకొనువారున్ను ఆయంమ్ములకు యెదురై నిలిచిన వారున్ను ముంద్దు వెనక తెలియక నిలిచిన వారున్ను ఆడాడ దిగ్భ్రమ పడివున్న వారున్ను యీరీతిని వుండ్డగా చితాపుఖానునికి యెదురులేదు గనక జగడం శేయగా ఆ సమయాన కర్నాటకం కైజీతం రౌతులు చితాపుఖానునికి పెడతలపోటుగా యిరుపార్శ్వాల కనమల పొడువున నెక్కి చితాపు ఖానుని వెనకదిక్కులకై వచ్చి సింగ్గాణులమతనున్ను, కడ్గముల చేతనున్ను బరిజీల చేతనున్ను వేటూరు తునకలుగా నరకగా చితాపుఖానుని తెగలకు కనుమలో నిలువకూడక విరిగి పారగ వెంబ్బడించ్చి తరుముకబోయి వారిని దుర్గంచొర దోలి తిరుగా వచ్చిరి.// (రాయల సైన్యం *అడవిమధ్యలో వెళుతుండగా అకస్మాత్తుగా సితాఫ్ ఖాన్ సైన్యం బాణాల వాన కురిపిస్తే మొదట్లో కంగారు పడ్డ రాయల సైన్యం, కొండలపైకెక్కి సితాఫ్ ఖాన్ సైన్యంపై బాణాలతో, బరెసెలతో దాడిచేసి వారిని తునకలుగా నరికి, సుదూరంగా తరిమివేసిందట)*

రాయలను కళింగవైపు రాకుండా అడ్డుకోవటానికి కటకం గజపతి రాజుల ఆదేశాలతో, సితాఫ్ ఖాన్ ఈ దాడి చేసి ఉండొచ్చు. ఈ దాడి తరువాత సితాఫ్ ఖాన్ వివరాలు ఎక్కడా కనిపించకపోవటాన్ని బట్టి రాయల సైన్యం ఎదురుదాడిలో వరంగల్ సితాఫ్ ఖాన్ మరణించి ఉంటాడని భావించవచ్చు.

III. రాజమహేంద్రవరం సితాఫ్ ఖాన్

కటకంలో సింహాసనం అధిష్టించి పాలిస్తున్న ముకుందదేవు గజపతి మేనల్లుడైన రాజవిద్యాధరుడు, సీతాభిఖానుడు కలిసి రాజమహేంద్రవరాన్ని కేంద్రం గా చేసుకొని ఆ ప్రాంతాన్ని పాలించేవారు.

తెలుగు కవులచే కీర్తించబడిన గోల్కొండ పాలకుడు ఇబ్రహీమ్ కుతుబ్ షా ఆదేశాలమీద అతని దండనాయకుడు, రుస్తుంఖాన్ పదివేలమంది అశ్వదళంతో 1572లో రాజమండ్రిని జయించటానికి వచ్చాడు. మొదటగా పెద్దాపురం (Pentapoor) కోటను ముట్టడించి వశపరచుకొన్నాడు. అక్కడ ఉన్న సీతాభిఖానుడు రాజపూడి కోటకు పారిపోయాడు. రుస్తుం ఖాన్ రాజపూడి కోటపై దాడి చేయగా, సీతాభిఖానుడు అక్కడనుంచి తప్పించుకొని రాజమండ్రి కోటను చేరుకొని అక్కడ ఉంటున్న విద్యాధరునితో కలసి రుస్తుం ఖాన్ సైన్యం పై ఎదురుదాడి చేయటం మొదలు పెట్టాడు. అలా నాలుగునెలల పాటు యుద్ధం జరిగింది. చివరకు సీతాపతి, విద్యాధరులు, రుస్తుం ఖాన్ తో సంధి కుదుర్చుకొని, విద్యాదరుడు కంశింకోటకు, సీతాపతి బీజానగర్ కు ప్రాణాలు దక్కించుకొని వెళ్ళిపోయారు.
రాజమండ్రి సీతాభిఖానుడి గురించి క్లుప్తంగా లభించే చారిత్రిక సమాచారం.

IV. మెకంజీ కైఫియత్తులలో వర్ణించబడిన సితాఫిఖానుడు

1. అవసరాల పెద్దిరాజు అనే బ్రాహ్మణుడి ఇంట సీతడు అనే ఒక శూద్రదాని కొడుకు దూడలు కాస్తూ ఉండేవాడు. ఒకనాడు సీతడు తాడిచెట్టునీడను పడుకొని ఉండగా ఒక పెద్ద సర్పము తనపడగను విప్పి అతనిపై ఎండపడకుండా గొడుగుపట్టటం పెద్దిరాజు చూసి, వీడు ఏనాటికైనా గొప్ప అదృష్టవంతుడు అవుతాడని ఊహించి ఆరోజునుంచి అతనితో దూడలు కాయించటం మాని విద్యలు చెప్పించటం మొదలెట్టాడు.

2. అలా విద్యలు నేర్చుకొన్న సీతడు ఓరుగల్లు వెళ్ళి సైన్యంలో చేరి చురుకుగా పనిచేస్తూ ప్రభువు ఆదరణకు పాత్రుడైనాడు. సీతడు సీతాఫిఖానుడు అనే బిరుదు పొందాడు.

3. కొన్నాళ్ళకు ఓరుగల్లుని తురకలు ఆక్రమించుకోగా, సీతాఫిఖానుడు ఓరుగల్లు విడిచి కటకం చేరాడు. అక్కడి గజపతి ముకుందదేవుని విశ్వాసం చూరగొనటంతో ఆయన సీతాఫిఖానుడికి రాజమహేంద్రవరం సంరక్షణా బాధ్యతలను అప్పగించాడు.

4. సీతాఫిఖానుడు రాజమహేంద్రవరం వచ్చి, తనకు చిన్నతనంలో సహాయం చేసిన అవసరాల పెద్దిరాజును పిలిపించి అతనికి దివానుగిరీ ఇచ్చి రాజమహేంద్రవరాన్ని గజపతిరాజు ప్రతినిధిగా పాలించటం మొదలెట్టాడు.

5. వీరిద్దరికి పొరపొచ్చాలు రావటంతో పెద్దిరాజు కనుగుడ్లు పీకించాడు సీతాఫిఖానుడు.

6. గుడ్డివాడైన పెద్దిరాజు పల్లకిలో రాజమహేంద్రవరం నుండి గోలకొండకు పోయి అక్కడ విభురాం పాదుషా (ఇబ్రహీమ్ కుతుబ్) గారిని దర్శించుకొని, సీతాఫిఖానుడు తనకు చేసిన అన్యాయాన్ని చెప్పుకొని, తనకు సైనిక మద్దతు ఇచ్చినట్లయితే రాజమహేంద్రవరం కోటను మీ పరం చేస్తాను అని విన్నవించుకొన్నాడు. దీనికి పాదుషా గారు అంగీకరించి, పెద్దిరాజుకి సహాయంగా పటాలాన్ని పంపించాడు.

7. గోల్కొండ నవాబు సేనలు 1572 క్రీ.శ. లో రాజమహేంద్రవరం కోటను ముట్టడించినపుడు సీతాఫిఖానుడు వారి ధాటికి తాళలేక కోట విడిచి పారిపోయాడు.

8. రాజమహేంద్రవరం నుంచి పారిపోయి తోటపిల్లి అడవిలో దాక్కొన్న సీతాఫిఖానుడిని తురకసైన్యం పట్టుకొని తలనరికి చంపేసారు. (బోయినపూడి, రాజమహేంద్రవరం, కిమ్మూరు కైఫీయతులు)

(మెకంజీ కైఫీయత్తులు మౌఖిక సాంప్రదాయంలో భద్రపరచబడిన చరిత్ర. నిజానికి సితాఫ్ ఖాన్ కు సంబంధించి మెయిన్ స్ట్రీమ్ చరిత్రే అష్టవంకరలు పోయిన పరిస్థితి ఉంది. అలాంటపుడు కైఫియత్తులలో నిర్ధిష్టమైన తారీఖులు, పేర్లు ఉంటాయని ఆశించలేం.)

పై ఎనిమిది పాయింట్లను గమనిస్తే---


మొదటి పాయింటులో కనిపించే పాము పడగ విప్పి నీడపట్టటం అనే కథనం ఒక వ్యక్తి దైవాంశసంభూతుడు అని చెప్పటానికి ఉద్దేశించబడే ఒక మెటాఫర్. ఇది సర్వాయి పాపన్న, ముమ్మిడివరం బాలయోగి లాంటి వ్యక్తుల జీవితచరిత్రలలో కూడా కనిపిస్తుంది.
రెండు మూడు పాయింట్లలో ఈ కైఫియత్ వ్రాయసగాడు వరంగల్ సీతాఫ్ ఖాన్ , రాజమండ్రి సీతాఫ్ ఖాన్ ల చరిత్రను కలగాబులగం చేసినట్లు అనిపిస్తుంది.
అయిదు, ఆరు, ఎనిమిది పాయింట్లలో చెప్పబడిన కథనాలు పూర్తిగా స్థానీయమైనవి.
ఇవి విశ్వసనీయంగా ఉంటూ ఇతర చారిత్రిక సంఘటనలతో సరిపోతూంటాయి. ప్రధానస్రవంతి చరిత్రలోకి ఎక్కని ఇలాంటి వందలకొలదీ సంఘటనలు కైఫీయత్తులలో దొరుకుతాయి. వీటికోసమైనా కైఫీయత్తులను అధ్యయనం చేయాలి.

March, 2020

సంప్రదించిన పుస్తకాలు

1.Shitab Khan of Warangal - Dr Hirananda Sastri
2.Andhra Pradesh District Gazetteers: East Godavari
3.Historic Land Marks Of The Deccan by Lt. Col. T. W. Haig
4. The Qutb Shahi Kings of Golconda by S. Hanumanth Rao (Essay)
5. రాయవాచకము- సివి రామచంద్రరావు
6. History Of The Rise Of The Mahomedan Power In India Vol. 3 by Briggs, John
7. Warangal inscription of Annul Report Of The Archaeological Department Of His Highness The Nizams Dominions 1934-35 p.no 33
8. Inscribing the Self: Hindu-Muslim Identities in Pre-Colonial India - Cynthia Talbot

మెకంజీ సహాయకులు



మెకంజీ సహాయకులు

కావలి సోదరులు

ఏలూరుకు చెందిన కావలి వెంకట సుబ్బయ్యకు అయిదుగురు కుమారులు ఒక కుమార్తె. వారు వరుసగా వెంకట నారాయణప్ప, వెంకట బొర్రయ్య, వెంకట లక్ష్మయ్య, వెంకటరామస్వామి మరియు సీతయ్య. కుమార్తె పేరు లక్ష్మిదేవమ్మ/సీతమ్మాళ్. [1] ఈమెకు విస్సన్నకోట జమిందారు రమణప్పతో వివాహం అయింది. ఈ కావలి సోదరులు కల్నల్ కాలిన్ మెకంజీ వద్ద సహాయకులుగా పని చేసారు.

కావలి వెంకట బొర్రయ్య (Cavelly Venkata Boriah -1776-1803)

బొర్రయ్య 1776లో ఏలూరులో జన్మించాడు. ఇతను ఏలూరులోని ఒక ప్రైవేట్ స్కూలులో పదిసంవత్సరముల వరకూ విద్యనభ్యసించాడు. ఆ తరువాత సాంప్రదాయ సంస్కృతపాఠశాలలో చేరాడు. ఇక్కడ అయిదారు నెలలలోనే సంస్కృతంలో ప్రావీణ్యత గడించి సొంతంగా పద్యాలల్లేవాడట. ఇతని బంధువులు కొంతమంది ఈస్ట్ ఇండియా కంపనీలో ఉద్యోగులు. వారిలాగే తానుకూడా ఉన్నతంగా జీవించాలనే ఆశయంతో బొర్రయ్య ఉండేవాడు. ఈ క్రమంలో పెర్షియన్, హిందీ భాషలను, తన ఇంటికి రెండుమైళ్ల దూరంలోకల కొత్తూరు వెళ్ళి నేర్చుకొన్నాడు. బొర్రయ్య పద్నాలుగేళ్ల వయసుకు చేరుకొన్నాక మచిలీపట్నంలో Mr. Morgan నడుపుతున్న స్కూలులోచేరి కొన్నాళ్లు ఇంగ్లీషు విద్యను అభ్యసించాడు. ఇది 1790-93 మధ్య కాలం కావొచ్చు.
తీరిక సమయాలలో బొర్రయ్య తెలుగు సాహిత్యం, చందస్సు, అలంకారశాస్త్రం అభ్యసనం చేస్తూ పద్యాలు అల్లటం చేసేవాడు. అత్తలూరి పాపయ్య వ్రాసిన కవిత్వం ఎక్కువగా ఇష్టపడేవాడట. మచిలీపట్నంలో ఆంగ్లేయులతో ఏర్పడిన పరిచయాల ద్వారా బొర్రయ్య ఈస్ట్ ఇండియా కంపనీ, మచిలీపట్నం సైనిక విభాగంలో ఉద్యోగం సంపాదించాడు. ఒంగోలు, మునగాల, కొండపల్లి లాంటి వివిధ ప్రాంతాలలో ఉంటున్న సైనికులకు జీతాలను తీసుకెళ్ళి పంచిపెట్టే ఉద్యోగం అది. ఉద్యోగ రీత్యాకూడా బొర్రయ్యకు అనేకమంది ఆంగ్లేయులతో

పరిచయాలు పెరిగాయి. అప్పటికి ఇతని వయసు పద్దెనిమిదేళ్ళు. కొంతకాలం నర్సాపురంవద్ద బ్రిటిష్ స్థావరమైన మెడపొల్లం (మాధవపాలెం) లో కూడా పనిచేసాడు. అప్పటికే కంపనీ ఉద్యోగిగా ఉన్న బొర్రయ్యసోదరుడైన నారాయణప్ప సిఫార్సుతో, బొర్రయ్య 1796లో మెకంజీ వద్ద ప్రధాన లేఖకునిగా ఉద్యోగంలో కుదరటంతో ఇతని జీవితం మారిపోయింది. బొర్రయ్య మేధోశక్తిని గమనించిన మెకంజీ ఇతనిపట్ల ఎంతో మాన్యత కలిగిఉండేవాడు. అప్పగించిన పనులను సమర్ధవంతంగా పూర్తిచేయగలడని విశ్వసించేవాడు. తెలుగు, తమిళ, కన్నడ, సంస్కృతం, పర్షియన్, భాషలలో ప్రావీణ్యం కలిగి ఉండటంతో దక్షిణ భారతదేశ శాసనాలను అవలీలగా ప్రతులు తీసి ఇంగ్లీషులోకి అనువదించేవాడు బొర్రయ్య. బొర్రయ్య చక్కని చిత్రకారుడు కూడా కావటంతో అనేక ఆలయాల డ్రాయింగులను చిత్రించాడు

****

1798 మైసూరు యుద్ధంలో మెకంజీ పాలుపంచుకొన్నపుడు బొర్రయ్య అతనిని అనుసరించాడు. ఆ సమయంలో ఒక నిజాం జమిందారుని అనుచరులు మెకంజీ కాగితాలను ఎత్తుకుపోతే, వాటిని తిరిగి సంపాదించిపెట్టమని మెకంజీ బొర్రయ్యను కోరాడు2. అంత యుద్ధసమయంలోను బొర్రయ్య వెరవక ఆ జమిందారువద్దకు వెళ్ళి వచ్చినపని చెప్పగా, అతను బొర్రయ్యను ఖైదు చేయించి తిండితిప్పలు పెట్టకుండా హింసించాడు. బొర్రయ్య ధైర్యం కోల్పోకుండా ఆ జమిందారుని పొగుడుతూ పద్యాలు అల్లి, అతని విశ్వాసాన్ని చూరగొని మెకంజీ కాగితాలతో పాటూ తనుకూడా అనేక బహుమతులను సంపాదించుకొన్నాడు. కొన్ని సార్లు బొర్రయ్య దట్టమైన అరణ్యాలు, కొండలు, వాగులు దాటుకొని విషయసేకరణ జరిపేవాడు.

టిప్పు సుల్తాను, బ్రిటిష్ వారికి మధ్య జరిగిన యుద్ధవిశేషాలను బొర్రయ్య కావ్యంగా రాసాడు. శ్రీరంగ రాజుల వంశావళిని తెలియచేసే "శ్రీరంగరాజ చరిత్ర", "యాదవరాజ వంశావళి", "కాంచిపుర మహత్యము" లాంటి పద్యకావ్యాలు రచించాడు. బొర్రయ్య వ్రాసిన- Account of the Jains, Collected from a priest of this sect at Mudgeri; Translated by Cavelly Boria Brahmin; for Major C Mackenzie.[3] అనే

పరిశోధనాత్మక వ్యాసం భారతదేశ జైనమత పునరుజ్జీవనంలో మైలురాయిగా నిలిచిపోయింది. కావలి వెంకట బొర్రయ్య అనేక సంస్కృత, కన్నడ శాసనాలను ఇంగ్లీషులోకి అనువదించినట్లు ఏసియాటిక్ జర్నల్స్ లో కనిపిస్తుంది. ఆ తరువాత కొన్ని సంచికలలో "బొర్రయ్య నిర్ధారించాడు" అంటూ ఇతరులు వ్రాసిన వ్యాసాలలో బొర్రయ్యకు సంబంధించిన అనేక రిఫరెన్సులు కనిపిస్తాయి.

****

బొర్రయ్యకు పన్నెండేళ్ళ వయసులోనే కసింకోట జమిందారైన వెంకటాచలం చిన్న సోదరితో వివాహమైంది. వీరిద్దరికీ ఒక కూతురు పుట్టి చనిపోయింది. 1803 లో ఇరవైఆరేళ్ల వయసులో బొర్రయ్య, రుద్రవాతం (మెదడు నరాలు చిట్లి అకస్మాత్తుగా మరణించటం) బారిన పడి అకస్మాత్తుగా చనిపోయాడు. బొర్రయ్య చేసిన సేవలకు గుర్తుగా కాలిన్ మెకంజీ బొర్రయ్య మద్రాసు సముద్రపు ఒడ్డున ఒక స్మారకచిహ్నాన్ని ఏర్పాటు చేయించాడు మెకంజీ. ఇది 1834 వరకూ అక్కడే ఉండేది. [4]

****

బొర్రయ్య మొట్టమొదటి బారతీయ ఎపిగ్రాఫిస్ట్ (పురాలేఖన కారుడు). "బొర్రయ్య ద్వారా నాకు భారతీయ విజ్ఞానానికి కొత్తతలుపులు తెరుచుకొన్నాయి" అని మెకంజీ చెప్పుకొన్నాడు. [5] 1816లో రాజారామమోహన్ రాయ్ Abridgment of the Vedanta అనే పుస్తకం రాసినందుకు అతనిని ఇంగ్లీషులో రచించిన మొట్టమొదటి భారతీయునిగా గుర్తించారు. కానీ 1803కి ముందే బొర్రయ్య వ్రాసిన అనేక ఇంగ్లీషురాతలు ఉన్నాయి. చాలా రచనలు జర్నల్స్‌లో ప్రచురింపబడ్డాయి. The Political Conditions of the Carnatic during Moghul Times, Lives of Telugu poets అనే పుస్తకాలను బొర్రయ్య రచించాడు. కానీ ఇవేమీ చరిత్రలోకి ఎక్కకపోవటం శోచనీయం. [6]

కావలి వెంకట లక్ష్మయ్య

బొర్రయ్య బ్రతికి ఉండగానే వెంకటలక్ష్మయ్య మెకంజివద్ద పనిచేస్తూ ఉండేవాడు. 1802లో ఇతను నెల్లూరులో ఉంటూ వ్రాతప్రతులను సేకరించి మెకంజీకి పంపేవాడు. బొర్రయ్యమరణానంతరం అతని స్థానంలో లక్ష్మయ్య

మెకంజీ ప్రధాన సహాయకునిగా మారాడు. వివిధ ప్రాంతాలనుండి వివరాలను తెప్పించటం వాటిని మెకంజీకి అందచేయటం ఇతని ప్రధానవిధిగా ఉండేది. ఈ పనికొరకు ఇతనికి నారాయణరావు, తిరుమలరావు, సీతారామయ్య వెంకట్రావు, మహమద్ హనుమా, మురహరిరావు, కైలాసపతి లాంటి అనుచరులను ఏర్పాటు చేసుకొన్నాడు. [7]

1816లో వెంకటలక్ష్మయ్య ఒక చీటింగ్ కేసు ఎదుర్కొని కోర్టులో చివాట్లు తిన్నాడు. వెంకటలక్ష్మయ్య సోదరి సీతమ్మాళ్ భర్త రమణప్ప విస్సన్నపేట జమిందారు. అతను మరణించాక ఆ జమిందారీని తనకున్న పరపతిని ఉపయోగించి సీతమ్మాళ్‌కు ఇప్పిస్తానని లక్ష్మయ్య నమ్మబలికాడు. అందుకయ్యే ఖర్చులకొరకు 6000 రూపాయిల మొత్తాన్ని నరసింహాచారి అనే మధ్యవర్తినుండి గ్రహించాడు. జమిందారీ వ్యవహారం ఎంతకీ తేలకపోవటంతో తన బాకీ తీర్చమని లక్ష్మయ్యపై నరసింహాచారి కోర్టులో దావావేసాడు. ఈ దావాలో ఓడిపోయిన లక్ష్మయ్య మొత్తం డబ్బును కోర్టుద్వారా చెల్లించాల్సివచ్చింది.

****

1821 లో మెకంజీ మరణించాకా ఆ సేకరణలను కేటలాగ్ చేయటంలో H. H. Wilson కు సహాయపడటం కొరకు కొంతకాలం లక్ష్మయ్య కలకత్తాలోనే ఉండి 1827లో మద్రాసుకు తిరిగి వచ్చేసాడు. ఈస్ట్ ఇండియా కంపనీ లక్ష్మయ్య చేసిన సేవలకు ప్రతిఫలంగా నెలకు మూడువందల రూపాయిల పింఛను, ప్రభుత్వఖర్చులతో ఒక పల్లకిని మంజూరు చేసింది. రామస్వామికి 30 రూపాయిల పించను ఏర్పాటుచేసింది. విల్సన్ 1828లో మెకంజీ సేకరణల కేటలాగును పుస్తకరూపంలో ప్రచురించాకా, చాలా సేకరణలను బ్రిటిష్ మ్యూజియంకు, దక్షిణభారతదేశానికి చెందిన వ్రాతప్రతులను మద్రాసుకు తరలించారు.
మద్రాసులో ఉన్న మెకంజీ వ్రాతప్రతులపై తదుపరి పరిశోధనలు చేస్తాను అని కావలి లక్ష్మయ్య 1833లో కంపనీ ప్రభుత్వానికి ఒక అర్జీ పెట్టుకొన్నాడు. ఆ పనిచేయటానికి సమర్ధుడు లక్ష్మయ్య అని Alexander Johnston లాంటి మెకంజి మిత్రులు కూడా మద్దతు ఇచ్చారు.

మెకంజీ ముఖచిత్రంతో వచ్చిన Saturday Magazine,28 June, 1834 సంచికలో మెకంజీపై Alexander Johnston వ్రాసిన ఒక సంస్మరణ వ్యాసంలో వెంకట లక్ష్మయ్య ప్రస్తావన ఉంది. ఇందులో మెకంజీ మొదలుపెట్టిన పనిని కొనసాగించాలని, దీనికొరకు Royal Asiatic Society చర్యలు తీసుకొని, మెకంజీ సహాయకులను సంప్రదించాలని, వారిని ప్రభుత్వం ప్రోత్సహించాలని - తాను కావలి వెంకట లక్ష్మయ్యకు పైన చెప్పిన పనులను చేపట్టమని ఒక ఉత్తరం వ్రాసానని, అది అందుకొని - వెంకటలక్ష్మయ్య మద్రాసులో రెండువందల మంది ఔత్సాహిక స్థానికులతో Madras Literary Society ని స్థాపించి మెకంజీ ఆశయాలను ముందుకు తీసుకొని వెళ్ళే ప్రయత్నాలు చేస్తున్నట్లు నాకు తెలియచేసాడు- అని అలెగ్జాండర్ అన్నాడు. ఇదే వ్యాసంలో రాయల్ ఏసియాటిక్ సొసైటి, లండన్‌కు భారతదేశప్రతినిధిగా ప్రస్తుతం కావలి వెంకటలక్ష్మయ్య వ్యవహరిస్తూన్నడని కూడా ఉంది.

వెంకటలక్ష్మయ్య మెకంజీ సేకరణలను పరిశోధిస్తానని పెట్టుకొన్న అభ్యర్ధనను తిరస్కరిస్తూ, 1836లో secretary of the Asiatic Society, J. Prinsep "ఆ పని బృహత్తరమైనదని, సమర్ధవంతుడైన నాయకుడు ఉండాలని, లక్ష్మయ్యకు అంతటి శక్తి, నైపుణ్యాలు లేవని" బదులిచ్చాడు. 1837 లో మెకంజీ సేకరణలను కేటలాగ్ చేసే పనిని William Taylor కి అప్పగించింది ఈస్ట్ ఇండియా కంపనీ. ఇతనికి లక్ష్మయ్య సహాయపడినట్లు తెలియరాదు.

****

1837లో లక్ష్మయ్య మద్రాసులో ఆరునెలలపాటు Julia Thomas అనే మహిళకు తమిళ టీచర్‌గా నెలకు అయిదు వరహాల జీతంపైన పనిచేసాడు. ఈ జూలియా భర్త రాజమండ్రి కలక్టరుగా పనిచేసేవాడు. జూలియా లండన్ లోని తన బంధువులకు వ్రాసిన ఉత్తరాలలో ఒకచోట లక్ష్మయ్య ప్రస్తావన ఇలా ఉంది.

"నాకు తమిళం నేర్పించే ఉపాధ్యాయుడు వారానికి మూడుసార్లు వస్తాడు. పెద్ద పెద్ద మీసాలతో, గంభీరంగా ఉంటాడు. నడుముచుట్టూ కట్టుకొన్న రంగురంగుల అందమైన శాలువాలు నడుస్తున్నప్పుడు ఊగుతూ ఉంటాయి. ఇతను మొదటి సారిగా కలిసినపుడు మీ స్నేహం ముఖ్యం, జీతం మీరు ఎంత

ఇస్తే అంత అన్నాడు. నెలకు అయిదు వరహాలు అనుకొన్నాం. నేను ఏ సమయం చెపితే ఆ సమయానికి వస్తాడు. ఇకచాలు మిగిలినది తరువాత చూద్దాం అంటే వెళిపోతాడు. ఒక్కోసారి నేను తయారుగా లేను కాసేపు ఆగు అంటే, వరండాలో కూర్చొని నా పిలుపుకొరకు అలా ఖాళీగా ఎన్నిగంటలైనా ఎదురు చూస్తాడు. ఇతను హిందూ లిటరరీ సొసైటీ అధ్యక్షుడట" [8]

పై ఉత్తరంలోని వర్ణనల ద్వారా కావలి వెంకటలక్ష్మయ్య రూపాన్ని, ఆహార్యాన్ని, నడవడికను గ్రహించవచ్చు. లక్ష్మయ్య రచయిత కూడా. భారవి విరచిత కిరాతార్జునీయ కావ్యాన్ని వెంకట లక్ష్మయ్య ఇంగ్లీషులోకి అనువదించి 1869లో ప్రచురించాడు.

****

ముందుగా చెప్పుకొన్న సీతమ్మాళ్ యొక్క జమిందారీ హక్కులను 1838లో లక్ష్మయ్య తనపేరిట రాయించుకొని కేసునడిపించటం మొదలెట్టాడు. ఈ కేసు తుదితీర్పు 1867లో లక్ష్మయ్యకు అనుకూలంగా వచ్చింది. అప్పటికి సంతులేని సీతమ్మాళ్ చనిపోయింది. లక్ష్మయ్య చనిపోయాడు. లక్ష్మయ్య కొడుకు నారాయణప్ప కూడా చనిపోయాడు. చివరకు జమిందారీ హక్కులు కావలి రామస్వామి కుమారులైన కావలి వెంకట సీతారామయ్యలకు దక్కాయి. [9] విధిచేయు వింతలంటే ఇవేనేమో!

కావలి వెంకట రామస్వామి

రామస్వామి 1798 నుంచి మెకంజీ వద్ద అనువాదకుడిగా పనిచేసాడు. పైన చెప్పిన నరసింహాచారి కావలి వెంకటలక్ష్మయ్యపై వేసిన కేసులో ఈ రామస్వామి తప్పుడు సాక్ష్యం ఇచ్చాడని రుజువుకావటంతో 1818 లో ఇతనిని కంపనీప్రభుత్వం ఉద్యోగం నుండి తొలగించింది. మద్రాసులో నెలకు పదిహేను వరహాల జీతంపై కొంతకాలం టీచరుగా పనిచేసాడు. తరువాత కలకత్తాలో ఉంటున్న అన్నగారైన లక్ష్మయ్యవద్దకు చేరాడు. వీరిద్దరూ రాజారామమోహన్ రాయ్ బ్రహ్మసమాజ సభలకు హాజరయ్యేవారు. బ్రహ్మసమాజం ప్రార్ధనాసమయంలో ఇద్దరు తెలుగు బ్రాహ్మణులు వేదపఠనం చేసేవారట. వారు కావలి వెంకట లక్ష్మయ్య, రామస్వామిలు కావొచ్చునని The

life and work of Kavali Brothers వ్రాసిన C V Ramachandra Rao అభిప్రాయపడ్డారు. [10]

రామస్వామి మంచి రచయిత. మెకంజీ సేకరించిన విషయాలను పుస్తక రూపంలోకి తీసుకురావటానికి ప్రయత్నించాడు. 1828లో ప్రచురించిన Descriptive and Historical Sketches of Cities and Places in the Dekkan ఇతని మొదటి పుస్తకం. ఈ పుస్తకంలో రామస్వామి ఒకచోట "వివిధ యుద్ధాలు, విశ్వాస వైరుధ్యాల వలన శాసనాలు, శిల్పాలు, కట్టడాలు లాంటి చారిత్రిక ఆధారాలు నాశనం చేయబడతాయి. కానీ సాహిత్యరూపంలో లిఖించబడిన చరిత్ర ప్రజలనాలుకలపైన జీవించే ఉంటుంది. దీన్ని ఏ యుద్ధమూ నాశనం చేయలేదు. సాహిత్యం ద్వారా లభించే చరిత్రను మనం శోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అంటూ వెలిబుచ్చిన అభిప్రాయాలు నేటికీ ప్రాసంగితను కోల్పోలేదు. "హార్డ్ ఎవిడెన్సెస" తో మాత్రమే చరిత్ర ప్రతిపాదనలు చేయాలి అని నమ్మే యురోపియన్ చరిత్రకారులకు ఈ మాటలు చెంపపెట్టులాంటివి.

1829లో కలకత్తా నుంచి రామస్వామి Biographical Sketches of Dekkan Poets పేరుతో దక్కను కవులచరిత్ర పుస్తకం వెలువరించాడు. ఈ పుస్తకానికి రాసుకొన్న ముందుమాటలో కావలి వంశస్థులు కృష్ణదేవరాయల ఆస్థానంలో రాయబారులుగా పనిచేసేవారని చెప్పుకొన్నాడు. ఈ పుస్తకాన్ని విలియం బెంటింగ్‌కి భక్తితో అంకితమిచ్చాడు. దీనిలో నన్నయ, పోతన, అవ్వయార్, సుందరర్ లాంటి మొత్తం 79 మంది కవుల జీవిత, సాహిత్య విశేషాలను ఇంగ్లీషులో అక్షరబద్ధం చేసాడు. ఇది గొప్ప విశేషం. బహుసా ఇదే మొదటి తెలుగు కవుల చరిత్ర కావొచ్చు. ఇందులో తమిళ, కన్నడ, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన కవులు ఉన్నారు. ఈ పుస్తకంలో తన తమ్ముడైన కావలి బొర్రయ్య సాహిత్యకృషిని కూడా చివరలో చేర్చాడు.

1833 లో రామస్వామి కలకత్తానుంచి మద్రాసుకు తిరిగి వచ్చేసాడు. 1836లో The Modern Culinary Recipes of the Hindoos పేరుతో ఒక వంటలపుస్తకాన్ని ప్రచురించాడు.

వెంకట లక్ష్మయ్య వద్ద తమిళం నేర్చుకొన్న జీuశ్రీఱa Tష్ట్రశీఎas 19 నవంబరు, 1838న వ్రాసిన మరో ఉత్తరంలో రామస్వామి గురించి ఇలా వ్రాసింది.

“ఒకరోజు ఒక తెలివైన ఇండియన్ ను కలిసాను. ఇతను రాజారామమోహన్ రాయ్ స్నేహితుడట. తను ప్రచురించబోతున్న ఒక పుస్తకం కొరకు చందా ఇవ్వమని అడిగాడు. స్త్రీలకు విద్యనేర్పకూడదు అనే మూఢ హిందూ సాంప్రదాయాలను ఎదిరించి తన ముగ్గురు కూతుర్లకు, కొడుకులతో సమానంగా చదువు చెప్పిస్తున్నానని, అలా చేయటాన్ని తన భార్యకు ఇష్టం లేదని చెప్పుకొచ్చాడు. ఇందువల్ల తనకు ఇంట్లో మనశ్శాంతి లేదని బాధపడ్డాడు. రాజారామ్ మోహన రాయ్ సూచనలను ప్రభుత్వం వారు అంగీకరిస్తే బాగుంటుందని ప్రజలు అనుకొంటున్నారని అన్నాడు”

పై ఉత్తరం ద్వారా రామస్వామి జీవనశైలి, ఆధునిక భావాలు, కుటుంబ విషయాలు అర్ధమౌతాయి.

రామస్వామి పబ్లిషర్‌గా వ్యాపారకిటుకులు బాగానే ప్రదర్శించేవాడని అనుకోవాలి. దక్కను కవుల చరిత్ర మొదటి ముద్రణను విలియం బెంటింగ్ కు అంకితమివ్వగా 1847 లో రెండవ ముద్రణను Erskine Parry అనే సుప్రీమ్‌కోర్టు జడ్జ్‌కి అంకితం ఇచ్చాడు. ఇతని పుస్తక ప్రచురణల కొరకు చందాలు ఇచ్చిన వ్యక్తుల పేర్లు పుస్తకం వెనకాల ముద్రించేవాడు. ప్రచురణ కర్తగా రామస్వామి మూలికాస్వాంతనము, castes of southern India, ఏకశిలానగర వృత్తాంతము, Account of Pulicat లాంటి అనేక పుస్తకాలను ముద్రించాడు. ఇవన్నీ మెకంజీ సేకరణలోవి కావొచ్చు. (ఏకశిలానగర కైఫియ్యతు కలదు)

మెకంజీ చిత్రకారులు

మెకంజీ వృత్తిరీత్యా సర్వేయరు కనుక మేప్స్ గీయటానికి అతని వద్ద అనేకమంది చిత్రకారుల బృందం ఉండేది. మెకంజీ సేకరణలలో దేవాలయాలు, భవనాలు, శిల్పాలు, తామ్రశాసనాలు, లాండ్ స్కేప్స్ లాంటి వివిధ చిత్రాలు మొత్తం 2630 ఉన్నాయిని విల్సన్ గుర్తించాడు. వీటిలో మెకంజీ స్వయంగా గీచిన చిత్రాలు, తన సహాయకులు వేసిన డ్రాయింగులే కాక మెకంజీ ఇతరులనుంచి సేకరించిన చిత్రాలు కూడా ఉన్నాయి.

మెకంజీ మొదట్లో తన బొమ్మలు తానే వేసుకొనేవాడు. అతని ఉద్యోగ బాధ్యతలు పెరిగేకొద్దీ క్రమక్రమంగా అతనికి సహాయకులను

నియమించుకొనే అవకాసం వచ్చింది. అలా అతనివద్ద పనిచేసిన సహాయకుల వివరాలు ఇవి.

Thomas Anderson: ఇతను 1811 నుంచి మెకంజీ వద్ద పనిచేసాడు. ఇతను 18 అమరావతి స్థూప డ్రాయింగ్స్ వేసాడు.

Charles Barnett: ఇతను సర్వే డిపార్ట్ మెంటులో సహాయక డ్రాఫ్ట్స్ మేన్. ఇతను 9 అమరావతి డ్రాయింగ్స్ చిత్రించాడు

Marcellus Burke: ఇతను 1806 లో మెకంజీ సహాయకునిగా చేరాడు. గుంటూరు జిల్లాను సర్వేచేసి మేప్ తయారుచేసాడు. 14 అమరావతి శిధిలాల డ్రాయింగ్స్ గీచాడు.

Buxton Bentley: ఇతను 1818 నుంచి మెకంజి వద్ద పనిచేయనారంభించాడు. కటక్ సర్వేలో పాల్గొన్నాడు. పూరిజగన్నాధ రథయాత్ర చిత్రాన్ని ఇతను గీచిందే.

Thomas Fiotte Haviland: ఇతను 1796 నుంచి మెకంజీతో కలిసి పనిచేసాడు. మెకంజీ మొదలుపెట్టిన దక్కను సర్వేను ఇతను కొనసాగించాడు. 1809 లో థామస్ ఆదోని కోట చిత్రాలను గీచాడు.

Fraser Edward: ఇతను మెకంజీతో కలిసి మైసూరు సర్వేలో పాల్గొన్నాడు. 1801 లో ఉత్తరాంధ్ర జిల్లాల సర్వే చేసాడు. 1820 లో మెకంజీ జబ్బుపడి వైద్యంకొరకు ఒరిస్సా వెళ్లినపుడు ఆతిథ్యం ఇచ్చాడు.

John Gould: 1817 లో ఇతను మద్రాసులో చదువుముగించుకొని మెకంజీ వెంట కలకత్తా వెళ్లాడు. అనేక ఒరిస్సా శిల్పాలను చిత్రించాడు. ఒక అమరావతి శిల్పం యొక్క చిత్రాన్ని గీచాడు.

Henry Hamilton: ఇతను నా వద్ద శిక్షణ పొందాడు అని మెకంజీ ఎంతోగర్వంగా చెప్పుకొనేవాడు. హామిల్టన్ కొండపల్లిని సర్వేచేసాడు. అమరావతి తవ్వకాలకు సంబంధించిన 21 డ్రాయింగులు వేసాడు. మెకంజీనితోపాటు కలకత్తా వెళ్లాడు.

Pyari Lal: ఇతను కలకత్తా చిత్రకారుడు. 1819 నుంచి మెకంజీతో కలిసి పనిచేసాడు. అప్పటికే ఇతను 1815లో ద్రాక్షారం ఆలయ స్తంభం అనే

డ్రాయింగ్ వేసినట్లు తెలుస్తుంది. కలకత్తా చేర్చబడ్డ అమరావతి ఫలకాల చిత్రాలను లిఖించాడు.

Najibullah: ఇతను కలకత్తా చిత్రకారుడు. ప్యారిలాల్ తో కలిసి అమరావతి ఫలకాల చిత్రాలను గీచాడు.

Benjamin Syndenham: ఇతను 1795లో మెకంజీ సహాయకునిగా చేరాడు. ఇతను నిజాంరాజ్యంలో అనేక డ్రాయింగ్స్ వేసాడు.

John Newman: ఇతను 1791 నుంచి మెకంజీ సహాయకునిగా ఉన్నాడు. తరువాతి కాలంలో మెకంజీ టీముకు హెడ్ డ్రాఫ్ట్స్మాన్ అయ్యాడు. అత్యుత్తమ చిత్రకారుడని మెకంజీచే మన్ననలు పొందాడు. కలకత్తా వెళ్ళాడు. 1818లో మరణించాడు. ఇతని గురించి మెకంజీ "నా దృష్టికోణాన్ని అర్ధం చేసుకొన్న ఒకే ఒక వ్యక్తి న్యూమేన్. అతన్ని కోల్పోవటం సొంతబిడ్డను కోల్పోయినట్లు అనిపిస్తుంది" అని బాధపడ్డాడు. ఇతను ప్రతులు తీసిన చిత్రాలలో, ద్రాక్షారామ ఆలయ ఉత్తర ద్వార దృశ్యం, వైజాగ్ డాల్ఫిన్ నోస్, సింహాచల ఆలయశిల్పాలు, 14 అమరావతి చిత్రాలు తెలుగునేలకు చెందినవి.

****

మెకంజీ వృత్తిరీత్యా ఒక మిలటరీ అధికారి. మైసూరు, పాండిచేరి, శ్రీలంక, జావా లలో జరిగిన అత్యంత సంకటమైన యుద్ధాలలో పాల్గొన్నాడు. సర్వేయర్ గా భారతదేశంలో అనేక ప్రాంతాల మేప్‌లు తయారుచేసాడు. ఇవన్నీ జీవిక కోసం చేసిన పనులని బావించి ఉంటాడు. అందుకనే సమాంతరంగా వివిధ రంగాలకుచెందిన సహాయకుల సాయంతో భారతదేశసంస్కృతికి సంబంధించిన అనేక చారిత్రిక ఆధారాలను సేకరించటంద్వారా తన మేధోపరమైన దాహాన్ని తీర్చుకొనేవాడేమో! మెకంజీ తన మిత్రులకు వ్రాసిన ఉత్తరాలలో "తన సహాయకులు చాలా తెలివైన వాళ్ళని, వారివల్లనే నేను అనేక విషయాలను నేర్చుకొంటున్నానని" పదే పదే చెప్పేవాడు. వారి పనిని ఏనాడూ దొంగిలించలేదు. మెకంజీ సేకరణలను గమనిస్తే వాటిని ఎవరు, ఎప్పుడు, ఎక్కడనుంచి సేకరించారన్న సమాచారం ఈనాటికీ లభిస్తుంది. తాను కలకత్తా వెళిపోయిన తరువాత కూడా మద్రాసులో ఉండిపోయిన తన సహాయకులకు ఉపాధికల్పించమని అధికారులకు ఉత్తరాలు వ్రాసాడు.

మెకంజీ తన సహాయకులను ప్రేమించాడు, గౌరవించాడు వారు మరణించినపుడు బాధపడ్డాడు, వారికి స్మారకచిహ్నాలు నెలకొల్పాడు, తన వీలునామాలో కొన్ని ఏర్పాట్లు చేసాడు. ఇవన్నీ అధికారి-సేవకుడు అనుబంధం క్రిందకు రావు. కాలిన్ మెకంజీ పరిపూర్ణ మానవుడు.

December 2, 2019

References

1. ఈ వివరాలు by C V Ramachandra Rao వ్రాసిన The Life and works of kavali Brothers అనే వ్యాసంలోనివి. కాగా కావలిసోదరులు వరుసగా- బొర్రయ్య, లక్ష్మయ్య, రామస్వామి, నరసింహులు, సీతయ్యలు గా కూతురుపేరు సీతమ్మాళ్ అని Modern Historiography in India పుస్తకంలో Rama Sundari Mantena పేర్కొన్నారు. మొదటి ముగ్గురుమాత్రమే మెకంజీతో కలిసి పనిచేసారు. మిగిలినవారు లక్ష్మయ్యకు సహాయంగా ఉండేవారు.
2.Biographical sketches of Dekkan Poets by Cavelly Venkata Ramaswamie.
3. 1809 Asiatic Researches vol 9
4.Biographical sketches of Dekkan Poets by Cavelly Venkata Ramaswamie.
5. Mackenzie Letter dated 1 February, 1817 to Alexander Johnston.
6. C.V. Ramachandra Rao వ్రాసిన The Life and Work of Kavali Brothers వ్యాసం.
7. Modern Historiography in India by Rama Sundari Mantena

8. Letter dated 11th January, 1837 by Mrs. Julia Thomas from the book “Letters from Madras during the Years 1836-1839 by a Lady”
9. కృష్ణా జిల్లా మాన్యువల్, పే 339
10. సమగ్ర ఆంధ్ర సాహిత్యం, వాల్యూ 3, పేనం. 109

దడాల రఫేల్ రమణయ్య

(1908- 1991)



Dadala Raphael Ramanayya

ఫ్రెంచి పాలనలోని యానాం విముక్తి కోసం పోరాడిన యోధుని జీవితం. ఒక ప్రాంతపు స్వేచ్ఛా పోరాట చరిత్ర ఆయన ఆత్మకథ

దడాల రఫేల్ రమణయ్య - స్వాతంత్ర్య పోరాటయోధుని ఆత్మకథ

దళిత సాహిత్య చరిత్రలో ఆత్మకథా ప్రక్రియ ప్రత్యేకమైనది. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు వ్రాసుకొన్న ఇతర ఆత్మకథలతో పోల్చినపుడు, దళిత ఆత్మకథలు భిన్నంగా ఉంటాయి. భారతీయ దళిత ఆత్మకథల్లో అంబేద్కర్ పూర్వ, తదనంతర సమాజాలలోని మూడుతరాల దళిత జీవనశైలుల చిత్రణ జరుగుతుంది. సమాజంలో ఉండే కులపరమైన వివక్ష, అగ్రకుల ఆధిపత్యం, పేదరికం, అంటరానితనం వంటివి దళిత ఆత్మకథలలో సహజంగా ప్రతిబింబించే అంశాలు. పీడితుల చరిత్రను దళిత ఆత్మకథలు అక్షరీకరిస్తాయి.

యానానికి చెందిన శ్రీ దడాల రఫేల్ రమణయ్య "My Struggle for freedom of French Provinces in India - An Autobiography' పేరుతో 1974 లో ఇంగ్లీషులో వెలువరించిన ఆత్మకథ ద్వారా ఒకనాటి ఫ్రెంచి ఇండియా యొక్క అనేక చారిత్రిక, సామాజికాంశాలు తెలుస్తాయి. క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన ఒక దళిత క్రిష్టియన్ జరిపిన స్వాతంత్ర్యపోరాటాన్ని మనకళ్ళముందు నిలుపుతుందీ రచన.

శ్రీ దడాల జీవనయానం

శ్రీ దడాల రఫేల్ రమణయ్య యానాంకు చెందిన పరంపేట అనే గ్రామంలో 30 జూన్, 1908న ఓ దళిత రైతుకూలి కుటుంబంలో జన్మించారు. నాలుగు

సంవత్సరాల వయసులో తండ్రిగారిని కోల్పోవటంతో నాయినమ్మ ఇంటపెరిగారు. చిన్నవయసులోనే యానాం చర్చిలో తోటమాలికి సహాయకునిగా పనికి కుదిరారు. చదువుపట్ల ఇతనికి ఉన్న జిజ్ఞాసను గుర్తించి చర్చి ఫాదర్ శ్రీ గాంగ్లాఫ్, దడాలను చేరదీసి పాండిచేరి పంపి ఉన్నత చదువు చెప్పించారు. చదువు పూర్తయ్యాకా శ్రీ దడాల కొద్దికాలం టీచర్గా పనిచేసి, పోటీపరీక్ష పాసయి పోలీసు ఇన్స్పెక్టర్ ఉద్యోగాన్ని చేపట్టారు. బాధ్యతాయుతమైన పోలీస్ అధికారిగా అనేక సాహసోపేతమైన పనుల ద్వారా ఉన్నతాధికారుల మన్ననను పొందారు. వీటిలో ఫ్రెంచి గవర్నర్ శ్రీ మెనార్డ్ను ఆందోళనకారులనుండి కాపాడటం, పాండిచేరీలో ఒక సభలో అప్పటి జాతీయనాయకుడు శ్రీ వి.వి. గిరి పై దుండగులు దాడిచేసినపుడు ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించటం వంటివి ప్రముఖమైనవి.

1947 లో బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించి నిష్క్రమించింది. ఫ్రెంచివారు మాత్రం పాండిచేరి, మాహె, కారైకాల్ మరియు యానాం ప్రాంతాలను ఇంకా పరిపాలించేవారు. ఈ ఫ్రెంచికాలనీల ప్రజలలో స్వాతంత్ర్యకాంక్ష బలపడి ఫ్రెంచివారికి వ్యతిరేకంగా ఉద్యమించటం మొదలెట్టారు.

జాతీయభావాలు కలిగిన శ్రీ దడాల తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి ఆ ఉద్యమంలో చేరారు. అనేకమంది యువకులను కూడగట్టి 'ఫ్రెంచి ఇండియా విమోచన కూటమి' అనే సంస్థను స్థాపించి దానిద్వారా ప్రజను చైతన్యపరుస్తూ పాండిచేరీ స్వాతంత్రోద్యమాన్ని నడిపించారు. తన సొంతఊరు అయిన యానాం ఈ ఉద్యమంలో వెనుకపడి ఉందని భావించి, 14 ఏప్రెల్, 1954 న యానాం చేరి అక్కడి ప్రజలలో జాతీయోద్యమ భావాలు పెంపొందించారు. 13 జూన్, 1954న శ్రీ దడాల, వేలమంది కార్యకర్తలతో యానాం స్థానిక పరిపాలనా ఆఫీసును ముట్టడించి, అధికారాలను కైవసం చేసుకొని, ఫ్రెంచి జండాను తొలగించి భారతదేశపతాకాన్ని ఎగురవేసి- యానాం ఫ్రెంచి పాలననుండి విమోచమైందని ప్రకటించారు. ఆనాటి ప్రముఖ పత్రికలన్నీ ఈ వార్తను మొదటి పేజీలో ప్రచురించాయి.

16 జనవరి, 1955న అప్పటి ప్రధాని శ్రీ జవహర్లాల్ నెహ్రూ పాండిచేరీ వచ్చినపుడు జరిపిన బహిరంగ సభలో శ్రీ దడాల మాట్లాడుతూ .....' యానాన్ని అభివృద్ధి చేయమని, వ్యక్తిగతంగా పర్యవేక్షించమని' నెహ్రూను కోరారు. ఆ తరువాత ఆంధ్రా ఎక్సైజ్ ఇనస్పెక్టరుగా ఉద్యోగం చేసి 1963లో పదవీవిరమణ పొందారు. 5 మే, 1991న శ్రీ దడాల తనువు చాలించారు.

శ్రీ దడాల స్వీయచరిత్ర విశ్లేషణ

దయాపావర్ రచించిన 'బుతా', నరేంద్ర జాధవ్, 'ఔట్ కాస్ట్ ఎ మెమొయిర్', బేబీ కాంబ్లే 'ప్రిజన్స్ వియ్ బ్రోక్' వంటి ప్రముఖ భారతీయ దళిత ఆత్మకథలలో - తెలుగులో జాషువా రచించిన 'నా కథ', బోయిభీమన్న 'పాలేరునుండి పద్మశ్రీ వరకు', తలమర్ల కళానిధి 'ఆత్మకథ', వై. సత్యనారాయణ వెలువరించిన 'మా నాయిన బాలయ్య' వంటి వివిధ స్వీయచరిత్రలలో, దళిత సంస్కృతి, ఆత్మవిశ్వాసంతో తమను తాము పునర్నిర్మించుకొన్న ఒక ప్రయత్నం, తాము ఎదుర్కొన్న వివక్ష, లాంటి విషయాలు కనిపిస్తాయి.

శ్రీ దడాల స్వీయచరిత్రలోపై అంశాలేవీ కనిపించకపోవటం ఆశ్చర్యం కలిగించక మానదు. కులవివక్ష ప్రస్తావన ఒకే ఒక సందర్భంలో తప్ప మరెక్కడా కనపడదు. ప్రభుత్వోద్యోగానికి రాజీనామా ఇచ్చి పాండిచేరీ స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్నందుకు కృతజ్ఞతగా భారతప్రభుత్వం శ్రీ



దడాలకు సెక్రటరీ స్థాయి ఉద్యోగం ఇమ్మని అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుకు రికమెండ్ చేస్తే, ఒక వదరుబోతు ప్రభుత్వాధికారి కులదురహంకారంతో ఇతనికి ఇనస్పెక్టర్ స్థాయి ఉద్యోగం మాత్రమే వచ్చేలా చేసాడట. ఈ సంఘటన మినహా ఎక్కడా తన జీవితంలో కులపరమైన భేదభావం ఎదురకొన్నట్లు తెలుపరు. అంతేకాక ఫ్రెంచి అధికారులు తనను ప్రేమగా చూసుకొనేవారని కూడా అంటారు. భారతదేశ దళిత ఆత్మకథలకు భిన్నంగా ఉంటుంది కోణం. ఆ విధంగా శ్రీ దడాల ఆత్మకథ మిగిలిన భారతీయ దళిత ఆత్మకథతో పోల్చినపుడు ప్రత్యేకమైనదిగా అనిపిస్తుంది.

దీనికి ఈ కారణాలు ఊహించవచ్చు

1. ఫ్రెంచిపాలనలో కులవివక్ష పెద్దగా లేదని భావించటం. యానాంలో 1849 నుంచి కులమతాలకు అతీతంగా విద్యాబోధన ఉండేది` అప్పట్లో యానాంలో విద్యాభ్యాసం చేసిన ప్రముఖ తెలుగుకవి శ్రీ చెళ్ళపిల్ల వెంకటశాస్త్రి యానాం స్కూలులో మాల మాదిగలతో కలిసి కూర్చోవలసి వచ్చేదని ఒక వ్యాసంలో అంటారు. యానానికి చెందిన ప్రముఖ సమకాలీన కవి శిఖామణి ఒక చోట "నేను యానాంలో పుట్టి పెరగటం వలన కులపరమైన వివక్షను పెద్దగా ఎదుర్కొన లేదు" అని ఒక ఇంటర్వ్యూలో చెపుతారు. ఇవన్నీ ఈ ప్రతిపాదనకు ఆధారాలుగా నిలుస్తాయి.

2. విదేశీయుడైన ఫాదర్ గాంగ్లాఫ్ సంరక్షణలో శ్రీ దడాల పెరగటం వలన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లాంటి విశాలమైన ఫ్రెంచి ఆదర్శాలను వంటపట్టించుకొని ఉండొచ్చు.

3. సామాజికంగా ఎదుర్కొనే కులవివక్షను ఏ మాత్రమూ ఖాతరు చేయని దృఢచిత్తం కలిగిఉండి, మహోన్నత ఆశయాలకొరకు జీవితాంతం శ్రీ దడాల పాటుపడి ఉండవచ్చు. బహుసా తాను ఎదుర్కొన్న కులపరమైన అవమానాలు తన లక్ష్యసాధన ముందు చిన్నవిషయాలుగా శ్రీ దడాల భావించారని కూడా అనుకోవచ్చు.

ఈ నేపథ్యంలోంచి శ్రీ దడాల స్వీయచరిత్రను పరిశీలించినపుడు ఆయన జీవితంలో దళిత వెతలు కనిపించకపోవటం ఆశ్చర్యం కలిగించదు. కానీ శ్రీ దడాలకు దేశవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న వివక్షపై అవగాహన, సహానుభూతి ఉన్నాయి. అందుకనే ఈ పుస్తకానికి వ్రాసుకొన్న ముందుమాటలో ` ' నేను 1963 లో పదవీవిరమణ చేసి నా పూర్వీకుల వృత్తి అయిన వ్యవసాయాన్ని చేపట్టాను, ఒక కూలీగా కాదు, ఒక భూస్వామిగా. ఇన్నేళ్ళ నా శ్రమఫలాల్ని నేను ఇపుడు అనుభవిస్తున్నాను. కానీ 150 మిలియన్ల నా దళిత, ఆదివాసీ సహోదరల దుస్థితి పట్ల నాకేమాత్రం ఉదాశీనత లేదు. ఆకలితో, పీడనతో, సజీవదహనాలతో, హత్యలతో, నా సహోదరులు చనిపోవటాన్ని నేను ఉపేక్షించలేను. నా జాతి స్త్రీలు బలాత్కరింపబడుతున్నారు, రోడ్లపై నగ్నంగా ఊరేగింపబడుతున్నారు'` అని ఎంతో ఆవేదనతో అంటారు. అంతేకాక యునైటెడ్ నేషన్స్ చార్టర్ 55 మరియు 56 ఆర్టికిల్ ప్రకారం అస్పృశ్యత, జాతివివక్ష, జనహననం వంటివి అంతర్జాతీయ నేరాలు... మన జాతిని కాపాడుకోవటానికి యు.ఎన్.ఒ. ను ఆశ్రయించాని సూచిస్తారు. ఇది ఆదర్శప్రాయమైన, గొప్ప ప్రాపంచిక అవగాహన కలిగిన ఒక దళిత ఆలోచనాపరుని దృక్పథం.

ఈ ఆత్మకథలో మనకు - స్వీయ అస్థిత్వాన్ని అన్వేషిస్తూ ఒక దళితయోధుడు చేసిన సాహస ప్రయాణం కనిపిస్తుంది. తరతరాలుగా అణచివేతకు గురయిన తన జాతికి చరిత్రలో ఒక సగౌరవ స్థానం కల్పించటానికి ఒక దళితదార్శనికుడు చేసిన పోరాటం తెలుస్తుంది. స్వేచ్ఛ స్వతంత్రాలకొరకు అచంచలమైన ఆత్మవిశ్వాసంతో అలుపెరుగని ఉద్యమం సాగించి విజయం సాధించిన గొప్ప దేశభక్తుడు దర్శనమిస్తాడు. తనప్రాణాన్ని పణంగా పెట్టి చేస్తున్న ఉద్యమంవల్ల తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని కలగకూడదని వారిని సురక్షితంగా కాపాడుకొన్న మంచి కుటుంబపెద్ద కనిపిస్తాడు. అప్పట్లో బ్రిటిష్ పాలనలోని భారతీయ అధికారులు ప్రభుత్వపక్షాన చేరి తమ సహోదరుల పట్ల దమనకాండ సాగించేవారు. భారతస్వాతంత్ర్యపోరాట చరిత్రలో ఉన్నత పోలీసు ఉద్యోగాన్ని ఒదిలి స్వాతంత్ర్యపోరాటంలో పాల్గన్న ఒకే ఒక వ్యక్తి శ్రీ దడాల మాత్రమే. దీనికి

ఆయన ఎంతో గర్వపడేవారు. ఇవన్నీ ఉత్తమ మానవవిలువలు. ప్రతిఒక్కరూ స్ఫూర్తి పొందగలిగిన లక్షణాలు.

తన ఆత్మకథ ఎందుకు వ్రాసానో శ్రీ దడాల చెపుతూ ' నేను దళిత క్రిష్టియన్ ని. నేనేదో గొప్ప విషయాన్ని సాధించానని చెప్పుకోవటం లేదు. కానీ నా వినమ్ర జీవితంలోని విషయాలను తెలుసుకొని ఏ కొద్దిమంది యువతీయువకులైనా, ముఖ్యంగా నా దళిత సహోదరులు స్ఫూర్తినొందుతారని నా ఆశ ' అంటారు. శ్రీదడాల తన జీవితంలో ప్రదర్శించిన పట్టుదల, ఆత్మవిశ్వాసం, పోరాటపటిమను భావితరాలకు తెలియచెప్పటానికి యానాం ప్రభుత్వం- శ్రీ దడాల రఫేల్ రమణయ్య గారి నిలువెత్తు కాంశ్య విగ్రహాన్ని యానాం, ఫెర్రీరోడ్డులో 1993లో ప్రతిష్టింపచేసి, తన గౌరవాన్ని చాటుకుంది.

August, 2017

రిఫరెన్సులు

1. My Struggle for freedom of French Provinces in India - An Autobiography' by Sri. Dadala Raphael Ramanayya

2. Cultural study of dalit autobiographies in India. by Landage, Ramesh, - source Shodhganga

3. మరాఠీ దళిత ఆత్మకథా ప్రక్రియ, డా. జి.వి. రత్నాకర్ 26-3-12 సూర్య దినపత్రిక/డా.దార్ల వెంకటేశ్వర రావు బ్లాగు

4. ఫ్రెంచి ఇండియా విమోచకుడు, దడాల రమణయ్య, 29 జూన్, 2008 ఆంధ్రజ్యోతి లో ప్రముఖ కవి శిఖామణి వ్యాసం

5. కథలు గాథలు, చెళ్ళపిల్ల వెంకటశాస్త్రి, పేజి నంబరు 403

6. ఫ్రెంచిపాలనలో యానాం పుస్తకం, బొల్లోజు బాబా

అల్లూరి సీతారామరాజు

(1897–1924)



మన్యం విప్లవ వీరుడి గురించి చాలామందికి తెలియని కొన్ని చారిత్రక వాస్తవాలను, సంఘటనలను ఆధారాలతో వివరించిన ఆసక్తికరమైన రచన

నిష్కళంక స్వాతంత్ర్యసమరయోధుడు శ్రీ అల్లూరి సీతారామరాజు

శ్రీ అల్లూరి సీతారామరాజు భూకబ్జాదారుడని, యాభై ఎకరాల భూమికొరకు అతను బ్రిటిష్ వారితో పోరాడాడని, దాన్ని కొద్దిమంది స్వాతంత్ర్యపోరాటంగా చిత్రీకరించారంటూ ఒక పోస్టు ఇటీవల వాట్సప్ గ్రూపులలో వైరల్ గా సంచరిస్తోంది.
శ్రీ అల్లూరి సీతారామరాజు జీవించి ఉండగా అతను జరిపిన పోరాటం పై వచ్చిన వార్తా కథనాలు, ఒక ఔత్సాహిక విలేఖరికి ఇచ్చిన అతని ఇంటర్వ్యూ ద్వారా – శ్రీ రామరాజు నిజాయితీగా, స్వాతంత్రపోరాటం జరిపినట్లు అర్ధమౌతుంది. శ్రీ రామరాజు మరణించిన వెంటనే వచ్చిన కొన్ని వ్యాసాలలోనూ ఇదే అభిప్రాయం వ్యక్తమవటం కూడా శ్రీ రామరాజు నిష్కళంకతను రుజువుచేస్తుంది.

ఈ అంశానికి సంబంధించి ఆనాటి పత్రికా కథనాలు.... వాటి విశ్లేషణా
.

1. ఆంధ్రపత్రిక April 21, 1923

రంపపితూరి నాయకుడు శ్రీ అల్లూరి సీతారామరాజు

శ్రీ అల్లూరి సీతారామరాజుతో శ్రీ చెరుకూరి నరసింహమూర్తి జరిపిన సంభాషణ April 21, 1923 ఆంధ్రపత్రిక లో ప్రచురింపబడింది. శ్రీ మూర్తిగారు అప్పటికే దేశంలో ప్రబలంగా నడుస్తున్న సహాయ నిరాకరణోద్యమంలో చురుకుగా పాల్గొంటున్నారు.
శ్రీ అల్లూరి సీతారామరాజు 17 వ తారీఖు ఉదయం 6:30 కు అన్నవరం పోలీసు స్టేషనును ముట్టడించి, అక్కడి పోలీసు తుపాకులను స్వాధీనం చేసుకొని, అన్నవర సత్యనారాయణస్వామి దేవాలయ సత్రంలో

స్నానపానాదులు కావించి; కాసేపు జపం చేసుకొని పది గంటల సమయంలో శంకవరం గ్రామం వైపు వెళిపోయారు. ఆ రోజు మూర్తిగారు రాజు గారితో జరిపిన సంభాషణ ఇలా ఉంది.

మూర్తి: మీ రే సంకల్పముతో నీ పితూరిని నడుపుతున్నారు

రాజు: ప్రజలకు స్వాతంత్ర్యము లభించుటకే

మూర్తి: ఏ సాధనము వలన

రాజు: దౌర్జన్యము వలననే. యుద్ధము చేసినగాని మనకు స్వరాజ్యము రాదు

మూర్తి: స్వాతంత్ర్యము బడయగలుగుదునను నమ్మకము మీకు కలదా?

రాజు: రెండేండ్లలో స్వరాజ్యము తప్పక లభించునను నమ్మకము నాకు కలదు.

మూర్తి: రెండేండ్లలో స్వరాజ్యమెట్లు లభించును? మీ రవలంబించుచున్న పద్ధతివలననే స్వరాజ్యము వచ్చునా?

రాజు: వచ్చును. తప్పక వచ్చును. నాకు అనుచరుల సంఖ్య అత్యధికముగానున్నది. జనము లోటేమియును లేదుగాని తుపాకులును మందుగుండ్లును కావలెను. వానికొరకె సంచారము చేయుచున్నాను.

మూర్తి: దౌర్జన్యముతో కూడిన యుద్ధములవలనను జన నష్టమువలనను ప్రపంచము విసుగు చెందియున్నది. దౌర్జన్యముకూడదను సిద్ధాంతమునే యిపుడు ప్రపంచములోని అన్నిదేశముల వారును ఆదరించుచున్నారు. జర్మనీవారుగూడా సాత్విక నిరోధమునే ప్రారంభించిరి. గాంధి మహాత్ముడు బోధించిన దౌర్జన్యరాహిత్య శాంతి సాధనములందుమాత్రమే మాకు నమ్మకముకలదు. సకలప్రపంచమునకు శాంతిమార్గమును బోధించుటకు దేవదూత గాంధిమహాత్ముని రూపమున వచ్చెనని ప్రపంచమువారందరును నమ్ముచున్నారు.

రాజు: నాకు దౌర్జన్యరాహిత్యమునందు నమ్మకము లేదు. దౌర్జన్యమువలననే స్వరాజ్యమును బడయగలుగుదుమని నేను గట్టిగా నమ్ముచున్నాను.

***

పై వార్తా కథనంలో వర్ణించిన రాజుగారి ఆకృతి: వయసు 26 ఏండ్లు, ఎత్తు 5 అడుగుల 4 అంగుళాలు; బక్కపలచన, ఆరోగ్యముతో, అందమైన దేహం; ఎప్పుడు నవ్వుమొఖముతో, వినయసంపదకలిగి, మర్యాదతో వ్యవహరిస్తారు; యోగులవలె గెడ్డము, తలవెంట్రుకలను కలిగి ఉన్నారు. ఖద్దరు ఖాకి పొట్టి

నిక్కరు, ఖద్దరు చొక్కాను ధరించారు. చేతిలో పేనుబెత్తము కలదు. కాలికి చెప్పులు లేవు.
***

పై ఇంటర్వ్యూ లో శ్రీ అల్లూరి సీతారామరాజు తన ఉద్యమ లక్ష్యం స్వాతంత్ర్యాన్ని సాధించటమే అని నిర్ద్వంద్వంగా పేర్కొన్నాడు. హింసా పద్ధతుల ద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించాలి అని నమ్మిన సుభాష్ చంద్రబోస్ కంటే ముందే ఆ లక్ష్యాన్ని స్వప్నించటం గమనార్హం.
***

2. ఆంధ్రపత్రిక 1922 అక్టోబరు 18
రంపపితూరి మూలకారకుని వృత్తాంతము

నరసిపట్నం దగ్గరనున్న గూడెం కొండలలోనుండి బయలుదేరిన యేజన్సీ పితూరి (పితూరి-తిరుగుబాటు) విషయము ఇటీవల తెలియవచ్చు సంగతుల వలన తీవ్రముగా నున్నట్లు కనుపట్టుచున్నది. మూడువందలవరకును పోలీసుదళము పితూరిదారులను పట్టుకొనవలెనని ప్రయత్నించుచున్నది. ఇంతవరకు నిరువురు తెల్ల ఉద్యోగీయులు హతులైరి. పోలీసులు కాన్సటబిల్సు కూడా కొంతమంది చంపబడిరి. కొందరకు గాయములు తగిలెను. మలబారు విప్లవ సందర్భములో ననుభవముగల యే ఆర్. న్యాపుగారు కూడా స్వయముగా వచ్చి పితూరి ప్రాంతములను పరీక్షించి పోయిరి. పరిస్థితులు తీవ్రముగా నున్నట్లు ఇంతవరకు ప్రభుత్వముపయోగించిన బలము నిష్ప్రయోజనమగుట రుజువు చేయుచున్నది.

ఈ పితూరిని నడుపుచున్నది అల్లూరి సీతారామరాజను క్షత్రియ యువకుడని ప్రచురింపబడినది. ఆయన అద్భుతశక్తులు కలవాడని ప్రజలు చెప్పుకొందురు.

//ఈయనకు 25 సంవత్సరముల వయస్సుండును. ఆజాన బాహువు, విశాల వక్షస్కుడు, బలిష్ఠుడు, స్ఫురద్రూపి, పచ్చని దేహచ్ఛాయకలవాడు. నల్లనిగడ్డము

పెంచెను. కాషాయవస్త్రములను ధరించి స్వరూపముచే నాకర్షించు బాలసన్యాసి. జ్యోతిషము, సాముద్రికము, వైద్యము తెలిసినవాడు. ప్రశ్నచెప్పగలడు. ఒక్కమారతనితో మాట్లాడువారు అతని వశులగుదురు. వైద్యముకొరకును, ప్రశ్నలను తెలుసుకొనుటకును, కొండవారనేకమందితని యొద్దకు వత్తురట. వారి ప్రశ్నలకు సరియైన నిదర్శనములు కనుపడుటచేతను కొండవాండ్రకాయన భగవంతుండను మూఢభక్తి గలదు.

//ఇతను వీలగునంతవరకును ప్రజలకు సేవజేయుచు వారి విశ్వాసమునకు పాత్రుడయ్యెను. ఎవరికే కష్టాలు గలిగినను సహానుభూతి చూపుచు తనకు వీలైన సహాయము చేయువాడట. మందస్మిత వదనముతో పలుకు యీతని పలుకులు జనులనాకర్షించి అతని ప్రేమింపజేయును. అతనికా చుట్టుపట్లనున్న గ్రామములలో చాల గౌరవము కలదు. కృష్ణాదేవి పేట చుట్టుపట్లనున్న అయిదారు గ్రామములలో నీయన పంచాయితీ కోర్టులను స్థాపించి ప్రజలలో న్యాయమును నెలకొల్పెను. ఏజెన్సీ యుద్యోగులా పంచాయతులను బ్రద్దలుగొట్టిరి. ఈ సందర్భమునని రాజుగారు నిరాకరణవాది యను నెపమున వానిని ఆరువారములు కైదులో ఉంచి, దోషిగ నెంచుటకు దగిన ఆధారములు లేక వదిలివేసిరి.

.

పై వార్తా కథనముద్వారా శ్రీ అల్లూరి సీతారామరాజు వ్యక్తిత్వం అర్ధమౌతుంది.
***

3. ఆంధ్రపత్రిక 1922, అక్టోబరు 4

రంపపితూరి

ఇద్దరు పోలీసు ఉద్యోగులును, 28 మంది పోలీసులును గుడెం కొండలలో పితూరిదారుల కొరకు వెతుకుచుండగా సెప్టెంబరు 24 వ తేదీన పితూరిదారులదరిపాటున వారిపై బడిరి. ఉద్యోగులగు స్కాటు కవర్డు, హయిటరు గార్లును ఒక కనిస్టెబును యీ ముగ్గురును మడసిరి (చనిపోయారు). ఒక హెడుకనిస్టేబుకును, ఇంకొక కనిస్టేబుకును గాయములు తగిలెను. మరియొక కనిస్టేబు కనబడనేలేదు.// ఉద్యోగుల మరణవార్త హతశేషులవలన విని వారి శవములను కొనితెచ్చుటకు

కొండపైకేగుటకు ఆర్మిటేజి గారు ప్రయత్నింపగా అడవిలోనున్న పితూరిదారులు తుపాకులను కాల్చుటచే ఆర్మిటేజిగారు ముందుకు వెళ్లలేదు. ఈ రెండవప్రయత్నమున మరలనొక కనిస్టేబు హతుడయ్యెను. చనిపోయినవారి శవములను, గాయములు తగిలినవారిని పిమ్మట గ్రామవాసులు తీసుకొని వచ్చిరి.

స్కాటుకవర్డు గారికి మన్యమంతయును బాగుగా తెలియును. ఆయన చాలా సమర్ధుడు. హయిటరు గారు టెంపరరీ పోలీసు అసిస్టెంట్ సూపర్నెంటు. జర్మని యుద్ధములో, 1914 ఏడెనులో, 1919 ఆఫ్ఘను యుద్ధములో పనిచేసెను. ఈ యుద్యోగులిద్దరును హతులగుటవలన గొప్పనష్టము కలిగినది.

పితూరి దారుల నాయకుడగు అల్లూరి సీతారామరాజును అతని ముఖ్యానుచరులనిద్దరిని గూర్చి తెలిపినవారికిని వారిని పట్టియిచ్చిన వారికిని బహుమానము లియ్యబడునని ప్రకటింపబడెను. మన్యములో ముఠాదారులు (కౌలుదారులు) ఇట్టి తొందరలు కలిగినపుడు పోలీసులకు సహాయము చేయవలెనను షరతుకలదు గాన అట్లు సహాయము చేయవలెనని ముఠాదారులను నిర్బంధించుటకు ఏర్పాటులు చేయబడెను.

.

పై సంఘటన ద్వారా శ్రీరామరాజు ఉద్యమం ఏ మేరకు బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిందో తెలుస్తుంది.

***

4. ఆంధ్రపత్రిక 1923, మే 31 జూన్ 4, జూన్ 18, జూన్ 19
రంపపితూరి - వాల్తేరులో విచారణ

1922 అక్టోబరు నెలలో జరిగిన ఎదురుకాల్పులపై విశాఖపట్నం కోర్టులో జరిగిన విచారణ వివరాలు 1923, మే 31, జూన్ 4, జూన్ 19 వ తేదీల ఆంధ్రపత్రిక లో విపులంగా వచ్చాయి. ఈ విచారణలో దుశ్చర్తి గ్రామ కౌలుదారుడైన చెక్కా లింగం దొర ఇచ్చిన సాక్ష్యంద్వారా శ్రీ రామరాజు

భూకబ్జాదారుడని చేసిన ఆరోపణ పూర్తిగా సత్యదూరమని అర్ధమౌతుంది. శ్రీ రామరాజుకి అసిస్టెంటు కమిషనరు గారు పైడిపుట్టలో 50 ఎకరముల భూమి ఇచ్చినట్లు; సదరు ఆర్డరు ప్రకారం ఈ చెక్కా లింగందొర ఆ భూమిని శ్రీరామరాజుకు అప్పగించినట్లు; ఆయన ఆ భూమిని దున్నటము మొదలగునవి ఏమీ చేయక, వారు (రామరాజు) నేపాళదేశము వెళ్ళిపోతానని చెప్పేవారని చెక్కా లింగందొర సాక్ష్యం చెప్పాడు.

***

ఇదే విచారణలో అడపా నడిపిపడాలు అనే సాక్షి "బాస్టియన్ దొర (ఏజెన్సీ డి. తహసిల్ దారు) పెట్టు బాధలచేతనే యీ పితూరి లేచినదని ప్రజలు తరుచుగా అనుకొంటారు" అని చెప్పాడు. అదే విధంగా క్రాస్ ఎగ్జామినేషను చేస్తున్న వకీలు "బేస్టియన్ దొరగారి మహా ఉద్రేకమయిన అల్లరులే ఈ పితూరీకి కారణము. ఆయనను తీసివేస్తే ఈ పితూరీ లేకపోవును" అని వ్యాఖ్యానించాడు.

బాస్టియన్ దొర దురాగతాలను గురించి ఖానుబహద్దరు అబ్దులు హజీజు సాహెబు (పోలవరం కలక్టరు) కూడా తన సాక్ష్యంలో ఇలా చెప్పాడు. " బాస్టిన్ దొరగారిని నేను ఎరుగుదును. బాస్టిన్ గారు ప్రజలను బాధపెట్టెదరు. ప్రజలచే 500 రూపాయల పనిచేయించుకొని పని బాగాచేయలేదను అబద్దపు మిషపై 100 రూపాయిలు మాత్రమే కూలీలకిచ్చేవారు. // కూలీలను తీసుకురాని ముఠాదారులకు మిరపకాయగుండను వారి మర్మస్థలములో బాస్టన్ గారు రాయించేవారు. ఇటులనే అనేక బాధలు పెట్టేవారు. నేను బాస్టిన్ గారి చర్యలను గూర్చి ఒక గట్టి రిపోర్టును వ్రాయగా బాస్టిన్ గారిని ఇప్పుడు పొట్టంగికి బదిలీ చేసినారు. సంతానం పిళ్ళై అను ఓవరుసీయరు గూడ ప్రజలను బాధపెట్టుటలో బాస్టను గారికి చాలా తోడుపడెను. ఈయనను ఈ తరువాత బర్తరవు చేసిరి//.

మన్యంలో బాస్టిన్ దొర అతని అనుచరులు చేసిన విధ్వంసం వలన తిరుగుబాటు వచ్చింది, అనేవాదన శ్రీరామరాజు ఉద్యమానికి ఉన్న విశాల ప్రయోజనాలను పరిమితం చేస్తుంది. బహుశా ఆ దురాగతాలు రామరాజును తక్షణం ప్రేరేపించిన అంశాలుగా భావించవచ్చు.

***

ఈ విచారణలో అగ్గిదొర అనే ఒక సాక్షిని ప్లీడరు క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తూ "రెండు సంవత్సరములలో బ్రిటిషు గవర్నమెంటు యుండదని రాజుగారు చెప్పుచుండెడివారని మీకు తెలియునా? అని ప్రశ్నించగా అతను "అట్లు రాజుగారు చెప్పుచున్నట్లు వదంతి గలదు" అని చెప్పటాన్ని బట్టి శ్రీ అల్లూరి సీతారామరాజు పోరాటం అంతా బ్రిటిషు గవర్నమెంటుకు వ్యతిరేకంగా దాన్ని కూలదోయటానికి చేసిన స్వాతంత్ర్యపోరాటంగా విశ్వసించవచ్చును.

***

ముంజేరి కౌలుదారుడైన శరభం నాయుడు తన సాక్ష్యంలో – పితూరిదారులు సెప్టెంబరు నెలలో మా వూరు వచ్చారు. వారి చేతులలో తుపాకులు కత్తులు వగైరాలు కలవు. సర్కారుపై పోట్లాటకు కుమ్మకు రావలెనని రాజుగారు మమ్ములనడుగగా మేము రామన్నాము. "దెబ్బలాట జరుగును గనుక మీ గ్రామములో ఎవరిని ఉంచకండి దెబ్బలు తగులుతవి అని నాతో రాజుగారు చెప్పగా భయముతో నేనుపోయి మావాళ్ళనందరిని మా వూళ్ళోనుంచి పంపివేస్తిని.

పై ఉదంతం ద్వారా శ్రీ రామరాజు బ్రిటిష్ ప్రభుత్వంతో చేస్తున్న పోరాటంలో, తనకు సహకరించని వ్యక్తులకు కూడా ఏ నష్టం జరగకూడదని కోరుకొనేవాడని అర్ధమౌతుంది. ఇది ఆయన ఉదాత్త వ్యక్తిత్వంగా భావించాలి.

***

5. శ్రీ రామరాజు గురించి స్వైరు దొర ఒక రిపోర్టు ప్రభుత్వానికి సమర్పించాడు. అది ఇలా ఉంది. (ఆంధ్రపత్రిక 31 మే, 1923)

"నేను అల్లూరి శ్రీ రామరాజుగారిని పిలిపించి మాటలాడితిని. అతని వయసు 25 ఏండ్లు-ఆయన విద్యాధికుడు. ఆంగ్లమున చాలా బాగుగా మాటలాడగలడు. ఆయన తనచరిత్ర నిటుల తెలిపెను. కృష్ణాజిల్లా మోగల్లు గ్రామమున నేను జననమై 14 వ ఏడు వచ్చువరకు నచటనేయుండి పిమ్మట కొంతకాలము రాజమండ్రిలోను తరువాత రామచంద్రపురమున,

జాతీయపాఠశాలలోను విద్యనభ్యసించితిని. విరాగినై యరణ్యవాసముచేసి తరువాత సన్యసించునుద్దేశముతో నాలుగేండ్లక్రితమీ మన్యప్రాంతమునకు వచ్చితిని" అని రాజుగారు నాతో చెప్పిరి. అది మొదలుగా నరశీపట్నము మున్నగుచోట్లకు వెళ్ళుచున్నను తరుచు మన్యములోనే కొండలలోను అడవులలోను ఆయన తిరుగుచుండెను-ప్రజలలో చిన్న చిన్న సివిలు దావాలను పరిష్కరించుటకు ఆరునెలలక్రితము పంచాయితీ కోర్టులనేర్పరచెను.

// "నాకు దివ్యశక్తులు కలవని అవివేకముచే ప్రజలు తలంచు చున్నారు- నేను పితూరి ప్రారంభించెదనను వదంతులు బయలుదేరినవి-నాకు అసహాయోద్యమముతో సంబంధమేమియును లేదు" అని రాజుగారే నాతో చెప్పిరి. మీరు మన్యమును వదిలి నరిశీపట్నం వెళ్లవలెనని నేను తెలుపగా వెంటనే ఆయన అంగీకరించెను-అసిస్టెంటు కమీషనరు 31 వ తేదీని నరిశీపట్నమునకు రాగా ఆయన యెదుట రాజుగారు వ్రాతమూలమున గూడనిచ్చెను-ఇపుడితడు ప్రభుత్వమునకు వ్యతిరేకముగా నేమియును చేయదలచినట్లుగుపడలేదు గాన ఇతనిపై చర్యజరుపుటనవసరము- అని ఆ రిపోర్టు సారాంసము.

1922 లో శ్రీరామరాజును అరస్టుచేసి, ఆరువారాలపాటు బంధీగా ఉంచి, రాజద్రోహం చేసినట్లు ఏ రకమైన ఆధారాలు లభించక విడిచిపెట్టినప్పుడు విచారణాధికారిగా స్వైరు దొరగారు రాసిన రిపోర్టు అది.

ఈ సందర్భంగా ఈ పోలీసు చెరనుండి నన్ను విడిపించమని శ్రీ రామరాజు పోలవరం డివిజను కలక్టరైన ఫజులా సాహెబు గారికి అర్జీ పెట్టగా, ఆయన రాజుకు యాభై యకరాల భూమిఇప్పించి పైడిపుట్టి గ్రామములో ఉండి వ్యవసాయము చేసుకొని జీవించమని ఆజ్ఞాపించాడు. దుశ్చర్తి కౌలుదారుడైన చెక్కా లింగందొర కు ఆ మేరకు ఉత్తర్వులు జారీచేసాడు. (రి. శ్రీ రామరాజు ప్రశంస - మద్దూరి అన్నపూర్ణయ్య ఆంధ్రభారతి జూలై, 1928)

బహుసా ఆ నేపథ్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏమీ చేయను అని కాగితాలపై సంతకాలు పెట్టించుకొని ఉంటారు. కానీ శ్రీ అల్లూరి సీతారామరాజు లక్ష్యం, గమ్యం వేరే ఉన్నప్పుడు ఆ సంకల్పాన్ని సంతకాలు నిలువరించగలవా?

ఆ తదనంతరం ఆ భూమినాకు అవసరం లేదు అంటూ, మీ ఇష్టం వచ్చినవారికి ఇచ్చుకోవచ్చును అంటూ 14-06-1922 న ఒక ఉత్తరం ద్వారా శ్రీ రామరాజు చెక్కా లింగందొర కు తెలియచేసాడు. ఈ సంఘటన ద్వారా కూడా శ్రీ రామరాజు తృణప్రాయమైన సంపదలకొరకు తన వ్యక్తిత్వాన్ని, లక్ష్యాన్ని అమ్ముకొనే వ్యక్తి కాదని నిరూపితమౌతుంది.

***

6. శ్రీ రామరాజు ప్రశంస - మద్దూరి అన్నపూర్ణయ్య ఆంధ్రభారతి జూలై, 1928

స్వరాజ్యమే అతని లక్ష్యము

.... కానీ అది పితూరీ కాదు. అది స్వాతంత్ర్య యుద్ధము. బాష్టియను దుండగములు భూముల రిజర్వేషను వలన ప్రభుత్వముపై కోయదొరలలో జనించిన ద్వేషమును శ్రీ రామరాజు ఊతగాగొని స్వరాజ్యము లభించినగాని శాశ్వతసౌఖ్యము జేకూరదని అతడు నిష్కర్షగా బోధించియుండవలెను.

//స్వరాజ్యమే తన పరమావధియైనటుల తనకు కుడిభుజములైన గాం సోదరులతో స్పష్టముగా చెప్పినట్లు ఒక పితూరీదారుడు కోర్టులో చెప్పెను. సిఐడి సబినస్పెక్టరు గుండాల శ్రీనివాసరావు గారు కూడా కోర్టులో స్వరాజ్యముకొరకే యుద్ధముజేస్తున్నానని రాజు తనతో చెప్పినట్లు తెలిపినాడు. కాన ముమ్మాటికిని ఆయన వుద్దేశం స్వరాజ్యస్థాపనమే అని రూఢియగుచున్నది.

***

7. శ్రీ అల్లూరి రామరాజు గారు - భోగరాజు పట్టాభిసీతారామయ్య, భారతి 1-7-1928

//శ్రీ రామరాజుగారు దోపిడి చేయలేదు. పితూరిగావింపలేదు. స్వార్ధము కొరకు ఘోరకృత్యములు సలుపలేదు. తన దేశవిముక్తికొరకు బ్రిటిషువారిపై యుద్ధము చేసెను. ఆనాడు నానాఫర్నవీసు, రాణీలక్ష్మీభాయి మున్నగువారు భారత స్వాతంత్ర్య యుద్ధముకొరకు యెటుల పోరాడిరో అటులనే 3 సంవత్సరములకాలము, బ్రిటిషు ప్రభుత్వోద్యోగులకు పూర్వసూచనలు గావించి, బహిరంగ యుద్ధములకై స్థల కాలనిర్ణయములతో నాహ్వానములనంపుచు, యుద్ధమును జరిపెను.

8. ముగింపు

శ్రీ రామరాజును బ్రిటిష్ వారితో సహా ఆయన సమకాలీనులు సరిగానే అర్ధం చేసుకొన్నప్పటికీ నేడు కొందరు ఆయన భూకబ్జా దారుడని, సొంత భూమికోసం బ్రిటిష్ వారితో చేసిన పోరాటాన్ని స్వాతంత్ర్యపోరాటంగా చిత్రీకరిస్తున్నారంటూ దుర్మార్గమైన కట్టుకథలను ప్రచారం చేస్తూ చరిత్రను వక్రీకరించబూనటం గర్హనీయం.

కేవలం ఎనిమిది వందలమంది అనుచరులతో, అరకొర ఆయుధసంపత్తితో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించబూనటాన్ని అవగాహనా రాహిత్యంగా కాక మాతృదేశ దాస్యశృంఖలాలను విడిపించాలన్న జ్వలించే తీవ్రమైన కాంక్షగానే చూడాలి. ప్రాక్టికల్ గా ఆలోచించే నేటి తరానికి అలా పోరాడటం వెనుక నిప్పులాంటి నిష్కల్మషమైన చిత్తశుద్ధి, నిజాయితీ ఉండేవనే విషయం నమ్మబుద్ధికాక ఏవో స్వార్ధప్రయోజనాలు ఉండే ఉంటాయని సరిపెట్టుకోచూడటం, ఆ మేరకు వక్ర భాష్యాలు చెప్పటం విషాదకరం.

శ్రీ రామరాజు ఉదంతంలో భిన్న వ్యవస్థలు కలవరపడిన వైనం ఆనాటి వార్తాకథనాలద్వారా స్పష్టంగా అర్ధమౌతుంది

కాంగ్రెస్ పార్టీ అప్పటికి సహాయనిరాకరణోద్యమం పేరిట మెత్తమెత్తగా స్వాతంత్ర్యపోరాటం జరుపుతోంది. శ్రీ రామరాజు మన్యంలో జరుపుతున్న ఈ

సాయుధ పోరాటం తమపీకకు ఎక్కడ చుట్టుకొంటుందో అని- మన్యం అనేది దుర్గమమైన కీకారణ్యం. అక్కడకు కాంగ్రెస్ నాయకులు వెళ్ళి ఆ ప్రజలను ప్రభావితం చేసి పితూరీ లేవదీసే అవకాసమే లేదు అని ప్రకటించి చేతులు దులుపుకొంది.

బ్రిటిష్ ప్రభుత్వం ఈ పితూరి ప్రభుత్వంపై కాదని, ఏదో స్థానిక బాస్టిన్, సంతానం వంటి అధికారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రేగిన చెదురుమదురు అల్లర్లని ప్రకటించుకోవటానికి ఆరాటపడింది.

పితూరీదారులు ఊర్లను దోచుకొన్నారని వైజాగ్ లో జరిగిన కోర్టు విచారణలో పదే పదే సాక్షులతో చెప్పించినప్పటికీ, చాలామంది సాక్షులు పితూరి దారులు బియ్యం, వంట సామాగ్రి, పడుకోవటానికి మంచాలు ఎత్తుకుపోయారని చెప్పారు తప్ప ధనకనక వస్తువులు దోచుకొన్నట్లు చెప్పలేదు. అంతే కాక స్త్రీలను చెరిచిన దాఖలాలు కూడా కానరావు. ఇది శ్రీ రామరాజు నాయకత్వ పటిమగా అర్థం చేసుకోవాలి.

శ్రీ రామరాజుకు 50 ఎకరాలు భూమి ఆశచూపి ఉద్యమాన్ని నీరుకార్చాలని చూడటం కూడా ఆనాటి ప్రభుత్వం చేసిన ఒక ప్రయత్నం.

ఇక అన్ని ప్రయత్నాలు విఫలమై, ఈ ఉద్యమం దావానలమై ప్రజలలో విస్తరిస్తున్నదన్న సంగతి గ్రహించిన ప్రభుత్వం, చివరకు ఎన్కౌంటర్ రూపంలో శ్రీరామరాజును మట్టుబెట్టటం జరిగింది. తనను ప్రశ్నించేవారిపై రాజ్యం చేసే చివరి దరహాసమని అనాదిగా పదే పదే రుజువయ్యే పరమ సత్యమది.

9/7/2022

6 ఆంధ్ర పత్రిక 1928వ సం॥ ఏప్రిల్ నెల 21వ తేది శనివారము

రంపపితూరీ నాయకుడు అల్లూరి సీతారామరాజుగారు

అన్నవరములో రాజుగారికి చెరుకూరి నరసింహమూర్తిగారికి జరిగిన సంభాషణ

మన్యంపితూరీ కాలం మరలరునికి షుమారు మైళ్ల దూరమునను న్న కోటనందూరు కట్టిరా గ్రామములలో తిరుగుచున్నట్లు వర్తమానం ప్రబలినది. ... 17 వ తేదీ ... అన్నవరమునకు రాజుగారు వచ్చిరి. అన్నవరములో జరిగిన సంగతులను సవిస్తరముగా గోదావరిజిల్లా రామచంద్రపురం తాలూకా ... శ్రీయుత చెరుకూరి నరసింహమూర్తిగారు తెలిపిరి. నరసింహమూర్తిగారు అత్తవారిల్లు అన్నవరముకటచే వారు 16 వ తేదిని అన్నవరములో నుండిరి. మూర్తిగారి వయస్సు 20 ఏండ్లు. ... మూర్తిగారు రాజుగారితో ... సంభాషించెను. రాజుగారును ...

... తలకు ... చేతులో నున్నది. పాదములకు చెప్పులేమియు లేవు.

ని:—కత్తి ... ?

న:—వారందరును కోయవారు. తెలుగుభాషనే మాటలాడిరి. రాజుగారు యింగ్లీషుభాషలో కూడ మాటలాడిరి. వారితో ... 30 ఏండ్లు. అతను పొట్టి ... ఒక చేతితో తుపాకిని ఒకచేతితో కత్తిని పట్టుకొనెను. ఒక పెద్ద రూపాయలసంచి (మనీబాగ్) ... తీసికొనెను.

... కూడ ... యున్నారు.

న:—దౌర్జన్యముతో ... జయప్రదముగ ... ప్రపంచము ... దౌర్జన్యము ... సిద్ధాంతమునే యిప్పుడు ప్రపంచములోని అన్ని దేశములవారును ఆదరించుచున్నారు. ... గాంధి మహాత్ముడు బోధించిన ... రాహిత్య శాంతి సాధనములందు మాత్రము నేను నమ్మకము ... శాంతిమార్గమును బోధించుటకు ... గాంధిమహాత్ముని ... నమ్ముచున్నాను.

రా:—నాకు దౌర్జన్యరాహిత్యమునందు నమ్మకము లేదు. దౌర్జన్యమువలననే స్వరాజ్యమును పొందగలుగుదుమని నేను గట్టిగా నమ్ముచున్నాను.

న:—దౌర్జన్యమువలన ప్రాణనష్టమును వినాశనమును కలుగును. శాంతిసాధనములవలననే స్వరాజ్యము లభించును. ఇంతకుపూర్వము మీకును పోలీసువారికిని జరిగిన యుద్ధములందు మీ స్థితి ఎటులుండెను?

పోలీసువారితో జరిగిన యుద్ధము

శ్రీ రామరాజుగారి చరిత్ర

పితూరి జరుగునను వదంతులనుబట్టి జిల్లా పోలీసు సూపరింటెండెంటు స్వయముగా రికార్డుపోర్టు పంపిరి. దానిని (ఎఫ్ దాఖలా) ఫిర్యాదీల దాఖలుచేసిరి. అందు స్వయముగా రీటుల పఠించిరి. "నేను అల్లూరి శ్రీరామరాజుగారిని పిలిపించి మాటలాడితిని. అతనివయసు 25 ఏండ్లు. ఆయన విద్యార్థియుడు. ఆంగ్లమున చాల బాగుగా మాటలాడగలడు. ఆయన తనచరిత్ర నిటుల తెలిపెను." కృష్ణాజిల్లా మోగల్లు గ్రామమున నేను జననమై 14వ ఏకు వచ్చువరకు నచట నేయుండి పిమ్మట కొంతకాలము రాజమండ్రిలోను తరువాత రామచంద్రపురమున; జాతీయపాఠశాలలోను విద్యనభ్యసించితిని. విరాగినై యరణ్యవాసముచేసి తరువాత సన్య

మూలకారకుని వృత్తాంతము

నర్సీపట్నం దగ్గఱనున్న గూడెంకొండలలో నుండి బయలు దేరిన యేజన్సీ పితూరివిషయము ఇటీవల తెలియవచ్చు సంగతుల వలన తీవ్రముగా నున్నట్లు కనుపట్టుచున్నది. మూడువందలకు మించు పోలీసు దళము పితూరిదారులను పట్టుకొనవలెనని ప్రయత్నించుచున్నది. ఇంతవఱకు నిరువురు తెల్ల ఉద్యోగీయులు హతులైరి. పోలీసులు కాన్స్టేబిల్సుకూడ కొంతమంది చంపబడిరి. కొందఱకు గాయములు తగిలెను. మలబారు విప్లవసందర్భములో ననుభవముగల యే. ఆర్. న్యాప్పుగారుకూడ స్వయముగావచ్చి పితూరి ప్రాంతములను పరీక్షించిపోయిరి. పరిస్థితులు తీవ్రముగా

పేజ్ 1

భారతి [విభవ సం॥

వ్యాసము జరిగినంతనే నాకంటికి గానవచ్చిన యాంశముల నిందుపొందుపరచినాడ.

[ఛేబోలు లక్ష్మణరావు.]

ఇట్టి రాజును బ్రిటిషువారు పంహరించుటకు సైనిక బలమును యుద్ధ శాసనము అమలులో నుంచుట ఆపాదుచేయుమని చెంచి సివిల్ శాసనములతోను, పోలీసు సిబ్బందులతోను పరాజితునిగ జేయుటకు నిరర్థక ప్రయత్నములను సలిపిరి. చివరకు రాజు పట్టుబడెను.

శ్రీ అల్లూరి రామరాజు గారు

ఈ యాంధ్ర వీరాగ్రగణి ముప్పదిరెండవ జన్మదివస మహోత్సవము జూలై ౪ా-వ తేది నాడు ఆంధ్రదేశమున పెక్కుచోటుల జరిగినది. భారతదేశ స్వాతంత్ర్యమునకు, స్వరాజ్య లాభమునకునయి ౧౯౨౨-౧౯౨౪ సం॥లో ఏజన్సీలలో స్వాతంత్ర్యయుద్ధమును నెఱపి

పేజ్ 4 జూలై 1928 ఆంధ్రభారతి

శ్రీరామరాజ పత్రిక ౫

లచ్చట మేయుటకు వీలు లేకపోయెను. ఇదివరలో కోయలకున్న స్వాతంత్ర్య మదియే. ఇది కూడ యిప్పుడు హరింపబడెను. కాని ఏజన్సీ అంతా ఇట్టిది కనట్లున్నది.

స్వరాజ్యమే అతని లక్ష్యము.

ఈ పరిస్థితులలో శ్రీరామరాజు తన స్వాతంత్ర్యయుద్ధమును లేవదీశాడు. అతని ఆదర్శమేమిటి? కూలిజనమునకు తాను రాజగుట కారకుడు పితూరీని లేవదీసెనని గవర్నమెంటువారిచే నియమింపబడిన హెస్టెలుదొరగారు రిపోర్టు వ్రాసిరి. భూముల రిజర్వేషను, బాస్టియను దుండగములు పితూరీకి కారణములని వ్రాసిరి. కాని యిది నమ్మదగిన విషయములుగావు ఏదైన ఉద్యమమును భగ్నముచేయుటకు ఉద్యమ నాయకునిపై స్వార్థపరత్వము నారోపించుట కంటె నీచమగుపద్ధతియింకొకటిలేదు. కేవలము బాస్టియను దుండగములు భూముల రిజర్వేషను మాత్రమే కారణములైనయెడల గవర్నమెంటు రెండునిమిషములలో "పితూరీ"ని అణచివేసి యుందురు. వెంటనే బాస్టియనును ట్రాన్సుఫరు చేసి భూముల రిజర్వేషను కొంతకాల మాపియుంచినచో "పితూరీ" దానంతట నదియే నాగిపోయెడిది. కాని అది "పితూరీ" కాదు. అది స్వాతంత్ర్య యుద్ధము బాస్టియను దుండగములు భూముల రిజర్వేషనువలన ప్రభుత్వముపై కోయదొరలలో జనించిన ద్వేషమును శ్రీరామరాజు ఊతగాగొని స్వరాజ్యము లభించినగాని శాశ్వతసౌఖ్యము చేకూరదని అతడు నిష్కర్షగా బోధించియుండవలెను. పంజాబు హత్యలు ఖిలాఫతు అన్యాయములవలన ప్రజలలో బ్రిటిషు ప్రభుత్వ విధానముపై జనించిన ద్వేషమును ఆధారము చేసికొని గాంధి స్వరాజ్యసిద్ధికై సహాయనిరాకరణోద్యమమును ప్రారంభించినట్లు బాస్టియను దుండగములు భూముల రిజర్వేషను వల్ల కల్గిన ప్రభుత్వ ద్వేషమును శ్రీరామరాజు స్వరాజ్యసిద్ధికి యుపయోగించుకొనెను. శ్రీరామరాజు తనలక్ష్యము స్వరాజ్యమని అన్నవరంలో శ్రీ చెరుకూరి నరసింహమూర్తిగారితో స్పష్టపరచెను. స్వరాజ్యమే తన పరమావధియైనట్లు తనకు కుడిభుజములైన గాంసోదరులతో స్పష్టముగా చెప్పినట్లు ఒక పితూరీదారుడు కోర్టులో చెప్పెను. సి ఐ డి. సబిన్స్పెక్టరు గుంటాల శ్రీనివాసరావుగారుకూడ కోర్టులో స్వరాజ్యముకొరకే యుద్ధము చేస్తున్నానని రాజు తనతో చెప్పినట్లు తెలిపినారు. కాన మనకొన్నాటికిని ఆయనపుద్దేశం స్వరాజ్యస్థాపనమే యని రూఢియగుచున్నది.

స్వాతంత్ర్య యుద్ధము.

అతడు రెండేండ్లు ఘోరంగా ప్రభుత్వంతో పోరినాడు — ఈ యుద్ధమునుగూర్చి స్వతంత్రముగ వారియొద్దనుండి కావలసిన లేవు— గవర్నమెంటువారు ప్రకటించిన విషయములే ఆధారములు. సావర్కరు "భారత స్వాతంత్ర్య యుద్ధము" (Indian War of Independence) వ్రాసేవరకు "సిపాయిల కలహములు" అనే పేరులో గవర్నమెంటువారు వ్రాసినదే నిజమను కొన్నాము. ఏ ఆంధ్ర సావర్కరో బయలుదేరి గవర్నమెంటువారు ప్రకటించిన విషయములు కాక కొత్తచరిత్ర యేదైన వ్రాసేవరకు యిదియే మన కాధారము—మొదట ౧౯౨౨

అయోతీ థాస్

(1845-1914)



అయోతీ థాస్ పండితర్ 1845 – 1914

ఆధునిక దళిత మేధావిగా, బౌద్ధ పునరుద్ధరణకర్తగా ఆయన చేసిన సామాజిక పోరాటం స్ఫూర్తిదాయకం. దక్షిణ భారత సామాజిక ఉద్యమ చరిత్రలో అయోధి థాస్ పోషించిన పాత్ర ఒక ముఖ్యమైన ఘట్టం.

అయోతీ థాస్ - దక్షిణభారత దళిత మేధావి

అయోతీ థాస్ (C. Iyothee Thass , 20 మే 1845 - 5 మే 1914) దక్షిణ భారతదేశంలోని మొదటి కుల వ్యతిరేక కార్యకర్త, తమిళ పండితుడు, సిద్ధ వైద్యుడు. ద్రావిడ ఉద్యమానికి మార్గదర్శకులలో ఒకరు. ఆది ద్రావిడ నేపథ్యం నుండి వచ్చిన ఈయన 19వ శతాబ్దం చివరలో ఆదిద్రావిడ ప్రజల అభ్యున్నతి కోసం రాజకీయాలు, మతం మరియు సాహిత్య రంగాలలో కృషిచేసారు. బౌద్ధమతంలోకి మారిన వీరు- పరయ్యల (మాలల) అసలు మతం బౌద్ధమని, అందువల్ల వారుకూడా బౌద్ధమతంలోకి మారాలని ఉద్బోధించారు. 1891లో అయోతీ థాస్, రెట్టమలై శ్రీనివాసన్ అనే మరొక సంఘసంస్కర్తతో కలిసి "కులరహిత ద్రవిడ మహా జనసభ" స్థాపించారు. C. Iyothee Thass అనేది C. Ayodhya Dasa, C. Ayotthyadasa Pandithar వంటి తమిళ పేర్లకు ఇంగ్లీషు స్పెల్లింగు.

అయోతీ థాస్ ఉన్నత విద్యావంతులైన కుటుంబంలో జన్మించారు. వీరి తాత, బట్లర్ కాంతప్పన్. తన కుటుంబం తరతరాలుగా భద్రపరచుకొంటూ వస్తున్న తిరుక్కురళ్ రచనను కాంతప్పన్, Francis Whyte Ellis అనే బ్రిటిష్ ఆఫీసరుకు అందించాడు. దానివిలువ గ్రహించిన ఎల్లిస్ దొర వాటిని ఇంగ్లీషులోకి అనువదించి ప్రపంచానికి పరిచయం చేసాడు. అలా తమిళుల సాంస్కృతిక సంపదైన తిరుక్కురళ్ వెలుగు చూసింది.

బాల్యం

అయోతీ థాస్ 20 మే 1845 న చెన్నైలో జన్మించారు. తరువాత తన తండ్రి ఉద్యోగం కారణంగా నీలగిరికి వలస వెళ్ళారు. వీరి కుటుంబం వైష్ణవాన్ని పాటించేది. అయోతీ థాస్ కు తల్లిదండ్రులు పెట్టిన పేరు కథవరాయన్.

అయోధ్య దాసర్ పండిట్ (1836-1900) అనే ఆచార్యుని వద్ద ఇతను తమిళం, ఇంగ్లీష్, పాళీభాషలు, తత్వశాస్త్రం, సిద్ధ వైద్యం లను నేర్చుకొన్నారు. తనకు జ్ఞానబుద్ధులునేర్పి జీవికను ఏర్పరచిన గురువుపై గౌరవంతో తన కథవరాయన్ పేరును అయోధ్య దాసర్‌గా మార్చుకున్నాడు.

మత దృక్పథం

పాతిక సంవత్సరాల వయస్సులో, అయోతీ థాస్ నీలగిరి కొండలపై నివసించే అణగారిన ప్రజలైన తోడర్లను సమీకరించాడు. 1870 లలో "అద్వైతానంద సభ" ని స్థాపించాడు. వీరి కుటుంబం వైష్ణవ సంప్రదాయాలను అనుసరించేది. ఆ కారణంగా తన కుమారులకు మాధవరాయ, పట్టాభిరామన్, జానకి రామన్, రాజారామ్ అని పేర్లు పెట్టి, బౌద్ధమతాన్ని స్వీకరించిన తర్వాత పుట్టిన తన కుమార్తెలకు అంబికాదేవి, మాయాదేవి అని పేర్లు పెట్టాడు.

వైష్ణవసంప్రదాయంతో మమేకమయినప్పటికీ, ఈయన ఆలోచనలు- ఆస్తికత్వం, ఆచారవ్యవహారాలు, బ్రాహ్మణ ఆధిపత్యం, మరియు మతపరమైన పెత్తందారీ పోకడలు-లాంటి అంశాలనుంచి హేతుబద్ధమైన విముక్తి కొరకు అన్వేషణ చేసేవి. ఈ వెతుకులాట ఇతనిలో సొంత ఆలోచనలు, సొంత భావజాలం ఏర్పడటానికి దోహదపడింది.

19వ శతాబ్దం చివరలో బ్రహ్మసమాజం, ఆర్యసమాజం లాంటి సంస్థల ద్వారా హిందూమతం పునరుద్ధరణ జరగసాగింది. 1861 నుండి 1891 వరకు, క్రైస్తవులు, ముస్లిములు మినహా మిగిలిన అందరూ హిందూ లేబుల్ తో హిందువులులో బలవంతంగా చేర్చబడ్డారు.

అయోతీ థాస్ వైష్ణవ సంప్రదాయానికి మద్దతు ఇచ్చారు కానీ "హిందూ" యొక్క గుర్తింపును అంగీకరించడానికి నిరాకరించారు. "హిందూ" గుర్తింపును అంగీకరిస్తే "హిందూ" సమాజంలోని కుల నిర్మాణాన్ని అంగీకరించాలి. కుల హింసతో ఎన్నో బాధలు పడిన ఆదిద్రవిడ ప్రజలు హిందూ గుర్తింపును అంగీకరించకూడదని ఈయన భావించేవాడు. హిందూకి బదులుగా అయోతీ థాస్ ప్రత్యామ్నాయ హిందూయేతర గుర్తింపు కోసం వెతకడం ప్రారంభించాడు.

తమిళనాట భక్తి రూపాల్లో "తమిళ శైవమతం" పునరుద్ధరణకు ప్రయత్నాలు జరిగాయి. ఇది కూడా ఒక రకంగా కులతత్వాన్ని వదులుకోలేదు. "తమిళ శైవిజం" బ్రాహ్మణ వ్యతిరేకత గురించి మాట్లాడుతుంది కానీ "కుల నిర్మూలన" గురించి ఏమీ మాట్లాడదు. ఆ కారణంగా అయోతీ థాస్ తమిళ శైవమతంలో చేరలేదు.

అయోతీ థాస్ ప్రారంభించిన "కుల రహిత ద్రవిడ మహాజన సభ" తరపున ఉచిత విద్య, ఆలయ ప్రవేశం, బంజరు భూముల కేటాయింపు వంటి 10 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి పంపగా అది 1891 జాతీయకాంగ్రేస్ పార్టీ 12 వ సమావేశంలో చర్చకు వచ్చింది కానీ ఆ డిమాండ్లు చివరికి నెరవేరలేదు.

1884 లో ఎమ్. వీరరాఘువాచారియర్, జి. సుబ్రమనియ అయ్యర్, పి ఆనందాచార్లు Madras Mahajanasabha ను స్థాపించారు. ఇది భారతదేశంలో మొదటిసారిగా స్వపరిపాలన కావాలని తీర్మానించిన చారిత్రిక సంస్థ. కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయంగా పనిచేసేది. 1892లో మద్రాసు మహా జనసభ నిర్వహించిన సమావేశంలో నీలగిరి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న అయోతీ థాస్ కాంగ్రెస్ పార్టీకి కు పైన సమర్పించిన 10 అభ్యర్ధనలను తిరిగి వీరికి సమర్పించి- శివాలయాల్లోకి ప్రవేశించేందుకు అనుమతి కోరగా ఆ అభ్యర్ధనను మహాజనసభ నిర్వాహక సభ్యులు నిర్ధ్వంద్వంగా తిరస్కరించి అయోతీ థాస్ ను అవమానించారు.

ఈ అవమానం అయోతీ థాస్ లో అంతర్మధనానికి దారితీసింది. మనం ఎవరం? హిందువులమా? అట్లైతే మనపై కుల దూషణలు ఎందుకు చేస్తున్నారు? అంటూ తన జాతి అస్తిత్వం గురించి ప్రశ్నించుకొంటూ ఆ క్రమంలో, వేదాలు, హిందూ మతం, బ్రాహ్మణత్వం, ఆచారాలు మొదలైనవాటిని లోతుగా అధ్యయనం చేసాడు.

ఆది ద్రావిడుల అస్తిత్వ కార్యకలాపాలు

1870వ దశకంలో, అయోతీ థాస్ నీలగిరిలోని తోడర్ మరియు ఇతర కొండ తెగలను ఏకం చేశాడు. 1875లో అద్వైతానంద సభను స్థాపించాడు. మద్రాసులో ఆది ద్రావిడుల కోసం వెసిలియన్ మిషన్ పాఠశాలను (Wesleyan Mission) నిర్వహిస్తున్న Rev. John Rathinam తో పరిచయం ఏర్పడింది. ఇతని సహాయంతో అయోతీ థాస్ 1885 లో ద్రవిడ పాండ్యన్ అనే వార్తా పత్రికను ప్రారంభించాడు.

1886 లో అయోతీ థాస్ "ఆది ద్రావిడులు "హిందువులు" కాదని భారతదేశచరిత్రలోనే అత్యంత విప్లవాత్మకమైన ప్రకటన" చేసాడు. ఆ తరువాత 1891లో ఇతను “ద్రవిడ మహాసభ”ను స్థాపించాడు 1891 జనాభా గణనలో ఆది ద్రావిడులు తమను తాము హిందువులుగా కాక "కుల రహిత తమిళులు"గా నమోదు చేసుకోవాలని కోరాడు. ఆనాటికి ఇద్ గొప్ప సాహసోపేతమైన వ్యాఖ్య.

అప్పటి ఏకైక పార్టీ అయిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా ఉందని - ఒకటి ఉత్తర భారత కాంగ్రెస్, మరొకటి దక్షిణాది కాంగ్రెస్ అని, ఇది బ్రాహ్మణ కాంగ్రెస్ అని అయోతీ థాస్ విమర్శించేవారు. ఆమేరకు స్వీయఅస్తిత్వ స్పృహతో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా స్వతంత్రరాజకీయాన్ని ప్రారంభించాడు. ఆది ద్రావిడ ప్రజలను అణిచివేసేందుకు ఏర్పడిన సాంస్కృతిక మరియు మతపరమైన అడ్డంకులను తొలగించడం ద్వారా అణగారిన ప్రజలకు నిజమైన విముక్తి లభిస్తుందని; కుల, వర్ణాలను వ్యతిరేకించే బౌద్ధమతమే అందుకు తగినదని అయోతీ థాస్ విశ్వసించాడు. బౌద్ధమతం ఆది ద్రావిడుల అసలు మతం అని, ఆదిద్రావిడ విముక్తి మరియు సాధికారతకు ప్రతిరూపం బౌద్ధమతమేనని ప్రచారం చేసేవాడు. ఆది ద్రావిడులు రాజకీయంగా అధికారం సాధించాలని కోరుకొనేవాడు.

బౌద్ధమత స్వీకరణ

అయోతీ థాస్ తన అనుచరులతో కలిసి థియొసాఫికల్ సొసైటీ వ్యవస్థాపకప్రెసిడెంట్ Colonel H. S. Olcott ను కలుసుకుని తాను బౌద్ధమతం స్వీకరించాలనే కోరికను వ్యక్తం చేశాడు. ఆల్కాట్ సహాయంతో, ఈయన శ్రీలంకకు వెళ్లి సింహళీ బౌద్ధ సన్యాసి సుమంగళ నాయక్ నుండి బౌద్ధదమ్మ దీక్షను స్వీకరించారు. అక్కడి నుండి తిరిగి వచ్చిన అయోతీ థాస్ 1898లో చెన్నైలో “శాక్య బౌద్ధ సంఘాన్ని” స్థాపించి దాని శాఖలను దక్షిణ భారతదేశం అంతటా విస్తరింపచేసాడు. ఈ Sakya Buddhist Society కాలక్రమేణా "Indian Buddhist Association " గా చరిత్రలో నిలిచిపోయింది.

ద్రావిడ రాజకీయాలకు మార్గదర్శకుడు

అయోతీ థాస్ 1885లో ద్రవిడ పాండియన్‌ను పత్రికను ప్రారంభించారు. క్రీ.శ. 1886లో హిందువులలో అంటరానివారందరూ కులరహిత ద్రావిడులని ప్రతిపాదించాడు. ఆ విధంగా ద్రావిడ భావజాలానికి ఆద్యుడిగా పేరు తెచ్చుకున్నాడు. అయోతీ థాస్ 1891లో ద్రావిడ మహాజన సభను స్థాపించి ద్రావిడ రాజకీయాలకు మార్గదర్శకుడుగా నిలిచారు.

రచనలు

పండిట్ అయోతీ థాస్ సుమారు 25 పుస్తకాలు, 30 వ్యాసాల ధారావాహికలు, రాజకీయ వ్యాసాలు, ప్రశ్నలు మరియు సమాధానాలు వంటి కొన్ని వందల వ్యాసాలు రాశారు. ఆయన మరణానికి ఒక సంవత్సరం ముందు రాయడం ప్రారంభించిన తిరుక్కురల్ గ్రంథం ఆయన మరణంతో 55 అధ్యాయాలతో ముగిసింది. వారి రచనలలో కొన్ని ప్రముఖమైనవి

1. అంబికయ్యమ్మన్ కథ 2. ఇంద్ర జాతి చరిత్ర 3.ఇంద్ర దేశ బౌద్ధ పండుగ వివరాలు 4. శాక్య మహర్షి చరిత్ర 5. తిరుక్కురల్ దేవునికి శుభాకాంక్షలు 6.తిరువల్లువర్ చరిత్ర 7. నందన్ చరిత్ర 8. ఆధునిక కులాల్లో భయాందోళనలు 9. బుద్ధుడు రాత్రి మరియు పగలు లేని కాంతి 10. మురుగ భగవానుని చరిత్ర 11. వివాహ వివరణ 12. ప్రాచీన తమిళ భాష బుద్ధుడు ఆదివేదం 13. వేషబ్రాహ్మణ వేదాంత వివరణ

ముగింపు


C. Iyothee Thass దక్షిణభారతదేశంలోని ద్రావిడ ప్రజల హక్కులను ఆత్మగౌరవాన్ని ప్రకటించి ద్రావిడ ఉద్యమానికి ఒక పితామహునిగా నిలిచిన దళిత మేధావి. వీరు మొదట పంచమర్ మహాజన సభను స్థాపించారు. ఇది పంచముల, పరయాల హక్కులకొరకు పోరాడిన మొదటి సంస్థ. తాను బౌద్ధంలోకి మారి ఇతర దళితసోదరులనుకూడా బౌద్ధంలోకి మారమని పిలుపు ఇచ్చిన ఆచరణవాది. తాను నడిపే తమిళన్ పత్రిక దళితులు తమ

అభిప్రాయాలను వ్యక్తపరచడానికి అప్పట్లో చక్కని వేదికగా నిలిచింది. అయోతీ థాస్ తమిళనాట జరిగిన ద్రవిడ ఉద్యమానికి స్ఫూర్తిగా, భారతదేశంలో జరిగిన దళితఉద్యమాలకు ప్రేరణగా నిలిచారు.

September 8, 2023

యర్రోజు మాధవాచార్యులు

(1913 – 1983)



ఈ వ్యాసం స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ రచయిత, కళాపోషకుడు అయిన **శ్రీ యర్రోజు మాధవాచార్యుల** జీవిత ప్రస్థానాన్ని, ఆయన చేసిన అపారమైన సాహిత్య కృషిని, విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం స్థాపన ద్వారా సమాజానికి ఆయన అందించిన విశేషమైన సేవలను వివరిస్తుంది.

మహాగురువు శ్రీ యర్రోజు మాధవాచార్యులు

జీవిత విశేషాలు

శ్రీ యర్రోజు మాధవాచార్యులు 1913, అక్టోబరు 22 న కృష్ణాజిల్లా నూజివీడులో జన్మించారు. వీరి తండ్రి శోభనాద్ర్యాచార్యులు, తల్లి రుక్మిణమ్మ. శోభనాద్ర్యాచార్యులు వేదపండితులు. జ్యోతిష్య శాస్త్రంలో ప్రావీణ్యం ఉండేది. వీరు నూజివీడు జమిందారీలో స్వర్ణకార కులవృత్తిని నెరిపారు. మాధవాచార్యులుగారికి చిన్నతనంలోనే తండ్రిగారు గతించటంతో తల్లి రుక్మిణమ్మ గారి పెంపకంలోనే పెరిగారు. వీరి బాల్యం, ప్రాధమిక విద్యాభ్యాసం అంతా నూజివీడులోను, పిదప గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కాలేజ్ లోను తమ చదువు కొనసాగించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుండి బిఎ. హానర్స్ పట్టా పొందారు.

శ్రీ మాధవాచార్యులు గుడివాడ ఎ.ఎన్.ఆర్ కళాశాలలో ఓరియంటల్ లాంగ్వేజెస్ శాఖాధిపతిగా 1950 నుండి 1966 వరకు పనిచేసారు. శ్రీ రాజా రంగయ్యప్పారావు పాఠశాలలో తెలుగు పండితునిగా సేవలందించారు. తరువాత కొంతకాలం నూజివీడు ధర్మప్పారావు కళాశాల తొలి ప్రిన్సిపాల్ గా బాధ్యతలు నిర్వహించారు. వీరు ఎక్కడ పనిచేసినా ఆ ప్రాంతంలోని సాహిత్య, కళా రంగాలకు సంబంధించి ఎన్నో కార్యక్రమాలను నిర్వహించి ఎందరో కళాకారులకు ఒక వేదిక కల్పించి వారిలోని ప్రతిభను పదిమందికి తెలిసేలా చేసేవారు. అలా గుడివాడలో రచయితల సంఘం, కృష్ణరాయ కళాసమితి మొదలైన సాంస్కృతిక సంస్థలు ఏర్పడటానికి దోహదపడ్డారు. గుడివాడలో

కవిరాజ కళాభవనం నిర్మించటంలో వీరిపాత్ర ఎంతో ఉన్నది.[1] శ్రీ మాధవాచార్యులు గుడివాడలో ఉండగా- కోడూరు అచ్చయ్య, తుమ్మలపల్లి కామేశ్వర రావు, కతారి సత్యనారాయణరావు, జి.ఎస్.ఆర్ ఆంజనేయులు, శ్రీమతి పువ్వుల అనసూయ, శ్రీ నెరుసు వీరాస్వామి లాంటి ప్రభృతులతో కూడి గుడివాడ కళాసమితి అనే సంస్థ ఆధ్వర్యంలో అనేక సాహిత్య కార్యక్రమాలను,[2] ఎందరో లబ్దప్రతిష్టులతో సాహిత్య సభలు, అవధానాలను ఏర్పాటు చేసారు.

సాహిత్య కృషి

శ్రీ మాధవాచార్యులు మఘవలయము, ప్రతిమా శంబూకము, మణి ప్రవాళము, భువన విజయము, ముక్కోటి, వ్యాసాలు-ఉపన్యాసాలు వంటి వివిధ రచనలు గావించి గొప్ప కీర్తి నార్జించారు.

“మఘవ లయము” అను పద్యకృతిని ఆనాటి కళలు ఎక్సైజ్ శాఖా మంత్రి అయిన రాజా రంగయ్యప్పారావు బహద్దరు కు 1965లో అంకితమిచ్చారు

“మఘవ” అనేది మహా ఘనత వహించిన అనే వాక్యానికి సంక్షిప్తనామం. నిజాం అధినేత మీర్ ఉస్మాన్ అలీఖాన్ కు బ్రిటిష్ ప్రభుత్వం హిస్ ఎగ్జాల్టెడ్ హైనెస్ అనే బిరుదు ఇచ్చింది. దీనిని తెలుగులో “మహా ఘనత వహించిన” అని వ్రాసేవారు. 1930 ల ప్రాంతంలో నిజాం రాజును వ్యంగ్యంగా సంబోధించటానికి మఘవ అని పిలిచేవారు మఘవ లయము అంటే మహాఘనత వహించిన నిజాం రాజుయొక్క అధికార లయము (నాశనము) అని సంకేతార్ధము.

నిజాం రాజ్యాన్ని స్వతంత్ర్యభారతావనిలో విలీనం చేయటానికి జరిపిన భారతప్రభుత్వ పోలీసు చర్య ఈ మఘవలయ కావ్య వస్తువు. ఈ కావ్యంపై గోల్కొండ పత్రికలో వచ్చిన ఒక సమీక్షలో- యర్రోజు మాధవాచారి

[1] గుడివాడ వైభవం, తాత రమేష్ బాబు పే.నం. 73
[2] ఆంధ్రజ్యోతి దినపత్రిక 11, ఆగస్టు 1964, పేనం. 5

శైలి విశ్వనాథ సత్యన్నారాయణ రచనా పోకడలతో ఉన్నదని సమీక్షకుడు అభిప్రాయపడ్డాడు[3].

దుష్టుడైన ఒక వ్యక్తి నిజాం రజాకార్లతో కలిసి చెడు వర్తనుడై ప్రజలను పీడిస్తుండగా, అతని సోదరుడే అతనిని చంపివేయటం మఘువలయ కావ్యాంశము. ఈ కావ్యంలో శ్రీ మాధవాచార్యులు ఎంతో ధైర్యంగా రజాకార్ల కోపాగ్నికి గురికావచ్చునేమోనని కూడా ఆలోచించక, ఆనాడు రజాకార్లు హిందువుల పట్ల, వారి ప్రార్ధనాలయముల పట్ల జరిపిన అత్యాచారములను ఎంతో వేదనతో ఇలా వర్ణించారు. ఇవి ఆనాటి పరిస్థితులను కళ్ళకు కడతాయి.

//దివ్యస్థలంబుల దేవాలయంబుల| మధుమాంస దుర్గంధమయ మొనర్చి
విగ్రహంబుల నెల్ల విధ్వంసనము చేసి| మూత్రాభిషేకాల ముంచి యెత్తి
భూషణాదుల దొంగపోటుగా హరించిన| వాహనాలెక్కి సవారిచేసి
చేదికందినవారి సిగలెల్ల గొరిగించి| యుపవీతముల మొలకుచ్చుపోసి
యర్చకస్త్రీల గర్భాలయముల బట్టి| చెప్పరానట్టి విధముల జెఱచి చెఱచికఱకు
గుండెలు రూపులు తిరుగు మొఱకు|రక్కసుల రాజ్యమైపోయె నక్కట కట|
అయ్యవార్లనదల్సి రొయ్యలు దినిపించి|నిష్టాగరిష్టులనిచ్చి సున్తీచ్చేసి
కుచ్చుటోపీలు పెట్టి మతము మార్చినారు........ అంటూ దుఃఖపడుతూ ఆనాటి హిందువుల నిస్సహాయ పరిస్థితులను, రజాకార్ల దుష్ట చేష్టలను చరిత్రలో నిక్షిప్తం చేసారు శ్రీ యర్రోజు మాధవాచార్యులు. ఇది వీరు నిర్వహించిన ఒక చారిత్రిక బాధ్యతగా నేడు గుర్తించవచ్చును.

అలాంటి క్రూరపరిస్థితులనుండి నిజాం రాజ్యాన్ని విడిపించి ప్రజలకు విముక్తికలిగించిన సర్ధార్ వల్లభాయి పటేల్ ధైర్యసాహసాలను మాధవాచార్యులు ఈ విధంగా స్తుతించారు.

వల్లభాయి పటేలు మేధా విభవ ప్రయోగ సముదారుడ'యి

---

[3] లి. గోలకొండ పత్రిక 12-12-1965

చేసిన వీర కార్యము ఫలితము త్రిలింగ విషయాభ్యుదయారున కాంతి పూరమైనది. ఇది ఫలోదయము [4]//

***

రామాయణంలోని శంబుకవధ ఘట్టంలోని ఔచిత్య, అనౌచిత్యాలను తాత్వికంగా చర్చించిన కావ్యం ప్రతిమా శంబూకము. భువన విజయము ఏకాంకిక నాటిక.

మాధవాచార్యులు జానపద వాఙ్మయం పై పి.హెచ్.డి చేసి సమర్పించటానికి రైలులో వెళుతుంటే రజాకార్ల ఉద్యమసమయంలో జరిగిన అల్లర్లలో సూట్ కేస్ పోవటంతో ఆ పరిశోధన తాలూకు పత్రాలను పోగొట్టుకొన్నారు. అలా డాక్టరేట్ ను మిస్ అయ్యారు. ఆ లోటు తీర్చుకోవటం కొరకు ఉద్యోగవిరమణ అనంతరం హానరరీ ఫెలోషిప్ తీసుకొని "మేకా రాజా రంగారావు అప్పారావు – జీవిత చరిత్ర" అనే పరిశోధనా గ్రంధాన్ని రచించారు[5].

శ్రీ మాధవాచార్యులు గొప్ప వాక్పటిమ కలిగిన ఉపన్యాసకులు. ఆకాశవాణిలో తెలుగు సాహిత్యంపై అనేక ప్రసంగాలు చేసారు. ఈ రేడియో ఉపన్యాసాలను ఇంకా మరికొన్ని వ్యాసాలను కలిపి "వ్యాసాలు-ఉపన్యాసాలు" పేరుతో పుస్తకరూపంలో వెలువరించారు.

మహా గురువు బిరుదు ప్రధానం

మలేషియా ఆంధ్రసంఘం వారు మాధవాచార్యులను మలేషియా ఆహ్వానించారు. వీరు అక్కడ ఒక నెలరోజుల పాటు తెలుగు సాహిత్యం గురించి వివిధ ప్రాంతాలు తిరుగుతూ ఉపన్యాసాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వీరికి మలేషియా ఆంధ్రసంఘం వారు "మహా గురువు" అనే బిరుదును ఇచ్చి గొప్పగా సత్కరించారు.

---

[4] ఉద్యమ దర్శనము, శ్రీ ముదిగొండ శివప్రసాద్. పే.నం. 334

[5] శ్రీ యర్రోజు మాధవాచార్యులు గారి కుమార్తె శ్రీమతి కల్యాణి గారు, వారి బంధువులైన ప్రొ. డా. నూతలపాటి శ్రీనివాస్ గారు ఈ వ్యాసరచనా సమయంలో అమూల్యమైన సమాచారాన్ని అందించారు.

సామాజిక సేవ

మాధవాచార్యులు స్వాతంత్రోద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. 1942 లో బొంబాయిలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ మహాసభలకు తెలుగు ప్రతినిధిగా హాజరయ్యారు. స్వాతంత్ర్యానంతరం కూడా కాంగ్రెస్ తో తన అనుబంధాన్ని కొనసాగిస్తూ- వితంతు పునర్వివాహం, అనాధప్రేత సంస్కారము లాంటి వివిధ సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు.

నూజివీడు జమిందారు కుమారరాజాగా ప్రసిద్ధిచెందిన మంత్రివర్యులు శ్రీ మేక రంగయప్పారావు గారితో యర్రోజు మాధవాచార్యులకు ప్రగాఢమైన స్నేహానునుబంధం ఉండేది. తన మఘవలయం కావ్యాన్ని కుమారరాజా గారికి అంకితం ఇచ్చారు. మాధవాచార్యుల ప్రోత్సాహంతోనే 1966లో శ్రీ కుమారరాజా వారు నూజివీడులో ధర్మప్పారావు కళాశాల నెలకొల్పారు[6]. ఇది నేడు శాఖోపశాఖలుగా విస్తరించి నడుస్తూ ఉన్నది.

***

ఆంధ్రనాటక కళాపరిషత్తు 1929లో స్థాపించబడింది. 1944 లో దీనిని పునర్వవస్థీకరించే వరకూ పెద్దగా చెప్పుకోదగిన కృషి కాని తెలుగు నాటకరంగ అభివృద్ధికాని జరగలేదు. అలా ఆంధ్ర నాటక కళాపరిషత్తును పునర్వవస్థీకరించిన పెద్దలలో శ్రీ రాజా రంగయ్యప్పారావు, శ్రీ యర్రోజు మాధవాచార్యులు, కాజ వెంకట్రామయ్య, దుక్కిపాటి మధుసూదనరావు తదితరులు ముఖ్యులు. వీరందరూ పరిషత్ నిర్వహణ బాధ్యత వహించి, ఒక నియమావళిని ఏర్పరచి పరిషత్తు నిర్విఘ్నంగా, సమర్ధవంతంగా పనిచేయటానికి దోహదపడ్డారు. వీరిలో మాధవాచార్యులు క్రియాశీలకపాత్ర పోషించించారు. అప్పటినుంచి ప్రతిఏటా నాటకపోటీలు జరపటం ఆంధ్రదేశంలోని నాటకసంఘాలలో గొప్ప ఉత్తేజాన్ని, చైతన్యాన్ని నింపింది.

ఆంధ్ర నాటక కళాపరిషత్తు కార్యవర్గ కమిటీలో మాధవాచార్యులు వివిధ హోదాలలో దాదాపు 1944 నుంచి మూడు దశాబ్దాలపాటు పని చేసి తెలుగు

---

[6] పుష్కర కృష్ణ, కృష్ణాపుష్కర విశేష సంచిక 2016, పేనం. 112

నాటకరంగానికి తమ విశిష్టమైన సేవలను అందించారు. పలు నాటక పోటీలను నిర్వహించటం, నటులను ప్రోత్సహించటం, ప్రతిభకలిగినవారిని సన్మానించటం[7] లాంటి పనులద్వారా ఎంతో మంది ప్రతిభావంతులను సినీ నాటకరంగాలకు పరిచయం చేసారు. అలా ఈ పరిషత్తు ద్వారా వెలుగులోకి వచ్చిన రచయితలలో ఆచార్య ఆత్రేయ, భమిడిపాటి రాధాకృష్ణ, డి.వి. నరసరాజు, పినిశెట్టి, బెల్లంకొండ రామదాసు, కొండముది గోపాలరాయ శర్మ తదితరులు; నటులలో ఎన్.టి. రామారావు, రమణమూర్తి, మిక్కిలినేని, జగ్గయ్య, రావికొండలరావు, చదలవాడ, వల్లం నరసింహరావు లాంటివారు ముఖ్యులు[8].

మాధవాచార్యులు పంతొమ్మిది వందల అరవైలలో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడెమీ కి మెంబరుగా తమసేవలందించారు. [9]

విశ్వబ్రాహ్మణ ధర్మపీఠ వ్యవస్థాపన

విశ్వబ్రాహ్మణ వంశీయులకు ధర్మప్రభోదం చేయటానికి, సంఘీయులకు చేయూతనీయటం కొరకు శ్రీ మాధవాచార్యులు 1974 లో వ్యవస్థాపక సభాపతిగా విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ను స్థాపించారు. దురిశేటి వెంకటరామాచార్యులు, కొండూరి వీరరాఘువాచార్యులు సంచాలకులుగా వ్యవహరించారు. ఈ సంస్థ నేటికీ గొప్ప గణనీయమైన సేవలందిస్తున్నది[10].

***

రచయితగా, సాంస్కృతిక సేవకునిగా, కళాపోషకునిగా, సంఘసేవకునిగా తన జీవితాన్ని సమాజానికి అర్పించుకొన్న శ్రీ యర్రోజు

---

[7] విశాలాంధ్ర, దినపత్రిక 3-5-1964 , పేనం. 6

[8] ఆధునిక నాటకరంగం ఈ దశాబ్ది ప్రయోగాలు by బోయిన వెంకటేశ్వర రావు. పే.నం.317-318. అదృష్టవంతుని ఆత్మకథ, డి.వి. నరసరాజు స్వీయ చరిత్ర, పే.నం. 148

[9] The Andhra Pradesh Legislative Asbembly Debates, official Report 15th July, 1967


[10] విశ్వబ్రాహ్మణ సర్వస్వము-విశ్వబ్రాహ్మణ ప్రముఖులు (ప్రధమ భాగము), శ్రీ రాపాక ఏకాంబరాచార్యులు, పేనం. 288

మాధవాచార్యులు 1983, ఆగస్టు 31 న నూజివీడులోని తమ స్వగృహంలో పరమపదించారు. తెలుగు నేలకు సంబంధించిన సాహిత్య, కళా విద్యారంగాలలో వీరి పాత్ర గణనీయమైనది.

2 March, 2024

సాధు సుబ్రహ్మణ్య శర్మ

(1932-2025)



'నిత్య యవ్వనమే' సాధు సందేశమంటూ ఆయన తాత్విక చింతనను వివరించిన వ్యాసం. జీవితం పట్ల ఉన్నతమైన, ఆరోగ్యకరమైన దృక్పథాన్ని ఇది కలిగిస్తుంది.

నిత్య యవ్వనమే’ సాధు సందేశం!

.

నేను ఒక ఏడాది క్రితం నా ఫేస్ బుక్ వాల్ పై మృత్యువు గురించి రాసిన ఒక కవితకు స్పందిస్తూ సాధు సుబ్రహ్మణ్య శర్మ ఇలా కామెంట్ చేసారు.

“As age increases try to become younger. Don't await death. let death take one unawares while fully immersed in executing a huge project , as in a battlefield!-- Sadhu Sarma.” (వయసు పెరిగే కొద్దీ పడుచువారయ్యేందుకు ప్రయత్నించండి. చావుకోసం ఎదురుచూడవద్దు. ఏదో ఒక పెద్దకార్యంలో పూర్తిగా నిమగ్నమై ఉండగా చావు మనకే తెలీకుండా వచ్చి మనల్ని లాక్కెళ్ళిపోవాలి, యుద్ధరంగంలో లాగ- సాధుశర్మ)

సాధుశర్మ పరిపూర్ణ జీవితం ఆస్వాదించారు. ఈ ప్రపంచాన్ని ప్రేమించారు. తన చుట్టూ ఉన్న పిల్లలను ప్రోత్సహించారు. 90 ఏళ్ళ వయసులో కూడా ఈ ప్రపంచాన్ని మార్చటానికి కొత్తకొత్త తాత్త్వికభూమికల గురించి అన్వేషిస్తూ,

తాను కనుగొన్న సత్యాలను ప్రపంచంతో పంచుకొంటూ జీవించారు. పైన ఆయనే చెప్పినట్లు మరణించే సమయంలో కూడా ఏదో పెద్దప్రోజెక్టును ఊహిస్తూ ఉండి ఉంటారు

శ్రీ సాధు సుబ్రహ్మణ్య శర్మ, శ్రీ సాధు లక్ష్మీనరసింహ శర్మ శ్రీమతి సుబ్బమ్మ దంపతులకు 6-3-1932న జన్మించారు. వీరి ప్రాధమిక చదువు బళ్ళారిలోను, కాలేజి చదువు అనంతపురం, హైదరాబాద్ లోను జరిగాయి. వీరు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖలో వివిధ హోదాలలో పనిచేసి, చివరకు జెనరల్ మేనేజర్ ఇన్ చార్జిగా 1990, మార్చి 31న పదవీవిరమణ చేసారు. 2025, జూలై 18న 93 ఏళ్ళ వయసులో కాకినాడలోని స్వగృహంలో పరమపదించారు. శ్రీ సాధు సుబ్రహ్మణ్య శర్మ గొప్ప మేధోసంపన్నులు, వారి జ్ఞానదాహం అపారమైనది. ఒక వ్యక్తి కవిత్వం, చరిత్ర, భాషాసంబంధ పరిశోధన, తత్త్వశాస్త్రం వంటి వివిధ రంగాలలో వారు చేసిన ప్రామాణిక రచనలు అసాధారణమైనవి. ఇది వారి అసామాన్య ప్రతిభ, బహుముఖీన పాండిత్యానికి, అవిశ్రాంత శ్రమకు నిదర్శనం.

వీరి రచనలు

"సాధువాడిమాట-నవసహస్రాబ్ది బాట" అనే మకుటంతో సమకాలీన అంశాలు, నైతిక విలువలపై రాసిన పద్యాలు. కాలవాహిని పేరుతో కవిత్వం సాధుబాల శిక్ష - అక్షరాలు దిద్దనవసరం లేకుండా తెలుగును బోధించేందుకు రచించిన పాఠ్యపుస్తకం.

New Frontiers of Philosophy for an Alternate model of society or the Human Manifesto. ఈ పుస్తకంలో మానవజాతి ఎదుర్కొంటున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ పర్యావరణ సంక్షోభాలను చర్చించారు. ప్రాచీనభారతదేశ తత్త్వసారాన్ని ఆధునిక సమాజానికి అన్వయిస్తూ చేసిన ప్రతిపాదనలు ఇవి. సమకాలీన సమాజాన్ని, మానవజీవనాన్ని పునర్నిర్మించే దిశలో ఒక గొప్ప మేధావి చేసిన ఆలోచనలు ఇవి.

Dialectics of Evolution, Systems Approach and New frontiers of Philosophy అనే పేరుతో 2015 లో రచించారు. 590 పేజీలు. దీనిని Partridge India వారు ముద్రించారు. చరిత్రను ఒక కొత్త తాత్విక దృష్టితో ఎలా చూడాలో ఈ పుస్తకంలో సుబ్రహ్మణ్య శర్మ వివరించారు. మరింత శాంతిమయ భవిష్యత్తు, శ్రేయస్సుతో కూడిన సమాజాన్ని సాధించేందుకు ఒక విన్-విన్ వ్యూహాన్ని దీనిలో ప్రతిపాదించారు. చరిత్రలో సామాన్యమానవుడు కేవలం విధేయతకలిగిన వస్తువుగానే ఉన్నాడని అతను మరింత తెలివైన పాత్రపోషించాలి అని అంటారు.
మేటి భారతదేశం - మన చరిత్ర మూలాలను అన్వేషిస్తూ వ్రాసిన విశ్లేషణాత్మక 770 పేజీల గ్రంధం. Fight for peace and struggle for an Ideal society అనే పుస్తకంలో ఆధునిక సమాజం, హింస యుద్ధాలనుండి ఎలా విముక్తి చెంది శాంతివైపు ప్రయనించాలో చర్చించారు.
బంకోలా నవల. సాధు సుబ్రహ్మణ్య శర్మ తెలుగు పాఠకులకు ఎక్కువగా తెలిసింది బంకోలా నవల ద్వారా. బంకోలా అంటే లైట్ హౌస్ అని అర్ధం.

అది విదేశీయులు వ్యాపారనిమిత్తమై వచ్చి దేశరాజకీయాలను తమ గుప్పెట్లోకి తెచ్చుకొంటున్న కాలం. స్వదేశీయులు మూడురకాలుగా విడిపోయారు. ఈ మార్పుని తమకు అనుకూలంగా మలచుకొని బాగుపడాలనుకొన్నవారు. రాజెవ్వడైతే మాత్రం నా కష్టమే కదా నాకు దిక్కు అనుకొని తటస్థంగా ఉండిపోయినవారు. రాబోతున్న ఉపద్రవాన్ని పసిగట్టి సమాజాన్ని అప్రమత్తం చేయటానికి ప్రయత్నించిన ఆలోచనా పరులు మరోపక్క.

వీరందరి మధ్యా సంఘర్షణ ఫలితంగా జరిగిన నాటకీయపరిణామాలే బంకోలా నవల.
కథానాయకుడు భైరి, ఓడల యజమాని నరసింహనాయకర్ కొడుకు. భైరి ఆలోచనాపరుడు, ఆంగ్లేయ స్నేహితుల నుంచి ప్రపంచ విజ్ఞానం గ్రహిస్తాడు, బ్రిటిష్ రాజకీయ ఆధిపత్య ఆలోచనలను గుర్తిస్తాడు. యానాం ఫ్రెంచివారి వద్ద గుమస్తాగా పనిచేస్తూ వారి దాష్టీకాలను ఎదిరించి గొడవపడతాడు. మంజరి

అనే వేశ్యద్వారా విదేశీయుల దోపిడీని తెలుసుకొని ఢిల్లీ సుల్తానును కలిసి విదేశీయులను నిలువరించమని కోరటానికని ఢిల్లీ వెళతాడు. అక్కడ ఎవరూ ఇతని మాట ఖాతరు చేయకపోవటంతో తిరిగి కోరంగి వచ్చేస్తాడు. మరదలు పరదేశిని పెళ్ళాడి వ్యాపారంలో విజయం సాధిస్తాడు. అయితే బ్రిటిష్ వ్యతిరేక భావాలతో ఉన్నందుకు భైరి కొడుకును బ్రిటిష్ వారు హతమారుస్తారు. చివరకు, 1789 డిసెంబర్ 10న వచ్చిన కోరంగి సునామీలో భైరి, పరదేశి కొట్టుకుపోయి మరణించటంతో నవల ముగుస్తుంది.

ఈ రచనలో సుబ్రహ్మణ్య శర్మ ఆ కాలపు సామాజిక సంఘర్షణను నేపథ్యంగా తీసుకోవటం వల్ల ఇది గొప్ప చారిత్రిక నవలగా రూపుదిద్దుకొంది. తెలుగులో ఈ కాలానికి సంబంధించి సామాన్యుల జీవితాలను ప్రతిబింబించే సాహిత్యం పెద్దగా లేదు. ఆ లోటు ఈ పుస్తకం తీర్చటంతో తెలుగు పాఠకులు దీనిని అపూర్వంగా ఆదరించారు. తెలుగువారు గర్వించదగిన గొప్ప తాత్త్విక రచనలను సుబ్రహ్మణ్య శర్మ చేసారు. వాటిపట్ల తెలుగునాట పెద్దగా చర్చ జరగకపోవటం నిజంగా బాధాకరం.

ఇవే కాక జహీశత్రుల మహాబాహో - మెట్టవేదాంతాన్ని విడనాడి శాస్త్రీయ మార్గం అవలంబించాల్సిన అవసరాన్ని ఎత్తిచూపే రచన. History of Freedom Struggle. శ్రీసాధు సుబ్రహ్మణ్య శర్మ గారు ప్రతిపాదించిన "స్వల్ప సంకేతాలతో సకల భాషలను వ్రాసే విశ్వజనీన లిపి" కి సోమనాథ కళాపీఠం వారు "స్వచ్ఛంద భాషా సేవా పురస్కారం" ను 2010 లో ప్రదానం చేసారు. ఈ విశ్వజనీన లిపి లాంటివి ఇంకా అముద్రితాలే.

సాధు సుబ్రహ్మణ్య శర్మ సాధు ప్రైవేట్ లైబ్రేరిని స్థాపించి స్కూల్ విద్యార్థుల కొరకు స్వయంగా నడిపారు. పిల్లలు ఆటలు ఆడుకోవటానికి ఒక ఇల్లును అద్దెకు తీసుకొని అన్ని రకాల ఆటవస్తువులను వారికి అందుబాటులో ఉంచారు. నిత్యయవ్వనంతో జీవించటమే ఆ గొప్ప తత్త్వవేత్త మనకిచ్చిన సందేశం.

22 July, 2025

డా. పి. చిరంజీవిని కుమారి

(1931 -2025)



బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఒక విదుషీమణికి నివాళి. విద్యా, సామాజిక రంగాల్లో ఆమె పోషించిన పాత్రను, ఆమె అంకితభావాన్ని ఈ వ్యాసం ఆవిష్కరిస్తుంది.

ధీర విదుషీమణి - డా.పి.చిరంజీవిని కుమారి

డా. చిరంజీవినికుమారి విద్యావేత్త, అభ్యుదయవాది, కవయిత్రి, అనువాదకురాలు, సాహిత్య-సామాజికాంశాలపై అద్భుతమైన వక్త, సాహితీ కార్యకర్త, సమాజసేవకురాలు అన్నింటికీ మించి అనన్యసామాన్యమైన వ్యక్తిత్వం, నిత్యచైతన్య శీలత కలిగిన ధీర.

కుటుంబనేపథ్యం, విద్యాభ్యాసం

చిరంజీవినికుమారి గారి తల్లి, తండ్రి ఇరువైపులా పండిత కుటుంబాలు. వీరి మాతామహులు తిమ్మరాజు శేషగిరిరావు. ప్రముఖ ఉపాధ్యాయులు. ప్రఖ్యాత రచయిత బోయి భీమన్న వీరివద్ద విద్యాభ్యాసం చేసారు. ఒకసారి భీమన్న అద్భుతంగా చేసిన ఒక అనువాదానికి ముచ్చటపడిన తిమ్మరాజు శేషగిరిరావు అతనిని బెంచిపైకి ఎక్కించి "అందరూ వాడిని చూడండి, అసలైన బ్రాహ్మణుడంటే వాడు" అని అన్నారని భీమన్న గారు ఒక వ్యాసంలో రాసుకొన్నారు.[1] చిరంజీవినికుమారి నాయినమ్మ పులుగుర్త లక్ష్మీనరసమాంబ, విద్యాధికురాలు. అనేక బెంగాలి నవలలను తెలుగు చేసారు. వాటిలో కొన్ని హైస్కూలు నాన్ డిటైల్డ్ పాఠ్యాంశాలుగా పెట్టారు. 1902-1908 మధ్యకాలంలో వీరు 'సావిత్రి' అనే పత్రికను నడిపారు. స్త్రీ విద్యను ప్రోత్సహించటానికి ఈమె వ్యవస్థాపక కార్యదర్శిగా 1903 జనవరి 30 న 'శ్రీ విద్యార్థిని సమాజము' పేరుతో కాకినాడలో ఒక సంఘాన్ని స్థాపించారు.[2] ఈ సంఘాన్ని కందుకూరి వీరేశలింగం, బండారు అచ్చమాంబల చేతులమీదుగ ప్రారంభించారు. 1923 లో కాకినాడలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సభలలో పులుగుర్త లక్ష్మినరసమాంబ చురుకైన కార్యకర్తగా పనిచేసారు. ప్రముఖ నాయకురాలు దుర్గాభాయ్ దేశ్ ముఖ్ తో వీరికి గొప్ప

స్నేహం ఉండేది. పులుగుర్త లక్ష్మీ నరసమాంబకు ఏకైక సంతానం పులుగుర్త బృందావనం.

పులుగుర్త బృందావనం, బాలాత్రిపుర సుందరి దంపతులకు చిరంజీవినికుమారి 30-3-1931 న అమ్మమ్మగారి ఊరైన రామచంద్రపురంలో జన్మించారు. వీరి తండ్రిగారికి ఆరుగురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు సంతానం. వీరిలో చిరంజీవినికుమారి పెద్ద. తండ్రిగారు కాకినాడ పి.ఆర్. కళాశాలలో గణితశాస్త్రం బోధించేవారు. చిరంజీవినికుమారి విద్యాభ్యాసం కాకినాడలో జరిగింది. స్కూలుఫైనలు దాకా పి.ఆర్. హైస్కూలులో చదివారు. బి.ఎ. తెలుగు పి.ఆర్. కళాశాలలో పూర్తిచేసి యూనివర్సిటీ గోల్డ్ మెడల్ పొందారు. 1959 ఆంధ్రా యూనివర్సిటీ నుండి ఎమ్.ఎ. ఇంగ్లీషు లిటెరేచర్ తరువాత బి.ఇ.డి. చేసారు. పాట్నా యూనివర్సిటీలో “Social and Ethical Philosophy in Valmiki Ramayana” అనే అంశంపై 1969 లో పిహెచ్.డి చేసి డాక్టరేట్ పొందారు.

వివాహం, కుటుంబం

చిరంజీవినికుమారి ఉద్యమాల నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చినందున విద్యార్థిదశనుంచే సామాజిక సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు. ఈ దశలో కమ్యూనిష్టుపార్టీ అనుబంధంగా ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ లో చురుకుగా పాల్గొనే శ్రీ పి.ఎస్. శర్మ గారితో పరిచయం ఏర్పడింది. శర్మగారు అప్పటికి చాలాకాలం క్రితమే నేతాజి సుభాష్ చంద్రబోస్ ను కాకినాడ రప్పించి ఉత్తేజపూర్వక ఉపన్యాసం ఇప్పించిన ఘనత సంపాదించుకొన్నారు. వీరిరువురు అనేక విద్యార్థి ఉద్యమాల్లో కలిసి పనిచేసారు. ఆ సాన్నిహిత్యం కాలక్రమేణా ప్రేమగా మారింది. ఇరువురూ పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకొన్నారు. వరుడు కమ్యూనిష్టు భావాలు కలిగి ఉన్నాడని, ఇద్దరికీ 14 ఏళ్ళ వయో బేధం ఉందని, పైగా వధువు MA చదవగా, వరుడు చదువు ఇంటర్ తో ఆపేసి సామాజిక సేవాకార్యక్రమాలలో పాల్గొంటున్నాడనే కారణాలతో చిరంజీవినికుమారి తల్లిదండ్రులు ఈ వివాహానికి మొదట్లో అంగీకరించలేదు. కాని వారి ప్రేమ, అన్యోన్యతలను

చూసి ఒప్పుకోకతప్పలేదు. అలా ఇరుకుటుంబాల అంగీకారంతో చిరంజీవినికుమారి, పిఎస్ శర్మ అక్టోబరు 1953 లో రిజిష్టరు మేరేజ్ చేసుకొన్నారు. చిరంజీవినికుమారి వివాహానంతరం కూడా తన ఉన్నతవిద్యను కొనసాగించారు.

ఉద్యోగ జీవితం

డా.చిరంజీవినికుమారి తన ఉద్యోగజీవితంలో అనేక మైలురాళ్లు ఏర్పరచుకొన్నారు. 1959 లో ఆంధ్రాయూనివర్సిటీ నుంచి ఎం.ఏ పట్టా అందుకొన్న వెంటనే, కాకినాడలోని ప్రతిష్టాత్మకమైన రంగరాయ మెడికల్ కాలేజిలో ఇంగ్లీషు లెక్చరర్ గా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. అప్పట్లో MBBS మొదటి సంవత్సరంలో ఇంగ్లీషు భాష బోధనలోభాగంగా ఉండేది. ఆ తర్వాత, మూడు సంవత్సరాలపాటు సత్యదేవ కళాశాలలో ఇంగ్లీషు లెక్చరర్ గా సేవలందించారు. 1969 లో డాక్టరేట్ పూర్తయిన తరువాత మళ్ళీ రంగరాయ మెడికల్ కాలేజీలో చేరి 8 సంవత్సరాలపాటు లేడిస్ హాస్టల్ వార్డెన్ గా పనిచేసారు.

1977లో రంగరాయ కాలేజ్ నుంచి డిప్యుటేషన్ మీద ఐడియల్ కాలేజ్ ప్రిన్సిపాల్ గా నియమితులయ్యారు. అప్పటినుంచి ఐడియల్ విద్యాసంస్థలే వీరి కార్యక్షేత్రంగా మారాయి. వీరి అవిశ్రాంత కృషి, నాయకత్వం వల్ల ఐడియల్ విద్యాసంస్థలు విస్తరించి నేడు జిల్లాలోనే అత్యుత్తమ సంస్థలుగా నిలిచాయి.

ఐడియల్ విద్యాసంస్థలు

ఐడియల్ విద్యాసంస్థలు డా.చిరంజీవినికుమారి అచంచలమైన అంకితభావం, దూరదృష్టి, నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తాయి. వీరు ఈ విద్యాసంస్థల అభివృద్ధికి, విద్యార్థుల శ్రేయస్సుకి తన సమస్త శక్తిని, జీవితాన్ని వెచ్చించారు. ప్రముఖ వైద్యులు, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో గౌరవవైద్యులుగా సేవలందిస్తున్న డా. పివిఎన్ రాజు వ్యవస్థాపక అధ్యక్షుడుగా డా.చిరంజీవినికుమారి సెక్రటరీగా 1970లో ఐడియల్ జూనియర్ కాలేజిని స్థాపించారు. ఈ సంస్థ 1974 లో డిగ్రీ కళాశాలగా, 1992 నుంచి పీజి కళాశాలగా, 2009 నుంచి ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాలగా

అంచెలంచెలుగా విస్తరించుకొంటూ వచ్చారు. ఒక చిన్నకళాశాలగా ప్రారంభించి బహుళ విద్యాసంస్థల సముదాయంగా తీర్చిదిద్దటంలో డా. చిరంజీవినికుమారి కృషి, నాయకత్వం కీలకమైనవి. డా. చిరంజీవినికుమారి ఈ విద్యాసంస్థలకు సెక్రటరీ మరియు కరస్పాండెంట్ గా జీవితాంతం సేవలందించడమే కాక ఐడియల్ కళాశాలకు 16 సంవత్సరాలపాటు ప్రిన్సిపాల్ గా కూడా పనిచేసారు.

"మానవ వనరులు పుట్టవు, సంస్కృతి, సంప్రదాయం, విద్య ద్వారా తయారవుతాయి"- అనే సత్యాన్ని నమ్మిన వీరు, ఈ విద్యాసంస్థలను ఉత్తమ మానవ విలువలతో కూడిన విద్యార్థులను సమాజానికి అందించే కేంద్రంగా నడిపారు. ఈ సంస్థలు అలా విలువలు నైపుణ్యాలు కలిగిన లక్షలాది విద్యార్ధులను సమాజానికి అందించాయి. ఐడియల్ కళాశాల జిల్లాలో NAAC, Autonomous గుర్తింపు పొందిన మొట్టమొదటి ఎయిడెడ్ విద్యాసంస్థగా నిలిచింది.

వివిధ సంస్థలలో సభ్యత్వం

డా. చిరంజీవినికుమారి ఎన్నో సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సంస్థలలో కీలక పదవులను నిర్వహించారు. వాటిద్వారా ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేసారు. ఐడియల్ కాలేజిని వేదికగా ఇచ్చారు.

1. అభ్యుదయ రచయితల సంఘం: అరసం ప్రారంభం నుంచి దానిలో ప్రముఖ పాత్ర పోషించారు. గుజ్జుల యల్లమందారెడ్డి, బూదరాజు రాధాకృష్ణ వంటి సాహిత్యవేత్తలు వీరిని అరసంవైపు నడిపించారు. తుమ్మల వెంకటరామయ్య, పరకాల పట్టాభిరామారావు వంటి పెద్దలు, డా.చిరంజీవినికుమారిని పిలిచి కాకినాడలో అరసం మహాసభ పెట్టాలని కోరారు. అలా 1972లో కాకినాడలో అరసం రాష్ట్ర మహాసభను వీరు నిర్వహించారు. ఈ సభకు చాగంటి సోమయాజులు ఆవంత్స సోమసుందర్, మహీధర రామమోహన్ లాంటి ప్రభృతులు హాజరయ్యారు. రాష్ట్ర

అభ్యుదయరచయితల సంఘానికి వీరు చాలాకాలం గౌరవాధ్యక్షురాలిగా పనిచేసారు.

2. ఇండో సోవియట్ కల్చరల్ సొసైటి(ఇస్కస్): ఇది ఇండియా సోవియట్ యూనియన్ మధ్య సాంస్కృతిక సంబంధాలను ప్రోత్సహించే సంస్థ. ఇరుదేశాల ప్రజలమధ్య సాంస్కృతిక అవగాహన, స్నేహాన్ని పెంపొందించడం ఈ సంస్థ లక్ష్యం. ఈ సంస్థ తరపున డా. చిరంజీవినికుమారి 1970 లో సోవియట్ యూనియన్ పర్యటించారు. ఆ దేశం సాధించిన ప్రగతిని, అక్కడ సామాన్య మానవుని జీవన విధానాన్ని అధ్యయనం చేసి తమ అనుభవాలను ప్రజలకు వివరించి, భారత్ -సోవియట్ మైత్రి మరింత బలపడేందుకు తోడ్పడటం ఈ బృంద పర్యటన ముఖ్యోద్దేశం.

డాక్టర్లు, న్యాయవాదులు, వ్యవసాయదారులు, వ్యాపారులు, యువకులతో మొత్తం భారతదేశంలోని ఐదు రాష్ట్రాలనుండి 72 మంది సభ్యులు గల ఈ బృందానికి ఇస్కస్ రాష్ట్రకార్యదర్శి హోదాలో డా.చిరంజీవినికుమారి నాయకత్వం వహించారు. ఈ బృందం ఇరవై రోజులపాటు సోవియట్ లో మాస్కో, లెనిన్ గ్రాడ్, ఆర్మేనియా ప్రాంతాలను సందర్శించి, అక్కడి రచయితలు, మేధావులు, సామాన్యప్రజలతో సంభాషించారు. అక్కడి ప్రజల జీవన విధానాలను పరిశీలించారు. ఆ స్ఫూర్తితో తిరిగి ఇండియాకు వచ్చాక డా.చిరంజీవినికుమారి కొన్ని రష్యన్ రచనలను తెలుగులోకి అనువదించారు. ఇస్కస్ సంస్థలో ఉండగా 1970లో Lenin and Universal Brotherhood అనే ఇంగ్లీషు వ్యాసం రాసారు. దీనిలో The Basis of this analysis is the proposition that the Economic Structure of the man Determins the social relationships of the members of that society అనే వాక్యం ఆనాటి విశ్లేషకులను ఆకర్షించింది.[3]

డా.చిరంజీవినికుమారి ఇస్కస్ కు 1977 లో ఉపాధ్యక్షురాలిగా పనిచేసారు.[4]

3. తూర్పుగోదావరి జిల్లా హిస్టరీ కాంగ్రెస్: ఈ సంస్థకు డా. చిరంజీవినికుమారి, చాన్నాళ్ళు సెక్రటరిగా పనిచేసారు. ఈ సంస్థ తరపున "తూర్పుగోదావరి జిల్లా చరిత్ర, సంస్కృతి" అనే 650 పేజీల గొప్ప బృహత్ గ్రంథాన్ని తన సంపాదకత్వంలో తీసుకొచ్చారు. దీనిలో వివిధ అంశాలపై నిష్ణాతులైన వారిచే రాయించిన 66 వ్యాసాలు కలవు. ఈ వ్యాసాలు జిల్లాకు సంబంధించిన ప్రాచీనచరిత్ర, మతపరమైన పరిణామాలు, వలసపాలనలు, సంస్కరణోద్యమాలు, స్వాతంత్రోద్యమాలను మదింపువేస్తాయి. ఈ ప్రాంత చరిత్రను సమగ్రంగా ఆవిష్కరిస్తాయి.

ఈ గ్రంథంలో డా. వకుళాభరం రామకృష్ణ, జాస్తి దుర్గాప్రసాద్, కె.ఎస్. కామేశ్వరరావు వంటి లబ్దప్రతిష్టులైన చరిత్రకారుల పత్రాలు; ఆవంత్స సోమసుందర్, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, అద్దేపల్లి రామమోహనరావు, కాశీభట్ల సత్యన్నారాయణ వంటి ప్రముఖ సాహితీవేత్తల వ్యాసాలు ఉన్నాయి. ఈ పుస్తకం జిల్లా చరిత్రను అధ్యయనం చేయాలనుకొనేవారికి ఒక కరదీపిక.

4. తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం: ఈ సంస్థకు వీరు కార్యదర్శి. స్వీయ సంపాదకత్వంలో 2018 లో "తూర్పుగోదావరి జిల్లా సాహిత్య చరిత్ర (1880-2015 వరకు) పేరుతో ఒక అధ్యయనాత్మక గ్రంథాన్ని ఈ సంస్థతరపున వెలువరించారు. ఈ గ్రంథం జిల్లాకు చెందిన శాసనసాహిత్యం, ప్రాచీన సాహిత్యం, సంస్కరణలు, ఆధునిక సాహిత్యం, ప్రక్రియలు, సాహితీవేత్తలు, పత్రికలు, సాహితీ సంస్థలు, సాహిత్యవిమర్శలాంటి వివిధ అంశాలను సమగ్రంగా విశ్లేషిస్తుంది. ఈ విశ్లేషణ ఒక ప్రాంత సాహిత్యఅస్తిత్వపు సమగ్ర అధ్యయనం. ఆ కోణంలోంచి ఈ పుస్తకం ఇతరజిల్లాలకు ఆదర్శప్రాయంగా నిలిచింది.

మాజీప్రధాని పివి నరసింహారావు శతజయంతి సందర్భంగా ఆయన రచించిన 'గొల్లరామవ్వ' కథపై ప్రాంతాలకు అతీతంగా ప్రముఖ సాహితీవేత్తల అభిప్రాయాలతో 'అభిప్రాయమాలిక" ను తీసుకొచ్చారు.

ఇదే సంస్థ తరపున జిల్లాకుచెందిన కథా రచయితల కథలతో తీసుకొచ్చిన "కథలు-అలలు" సంకలనానికి సంపాదకత్వం వహించారు.

తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం తరపున 2024 లో యువకథకులకు దిశానిర్దేశం చేయటానికి 'కథ ఎందుకు ఏమిటి ఎలా' పేరుతో 2024 లో ఒక జాతీయ సదస్సు నిర్వహించారు
వీరి సహచరుడైన శ్రీ పి.ఎస్. శర్మ రచించిన సాతంత్ర్యసంగ్రామంలో తూర్పుగోదావరి అనే పుస్తకాన్ని పునర్ముద్రించారు.
జిల్లా సాంస్కృతిక సాహిత్య వారసత్వాన్ని రికార్డు చేయటంలో డా. చిరంజీవినీ కుమారి కృషి విశేషమైనది.

4. జనవిజ్ఞాన వేదిక: వీరు జనవిజ్ఞాన వేదిక కాకినాడ జిల్లా గౌరవ అధ్యక్షురాలుగా సేవలందించారు. 1953 ప్రాంతంలో కమ్యూనిష్టు నాయకుడు ఎస్.ఎ డాంగే రచించిన "From Primitive Communism to Slavery" అనే గ్రంథం చదివి వామపక్ష భావవాదం, మార్క్సిష్టు సిద్ధాంతాలను లోతుగా అర్థం చేసుకొన్నానని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.[5] జీవితాంతం వామపక్షభావజాలంతో మెలిగి అనేకమందికి ఆదర్శంగా నిలిచారు. జెవివి నిర్వహించిన అక్షర గోదావరి ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారు.

5. ఇవే కాక – శ్రీవేణుగోపాల సంస్కృత ప్రచారసభ, ఈశ్వర పుస్తక భాండాగారం, కాకినాడకు సెక్రటరీగా; జిల్లా గ్రంధాలయ సంఘానికి సెక్రటరీగా; జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కు పాతికేళ్ళు వివిధ హోదాలలో; గిరిజన ప్రాంతాలలో వారి అభివృద్ధికై పనిచేసే 'స్పందన' అనే సంస్థకు ప్రెసిడెంట్ గా; ఎపి స్టేట్ ప్రైవేట్ విద్యాసంస్థల మేనేజ్ మెంట్ అసోసియేషన్ కు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వివిధ పదవులలో ఆ సంస్థల వికాశానికి, ఉన్నతికి తనవంతు సహకారం అందించారు.

6. ఆదికవి నన్నయ యూనివర్సిటీని జిల్లాకు సాధించటానికి ఏర్పడ్డ గోదావరి యూనివర్సిటీ సాధన సమితికి డా. చిరంజీవినికుమారి వైస్ ప్రెసిడెంటుగా పనిచేసారు. ఆంధ్రాయూనివర్సిటి పిజి సెంటరు, అన్నవరం సత్యదేవి మహిళా కళాశాల లాంటి విద్యాసంస్థలు కాకినాడకు రావటంలో కృషిచేసి వాటికి వ్యవస్థాపక సభ్యురాలిగా ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాను విద్యా, సాహిత్య,

సాంస్కృతిక హబ్‌గా మార్చడంలో డా. చిరంజీవినికుమారి కీలకపాత్ర పోషించారు.

చరిత్రాత్మక మహాసభల నిర్వహణ

1. శ్రీశ్రీ సప్తతి సభ: డా. చిరంజీవినికుమారి ఆధ్వర్యంతో1980 మార్చి 2వ తేదీన కాకినాడలో శ్రీశ్రీ సప్తతిపూర్తి (70వ జన్మదిన) సభలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీశ్రీకి అయిదువేల రూపాయిలు బహుమతిగా అందచేసారు. ఆయన రచనలను పునర్ముద్రించి అమ్మారు. అభినందన సంచిక వెలువరించారు. ఈ సభకు శ్రీ హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ ముఖ్య అతిథిగా, సభాధ్యక్షునిగా వ్యవహరించారు. వీటన్నిటి వెనుక చిరంజీవినికుమారి మెటిక్యులస్ ప్లానింగ్ ఎగ్జిక్యూషన్ ఉన్నాయి.

ఈ సభ జరగటానికి మూడునెలల ముందు డా. చిరంజీవినికుమారి, శ్రీ మిరియాల రామకృష్ణ 1979 డిశంబరు మొదటివారంలో మద్రాసులోని శ్రీశ్రీని కలిసి సప్తతి కార్యక్రమం గురించి చర్చించి ఆహ్వానించారు

ఈ ఫంక్షన్ గురించి శ్రీశ్రీ సతీమణి శ్రీమతి సరోజ తనపుస్తకం 'సంసారంలో శ్రీశ్రీ' లో ఇలా రాసారు—"మార్చి రెండవ తేదీ ఫంక్షన్ కి కాకినాడ వెళ్ళాం. అందరూ మమ్మల్ని ఎంతో బాగా చూసుకున్నారు చిరంజీవినీ కుమారిగారు అన్ని పనులు తనే చేస్తూ, చచ్చేటంత బిజీగా వుండి కూడా అడుగడుక్కి వచ్చి నన్ను పలకరించి వెళుతూవుండేవారు" [6].

సరోజ శ్రీశ్రీ రాసిన పై వాక్యాలు డా.చిరంజీవినికుమారి కార్యదీక్షకు, ఆదరణకు అద్దంపడతాయి.

శ్రీశ్రీ సప్తతి సభలు తెలుగుసాహిత్యరంగంలో గొప్పగా నిలిచిపోయిన సంఘటన. శ్రీశ్రీ షష్టిపూర్తి సభ భిన్నాభిప్రాయాలు, నిరసనలవల్ల రసాభాస అయింది. కాని సప్తతి సభలు మాత్రం ఏ రకమైన నిరసనలు లేక అంగరంగవైభవంగా జరిగాయి.

2. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యపు వెలుగులు: తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం తరపున, 1989 డిసెంబరు 29, 30, 31 తేదీలలో ఐడియల్ కళాశాలలో, "వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యపు వెలుగులు" అంశంపై జాతీయ

సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు తెలుగు సాహిత్య చరిత్రను సమగ్రంగా చర్చించే వేదికగా నిలిచింది. ఈ సదస్సుకి దేశం నలుమూలలనుంచి లబ్ధప్రతిష్టులైన సాహితీవేత్తలు హాజరయ్యారు.

3. గరికిపాటి నరసింహారావు మొదటి సహస్రావధానం కార్యక్రమం డా. చిరంజీవినికుమారి ఆధ్వర్యంలో జరిగింది.. ఈ కార్యక్రమం తెలుగు సాహిత్యంలో అవధాన కళను ప్రోత్సహించడంలో, గరికిపాటి నరసింహారావు సాహిత్య ప్రతిభను వెలుగులోకి తీసుకురావడంలో ఒక ముఖ్యమైన సంఘటన.

రచనలు

డా. చిరంజీవినికుమారి కవిగా, అనువాదకురాలిగా, వ్యాసకర్తగా, వక్తగా సాహిత్య రంగంలో విశిష్టమైన కృషి సలిపారు.

డా. చిరంజీవినికుమారి మూడు స్వీయ కవితా సంపుటులను వెలువరించారు. ఈ సంపుటులు ఆమె సాహిత్య సృజనాత్మకత, సామాజిక చైతన్యం, మరియు స్త్రీవాద దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి

సోవియట్ రష్యాను సందర్శించినపుడు ఆర్మేనియాలో హోవనేస్తు మన్య అనే రచయితతో పరిచయం కలిగింది. ఆయన కథలపుస్తకం తెచ్చుకొని వాటిని "ఆర్మేనియా కథలు గాథలు" పేరిట తెలుగులోకి అనువదించారు. ఈ పుస్తకాన్ని విశాలాంధ్ర వారు ప్రచురించారు.

సోవియట్ యూనియన్‌కు చెందిన 32 మంది మహిళా రచయిత్రుల కవితల సంపుటి Tender Muse ని వీరు "లేత మందారాలు-రక్త సింధూరాలు" పేరిట తెలుగులోకి అనువదించి ప్రచురించారు

80 పైన వివిధ సాహిత్య సాంస్కృతిక, స్త్రీవాద సంబంధ వ్యాసాలు రాసారు. వక్తగా వివిధ వేదికలపై కొన్ని వందల ప్రసంగాలు చేసారు. అనేక రేడియో ప్రసంగాలు చేసారు. మహిళాసమస్యలపై టివి చర్చాగోష్ఠులలో పాల్గొన్నారు.

అవార్డులు

డా. చిరంజీవినికుమారి విద్య, సాహిత్యం, సామాజిక సేవ, సాంస్కృతిక రంగాలలో చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా అనేక పురస్కారాలను అందుకున్నారు.

1. సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డు: భారత్-సోవియట్ సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేసినందుకు, ముఖ్యంగా వీరు చేసిన రష్యన్ అనువాద రచనలు, ఇస్కస్ సంస్థలో చేసిన కృషికి ఈ అవార్డు లభించింది.

2. కీర్తి పురస్కారం 2011: సాహిత్య, విద్యా రంగాలలో డా.చిరంజీవినికుమారి చేసిన సేవలకు గుర్తింపుగా శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నుంచి ఈ పురస్కారం అందుకున్నారు

3. విద్యారంగంలో విశేషమైన సేవలు అందించినందుకు SHE, ఫౌండేషన్, హైదరాబాద్ వారిచే ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అండ్ విమెన్ ఎంపవర్‌మెంట్ అవార్డు (2012) హైదరాబాద్ రవీంద్ర బారతిలో, రాష్ట్ర గవర్నరు సతీమణి శ్రీమతి విమలా నరసింహన్ చేతులమీదుగా అందుకొన్నారు.

4. ఇంటిగ్రల్ హ్యూమనిస్ట్ అవార్డు (2014), పుల్లెల తాతయ్య మెమోరియల్ అసోసియేషన్

5. తుమ్మల వెంకట్రామయ్య సాహితీ సత్కారం, హైదరాబాద్

ముగింపు

డా. చిరంజీవినికుమారి భర్త పిఎస్ శర్మ 25, డిశంబరు 2000 న మరణించారు. వీరికి ఇద్దరు కుమారులు. డా. పిబిఎస్ గోపాల్ హైదరాబాదులో వైద్యుడిగా పనిచేస్తున్నారు. పిఎస్. కిరణ్ ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాల వ్యవహారాలు చూస్తున్నారు.

డా. చిరంజీవినికుమారి విద్య, సాహిత్యం, సామాజిక సేవ, సాంస్కృతిక పరిరక్షణలలో అసాధారణమైన కృషి చేసిన వ్యక్తి. విద్యావేత్తగా, కవిగా, అనువాదకురాలిగా, సాహితీ కార్యకర్తగా, సమాజ సేవకురాలిగా చేసిన సేవలు తూర్పుగోదావరి జిల్లా సాహిత్య, విద్యా రంగాలలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. వివిధ సంస్థల నిర్వహణలో, డా.చిరంజీవినికుమారి అసాధారణమైన నాయకత్వ పటిమను ప్రదర్శించారు. విద్య, సాహిత్యం,

సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఆమె నిర్వహించిన కార్యక్రమాలు ఆమె సమర్ధ నాయకత్వానికి, ప్రణాళికా నైపుణ్యానికి, అంకితభావానికి నిదర్శనం. వామపక్ష భావజాలాన్ని జీవితాంతం ఆచరించారు. సమాజ అభ్యున్నతికి, ముఖ్యంగా మహిల అభ్యున్నతికి కృషి చేసారు.

ఒక ఇంటర్వ్యూలో ఇలా అన్నారు:
"మనమూలాల్ని మరచిపోకూడదు. వారసత్వంగా ఆస్తులు పంచినట్టే మన పిల్లలకు మన మూలాలను కూడా పంచి ఇవ్వాలి. వాటిని వారు జాగ్రత్తగా గుర్తుపెట్టుకొనేట్టు చేయాలి.... అప్పుడే జీవితానికి ఒక విలువ ఏర్పడుతుంది" ఈ వాక్యాలు సాహిత్య, సాంస్కృతిక, విద్యారంగాలలో వీరి జీవితకాలకృషిని ప్రతిబింబిస్తాయి. డా. చిరంజీవినికుమారి గారి జీవితం పరిపూర్ణమైనది. అందరిలో ఆదర్శప్రాయమైన స్ఫూర్తిని కలిగిస్తుంది.

Footnotes

1. పరిణతవాణి (2000, Volume – 2) పేన3
2. కాకినాడ విద్యార్థినీ సమాజం; ప్రారంభం, వీక్షణం మాస పత్రిక, పేనం. 48, ఫిబ్రవరి 2008,
3. ఆంధ్రపత్రిక, 25, సెప్టెంబరు 1970
4. 1977-08-18 Visaalandhra
5. విశాలాంధ్ర, 01, ఏప్రిల్ 2018
6. సంసారంలో శ్రీశ్రీ, సరోజా శ్రీశ్రీ పేనం 78

కొత్తలంక బాబా

(????- 1948)



సూఫీ తత్వాన్ని, మానవత్వాన్ని చాటిన బాబా గారి జీవితం ఒక గొప్ప స్ఫూర్తి. మత సామరస్యానికి, కరుణకు ఆయన జీవితం ఒక నిలువెత్తు సాక్ష్యం.

కరుణ కన్నా గొప్ప మహిమ లేదు! - సూఫీల గొడుగు నీడలో

చాన్నాళ్ల క్రితం సారంగ కోసం కొత్తలంక బాబా గారి గురించి ఒక వ్యాసం రాసాను. ఆ వ్యాసం చదివిన ఒక మిత్రుడు ఒక మాట అన్నాడు—
"ఆ వ్యాసం కొత్తలంక బాబాగారిని కన్నా మీ అమ్మగారిని, ఆమె వ్యక్తిత్వాన్ని ఎక్కువగా ఆవిష్కరించింది" అని.
ఈ ఉమెన్స్ డే రోజున ఆ వ్యాసాన్ని తిరిగి చదివితే నాకు స్పష్టంగా తెలుస్తోంది—
అది కొత్తలంక బాబా గారి కథ మాత్రమే కాదు;
నా జీవితాన్ని నిశ్శబ్దంగా మలిచిన
మా అమ్మ కథ కూడా.
బొల్లోజు బాబా

.

కరుణ కన్నా గొప్ప మహిమ లేదు! - సూఫీల గొడుగు నీడలో

తూర్పుగోదావరి జిల్లా, ముమ్మిడివరం సమీపంలో ఉన్న కొత్తలంకలో హజరత్ సయ్యద్ అహ్మదలీషా ఖాదర్ వలీబాబా గారి దర్గాతో మా కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి కొన్ని సంగతులు పంచుకోవాలనుకొంటున్నాను.
అవి 1930ల నాటి రోజులు.
మా మాతామహుని పేరు దొంతాభక్తుని సోమలింగం. యానాంలో నివసించేవారు. వీరికి సంతానం లేదు. ఎన్నిపూజలు చేసినా ఫలించలేదు.

“రేవు అవతల ఎవరో యోగీశ్వరుడు వచ్చారట, ఆయన అనేక మహిమలు చూపుతున్నారట. వారిని దర్శించుకొన్నవారికి అనుకొన్నవి జరుగుతున్నాయట” అంటూ వారూ వీరూ చెప్పుకొనే మాటలను నమ్మి “సరే చూద్దాం ఏంజరుగుతుందో” అనుకొని ఒక రోజు మా తాతగారు కొత్తలంక వెళ్ళారు.

కొబ్బరితోట మధ్యలో ఓ చెట్టునీడన దిగంబరంగా కూర్చొని, బక్కపలచని శరీరంతో ఒక సాధువు, ఆయన చుట్టూ పది పదిహేను మంది భక్తులు. అరటిపళ్ళు, తీపితినుబండారాలు ప్రసాదంగా సమర్పించుకొని ఒక్కొక్కరు ఆయనపాదాలను తాకి నమస్కరించుకొని వెళిపోతున్నారు. కొంతమందితో ఆ సాధువు మాట్లాడుతున్నారు. మరికొందరిని వెళ్ళిపొమ్మని సైగలు చేస్తున్నారు. తెచ్చిన ప్రసాదాలను అక్కడక్కడా తీసుకొని ఎంగిలిచేస్తున్నారు, మరికొందరివి వారికే ఇచ్చేస్తున్నారు.

మా తాతగారి వంతు వచ్చింది. అరటిపళ్ళు ఆయన ముందు ఉంచి పాదాలకు నమస్కరించి లేస్తుండగా “ఏరా బ్రహ్మం, నీకు సంతానం ఉందిలే…. ఆడసంతానం” అని పలికి తలతిప్పి మరో వైపుకు చూస్తూ ఉండిపోయారట. ఈ సంఘటన జరిగిన కొన్నాళ్లకు మా అమ్మ పుట్టింది. నెలల బిడ్డను తిరిగి బాబాగారి వద్దకు తీసుకు వెళ్ళారట మా తాతయ్య, అమ్మమ్మలు. ఎవరో తన ఒంటిపై కప్పిన శాలువాను బాబా గారు పొత్తిలిగా చేసి పసిగుడ్డుగా ఉన్న మా అమ్మను ఎత్తుకొన్నారట. సపోటా పండును వలిచి తొనలు నోటిలో పెడితే మా అమ్మ చప్పరించిందట. “ఏంపేరు పెట్టమంటారు బాబా” అని మా తాతగారు అడగ్గా ” అమ్మాజి అని పెట్టరా” అన్నారట. కప్పిన శాలువాను తిరిగి ఇచ్చేయబోతే పట్టుకొనిపొండి అని బాబాగారు సైగ చేసారట. ఆ తరువాత 1948 లో కొత్తలంక బాబాగారు స్వర్గస్తులైనారు. కొత్తలంకలో వారి సమాధి వద్ద దర్గా నిర్మించారు.

అలా మా అమ్మ పేరు అమ్మాజి. మా అమ్మకు తోబుట్టువులు లేరు. మా అమ్మ జీవితాంతం ఒక వైపు హిందువుగా అన్ని పూజలు, పండగలు, వ్రతాలూ ఆచరిస్తూనే, బాబాగారిని కూడా ఎంతో భక్తితో పూజించేది. అందరి

దేవుడిపటాల సరసనా కొత్తలంక బాబాగారి ఫొటో కూడా ఉండేది. మేం ఆరుగురుం సంతానం. మా అన్నయ్యలు ముగ్గురికీ హిందూ పేర్లు పెట్టారు. నాకు మాత్రం మా అమ్మ పట్టు పట్టి కొత్తలంక బాబా గారి పేరు పెట్టించింది. నా పూర్తి పేరు బొల్లోజు అహ్మదలీబాబా. మా అందరికీ పుట్టువెంట్రుకలు కొత్తలంక దర్గావద్దే తీయించారు.

నాకు బాగా చిన్నప్పుడు కొత్తలంక వెళ్లాలంటే యానాంలో పడవకట్టించుకొని ముమ్మిడివరం రేవులో దిగి, అక్కడనుంచి సుమారు 4 కిలోమీటర్లు కాలవగట్టుపై నడుచుకొంటూ వెళ్ళేవాళ్ళం.

***

బాబాగారు ఇచ్చిన శాలువాని ఒక చెక్క పెట్టెలో వెండిపళ్ళెంలో ఉంచి పూజించేది మా అమ్మ. మాకెవరికైనా జ్వరాలొచ్చినా, చదువులకనో, పనులమీదో పొరుగూర్లు వెళుతున్నప్పుడూ బాబాగారి శాలువాని తీసి మా తలపై ఉంచి అంతా మంచి జరగాలని ప్రార్ధించేది.

ఏడాదికి రెండు మూడు సార్లు రోజంతా ఉపవాసం ఉండి, ఆ శాలువాను బయటకు తీసి, దాని ఎదురుగా కొవ్వత్తులు, అగరొత్తులు వెలిగించి, సెంటు, గంధం పూసి "కొత్తలంక బాబా నిను కోరి భజింతును, నిను చేరి సేవింతును" అనే పాటను పాడుకొంటూ పూజచేసుకొనేది మా అమ్మ. అలాగని మా అమ్మ బేల కాదు. మాహె, కారైకాల్ లాంటి సుదూరప్రాంతాలకు బదిలీలకారణంగా మా నాన్నగారు దాదాపు పన్నెండేళ్ళ పాటు ఇంటికి దూరంగా ఉన్నప్పుడు, బంధువుల సాయం అర్ధించకుండా ఆరుగురుసంతానం ఉన్న కుటుంబాన్ని ఒంటిచేత్తో నడిపించింది. పాలు అమ్మి, కోళ్ళను పెంచి కోడిగుడ్లు అమ్మి, పెరట్లో కూరగాయలు పెంచి సంసారం నడిపి ఆర్ధిక ఇబ్బందులు తప్పించేది. ఆ లోపలిధైర్యమేదో బాబాగారి నుంచి పొందిందనుకొంటాను.

***

మా నాన్నగారి సంవత్సరీకాలు అయిపోయాకా "కొత్తలంక వెళ్ళాలని ఉంది నువ్వు తీసుకెళ్తావా" అని ఒకటి రెండు సార్లు అడిగింది నన్ను. అప్పటికి మా అమ్మ వయసు డబ్బై సంవత్సరాలు. అప్పట్లో నేను ఏలేశ్వరంలో ఉద్యోగం చేస్తూ ఉండేవాడిని. పరీక్షల హడావిడి తగ్గాక వస్తానే అని చెప్పాను. ఆ తరువాత ఒక రోజు ఇంటికి వెళ్ళినప్పుడు మా అమ్మ గుండుతో ఉండటం చూసి ఆశ్చర్యపడి,

ఎప్పుడు వెళ్లావే దర్గాకు అని అడిగితే, “ఏమోరా నేను ఇక వెళ్లగలనో లేదో అని- దర్గా ఉన్నదిక్కుకు తిరిగి జుత్తు బాబాగారికి అర్పించేసుకొన్నాను” అన్నది. ఆ సంఘటన జరిగిన కొద్దిరోజులకే మా అమ్మ కూడా గతించిపోయింది. ఇది జరిగి పదిహేనేళ్లయినా నా జీవితంలో మిగుల్చుకొన్న పెద్ద వెలితి అది ఏనాటికీ.

నేను పదో తరగతి నుంచి కొత్తలంక దర్గాకు సొంతంగా వెళ్లటం మొదలు పెట్టాను. పడవపై యానాం గోదావరి దాటి, ఎదుర్లంకలో బ్రాంచ్ సైకిల్ అద్దెకు తీసుకొని మురమళ్ళవరకూ తొక్కుకుంటూ వెళ్ళి అక్కడ దాన్ని ఇచ్చేసి నడుచుకొంటూ కొత్తలంక వెళ్ళేవాడిని అప్పట్లో.

నేడు మా ఇంట్లో అందరి దేవుళ్లపటాలతో పాటు కొత్తలంక బాబాగారి పటంకూడా ఉంటుంది. నేటికీ ఏటా రెండు మూడుసార్లు కొత్తలంక దర్గాను దర్శించుకొంటాను సకుటుంబంగా. రకరకాల చిక్కుముళ్ళలో చిక్కుకున్నప్పుడు, పెద్దపనులు ఏమైనా తలపెట్టినపుడు దర్గావద్దకు వెళ్ళి ప్రార్ధించుకొని రెండుమూడుగంటలు కూర్చొని వస్తూంటాం. మా పిల్లలిద్దరి పుట్టువెంట్రుకలు కొత్తలంక బాబాగారి దర్గా వద్ద తీయించాము. రెండో సారి కేశాలు తిరుపతిలో ఇచ్చాం.

నేను డిగ్రీ చదివేటపుడు ఏ కల్మషమూ లేని ఒక మిత్రుడు “ఒరేయ్ మీరు కొత్తలంక బాబాగారిని ఇంతగా ఆరాధిస్తారు. మా తాతగారిది కోనసీమే. ఆయన బాబాగారి సమకాలీనుడు. ఎప్పుడైనా బాబాగారు మా ఇంటి అరుగుమీద కూర్చుంటే వెళ్ళిపో ఇక్కడనుంచి అని విసుక్కొనేవారట ఆయన. ఒక వ్యక్తిని కొందరు దైవంలా పూజించటం, మరికొందరు తృణీకరించటం ఎందుకు జరుగుతుందీ?” అని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు సరైన సమాధానం నావద్ద అప్పుడూ లేదు ఇప్పుడూ లేదు.

చుట్టూ ఉన్న విశాలమైన గోదావరి కారణంగా కోనసీమ ప్రధానస్రవంతి చరిత్రకు కొంచెం ఎడంగానే ఉంది. అలాగని చరిత్రలేని సీమకాదు. అశోకుని పుత్రిక సంఘమిత్ర నిర్మింపచేసిన ఆదుర్రు బౌద్ధ క్షేత్రం ఘనమైన గతకీర్తికి

చిహ్నం. షాజహాను ఆస్థానపండితుడైన జగన్నాధపండితరాయలు ఇక్కడివాడే. ఇతను షాజహాను కూతురు లవంగికను పెండ్లాడాడు అని ఒక కథ ప్రచారంలో ఉంది. ఎన్నోశతాబ్దాల క్రితం గోదావరిపై పడవలలో పెద్దమొత్తంలో ముస్లిం వ్యక్తులు వచ్చి ఇక్కడి ప్రజలలో కలిసిపోయి జీవించసాగారు అని చెపుతారు. లాస్ట్ బ్రాహ్మిన్ పుస్తకంలో ప్రధాన పాత్ర తన ముస్లిమ్ మిత్రుడిని సమాదరణతో చూస్తుంది. దళిత యోగిపుంగవుడైన ముమ్మిడివరం బాలయోగీశ్వరుని, కొత్తలంకబాబాగారిని పూజించినట్లుగానే కులమతాలకు అతీతంగా ఆనాటి కోనసీమ వాసులు ఆరాధించారు.

నా మిత్రుడు అడిగిన ప్రశ్నకు ఒక్కటి మాత్రం చెప్పగలను. పశుపక్ష్యాదుల్ని సమాదరించటం, మనుషుల బాధల్ని తొలగించటం లాంటి విషయాలలో కొత్తలంక బాబా గారు చూపిన మహిమలను ఈ ప్రాంత ప్రజలు కథలు కథలుగా చెప్పుకొంటారు.

ఈ సృష్టిలోని జీవరాశి అంతా ఒకటేనని, సాటిమనిషి పట్ల కరుణ కలిగి ఉండాలి అనే మౌలిక జీవన సూత్రాలను కొత్తలంక బాబాగారు ఈ ప్రాంతంలో సంచరిస్తూ అనుచరిస్తూ, వెళ్ళిపోతూ మనకు ఇచ్చిన దైవసందేశం అనుకొంటాను.

15 Jun 2020

ఆవంత్స సోమసుందర్
(1924 – 2016)



ఎనిమిది దశాబ్దాల పాటు నిరంతరంగా సాగిన సోమసుందర్ గారి సాహిత్య ప్రస్థానంపై సమగ్ర విశ్లేషణ. తెలుగు సాహిత్యంలో ఆయన ఒక ధ్రువతార

సారస్వత మేరువు శ్రీ ఆవంత్స సోమసుందర్

ఆరున్నర దశాబ్దాలుగా సాహితీ వ్యాసంగం చేస్తున్నశ్రీ సోమసుందర్ గారు ని త్యయవ్వనుడు, నిత్యోత్సాహి. తెలుగు సాహిత్యక్షేత్రంలో కురువృద్ధుడు. వయ సు 84 వసంతాలు దాటినప్పటికీ ఇప్పటికీ కవిత్వాన్ని తన ఉఛ్వాస నిశ్వాసాలు గా వెలువరిస్తున్న గొప్ప కవి, విమర్శకుడు శ్రీ సోమసుందర్ గారు.

శ్రీ సోమసుందర్ గారు కవిగా, కధకుడిగా, నవలా రచయితగా, నాటక కర్తగా , అనువాదకుడిగా భిన్న రూపాలతోగత 66 సంత్సరాలుగా సాహితీ సేవ చే యుచున్నారు. సాహితీక్షేత్రంలో వీరు సహస్రబాహువులతో ప్రకాశించే కార్తవీ ర్యార్జునుని గా అగుపిస్తారు.

జననం - విద్యాభ్యాసం

శ్రీ సోమసుందర్ గారు తూర్పుగోదారి జిల్లా అన్నవరం సమీపంలో ఉన్న శం ఖవరం అనే గ్రామంలో శ్రీ కాళూరి సూర్యప్రకాశరావు, శ్రీమతి వెంకాయమ్మల కు 18-11-

1924న అష్టమ సంతానంగా జన్మించారు. తన పినతల్లిగారైన శ్రీమతి ఆవం త్స వెంకాయమ్మగారికి సంతానం లేకపోవటం వలన చిన్నతనంలోనే శ్రీ సో మసుందర్ గారు వారింటికి దత్తుకు వెళ్లారు. ఆవిధంగా కాళ్ళూరి అనే ఇంటి పేరు ఆవంత్సగా మారింది.

తనను దత్తత తీసుకున్న వారికి మెండైన సాహిత్యాభిలాష కలిగిఉండటంవల్ల, చిన్నతనం నుంచే సంస్కృత కావ్యాలు, శతకాలు, అమరకోశం వంటివి క్షుణ్ణంగా అధ్యయనం చేసే అవకాశం వీరికి కలిగింది. కానీ విధి వశాత్తు వీరి దత్తత తల్లితండ్రులు వీరికి పదేళ్ళ వయసుండ గానే పరమపదించారు. అయినప్పటికీ వీరి చిన్నారి మనసుపై ఆ పుణ్య దంపతులు వేసిన సాహిత్య ముద్ర మాత్రం అలానే నిలిచిపోయింది. వీరి ప్రాధమిక విద్యాభాసం అంతా పిఠాపురం లోనే జరిగింది.

1943 లో కాకినాడ పి.ఆర్.కళాశాలలో ఉన్నత విద్య నభ్యసించారు.

దేశ భక్తి

ఆ కాలం లో స్వాతంత్ర్యం కోసం జరిపే పోరాటానికి ఆ బాలగోపాలమూ ఉత్తేజితమై సర్వం త్యజించి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటాలు జరిపేవారు. శ్రీ సోమసుందర్ గారు కూడా అప్పుడు జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం లో చురుగ్గా పాల్గొన్నారు.

1942 లో విద్యార్థులను కూడదీసి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మెచేసారు. వీరి చర్యలకు ఆగ్రహించిన బ్రిటిష్ ప్రభుత్వం వీరిని లాకప్పులో పెట్టి, రోజూ స్టేషనుకు వచ్చి సంతకం చేయాలన్న షరతుపై విడుదల చేసింది.

శ్రీ సోమసుందర్ గారు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నప్పుడు పోలీసు దెబ్బలకు తీవ్రంగా గాయాలపాలయ్యారు. అప్పుడు వ్రాసిన వీరి మొదటి గీతం లో ఎంతటి గొప్ప దేశ భక్తి ఉందో గమనించండి.

రండి రండి ఉక్కుముక్కు కాకుల్లారా
రండర్రా గద్దల్లారా రండి రండి
సమరంలో క్షతగాత్రుడనై పడిపోయిన
నా శరీరాన్ని తినివేయండి ....

ఇక్కడ తన శరీరాన్ని కాకుల్ని గద్దలనూ తినివేయమంటున్నారేమిటా అనుకో

వచ్చు కానీ అది అనన్యమైన దేశభక్తిగా గ్రహించాలి, ఎందుకంటే తను చనిపో యిన తరువాత తన శరీరం కూడా బ్రిటిష్ వారికి దక్కకూడదనే తీవ్ర స్వాతం త్ర్య కాంక్ష. (ఇది వారు స్వయంగా చెప్పిన విశ్లేషణ).

వీరు స్వాతంత్ర్య పోరాటంలో విద్యార్థి నాయకుడిగా, కమ్యూనిష్టు పార్టీ సభ్యు నిగా తనదైన గొప్పపాత్రను పోషించారు. సామ్రాజ్య వాద శక్తులను ఎదుర్కో వాలని పిలుపునిచ్చారు.
1954 వరకూ వీరు కమ్యూనిష్టు పార్టీ కార్యక్రమాలలో క్రియాశీలక పాత్ర వ హించారు. తరువాత తరువాత రాజకీయాలు, సాహిత్య వ్యాసంగము ఏకకా లంలో నిర్వహించటం వలన , తనకెంతో ప్రీతిపాత్రమైన సాహిత్యానికి తగిన న్యాయం చేయలేకపోతున్నానని ఆత్మపరిశీలన చేసుకొని, క్రమక్రమంగా క్రి యాశీల రాజకీయాలకు దూరం అయ్యారు.

సాహితీ ప్రయాణం

వీరు ఫోర్తు ఫారం చదువుతున్న రోజుల్లో పద్య ప్రక్రియపై మోజు కలిగి, చంద స్సును క్షుణ్ణంగా అధ్యయనం చేసారు. ఈ ప్రక్రియలో ప్రతీ రోజూ అభ్యాసం కో రకు తాను వ్రాసిన వివిధ పద్యాలను మిత్రులకు, ఉపాధ్యాయులకు చూపేవా రు.
1943 వరకూ కూడా భావకవిత్వం వీరికి తారసపడలేదు. భావకవిత్వాన్ని చది విన తరువాత వీరు తనదైన వచనా శైలిని అలవరచుకొన్నారు. వీరు కమ్యూని ష్టు కార్యకర్తగా పనిచేసారు కనుక ఆ భావజాలం వీరి కవిత్వంలో అంతర్లీనం గా జాలువారుతుంది. వీరి కవిత్వానికి మానవుడే ప్రాతిపదిక, సమాజమే నేప థ్యం..

వజ్రాయుధం నుండి ఆమ్రపర్ణి వరకూ సుమారు ఆరున్నర దశాబ్దాల పాటు శ్రీ సోమసుందర్ చేసిన కవితాయానంలో సమాజ సంకుల సమరమే అన్ని కో ణాల్లోనూ ప్రతిబింబిస్తుంది. ఈ కవి మానవుని విస్మరించి, ఆకాశంలో విహ రించిన సందర్భాలు కనపడవు.

వీరు 1969-
73 ల మధ్య కాకినాడకు మకాం మార్చి ' కళా కేళి " అనే సాహిత్య పత్రికను న
డిపారు.
(వీరు పిఠాపురంలో నివసిస్తున్న ఇంటి పేరు కూడా "కళాకేళి నికేతన్""") ఈ ప్రక్రియలో వీరు కొంత ఆర్ధికంగా నష్టపోయి, కొంత భూమిని కూడా అమ్ముకోవలసి వచ్చింది. ఈ కాలం మినహా మిగిలిన జీవితకాలమంతటిలో, వీరు ప్రతిఏటా ఒకటో రెండో పుస్తకాలు చొప్పున రాస్తూనే ఉన్నారు.

1975 లో శ్రీ దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారికి కళా ప్రపూర్ణ అవార్డును పొందినపుడు, వారి అభిమానులు కాకినాడలో సన్మానం జరిపారు. దానికి విచ్చేసిన దేవులపల్లి, వీరికి ప్రత్యేకంగా కబురు పెట్టించి కాకినాడ రప్పించుకొన్నారు. ఆ రోజు జరిగిన సభకు శ్రీ సోమసుందర్ అధ్యక్ష్యత వహించారు. ఆ సభలో దేవులపల్లి ఒక చీటిపై " మీరు నా కవిత్వంపై విమర్శనాత్మక పుస్తకం వ్రాయాలి" అని కోరారు. దానిని పైకి మైకులో చదవమని దేవులపల్లి కోరగా వీరు మైకు తీసుకొని "మీ సాహిత్యం పై నేను పుస్తకం వ్రాయటం నాకు సాద్యమా?
"అని అడిగారు. దానికి దేవులపల్లి మరలా మరో చీటిపై " మీరు వ్రాయగలరు, మీకా సమర్ధత ఉంది వ్రాయండి ఇది నా ఆజ్ఞ అనుకోండి" అని వ్రాసి ఇచ్చి, దాన్ని కూడా చదవమని సైగ చేసి చెప్పారట. ఆవిధంగా ఆవిర్భవించిన గ్రంధమే "క్రిష్ణశాస్త్రి కవితాత్మ".

తెలుగు విమర్శనా సాహిత్యంలో ఇంతటి ఉత్తమ విమర్శ నభూతో నభవిష్యత్ అన్న రీతిలో శ్రీ దేవులపల్లి క్రిష్ణశాస్త్రి గారి కవితాత్మను పట్టుకొన్న గొప్ప పుస్తకమిది. కృష్ణ శాస్త్రి గారి పై వ్రాసిన పుస్తకాలలో ఒకదానికి ప్రైజు ఇవ్వదలచి పోటీ పెడితే, పోటికి పంపించబడ్డ 15 పుస్తకాలలో శ్రీ సోమసుందర్ గారు వ్రాసిన "కృష్ణ శాస్త్రి కవితాత్మ" అనే ఈ పుస్తకం మొదటి బహుమతి గెలుచుకోవటం వీరి సునిశిత పరిశీలనా శక్తికీ, రచనా పటిమకు నిదర్శనం.

ఇంత సుదీర్ఘకాలంగా మీరు సాహిత్యాన్ని ఎలా సృష్టించగలుగుతున్నారని అడిగినప్పుడు వారు చిరునవ్వు నవ్వి " రాయలేకుండా ఉండలేక. ఏమీ రాయక

పోతే ఆరోజు దుర్దినంగా ఉంటుంది" అన్న వారి మాటలను బట్టి, వారు కవిత్వం వ్రాయటం ఒక ప్రకృతి సిద్ధమైన పనిగా పెట్టుకున్నారా అనిపిస్తుంది. ఒక పూవు వికసించటం లాగా, చెట్లు వసంతాన్ని ధరించటం లాగా.

శ్రీ సోమసుందర్ గారు జీవితమే కవిత్వం అని నమ్మి, జీవితాన్నే కవిత్వానికి అంకితం చేసిన వ్యక్తి, శతాధిక గ్రంధ కర్త. కొందరు కవులు తాము వ్రాసిన ఒకటి రెండు రచనలతో వచ్చిన కీర్తితో జీవితాన్ని వెళ్లదీస్తారు. కానీ శ్రీ సోమసుందర్ గారి రచనలు అసంఖ్యాకం. దేని ప్రతిభ దానిదే, దేని సౌరభం దానిదే. ్సామాన్య మానవుడిని కవిత్వంలో ఆవిష్కరించటానికై వీరు కవిత్వాన్ని నిత్యాగ్నిహోత్రంగా పాటించారు.

ఆరున్నర దశాబ్దాల వీరి సాహితీయాత్రలో అనేక ఉద్యమాలు, పోరాటాలు, ప్రళయాలు, కరువులు, ఎన్నో కనిపిస్తాయి. జాతి చైతన్యాన్ని కవితా చైతన్యంగా సమర్ధ వంతంగా తర్జుమా చేసిన అభ్యుదయ కవిగా శ్రీ సోమసుందర్ గారికి తెలుగు సాహిత్యంలో సాటి మరొకరు లేరంటే అతిశయోక్తి కాదు.

వీరు సాహిత్యజీవితంలో అందుకోవలసిన శిఖరాలు అందుకోలేదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చును. అకాడమీ ప్రైజులు, అవార్డులు వీరి దరి చేరకపోవటానికి కారణం శ్రీ సోమసుందర్ గారు ఎన్నడూ రాజకీయనాయకుల దగ్గర, అధికార పీఠాల్లో ఉన్నవారిదగ్గర తలవంచి నిలబడలేదు.

వ్యక్తిత్వం

శ్రీ సోమసుందర్ అభ్యుదయ కవి. తెలంగాణా ఉద్యమాన్ని కోస్తా ప్రాంతం నుండి సమర్ధించి కవిత్వం వెలువరించిన మహామనీషి శ్రీ సోమసుందర్ గారు. అప్పట్లో " ఖబడ్దార్ హే నిజాం పాదుషా .... ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురని " గర్జించిన సాహసి.

శ్రీ సోమసుందర్ గారి వ్యక్తిత్వంలో మరొక విశిష్టమైన అంశం ఏమిటంటే వీరు చాచే నిష్కల్మష స్నేహ హస్తం. వీరి సమకాలీనులలో ఎవరికైనా ఏదైనా అ

వార్డు వచ్చినట్లయితే వారిని అభినందిస్తూ వ్యాసమో, పుస్తకమో వ్రాసి ఆ అవార్డేదో తనకే వచ్చినంత ఆనందించటం వీరి కల్మషమెరుగని మనస్సుకు అద్దం పడుతుంది.

వీరు ఎందరో కవులను ప్రోత్సహించారు. అలనాటి ఓలేటి శశాంక మొదలు ఈ నాటి అరుణ్ బవేరా వరకూ.

ఇస్మాయిల్, మిరియాలరామకృష్ణ, మల్లిక్, చందుసుబ్బారావు, పెనుగొండ లక్ష్మీనారాయణ వంటి చాలా మందిని వీరు వెన్ను తట్టి ముందుకు నడిపించారు .

వీరికి రెండు పార్శ్వాలు. ఒకటి రచనా వ్యాసంగం. రెండవది తన రచనల్లో దేన్నైతే ప్రవచించారో దానికోసం నిరంతర పోరాటం. దానిలో భాగంగా శ్రీ సోమసుందర్ గారు ప్రతీ ఏటా ఐదుగురు కవులకు ఆరువేల రూపాయిల నగదు బహుమతిని, తాను నెలకొల్పిన సోమసుందర్ లిటరరీ ట్రస్టు ద్వారా అందచేస్తున్నారు.

2006 లో వీరి ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి ఆధునిక మహిళా సాహిత్య సదస్సు జరిపారు. దానికి రాష్ట్రం నలుమూలలనుంచీ అనేక మంది కవయిత్రులు విచ్చేసి పాల్గొన్నారు.

పాత కొత్త తరాల వారధి

1953 వరదలకు చలించిపోయిన సోమ సుందర్ గారు వ్రాసిన గోదావరి జలప్రళయం అనే కావ్యంలోని కొన్ని కరుణ రస ప్రధాన పద్య పాదాల ను చూస్తే వీరి కవితా శక్తిని గుర్తించవచ్చును.

ఏమమ్మా, ప్రళయమువలె పొంగి ఓ గౌతమి
ఇకనైనా దయను చూపి శాంతించవదేమి?
ప్రసవించిన పులివై నీ కన్న బిడ్డలను మమ్ముల

కోరలెత్తి ఖ్రింగుట ఇది ఏమన్యాయమే తల్లీ...

2004 లో వీరు రచించిన అక్షర నాదం అనే కవితా సంపుటిలోని కొన్ని పద చిత్రాల ను గమనించినట్లయితే వీరి ప్రతిభ, వీరేవిధంగా రెండు తరాలకు వారధిగా ఉన్నారనే విషయం సుస్పష్టమౌతుంది.

గ్లోబలైజేషన్ తో ఈ భూమి రజస్వలై
నవవరాన్వేషణలో మిటకరిస్తుంది......
హ్యూమన్ జెనిటిక్ ఇంజనీరింగ్ తో
అవతరించిన క్లోనింగ్ కోడె దూడ
' అంబా " అని అరవడం
గ్రాంధికమని నిషేదిస్తుంది. *(నేటిని ఏటికి విడిచి అనే కవితనుంచి)*

నేడు నా ముని వాకిట
పూచిన గులాబి పరిమళం నిండా
బాంబుల విషధూమం నింపింది పడమటి గాలి (సమరం కాదిది మరణం అనే కవితనుంచి)

ఇన్ని జంత్ర స్వరాల నాదాలలోంచి
ఎన్ని వెన్నెల మైదానాలు - ఎలా తెరుచుకున్నాయి?
దూరంలో మసకబారిన కొండలు
బూడిద బుంగలు (బితోవెన్ సంగీతంపై వ్రాసిన మూన్ లైట్ సొనాటా అనే కవిత నుంచి)

వంకవంకల వయ్యారాలతో
తల్లిలా పవళించిన ఏటి ఒడిలో
నిటారుగా నిలచిన కొబ్బరి తోట....
రేగిన జుత్తుతో ఊరికే మారాంచేసే
పిల్లవాడి వెర్రి ఊగిసలాట...... *(ఏటి వడిలో కొబ్బరి తోట అనే కవిత నుంచి)*

వీరి కవిత్వంలో సరళత, అదే సమయంలో అర్ధ గాంభీర్యతా , ఉదత్తమైన లో తైన భావాలు, మానవత్వపు పరిమళాలు పుష్కలంగా పొర్లాడుతూంటాయి.

బానిసల దేశం, గోదావరి ప్రళయం, రక్తాక్షి, హిరోషిమా, రక్షరేఖ, సీకింగ్ మై బ్రోకెన్ వింగ్, వంటి వీరి రచనలలో ఆయా సంఘటనలకు, సందర్భాలకు ఒక కవి తన హృదయమంతటితోనూ స్పందించిన విధానాన్ని దర్శించవచ్చు.

అంధురాలికోసం బిథోవెన్ సృష్టించిన వెన్నెల, సౌరాష్ట్రంలో జరిగిన నరమేధం, ఎన్నటికీ పూర్తికాని సోమశిల ప్రోజెక్టూ, ఖజురహో శిల్ప విన్యాసం, సోమాలియాలో అన్నార్తులూ, సైగల్ గానమాధుర్యం ఇవీ వీరి కవితా వస్తువులు. వీటిలో ఏ ఒక్కటీ కూడా ఈ మట్టిని , గాలిని విడిచి సాము చెయ్యవు.

అవార్డులు

వీరు 1979 లో సోవియట్ లాండ్ నెహ్రూబహుమతి పొందారు. రాజాలక్ష్మి ఫౌండేషను అవార్డు, పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ పొందారు.
2008 సంవత్సరానికి గానూ ఎన్టీఆర్ స్మారక జాతీయ పురస్కారం వీరిని వరించి వన్నెకెక్కింది.

శ్రీ ఆవంత్స సోమసుందర్ గారికి ఇంతవరకూ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రాకపోవటం ఆశ్చర్యకరం. ప్రభుత్వ పరంగా వీరికి జరిగిన అన్యాయం పెరుమాళ్ల కెరుక. కవిత్వం సోమసుందర్ కెరుక.

వీరి రచనల పట్టిక

వీరింతవరకూ 77 పుస్తకాలు రచించారు. చాలా పుస్తకాలు అనేక పునర్ముద్రణలు పొందాయి.
వీరు ప్రస్తుతం తన స్వీయచరిత్ర రెండవ భాగాన్ని వ్రాస్తున్నారు.
ఈమధ్య ప్రచురించిన వీరి పుస్తకం పేరు " దేశి సారస్వతము-

సమాజ వాస్తవికత.

" దేశి సాహిత్యంలో ఉండే సామాజిక స్పృహపై వ్రాసిన విశ్లేషణాత్మక గ్రంధం.

వజ్రాయుధం.

: నిజాం వ్యతిరేక పోరాటానికి మద్దతుగా వ్రాసిన కవితాసంకలనం.

1946 అక్టోబరు 26న దొడ్డి కొమరయ్య మరణంపై వ్రాసిన ఖబడ్ధార్ అనే కవితతో ఇది మొదలవు తుంది. ఈ పుస్తకాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేదించింది. 1956 లో శ్రీసంజీవరెడ్డి ప్రభుత్వం నిషేదాన్ని ఎత్తివేసింది. ఇది ఇప్పటికి 5 ముద్రణలు పొందింది. అనంతపురం యూనివర్శిటీ వారు దీనిని టెక్ట్స్ బుక్ గా పెట్టుకొన్నారు.

కాహళి : ఇవి ఆంధ్రరాష్ట్ర ఉద్యమ సమయంలో వ్రాసిన కవితలు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఉద్యమిస్తున్న సమయంలో వారానికి ఒకటి చొప్పున "జ్వాల " అనే వార పత్రికలో ప్రచురింపబడ్డాయి.

1953 లో పుస్తక రూపంగా వచ్చాయి.

గోదావరి జల ప్రళయం: 1953 లో వచ్చిన గోదావరి వరదలు వచ్చిన సందర్భంలో, శ్రీ సోమసుందర్ గారు రాజమండ్రి, అమలాపురం, కపిలేశ్వరం వంటి ప్రాంతాలను సందర్శించి అప్పటి గోదావరి భీభత్సాన్ని కరుణరసార్ధ్రంగా కవిత్వీకరించారు.

రక్తాక్షి : ఫ్యూడల్ చట్రంలో సమాజం ఎదుర్కొన్న నిరంకుశత్వాలు, అమానుషత్వాలను కధా వస్తువుగా తీసుకొని చేసిన చందోబద్ధ కావ్యం. ఈ కావ్య ప్రత్యేకత ఏమిటంటే ఆధునిక కాలంలో విశ్మరింపబడ్డ ప్రాచీన చందస్సును తీసుకొని రచించటం. ఉదా: శ్రీ వృత్తం, వనితా వృత్తం వంటివి. రక్తాక్షి కావ్యంలో రెండు భాగాలు ఉంటాయి. 1. సచితానందం 2. రక్తాక్షి

మేఘరంజని: 1954 లో వెలువడ్డ కధాకావ్యం. దీర్ఘ వచన పద్యం. మొత్తం ఆరు చాప్టర్లు ఉంటాయి.

సోమరసంసుందరకాండ: ఇది తాత్విక చింతనామయ కావ్యం. ఏమిటీ లోకం, ఏమిటీ భాదలు వంటి ప్రశ్నలు, వాటికి కవి కనుగొన్న సమాధానాలతో ఈ కావ్యం రచింపబడింది.

మిణుగురులు: అద్భుతమైన పదచిత్రాలతో కూడిన ఆధునిక కవితాసంకలనం

.

అనలకిరీటం: 1975 లో వెలువడిన కవితా సంపుటి. Progressive and Revolutionary భావాల Concealed
expressions తో కూడిన కవితల పుస్తకం.
(శ్రీ సోమసుందర్ గారి మాటలలో)

వెన్నెలలో కోనసీమ : 1977 లో అమలాపురంలో ఆవిష్కరింపబడిన గీత సంపుటి. సంగీతానికి అనుకూలంగా ఉండే గీతాల రచన. ఈ గీతాలలో చాలావాటిని రేడియోలలో పాటలుగా పాడారు.

రాలిన ముత్యాలు: మిని కవితల ఉద్యమానికి ముందే లఘుకవితల పేరిట వ్రాసినటువంటి చిన్ని చిన్ని కవితలు.

మాఊరు మారింది: శ్రీసోమసుందర్ గారు ఎమర్జన్సీని బలపరిచారు. ఈ విషయం శ్రీ నార్ల వెంకటేశ్వరరావు గారిని కలవరపరచి, వీరితో భేటీ అయి అయిదురోజులపాటు చర్చించగా, వీరు ఎమర్జన్సీ కి వ్యతిరేకంగా తన భావాలను మార్చుకొని, ఒక స్టేట్ మెంట్ ఇవ్వటం జరిగింది. ఆ భావ పరిణామక్రమంలో వ్రాసిన 7 భాగాల కావ్యమే మావూరు మారింది. దీనిలో ప్రణాళికల ద్వారా గ్రామాలే విధంగా మారాయి అని వివరిస్తూ వ్రాసినటువంటి కావ్యం.

ఆగతనికి శుభారంభం : వచన కవితలు

బృహత్కావ్యాలు (నాలుగు సుదీర్ఘ కవితలు): నాలుగు దీర్ఘకావ్యాలు. సుమారు 300 పేజీల పుస్తకం. ఈ పుస్తకంలో అక్షయతరంగిణి, కాలం వీలునామా, ముక్తఛ్ఛాయ, అరచే లోయలు అనే నాలుగు దీర్ఘ కవితలు ఉంటాయి. దీనిలో ముక్తఛ్ఛాయ లో మననుంచి మన నీడ విడిపోవటం, అసలు మననీడ అంటే ఏమిటి అనే విషయాలపై తాత్విక, భౌతిక చింతనలతో కూడిన భావాలుంటాయి.

ఒక్క కొండలో వేయి శిల్పాలు: 120 పేజీల దీర్ఘ కవితల సంకలనం

ఆంగ్ల సీమలో ఆమని వీణలు (యాత్రా సాహిత్యం): 1983 లో వీరు ఆంగ్లసీమలో చేసిన ప్రయాణ విశేషాలతో కూడిన ట్రావెలాగ్.

గంధ మాదనం: రచనా కాలం 1995/96. హనుమంతుడు సీతను అన్వేషించటానికి వెళ్లినపుడు మధ్యలో మకాంచేసిన పర్వతం పేరు గంధమాదనం. జీవితం యొక్క అన్వేషణకు గ్రంధాలయం ప్రాతిపదిక అనే భావనతో వ్రాసిన దీ

ర్ఘకావ్యం.

చేతావని: చేతావని అంటే వార్నింగ్ (1994). బాబ్రిమసీదు కూల్చినపుడు వ్రాసిన దీర్ఘ కావ్యం. 50 పేజీలు.

దోనా పాలా: ఇది ఒక ప్రదేశం పేరు. గోవా ప్రయాణంలో వ్రాసిన కవితలు.

రక్షరేఖ: బాబ్రి మసీదు కూలగొట్టిన తరువాత బొంబాయిలో (ముంబాయి) మతకలహాలు చెలరేగాయి. ఇలాంటి మతకలహాలు పాకిస్తాను విడిపోయినప్పుడు కూడా జరగలేదు. వాటికి స్పందిస్తూ వ్రాసినటువంటి దీర్ఘ కవితా సంపుటి.

హృదయంలో హిరోషిమా: 1997 లో హీరోషిమా ఉదంతాన్ని స్మరించుకొంటూ వ్రాసిన కవితలు.

ధూప ఛ్చాయ: నక్సలైట్లు రైలుపెట్టిని కాల్చివేస్తే దాన్ని నేపధ్యంగా తీసుకొని వ్రాసిన దీర్ఘకావ్యం.

జీవన లిపి : 120 పేజీల సంపూర్ణ కావ్యం. మానవుడు విప్లవానికై జరిపేకృషి అనే అంశంపై వ్రాసిన దీర్ఘకావ్యం.

సీకింగ్ మై బ్రోకెన్ వింగ్ :దేశంలో అతివాద పార్టీలన్ని (left wing) విడిపోతున్నాయి. దాన్ని సింబలైజ్ చేస్తూ వ్రాసిన అన్వేషాత్మకమైన దీర్ఘ కవిత.

సోమసుందర్ కథలు : 1984 లో ప్రచురింపబడిన శ్రీ సోమసుందర్ గారి బానిసల దేశం వగైరా కథలు.

బుద్ధదేవ్ బోస్: శ్రీ బుద్ధదేవ్ బోస్ అనే ఆయన ప్రముఖ బెంగాలీ కవి. వీరి మోనోగ్రాఫ్ మరియు కొన్ని కవితల యొక్క అనువాదాలతో కూడిన రచన.

లియోనార్డో డావిన్సీ: డావిన్సీజీవిత చరిత్ర. ఆయనను ఒక సంపూర్ణ మానవుని గా దర్శింపచేసే పుస్తకం.

హంసధ్వని: భారతీయ ఆధునిక సంగీతకారుల జీవితచిత్రణలు.
(బిస్మిల్ల, బడేముల్లా తదితరులు).

కాజీ నజ్రుల్ ఇస్లాం: శ్రీ ఖాజీ, బెంగాలీ విప్లవకవి. వీరి కవిత్వాన్ని, జీవితాన్ని ఈ పుస్తకంద్వారా తెలుగు పాఠకులకు పరిచయం చేసారు.

కాళిదాసు రామకధ: రచనా కాలం 1990 లు. రఘువంశంలో కాళిదాసు చెప్పిన రామకధకు, వాల్మీకి రామకధకు గల సునిశితమైన వ్యత్యాసాలను తెలుపుతూ వ్రాసిన విశ్లేషాత్మక పుస్తకం.

రుధిరజ్యోతిర్ధర్శనం: శ్రీరంగం నారాయణ బాబు కవిత్వం లోతు పాతులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి చూపించిన గొప్ప విమర్శనాత్మక గ్రంధం.

జాతికి జ్ఞాన నేత్రం: శ్రీకొడవటిగంటి కుటుంబరావు రచనలపై చేసిన విశ్లేష ణాత్మకమైన గ్రంధం.

కవిత్వం కాలాతీత కాంతిరేఖ: ఆధునిక కవిత్వానికి ఉండవలసిన లక్షణాలపై సూత్రీకరణ చేస్తూ వ్రాసిన విశ్లేషణాత్మకమైన 200 పేజీల గ్రంధం.

ఆధునిక కావ్య ప్రకాశిక: ఇతరుల పుస్తకాలకు వ్రాసిన పీఠికలలో కొన్నింటిని ఏ ర్చి కూర్చి చేసిన సంకలనం.

అమృత వర్షిణి: తిలక్ కవిత్వంపై వ్రాసిన విమర్శనాత్మక వ్యాసావళి.

సాహిత్యంలో సంశయ కల్లోలం: విరసం ఆవిర్భవించిన కొత్తలో విజయనగ రం నుంచి చిత్తూరుదాకా ప్రయాణించి సభలు జరిపి, ఆ సభల్లో పలువురు వె లిబుచ్చిన సందేహాలకు ఇచ్చిన సమాధానాల సంకలనం. ఆ ఆ ప్రదేశాలలో వా రి సందేహాలను చిన్న చిన్న స్లిప్పులపై తీసుకొని, వాటికి సమాధానాలను పత్రి కా ముఖంగా ఇచ్చారు. వాటన్నిటినీ క్రోడీకరించి ఈ పుస్తకంగా ప్రచురించారు

అక్షర సుమార్చన: తిక్కన, వేమన ఇత్యాదులపై వ్రాసిన వ్యాసావళి. శ్రీ వావిలా ల గోపాల కృష్ణయ్య గారికి అంకితమీయబడినది.

పురిపండా ఎత్తిన పులి పంజా: పురిపండా అప్పలస్వామి వారిపై వ్రాసిన వ్యాస సంపుటి.

నూరు శరత్తులు : 1990 లకి నూరేళ్ళు నిండిన (కృ.శా., విశ్వనాధ మొ.)వారి పై వ్రాసిన వ్రాసావళి.

ఆ తరం కవితా తరంగాలు: భావకవుల తరువాత వచ్చిన పఠాభి, పాలగుమ్మి పద్మరాజు, వంటి వారిపై వ్రాసిన వ్యాసావళి.

నారాయణ చక్రం: డా: సి. నారాయణ రెడ్డి కవిత్వంపై విశ్లేణాత్మకంగా వ్రాసిన గ్రంధం.

గోపుర దీపాలు : చలం పురూరవ పై వ్రాసిన పుస్తకం.

కృష్ణశాస్త్రి కవితాత్మ: కృష్ణశాస్త్రి కవిత్వంపై సమగ్ర విమర్శ.

గురజాడ గురుత్వాకర్షణ: గురజాడ పై వ్రాసిన పుస్తకం. పూర్రిచర్డ్ అనే మాట పై పరిశోధన.

శరచ్చంద్రిక : శ్రీ శ్రీ నుంచి కుందుర్తి వరకూ ఆధునిక కవులపై వ్రాసిన పరిశీల

నాత్మక వ్యాసావళి.

ఉర్దూసాహిత్యంలో ఉన్నత శిఖరాలు: కబీర్ నుంచి ఖైఫీ అహ్మద్ దాకా ఉండిన గొప్ప గొప్ప కవులను గురించి పరిచయంచేస్తూ వ్రాసిన పుస్తకం.

శేషేంద్ర జాలం: శేషేంద్ర కవిత్వంపై వ్రాసిన వ్యాసావళి.

అగ్నివీణ ఆలాపించిన అణుసంగీతం: అనిసెట్టి సుబ్బారావు కవిత్వం పై వ్రాసిన విశ్లేషణాత్మక పుస్తకం.

కవితా కల్పవల్లి: ఆధునిక కవిత్వం-విమర్శనాత్మక విశ్లేషణ.

ఆగామి శతాబ్ధానికి ఆహ్వానం: వ్యాసాలు.

చరమ దశాబ్ది-కవితా రసాబ్ధి: 90 లలో కవిత్వంపై వచ్చిన వ్యాసావళి.

అక్షర నాదం: 2004 కవితా సంపుటి.

ఆమ్రపర్ణి: కావ్యం

జీవన లిపి: సంపూర్ణ కావ్యం

చిన్మయ లహరి: స్వీయ కవితా సంపుటి.

మనస్సంగీతం: పాటల సంపుటి.

విషవలయం: నాటకం.

1980 లలో అనేక పరిషత్తులలో బహుమతులు సాధించిన గొప్ప నాటకం

లేఖలు: సినీనటుడు రమణారెడ్డికి శ్రీ సోమసుందర్ గారు వ్రాసిన లేఖలను నెల్లూరులోని వీరి అభిమానులు పుస్తకరూపంలోకి తీసుకొచ్చారు.

నగరం నుంచి గగనం దాకా మనిషి: వివిధ పత్రికలలో చుట్టుచూపు అనే పేరుతో వచ్చిన వ్యాసాలన్నింటిని సంగ్రహపరచి ప్రచురించిన పుస్తకం. సుమారు 250 పేజీలు.

మంది-మనిషి: వ్యాస సంపుటి .

శ్రీ సోమసుందర్ గారి వద్ద ప్రస్తుతం ఇంకా 10 పుస్తకాలవరకూ అముద్రితంగా ఉన్నాయి. త్వరలో వెలువరించాలన్న ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.

October 10, 2008

ఇస్మాయిల్

(1928 – 2003)



ఆధునిక తెలుగు కవిత్వంలో ఇస్మాయిల్ గారు సృష్టించిన కొత్త ఒరవడిపై చర్చ. వారి కవిత్వంలోని తాత్వికతను, ప్రకృతి పట్ల వారికున్న మక్కువను ఈ వ్యాసాలు వివరిస్తాయి.

1. ఇస్మాయిల్ కవిత్వం, కాసిన్ని జ్ఞాపకాలు, - బొల్లోజు బాబా OCTOBER 1, 2009

అప్పుడు నేను పి.జి. విద్యార్ధిని. కవిత్వం అంటే తిలక్, ఇస్మాయిల్, శిఖామణి, చలం అని అనుకొనే రోజులవి. అప్పటికి అచ్చయిన నా కొన్ని కవితలను ఇస్మాయిల్ గారికి చూపించాలని నా తాపత్రయం. మిత్రుని ద్వారా ఓ రోజు ఆయనకు పరిచయం చేయించుకొన్నాను. పసుపు పచ్చని దేహచ్ఛాయ, ఎత్తైన విగ్రహం, సన్నని స్వరం, రంగులు చిమ్మే సాదా దుస్తులతో ఆయనను చూడగానే కవిత్వంతో నిండిన గౌరవం కలిగింది. కుశలప్రశ్నలయ్యాకా నా కవితల గురించి ఆయనన్న మాటలు ఇప్పటికీ నాకు గుర్తే. "నీ కవిత్వంలో స్పార్క్ ఉంది. ఆవేశాన్ని పదాలలోకి ఒంపేప్పుడు తేలికైన పదాల్ని ఎంచుకోవాలి. భావాన్ని మరింత క్లుప్తంగా చెప్పగలగాలి" అన్నారు. ఇది జరిగి సుమారు పదిహేను సంవత్సరాలు అయ్యింది. ఇప్పటిదాకా వ్రాసిన నా కవితలను తరచి చూసుకొంటే క్లుప్తత, పదాల ఎంపిక విషయంలో ఆయన పరిశీలన ఎంతటి సూక్ష్మమో తెలుస్తూంటుంది.

చాలా కాలం కవిత్వానికి దూరంగా ఉండటం వలన, ఆయనను కలుసుకోవటం అదే మొదలు మరియు చివరు అయ్యింది నాకు. ఇదిగో ఇప్పటికి మరలా ఇలా........

ఇస్మాయిల్

ఇస్మాయిల్ గారు 26 మే, 1928 న జన్మించారు. వీరు కాకినాడ పి.ఆర్. కళాశాలలో ఫిలాసఫీ లెక్చరర్ గా, ప్రిన్సిపాల్ గా పని చేసారు. 25 నవంబర్, 2003 న ఆయన అనంత నిశ్శబ్దం లోకి జారిపోయారు.

కవిగా, విమర్శకునిగా ఇస్మాయిల్ గారు పోషించిన పాత్ర తెలుగు సాహితీవనంలో నిలువెత్తు పొగడచెట్లై పరిమళాలు చిందిస్తూనే ఉంటుంది. ఆయన రచించినవి పదిపుస్తకాలే కావొచ్చు, అన్నీ కలిపి ఓ మూడు, నాలుగొందల పేజీల సారస్వతమే అవ్వొచ్చు, కానీ వాటి ముద్ర మాత్రం తెలుగు సాహిత్యంపై ఏ నాటికీ చెరగనిది.

ఇస్మాయిల్ కవిత్వం

ఇస్మాయిల్ గారనగానే రెండు విషయాలు చాలామంది స్మరణకు వస్తాయి. మొదటిది "'చెట్టు నా ఆదర్శం" అన్న ఇస్మాయిల్, రెండవది ఆయన ఆంధ్రదేశానికి పరిచయం చేసిన హైకూ. ఇస్మాయిల్ కవిత్వ భాష విశిష్టమైనది. క్లిష్టపదాలు, పొడుగు వాక్యాలు ఉండవు. ఛందస్సులు, లయ శయ్యల వంటివి కనపడవు. అయినప్పటికి ఈయన కవిత్వం ఒక అనుభూతిని పదచిత్రాల ద్వారా పఠితకు ప్రసారం చేసి అతనూ అనుభూతి చెందేలా చేస్తుంది, అదీ ఎంతో నిశ్శబ్దం గా.

సౌందర్యారాధన, మానవత్వంపై విశ్వాసం, స్వేచ్ఛాశీలత, ప్రకృతి ఉపాసన ఆయన కవిత్వానికి కాన్వాసు. మన దైనందిక విషయాలను, చిన్న చిన్న అనుభవాల్నీ, అపుడపుడూ ప్రకృతి కరుణించే సుందర దృశ్యాలకు, కరుణ తాత్వికలను అద్ది కవిత్వంగా మలచి మనకందించారు. ఇస్మాయిల్ కవిత్వంలో ఇజాలు, వాదనల వంటి శృంఖలాలు కనిపించవు. కేవలం కవిత్వం మాత్రమే వినిపిస్తూంటుంది. జీవితోత్సవాన్ని ఎన్నికోణాల్లో ఆనందించవచ్చో అన్ని కోణాల్నీ ఆయన తన కవిత్వంలో ఆవిష్కరించారు. అందుకనే ఇస్మాయిల్ గారి పుస్తకాలను వరుసగా చదువుతున్నపుడు ఇతివృత్త సంబంధమైన మొనాటనీ కనిపించదు.

ఆయన కవిత్వంలో పదచిత్రాల సౌందర్యం పరిమళిస్తూంటుంది. పదచిత్రాల్ని ఎవరైనా కల్పన చేయగలరు. కానీ ఒక దృశ్యాన్ని నలుగురూ చూసే దృష్టితో కాక కొత్తగా దర్శించి దాన్ని పదచిత్రంగా మలచటం ఇస్మాయిల్ గారికే చెల్లింది. ఒక్కోసారి ఈయన "ఇలా ఎలా" చూడగలిగారబ్బా అని విస్మయంతో ఆశ్చర్యపడక తప్పదు. ఈ క్రింది ఉదాహరణలను చూస్తే అర్ధం అవుతుంది ఆయన విలక్షణ వీక్షణం.

> *ఎక్కడెక్కణ్ణించో ఎగిరి వచ్చిన కాకులు చింతచెట్లులో నల్లగా అస్తమిస్తాయి /*

ప్రణయక్రీడలో మన అంగాల పాచికల్ని మహోద్రేకంతో విసిరి నక్షత్రాల పావుల్ని రాత్రల్లా నడిపించాం గుర్తుందా! /

కిటికీలోంచి చూస్తే వెలుతురునిండిన బెజ్జాలతో పిల్లం గోవిలా ఊళవేసుకుంటూ దూసుకుపోతోంది రైలు /

తొలిసంజె నారింజని ఎవరు ఒలిచేరు, తెలిఎండ తొనలను ఎవరు పంచారు /

ఊగుతోంది వేయి పిర్రల సముద్రం /

మూగిన బంధుమిత్రులు మోసుకుపోయి అతణ్ణి విత్తనంలా పాతారు/

భూమి బుగ్గపై చల్లటి నవ్వు సొట్టలా బావి /

ఉదయాలు అనాది నుంచీ సూర్య శిశువును ఎన్నివిధాలుగా ఎగరేసి పట్టుకొన్నాయో/

నీడల విసనకర్రను విప్పి ఎండలో సేదదీరుస్తుంది చెట్టు ----- ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన కవితలనన్నీ టైప్ చెయ్యవలసి ఉంటుంది. ఎన్ని పదచిత్రాలు, ఎన్నెన్ని సునిశిత దృశ్యాలు.

బుద్ధిగా ప్రేమించుకోక
యుద్ధమెందుకు చేస్తారో
నాకర్థం కాదు.

పై వాక్యాల సారాంసమే ఇస్మాయిల్ కవిత్వమూ, జీవితమూను. జీవితానందాల్ని గానం చేసే కవికి, వానిని పాడుచేసే మనుష్యులను చూస్తే ఇలాకాక వేరెలా అనిపిస్తుందీ!

తనని బాధిస్తున్న ప్రపంచపు ముల్లుని
పీకి పారేసి
ఈ పిల్ల చకచక ఎటో నడిచిపోయింది (ఆత్మహత్య)

ఆత్మహత్యకు ఎంత అద్భుత నిర్వచనం. ఈ గుప్పెడు వాక్యాలలో, ఒక అమ్మాయి జీవితంలో ఓడి పోవటం, తద్వారా ఎదుర్కోవలసి వచ్చిన సామాజిక వివక్ష, నిత్యం ముల్లై బాధించిన ఈ ప్రపంచాన్ని ఇక ఏమాత్రమూ తప్పించుకోలేని దోషిగా నిలబెట్ట టమూ — ఎంతగొప్పగా ఇమిడి పోయాయి.

సెలయేరా సెలయేరా

గలగలమంటో నిత్యం
ఎలా పాడ గలుగుతున్నావు?
చూడు, నా బతుకునిండా రాళ్లు
పాడకుంటే ఎలా?

జీవితంలోని కష్టాలను కప్పిపుచ్చు కొని ఆనందంగా ఉండక తప్పదు అని ప్రవచించే ఈ కవితే ఇస్మాయిల్ గారి జీవితాదర్శం. ఆయనకు ఎన్ని ఆర్ధిక ఇబ్బందులున్నా చిరు నవ్వు ను, సంతృప్తిని వీడ లేదంటారు సన్నిహితులు. అందుకేనేమో ఓ కవితలో ఇలా అన్నారు.

నేను డబ్బు సంపాదించలేదని
మా ఆవిడ సణుగుతుంది.
డబ్బెందుకు?
కిటికీ లోంచి వాలి టేబుల్ పై పుస్తకాన్ని, పెన్నుని
ఇంకు స్టాండుని మంత్రించే సూర్యకిరణం ఖరీదెంత!
ఎంత డబ్బు పెడితే దొరుకుతుంది.

సూర్యకిరణాలు, చంద మామలు, సాయింత్రపు కలువలూ, పక్షుల కిలకిలలు, నదిలోనీడలు, గదిలో కాంతులు, ఆకాశపు దీపాలు, ఇవీ ఇస్మాయిల్ కవితాలోకపు డబ్బులు. వారి సతీమణిని మరో కవితలో వర్ణించిన తీరు చాలా హృద్యంగా ఉంటుంది.

మా ఆవిడ ఒక చేత్తో ఆకాశాన్ని ఎత్తిపట్టుకొంటుంది
ఒక చేత్తో భూమిని బుజ్జగిస్తుంది.
ఒక పిట్టచేత్తో కన్నీటి బీజాల్ని ఏరుకుంటుంది.

ఒక సెలయేటి చేత్తో బండల్ని నిమిరి ఓదారుస్తుంది......

నా ఇల్లు, నా సంసారం అనుకుంటూ నిత్యం శ్రమించే ఇల్లాలిని ఇంతకన్నా గొప్పగా వర్ణించే వాక్యాలు తెలుగు సాహిత్యంలో లేవు అంటే అతిశయోక్తి కాదు.

ఇస్మాయిల్ గారు తన పద్యాల్ని తెరుచుకొన్న పద్యాలు అన్నపుడు, మిగిలిన వారివి మూసుకొన్న పద్యాలా అంటూ తెలుగు సాహిత్యవిమర్శనా లోకంలో కొంత అలజడి రేగింది. అలా అన్నప్పుడు ఇస్మాయిల్ గారి ఉద్దేశ్యం ఒక కవిత చదవగానే పాఠకుడు ఆ పద్యానికి కంటిన్యూ అవుతారనీ, అంటే అతను కవితను తనంతట తానుగా కొనసాగించుకొనే అవకాశం ఉంటుందని. అలాంటి "ఓపెన్ నెస్" ఈయన కవితలలో ఉండి పాఠకుల కల్పనా శక్తికి పని కల్పించటం ద్వారా అవి మరింతగా వారి హృదయంలోకి ఇంకటం జరుగుతుంది.

స్త్రీవాద కవిత్వాన్ని ఇస్మాయిల్ గారు అహ్వానించలేదన్న అపవాదు వారిపై ఉంది. కానీ నిజానికి ఆయన ఉద్దేశ్యం కవిత్వం ప్రకృతిని ప్రతిబింబిస్తుందనీ, స్త్రీ ప్రకృతికి దగ్గర కనుక వారికి కవిత్వం వ్రాసే అవసరం రాకపోవచ్చుననీ మాత్రమే అన్నారు. ఆ తరువాత వచ్చిన స్త్రీవాద కవిత్వాన్ని చూసిన ఆయన, కవిత్వం అనేది అంతర్గతకల్లోలాల వల్ల జనిస్తుంది, ఈనాడు స్త్రీలకు కూడా ఈ మానసిక అశాంతి తప్పటం లేదన్న మాట అని అభిప్రాయ పడ్డారు.

జ్ఞాపకాలూ – అనుభవాలు

ఇస్మాయిల్ గారితో వివిధ ప్రముఖుల అనుభవాలు, అభిప్రాయాలు వారి మాటల్లోనే ....

• ఎందుకు బతకాలి అన్న ప్రశ్నకు ఆయన చెప్పిన సమాధానం నాకిప్పటికీ గుర్తుంది. స్టాఫ్ రూం కిటికీ లోంచి బయటకు చూస్తూ ఎండ వెచ్చగా ఉంది, పచ్చిక పచ్చగా ఉంది – ఇక్కడింత హాయిగా ఉంటే, బతకటానికేమయ్యిందయ్యా నీకు? అన్నారు. – విన్నకోట రవిశంకర్

• ఎనభైయవ దశకంలో కాకినాడలో నెల నెలా వెన్నెల పేరుతో జరిగే సాహితీసమావేశాలకు ఇస్మాయిల్ వచ్చేవారు. సమావేశమంతా అన్ని గంటలూ మౌనంగా ఉండే ఆయన, మధ్యలో జేబులోంచి ఒక తెల్లటి కాగితం మడత విప్పి ఒక కవిత చదివి వినిపించేవారు. ఆ కవితను రెండవ సారి కూడా చదివేవారు కాదు. ఆ సభలో ఆయన పార్టిసిపేషను అంతే. కానీ చివరిదాకా అలా అందరి కబుర్లనూ ఆస్వాదిస్తూ ఉండేవారు. – వాడ్రేవు వీర లక్ష్మీ దేవి

· చాలా ఏళ్ల క్రితం నేను కాకినాడ వెళ్లినప్పుడు రోజల్లా విడుపు లేకుండా మాట్లాడుకున్న గంటలు, ఆయన నామీద చూపించిన ఆప్యాయత, వీధరుగు మీద విశ్రాంతిగా కూర్చుని తిరగేసిన పుస్తకాలు, ఆయనా, వాళ్లావిడ మాకిచ్చిన ఆతిథ్యం నాకిప్పటికీ గుర్తొస్తాయి. అన్ని గంటలసేపు ఆయనతో మాట్లాడినా ఆయన తన కవిత్వాన్ని గురించి ఏమీ చెప్పలేదు. చదివి వినిపించలేదు. వాటన్నిటికన్నా కూడా ఇప్పటికీ నన్ను పట్టుకొనేది ఆయన పద్యాల్లోని నిశ్శబ్దమే. --- వెల్చేరు నారాయణరావు

· ఇస్మాయిల్ గారిని ఒక ప్రశ్న అడిగారు "ఒక మైనారిటీ మతస్తునిగా సమాజంలో సాహిత్య రంగంలో మీ అనుభవమేమిటి" అని. దానికి ఇస్మాయిల్ గారి సమాధానం

"మతం గురించి కులం గురించి ఆలోచన నాకెప్పుడూ రాలేదు. నేను మొదట్నుంచి అందరిలో ఒకణ్ణిగా, తెలుగువాణ్ణిగా ఫీలవుతూ వచ్చాను..... నా మైనారిటీ మతం నాకు 'హేండీకేప్' కాలేదు" ---సి. ధర్మారావు

· ఇస్మాయిల్ కవిగారి స్నానం గురించి – ఆ వ్రతవిధానం కనీసంగా ఒక గంటన్నర పడుతుంది. ... సెంట్లు పౌడర్లు స్నోలు అద్దుకుని ధౌత వస్త్రాలతో కడిగిన ముత్యంలా ఈయన గది బయటికొచ్చేవారు. --- సి. ధర్మారావు.

· రేడియో కవి సమ్మేళనంలో కవులంతా కొత్త సంవత్సరం మీద ఊగిపోతూ పద్యాలు చదివితే, ఈయన మాత్రం తాపీగా పదేళ్ల క్రితం వచ్చిన తన పాత పుస్తకాల నుంచి కవితలు వినిపించటం లాంటిది కూడా ఆయనకే చెల్లింది (ఉగాది మీద పద్యాలు రాయటమేమిటి?) -- విన్నకోట రవిశంకర్

· ఇస్మాయిల్ కుటుంబం ఆ ఇంట్లోకి మారి మూడే రోజులైంది. ఇంకా సామాన్లు సర్దుకోలేదు. మాకు చాయ్ ఇవ్వాలని ఆయన తాపత్రయం. పాలకోసం వాళ్లబ్బాయి వెళ్లాడు. ఆయన మమ్మల్ని చూసి ప్రసన్నవదనుడైనా, ఆ పొరల వెనుక ఏదో వేదన లాంటిది కనిపించింది. అనారోగ్యంగా ఉన్నా, వద్దన్నా కారు దాకా వచ్చారు. మళ్లీ ఎప్పుడు చూస్తామో ఆయన్ని అనిపించింది. మరో వారంరోజుల్లోనే చూడలేని లోకాలకు వెళ్లిపోతారనుకోలేదు. -- డా. ఎన్. గోపి

ఇస్మాయిల్ ఉత్తరాలు

• ఇస్మాయిల్ గార్ని తలుచుకోగానే తక్షణం గుర్తొచ్చేవి ఆయన ఆకుపచ్చ అక్షరాలే. శిథిల నేత్రాలు అనే నా కవిత అచ్చులో చూసి ఇది తెలుగు పద్యంలా లేదు" అంటూ మెచ్చుకుంటూ రాశారాయన. – అఫ్సర్

• ఆయన చిన్నతమ్ముడు వజీర్ రెహ్మాన్, నలుగురు అన్నదమ్ముల్లో ఆఖరివాడు మరణించిన కొంతకాలానికి ఆయన మూడో తమ్ముడు చనిపోయారు. అప్పుడు ఇస్మాయిల్ గారు ఉత్తరం రాస్తూ "ఈ వరస కింది నుంచి మొదలైనట్లుంది. మనకి ఆట్టే దూరం లేదు" అన్నారు. అన్నట్లుగానే అదే వరుసలో మరణాలు జరిగాయి –స్మైల్

• ప్రజాతంత్రలో నా 'విస్మృతి' కవిత అచ్చుకాగానే కవిత నచ్చిందని చెపుతూ రాసిన ఉత్తరంతో పాటు "ఇంకెక్కడా ఖాళీ దొరకనట్లు అనంతపురం వెళ్లారేమిటి? అక్కడసలే గాడిదలు ఎక్కువ" అంటూ ఓ చెణుకు. ఇస్మాయిల్ గారు అనంతపురం కాలేజీలో పనిచేసారు – కల్పనా రెంటాల

• పతంజలి శాస్త్రి కి ఇస్మాయిల్ గారు తమ కుమారుని పెళ్ళికి ఆహ్వానిస్తూ వ్రాసిన ఉత్తరం "ధర్మపత్నీ సమేత: ఇస్మాయిల్ కవి: స్వపుత్రస్య పరిణయ మహోత్సవం....... అంటూ సరదాగా సంస్కృతంలో సాగుతుంది.

• ఆయన నాకు రాసిన కార్డు (26-10-2003) ఆయన ఆరోగ్యం గురించి ఆందోళన పడ్తున్నట్లు అనిపించింది. " నా ఆరోగ్యం కూడా నన్ను మర్చిపోయింది. చాలా జబ్బుపడ్డాను" అని – యాకూబ్

ప్రముఖుల అభిప్రాయాలు

• మేం (ఉభయులం) స్వేచ్ఛా భావుకులం, అభయులం, నిత్యబాలలం, నిత్యసంతోషులం, మాకులం విమల విశ్వశాంతి కులం, మంచి జీవన శిల్పులం, నాకు ఇస్మాయిల్ అంటే ఇష్టమంత ఇష్టం -- పి.వి. నరసింహారావు

• అతని ప్రతికవితలోను ఒక మనోహరత్వాన్ని, ఒక హృదయరంజకత్వాన్ని అనుభవించాకనే నేను ఆయన మొదటి కావ్యాన్ని ప్రచురించాను - సోమసుందర్

• తనకు పోటీగా ఎన్ని ప్రబల కవి సిద్ధాంతాలు ఉన్నా, తనదైన వాదాన్ని కడదాకా నిలిపిన గొప్ప కవి, కవిత్వాన్ని మానవతా ప్రబోధ సాధనంగా మహోన్నత శిఖరాలపై నిలిపాడు ఇస్మాయిల్ -- సి.నా.రె.

• సాదీ మహాకవి ఒక మాటంటాడు " జ్ఞానవంతులకు పచ్చని చెట్లులోని ఒక్కొక్క ఆకు ఒకో దివ్యజ్ఞాన ప్రపంచంలాగ కనిపిస్తుందని" , నిజంగా ఈ మాటలకు నూటికి నూరు పాళ్లూ సరిపోయే తెలుగు కవి ఇస్మాయిల్ మాత్రమే -- శిఖామణి

• ఒక రుషిలాగ, సూఫీ కవిలాగ, ఒక హైకూగా ఇస్మాయిల్ బతికాడు. తెలుగు భాష ఉన్నంత వరకు సాహిత్య చరిత్ర పుటల మీద పచ్చని సంతకంలా ఇస్మాయిల్ పది కాలాలు పదిలంగా ఉంటాడు - ఎండ్లూరి సుధాకర్

• ఈయన సదా బాలకుడిగా లోకాన్ని చూసాడు, నిత్య నూతనుడిలా జీవించాడు -- స్మైల్

• వెయ్యి సంవత్సరాల సాహిత్య జీవితంలో తెలుగులో ఇలాంటి కవి మరొకరు లేరు - వేల్చేరు నారాయణరావు

• ఇస్మాయిల్ ఎందుకు విశిష్టకవి అయ్యారంటే, ఏ వ్యాసం ద్వారానో, విస్తృతమైన నవలద్వారానో, కధ ద్వారానో, వార్తా కధనం ద్వారానో చెప్పదగిన ఆవేశకావేషాలను, సిద్ధాంత చర్చలను, ఒక నిలువెత్తు పద్యంలా పోతపొయ్యటానికి ఆయనెప్పుడూ ప్రయత్నించలేదు — ఇంద్రగంటి శ్రీకాంత శర్మ

• నేను పెద్ద సాహిత్య విమర్శకుడిని కాదు కాని, శ్రీశ్రీ తర్వాత తెలుగు కవిత్వాన్ని మరో మలుపు దాటించిన వాడు ఇస్మాయిల్ అని నేను గట్టిగా నమ్ముతాను -- సి. ధర్మారావు.

• సాదా సీదాగా ఉండే ఇస్మాయిల్ కవిత్వానికి అంతశక్తి ఎక్కణ్ణించి వచ్చిందంటే 'నిబద్ధత లేకపోవడమే ఆయన కవిత్వ శక్తికి కారణం" అని ఆయన (అఫ్సర్ తండ్రిగారు) లెనిన్ అన్నమాటని గుర్తుచేసేవారు -- అఫ్సర్

ఆణిముత్యాలు - ఇస్మాయిల్ గారు వివిధ సందర్భాలలో వెలువరించిన అభిప్రాయాలు

- క్షణక్షణం మనల్ని ప్రత్యక్షంగా తాకే అనుభవాలూ, వాటి స్పందనలూ, జీవితాన్ని జీవనపాత్రంగా మార్చే అనంతమైన అనుభూతులూ, ఇవి కాక కవిత్వానికేవీ అర్థం?

- అనుభూతి ఎప్పుడూ వైయక్తికమే. అనుభవ వస్తువు ఒకటైనా, ఎవరి అనుభూతి వారిది. అది ఎప్పుడూ కొత్తగా ఉంటుంది. ఒకరి అనుభూతిలా మరొకరి అనుభూతి ఉండదు. ఈ నవనవోన్మేషమైన అనుభూతిని ఆవిష్కరించటమే కవి కర్తవ్యం

- కవి అనుభవాల్ని తనలో ఇంకించుకుని, అంతర్గర్భి ఐననాడే మంచి కవిత్వం జనిస్తుంది.

- అనుభూతులు శబ్ద ప్రపంచానికి చెందినవి కావు. ఈ నిశ్శబ్దాన్ని శబ్దంలోకి ప్రవేశపెట్టటమే కవిత్వం విశిష్ట లక్షణం. కవిత్వానికి శబ్దమెంత ముఖ్యమో నిశ్శబ్దం కూడా అంతే.

- పదచిత్రమనేది ఐంద్రియకం (sensuous). ఇంద్రియ జ్ఞానాన్ని ప్రేరేపిస్తుంది. హేతుబుద్ధికి సంబంధించింది కాదు. లోతైన అనుభూతుల్నీ(feelings), భావాల్నీ(emotions) ఆవాహించే శక్తి పదచిత్రానికుంది.

- లేబిల్స్ ఉపయోగించడం నాకిష్టం లేదు. అందుకనే నా కవిత్వానికి పేరు పెట్టనీయలేదు

- ప్రస్తుతం తయారవుతున్న కవిత్వాన్ని రెండు రకాలుగా విశాలంగా వర్గీకరించవచ్చు ననుకుంటాను. poetry of ideas (అభిప్రాయ కవిత్వం), poetry of experience (అనుభవ కవిత్వం).

- మినీ కవిత్వం రాస్తున్న యువకవులు చమత్కారమే కవిత్వం అనుకుంటున్నారు. చమత్కారం వేరు, కవిత్వం వేరు.

- కవిత్వం వల్ల కొంపలు కాల్తాయి. విప్లవాలు వస్తాయి అని మీరనుకున్నట్లయితే నిరాశ కోసం సిద్ధపడండి. అది చేసే పనల్లా చదువరి మనస్సులో దీపం వెలిగించడమే. దీని వల్ల అతని అవగాహన పరిధి విస్తరిస్తుంది. తన మనస్సులో వెలిగిన దీపం వెలుతురు తన దారి తను వెతుక్కోవడానికి సహాయపడుతుంది. ఫలానా దారినే నడవమని ఒకరు చెబితే వినడు మనిషి. అది తనకు తోచాలి. తన దారేదో తను నిర్ణయించుకోవాలి. ఈ నిర్ణయానికి కవిత్వం తోడ్పడుతుంది.

- బ్రహ్మాండం బద్దలయ్యే సంఘటనలకి బ్రహ్మాండం బద్దలయే కవిత్వం పుడ్తుందని ఆశించడం అమాయకత్వం.

- ప్రతిదేశంలోనూ అభ్యుదయం పేరనో, విప్లవం పేరనో రచయితల సంఘాలు ఏర్పరచి, రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడని సాహిత్యం పనికిమాలినదని యువ రచయితలకు నూరి పోసి వాళ్ల చేత నినాద ప్రాయమైన శుష్కరచనలు రాయించి పార్టీ ప్రచారం చేయించుకొంటున్నారు. సాహిత్యంలో రాజకీయ కాలుష్యాన్ని మొదట్నించీ ఎదిరిస్తూ వచ్చాను. కమ్యూనిష్టు ప్రభావం వల్ల ఎంతో మంది యువరచయితలు, జబ్బుపడి సాహిత్యపరంగా శవ ప్రాయులయ్యారు. ఆ అకవిత్వ కల్మషం దేశమంతా అలముకొంది. ఈ వెల్లువ ఇంకా తగ్గినట్లు లేదు. దీనికి వ్యతిరిక్తంగా, అంటే సాహిత్యంలో స్వేచ్ఛకోసమూ, రచయితల వ్యక్తి ప్రాధాన్యాన్ని ఉగ్గడిస్తూనూ, నలభైయ్యేళ్ల బట్టి పోరు సాగిస్తున్నాను.

- కవిత్వం హృదయ సంబంధి. ఆలోచనా వ్యవస్థ బుద్ధికి సంబంధించినది. కవిత్వాన్ని బుద్ధి (Reason) శాసించలేదు.దాని సామ్రాజ్యమే వేరు.

- కవిత్వమనేది కవి సంపూర్ణ అస్తిత్వంలోంచి ఉద్భవిస్తుంది. నేను బ్రాహ్మణుణ్ణి లేదా దళితుడిని అని జీవితాన్ని కుంచింపజేసుకున్నవాడు కవిత్వమేం రాయగలడు?

- జీవిత మహోత్సవంలోని అద్భుతాన్ని ఆవిష్కరించడమే కవిత్వం పని. ఈ విధంగా మన చేతనని సుసంపన్నం చేస్తుంది కవిత్వం.

ఇస్మాయిల్ రచనలు

1. చెట్టు నా ఆదర్శం 2. మృత్యువృక్షం 3. చిలకలు వాలిన చెట్టు 4. రాత్రి వచ్చిన రహస్యపు వాన 5. బాల్చీలో చంద్రోదయం 6. కప్పల నిశ్శబ్దం 7. రెండో ప్రతిపాదన (అనుసృష్టి) 8. కరుణ ముఖ్యం 9. కవిత్వంలో నిశ్శబ్దం (ఒక వ్యాసం) 10. పల్లెలో మా పాత ఇల్లు (లివ్యూ)

చివరి మూడు రచనలలో, మొదటి రెండూ సాహితీ విమర్శనా వ్యాస సంపుటులు, చివరది ఆయన మరణానంతరం, అభిమానులు వెలువ రించిన కవితాసంకలనం.

అవార్డులు/రివార్డులు

- 1989లో ఇస్మాయిల్ గారి షష్టిపూర్తి, రాజ్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ శ్రీమతి కుముద్ బెన్ జోషి గారి చేతులమీదుగా జరగటం ఒక గొప్ప విశేషం.
- 1999 లో కళాసాగర్ వారి విశిష్ట పురస్కారాన్ని అందుకొన్నారు
- 15-6-2003 హైదరాబాద్, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో “చెట్టంత కవికి పిట్టంత సత్కారం” పేరిట ఇస్మాయిల్ అభినందన సభ జరిగింది.
- కవిత్వంలో నిశ్శబ్దం అన్న సాహిత్య వ్యాసాలకు తెలుగు విశ్వవిద్యాలయం వారు అవార్డు నిచ్చారు.

చివరగా

కీర్తి శేషుడైన కవి
కాలతీరాన
కాసేపు పచార్లు చేసి
గులకరాయొకటి
గిరవాటేసి
తిరిగి వెళ్లిపోయాడు

అన్న ఆయన కవితావాక్యాలలోని కవి ఎవరనేది ఇన్నాళ్లకు అర్ధం అయ్యింది. ఆయన ఎవరో కాదు ఇస్మాయిల్ గారే.
చెట్లు నా ఆదర్శం అని ప్రకటించుకొన్న ఇస్మాయిల్ గారి కవిత్వం తెలుగు సాహిత్య చరిత్ర లో చిరస్థాయిగా నిలుస్తుంది

ఆయన సాహిత్య శకటాన్ని ఎక్కడ ఆపారో దాన్ని అక్కడి నుండి కొనసాగించటం తదుపరి కర్తవ్యం, భుజానికెత్తుకోవలసిన ఇంకొక పని - ఆయన ఎంతో ప్రేమతో, ఓపికతో నెరవేర్చినదే – ఎందరో సదా బాలకుల రాకకు అనుకూలంగా దారిని సుగమం చేయటం - అన్న తమ్మినేని యదుకుల భూషణ్ గారి మాటలు స్మరించుకొందాం.

Acknowledgements
1. Md. రెహ్మాన్ లెక్చరర్, కాకినాడ (ఇస్మాయిల్ గారి బంధువు)
2. అంతర్జాలంలో పైన ఉటంకింపబడిన లింకులలోని ఇస్మాయిల్ గారి వివిధ రచనలు
3. సలాం ఇస్మాయిల్ – వ్యాస సంపుటి
4. Tribute to Ismail –DVD by Indraganti's Family

2. కవుల కవి – ఇస్మాయిల్ ˜ బొల్లోజు బాబా DECEMBER 31, 2014

ఇస్మాయిల్ కవిత్వంలో నినాదాలు, సిద్ధాంతాలు, వాదనలు కనిపించవు. ఇంకా చెప్పాలంటే ప్రకృతి కనిపించినంతగా జీవితం కనిపించదు కూడా. అయినప్పటికీ ఆయన కవిత్వాన్ని అభిమానించే వారిలో కవులు ముందుంటారు వారి వారి కవిత్వ కమిట్మెంట్లు వేరైనప్పటికీ. ఆ విధంగా ఇస్మాయిల్ కవుల కవి.

ఇస్మాయిల్ కవిత్వంలో సౌందర్యం, కరుణ, జీవనోత్సాహాలు నిశ్శబ్దంగా శబ్దిస్తూంటాయి. జీవితంలో తారసిల్లే అనేక సందర్భాలకు, దృశ్యాలకు, వస్తువులకు ఈయన కవిత్వగౌరవం కల్పించాడు. మనుషుల రసదృష్టి పై అచంచలమైన విశ్వాసంతో కవిత్వాన్ని పలికించాడు. కవితలో దండుగ పదాల్ని శుభ్రంగా తుడిచేసి సుందర స్వరూపాన్ని మాత్రమే మిగిలేట్లు చేయటం ఇస్మాయిల్ కవిత్వశైలి.

ధనియాల తిప్ప

అంతా ఒక తెల్ల కాగితం.\\ప్
అందులో ఒక మూలగా
ఒక అడ్డుగీతా
ఒక నిలువు గీతా –
తెరచాప ఎత్తిన పడవ.
కిందిది నదీ
పైది ఆకాశమూ
కావొచ్చు.

సుమారు ముప్పై ఏళ్ళ క్రితం వ్రాసిన పై కవిత లో ఒక దృశ్యం ఇప్పటికీ సజీవంగానే కనిపిస్తుంది. నదీ ఆకాశం కలుసుకొన్న చోట ఒక పడవ. తెరచాప నిలువుగీత, పడవ అడ్డుగీత. అంతే అంతకు మించేమీ లేదు. ఇదే దృశ్యాన్ని నాబోటి వాడు "నది ఆకాశాన్ని ముద్దిడే సుదూర మైదానపు దారులలో ఒంటరి పడవ ప్రయాణం" అంటో వెలిసిపోయిన అలంకారాలతో, పదాల

డమడమలతో కవిత్వీకరించవచ్చు. కానీ ఇస్మాయిల్ కవితలో ఒక దృశ్యం మాత్రమే పదాల ద్వారా వ్యక్తీకరించబడింది. అది చాలా నిశ్శబ్దంగా చదువరి హృదయంలో పడవలా సాగుతుంది. అందుకే శ్రీ వెల్చేరు నారాయణరావు ఒకచోట “...... మాట తనను తాను నిశ్శబ్దం చేసుకుంటే ఒక అపూర్వ శక్తిని సంపాదించుకోగలదని – ఆ పనిని మాటచేత చేయించగలిగిన వాడు ఇస్మాయిల్ ఒక్కరే” అని అంటారు.

చట్రాలు, తిరగళ్ళు కవిత్వానికి కట్టి ఊరేగిస్తున్న కాలంలో ఆ పద్ధతికి ఎదురొడ్డి ఇస్మాయిల్ కవిత్వం నిలబడటం ఒక చారిత్రిక సత్యం. అలా తెలుగు సాహిత్యంలో ఒక విస్మరింపజాలని అధ్యాయంలా ఇస్మాయిల్ నిలిచిపోయారు. కవికి అనుభవంతప్ప వేరే ఆస్తి, అస్త్రం ఉండకూడదని ఇస్మాయిల్ భావించాడు. ఆయన కవితల్లో అనుభవసారం ఒక పదచిత్రంగా, ఒక ప్రతీకగా రూపుదిద్దుకొని పఠిత హృదయంలో దీపమై వెలుగుతుంది.

ప్రాపంచిక సంగతులను పారలౌకిక విషయాలతో గొప్ప నేర్పుతో అనుసంధానించటం ద్వారా గొప్ప కవిత్వానుభవాన్ని కలిగించటం ఇస్మాయిల్ కవిత్వంలో చాలా చోట్ల కనిపిస్తుంది.

పాట

సెలయేరా, సెలయేరా!
గలగలమంటో నిత్యం
ఎలా పాడగలుగుతున్నావు?
చూడు, నా బతుకునిండా రాళ్ళు.
పాడకుంటే ఏలా?

లోపల చిరుగుల బనీనుతో కృష్ణదేవరాయుల రాజసాన్ని పలికించే రంగస్థల నటుడో లేక గొంతుమూగబోయినా హృదయంతో అద్భుతగీతాలను గానంచేసిన కృష్ణశాస్త్రో, కళాకారుడెవరైనప్పటికీ నిత్యం గలగలమంటో పాడటంలోని అనివార్యతలాంటి జీరనేదో ఈ కవిత పట్టిచూపుతుంది. సౌందర్యభాషలో తాత్వికతను చెప్పినట్లుంటుంది.

కవిత్వం కరుణను ప్రతిబింబించాలని నమ్మిన వ్యక్తి ఇస్మాయిల్. జీవితాన్ని ప్రేమించి జీవనోత్సాహాన్ని గానం చేసిన సౌందర్య పిపాసి. కవిత్వంపై సామాజిక స్పృహ అనే బరువును వేసి బలవంతంగా మోయించిన రోజులవి. మోయలేము అనే కవుల్ని అకవులు అని నిందించే కాలంలో, ఇస్మాయిల్ గారు ఒక్కరే నిరసించి – మనం రోజూ చూసే విషయాలని, చిన్నచిన్న అనుభవాలనే

కవిత్వంగా మార్చి ఇదీ అసలైన కవిత్వమని ప్రకటించారు. బాగా దాహం వేసినప్పుడు చల్లని మంచినీళ్ళు తాగితే ఎంతో హాయిగా ఉంటుంది. ఇది మనం అనేకసార్లు అనుభవించిన ఒక అత్యంత సాధారణమైన అనుభవం. కానీ ఈ అనుభవమే ఇస్మాయిల్ గారి చేతిలో పడి చక్కని కవితగా రూపుదిద్దుకొంది..... ఇలా.....

దాహం

వేసవి గాడ్పులకి
దాహపు ఖర్జూరచెట్లు
యెడారి గొంతులో
అమ్ములపొదిలా
విచ్చుకుని
గరగరలాడుతోంది.

చల్లటి నీళ్ళు
గొంతు దిగుతోంటే
ఎంత హాయి//

యెడారిగొంతు, ముళ్లతో ఖర్జూరచెట్లు విచ్చుకోవటం, గొంతులో గరగర వంటి పదచిత్రాలన్నీ ఒక అనుభవాన్ని ఎంతో అందంగా, హాయిగా (గరగరగా) మన అనుభూతికి తెస్తాయి.

ఇస్మాయిల్ కవిత్వంలో డబుల్ మెటాఫెర్స్ అద్భుతంగా ఒదిగిపోయి కవితకు అందాన్ని, లోతైన అర్థాన్ని ఇస్తాయి. ఆయన పదచిత్రాల సౌందర్య రహస్యం అదే కావొచ్చు.

వాన వచ్చిన మధ్యాహ్నం
బరువెక్కిన సూర్యుడు
బతకనీడు భూమిని
ఉదయమ్మొదలు
ఊపిరాడనీడు
సర్వాన్ని అదిమిపట్టి
వీర్యాన్ని విరజిమ్మాడు
ఆకల్లాడదు.

ఏ కాకీ ఎగరని

ఏకాకి ఆకాశం.
ఇంతలో హటాత్తుగ
ఇలకు కలిగింది మబ్బుకడుపు.

వేవిళ్ళ గాలులు
వృక్షాగ్రాల్ని వూపాయి.
ధాత్రీచూచుకాలు నల్లపడ్డాయి.
తటాకాల చెంపలు తెల్లపడ్డాయి.///

పై కవితలో వీర్యం, కడుపు, వేవిళ్ళు, నల్లబడ్డ చూచుకాలు ఇవన్నీ ఒక స్త్రీ గర్భవతి అవ్వటాన్ని సూచిస్తాయి. అదే విధంగా విపరీతమైన ఎండకాసిన తరువాత వానపడటం అనే విషయాన్ని సూర్యుడు, భూమి, ఆకు అల్లాడకపోవటం, మబ్బులు, గాలులు, ధాత్రి నల్లపడటం, తటాకాలు తెల్లబడటం వంటి వర్ణనలు తెలియచేస్తుంటాయి. రెంటి మధ్య సమన్వయాన్ని బరువెక్కిన సూర్యుడు, మబ్బుకడుపు, ధాత్రీచూచుకాలు, తటాకాల చెంపలు అనే పదబంధాల ద్వారా సాధించి కవితకు అద్భుతమైన లోతును వచ్చేలా చేసారు. చివరలో "వర్షాగర్భంలో వర్ధిల్లే శిశుపిండాన్ని" అంటూ కవి తనను తాను ప్రకటించుకోవటం, ఆ అనుభవాన్ని హృదయానికి హత్తుకొనేలా చేస్తుంది. ఇదే రకమైన శైలిలో వ్రాసిన సంజె నారింజ అనే కవితలో...

దినపు రేకలపైన వాలెను
ఇనుని సీతాకోకచిలుక//
గులక రాళ్ళ పిట్టలతో
కులుకు తరుశాఖ ఏరు//
వొంగిన సాయింత్రపు రంగుల ధనసు
విసిరే గాలి బాణం

పై కవితలో దినాన్ని పుష్పంగా, సూర్యుడ్ని సీతాకోక చిలుకలా, ఏరుని వృక్షంగా, గులకరాళ్ళని పిట్టలుగా, ఇంద్రధనస్సుని గాలి బాణంగా పోలుస్తూ ఒక దృశ్యాన్ని పదచిత్రాలుగా పేనిన కౌశలం అబ్బురపరుస్తుంది.

వానని అనేక మంది కవులు అనేక విధాలుగా వర్ణించారు. కానీ ఈ విధంగా వర్ణించటం ఇస్మాయిల్ కే సాధ్యం.

శ్రావణ మంగళవారం
సాయంత్రం
ఒకానొక మబ్బు డస్టరు

అకస్మాత్తుగా ప్రవేశించి
భూమ్మీది వెర్రి రంగుల్నీ పిచ్చిగీతల్నీ
పూర్తిగా తుడిచేసి,
మెరిసే వానసుద్దముక్క పట్టుకొచ్చి
వీధుల్లో కళ్ళనీ
రోడ్లపై పడెల్నీ
లోకంలో కాంతినీ
వెయ్యిపెట్లి గుణించేసి
చెయ్యూపి వెళ్ళిపోయింది///

ఈ కవితలో కూడా మబ్బుడస్టరు, వానసుద్దముక్క వంటి పదబంధాల ద్వారా అద్భుతమైన పదచిత్రాల్ని నిర్మించి ఒక సుందరదృశ్యాన్ని కళ్లముందు నిలుపుతారు.

స్వారీ అనే కవితలో ఒక మనోహర సందర్భాన్ని ఇస్మాయిల్ వర్ణించిన తీరు గమనిస్తే ఏ చదువరి మనసు కవిత్వ ఆర్ద్రాజం పొందదు!

స్వారీ

కళ్ళెం లేని గుర్రమెక్కి
పళ్ళు గిట్ట కరచి
ఏ శత్రు సంహారం కోసమో
వైచిత్ర సమరంలోకి
స్వారి చేసే యోధురాలామె.
మళ్ళీ, యుద్ధాంతాన
కళ్ళు తేలేసి
నిర్వికల్ప సమాధిలో
సర్వాంగాలూ స్తంభించే
యోగిని కూడాను.

ఇస్మాయిల్ కవిత్వంలో కనిపించేమరో గుణం సున్నితత్వం. అనేక కవితల్లో ఈ లక్షణం స్పష్టంగా కనిపిస్తూంటుంది.

చిగిర్చే చెట్లు
నడచివచ్చి నిశ్శబ్దంగా
నా కిటికీ దగ్గిరాగి
హటాత్తుగా

పటేలుమని
వంద వాయిద్యాలతో
వికసించిన బ్యాండుమేళంలా
ఒక రోజు
అకస్మాత్తుగా
చివురించిన చెట్టు
గవాక్షం వద్ద నన్ను ఆపేసింది.///

పై కవితలో చెట్టు చివురించటాన్ని "వందవాయిద్యాల బ్యాండుమేళం" అంటున్నాడంటే, అది కవి దృష్టిలో ఎంత పెద్దదో, ఈ కవెంత సున్నితమనస్కుడో అర్ధం చేసుకోవచ్చును. అందుకనే ఈయన కవిత్వంలో సూర్యకిరణాలు, చందమామలు, సాయింత్రపు కలువలూ, పక్షుల కిలకిలలు, నదిలోనీడలు, గదిలో కాంతులు, ఆకాశపు దీపాలు, కొత్తచినుకులు, సొట్టబుగ్గల బావులు, చెట్టుపై వాలినచిలకలు, పసిపాపలు, గులకరాళ్లు వంటి అనేక కవితావస్తువులు కనిపిస్తూంటాయి. వీటన్నింటిని మనం నిత్యం చూసేవే అయినా ఆధునిక జీవనపు రణగొణల్లో పడి ఆ అందాలకు అంధులం అవుతాం దాదాపుగా. అలాంటి సున్నితమైన విషయాలతోనే ఇస్మాయిల్ కవిత రచన చేసారు. చిన్న చిన్న అనుభవాలని అందమైన పదచిత్రాలలో బంధించి మనకందించారు.

పడిలేచిన అనేక కవిత్వరీతుల వెల్లువల్లో కొట్టుకుపోకుండా మూడున్నర దశాబ్దాలపాటు తనదైన శైలిలోనే ఇస్మాయిల్ కవిత్వాన్ని వెలువరించారు. రాజకీయ కవిత్వాలు తమ ప్రాసంగితను కోల్పోయాక సేదతీర్చేది ఇస్మాయిల్ మార్కు కవిత్వమే అనటంలో సందేహంలేదు. ఆయన తను సాగిన బాటలో ఎందరో అభిమానులను పోగేసుకొన్నారు. ఆయన శిష్యులుగా ఎంతో మంది అదేబాటలో పయనించి తర్వాతికాలంలో మంచి కవులుగా పేరుతెచ్చుకొన్నారు. గోదావరి శర్మ, విన్నకోట రవిశంకర్, ఆకెళ్ళ రవిప్రకాష్, తమ్మినేని యదుకుల భూషణ్, మూలా సుబ్రహ్మణ్యం, కొండముది సాయికిరణ్, బి.వి.వి. ప్రసాద్, హెచ్చార్కె, నామాడి శ్రీధర్, శిఖామణి, అఫ్సర్ వంటి కవులకు ఇస్మాయిల్ అభిమాన కవి. అలా ఇస్మాయిల్ కవుల కవిగా కీర్తిశేషులయ్యారు.

3. పల్లెలో మా పాత ఇల్లు – ఇస్మాయిల్ బొల్లోజు బాబా September 1, 2009

“చెట్లు నా ఆదర్శం” అంటూ తన కవిత్వ హరిత కాంతుల్నిదశదిశలా ప్రసరింపచేసిన ఇస్మాయిల్ గారు పరిచయం అవసరం లేని కవి, మరీ ముఖ్యంగా అంతర్జాల పాఠకులకు. ఎందుకంటే, ఏ ఆధునిక మహాకవి సంపూర్ణ సాహిత్యం దాదాపు పూర్తిగా అంతర్జాలంలో లభ్యమవుతుందని చూస్తే, అది ఒక్క ఇస్మాయిల్ గారిదే.

ఇజాలు, వాదనలు లేకుండా, మన దైనందిక విషయాలు, చిన్న చిన్న అనుభవాలు, ప్రకృతి కరుణించే సుందర అపురూప దృశ్యాలు, ఆయన కవితాలోకంలో, కరుణ, తాత్వికలను అలంకరించుకొని సంచరిస్తూంటాయి. అలాంటి కవిత్వం ఎవరికి ఇష్టముండదూ.
ఇస్మాయిల్ గారు 2003 నవంబరు, 25న, ఆయనే ఏదో కవితలో అన్నట్లు ఓ విత్తనమై తనని తాను పాతుకొన్నారు. ఆ మహా నిశ్శబ్దంలోంచి మొలకెత్తిన ఓ తరువే **“పల్లెలో మా పాత ఇల్లు”** కవితా సంకలనం. దీని ప్రధమ ముద్రణ నవంబరు, 2006. ఇందులో వీరి అముద్రిత రచనలు, కొన్ని అనువాదాలు ఉన్నాయి.

హైకూలను తెలుగు సాహితీలోకానికి పరిచయం చేసినట్లే “తంకా” లను (జపనీయ సాహితీ ప్రక్రియ) పరిచయం చేసే ప్రయత్నం చేసినట్లనిపిస్తుంది ఈ పుస్తకంలో. ఇస్మాయిల్ గారు వ్రాసిన ఒక తంకా

స్టేషన్ రద్దీలో
బెంచీపై కూచుని
ముసిలాళ్లు ముచ్చటిస్తున్నారు.
ప్రవహించే నీటిలో
ప్రవహించని నీడలు.

ఈ పుస్తకంలో వలసపాక హైకూలు అన్న శీర్షికతో మొత్తం 72 హైకూలున్నాయి. ఇస్మాయిల్ గారు తన జీవిత చరమాంకంలో, టౌన్ లో ఉండే తమ ఇంటిని డెవెలప్ మెంట్ కిచ్చేసి, టౌనుకు దూరంగా వలసపాకల అనే ఊరిలో కొన్నాళ్లున్నారు.. శ్రీనాధుడు పాకనాటి వాడయితే నేను వలసపాకనాటి వాడినని ఎక్కడో చమత్కరించారు కూడా. ఆ కాలంలో రాసిన హైకూలివి. ఈ హైకూలలో ఇస్మాయిల్ కవిత్వంలో కనిపించే అదే సౌందర్యారాధనా, అదే ప్రకృతి పరిశీలనా, అదే తాత్వికతా, అదే

నిశ్శబ్దం, పరిమళించే నెమలీకలై చదువరి మనసులను మృధువుగా తాకుతూ పరవశాన్ని కలిగిస్తాయి.
మచ్చుకు కొన్ని

ఇద్దరికీ సంబరమే
సముద్రపొడ్డున జనానికీ,
జనాల ఒడ్డున సముద్రానికీ.

సంజె వేళ
దీపాలు వెలిగించారు
ఎవరి దీపాలు వారివి.

కాకు లెగిరిపోయాయి
నల్లటి నిశ్శబ్దాన్ని
వదిలి.

గిల్లు ప్రేమ
పెచ్చులు పెచ్చులుగా
ఊడుతోంది.

రాత్రి హోరున వర్షం
ఉదయం లేచి చూస్తే
ఎదురింటాయనకు రెండు మేడలు.

గుండె బీటలు పడితే
దిగుళ్ళు తప్ప
అన్నీ కారిపోతాయి.

ఈ పుస్తకంలో శ్రీనివాస్ రాయప్రోల్, జీబనానంద దాస్, సుజాతా భట్, రేనర్ మరియు రిల్కే, పాబ్లో నెరుడా మరియు వివిధ జపనీయ కవయిత్రులు వంటి ముప్పై మంది కవుల కవితల అనువాదాలు ఉన్నాయి. చదువుతున్నపుడు అవి అనువాద రచనల్లా కాక, స్వతంత్ర రచనలుగా అనిపిస్తాయి. దీపావళి రోజు అనే కవితలో పలికించిన విషాదం ఈ రోజు తెలుగునాట చాలా ఇళ్లలో ప్రవహించేదే.
జీబనానంద దాస్ వ్రాసిన బనలతాసేన్ అనే పద్యానువాదంలో, ఇస్మాయిల్ గారి ట్రేడ్ మార్కయిన భాషా సరళత కనిపించదు. దీనికి కారణం బహుసా సంస్కృత భూయిష్టంగా ఉండే మూల కవితే. అనువాదకుడు మూలానికి

విధేయుడై ఉండాలి అనే నియమానికి ఈ కవితానువాదం సాక్షి గా నిలుస్తుంది. ఇస్మాయిల్ గారికి బెంగాలి కూడా వచ్చు.

చీనా వేదాంతి అన్న అనువాద కవిత ఇలా సాగుతుంది.

సరే, వాళ్ల చేతిలో ఓడిపోయాం;
ఐతే ఏమైంది?
టీ వచ్చింది తాగు.
మరో తొమ్మిది వందలేళ్లలో
వాళ్లూ ఓడిపోతారు
మరొకళ్ల చేతిలో.

ఈ పదిహేను పదాల కవితలో కవితలో మొత్తం మానవజాతి చరిత్ర ఇమిడిపోలేదూ?

రేబో అనే కవిత కవికి ఉండవలసిన నిబద్ధతను అన్యాపదేశంగా, అద్భుతంగా ఆవిష్కరిస్తుంది.
అంతటి సర్రియల్ పాబ్లో నెరుడా ఇస్మాయిల్ చేతిలో పడి, అలతి అలతి పదాలలో, తేటగా, తేలికగా ప్రకాశించటం, "కృష్ణ పక్షం, ఏల ప్రేమింతు నిన్ను, పరిచ్ఛ్యుతులు" అనే కవితల్లో చూడవచ్చు.

ద్వేషం మానవజాతిని అనాదిగా నాశనం చేస్తుంది అనే భావనను వ్యక్తీకరించే "ద్వేషం" అనే అనువాద కవిత అత్యద్భుతంగా ఉంటుంది. రకరకాల వాదాలతో కొట్టుకు చచ్చే ఈ లోకరీతిని నిరసిస్తూ, మానవత్వాన్ని అక్షరక్షరంలోనూ పలికించే కవిత ఇది. అందులో ఒక చోట

మిగతా అనుభూతుల గురించి చెప్పకండి.
వట్టి నీరసప్పీనుగులు.
సౌభాత్రుత్వం పేరు చెపితే
ఎక్కడైనా జనం మూగారా?
జాలీ, దయా
ఎప్పుడైనా గెలిచాయా?
పని చేసి చూపించేది
ద్వేష మొక్కటే.

జపనీయ కవయిత్రుల అనువాదాలు చాలా సరళంగా హృద్యంగా సాగుతాయి.

అవ్యక్త వాంఛ

ఘనీభవించి
నా శరీరపులోతుల్లో
నల్లటి ముత్యంలా
మారుతోంది.

ఎన్ని ముద్దులు పెట్టుకొన్నా
ఎన్ని కబుర్లు చెప్పుకొన్నా
నువ్వు నువ్వే
నేను నేనే

వంటివి చదివిన చాలాకాలం వెంటాడతాయి.
ఇస్మాయిల్ గారు కేవలం అనువాదాలను వదిలిపోయారట; మూలంలో చాలామంది కవుల పేర్లను శ్రీ యదుకుల భూషణ్ గారు గుర్తించి, ఈ సంకలనాన్ని తీసుకురావటంలో ఎంతో సహాయపడ్డారు. అలా ఇస్మాయిల్ అభిమానులు తీసుకువచ్చిన పుస్తకం "పల్లెలో మా పాత ఇల్లు"
.
ఇజాలు, కులాలు, మతాలు, ప్రాంతీయతలు లేని సార్వజనీనమైన కవిత్వాన్ని అనుభవించి, పలవరించాలని కోరుకొనే వారందరికీ ఈ పుస్తకం నచ్చుతుంది. ఇది ఇస్మాయిల్ గారి చివరి రచనల సంకలనం కనుక, ఆయన అభిమానులందరికీ మరింత అపురూపం.

సమకాలీన తెలుగు లాక్షణికుడు - శ్రీ ఇస్మాయిల్ - సెప్టెంబరు 29, 2024

చాన్నాళ్ళ క్రితం ప్రముఖ విమర్శకులు శ్రీ సీతారాం "కావ్యసౌందర్యశాస్త్రం లేదా భారతీయ లాక్షణిక సిద్ధాంతాలు వినా, మనవీ అని చెప్పుకోదగిన సాహిత్య సిద్ధాంతాలు ఏమైనా ఉన్నాయా?" అని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. దీనికి ప్రముఖ విమర్శకులు శ్రీ లక్ష్మి నరసయ్య "దళిత, బహుజన, ముస్లిం వాద సాహిత్య దృక్పథాలు వాటికి సంబంధించిన ఈస్థటిక్స్ లాంటివి దేశీయ సాహిత్య సిద్ధాంతాలు" అన్నారు.
షేక్ పీర్ల మొహమ్మద్" ఏ సిద్ధాంతానికైనా యూనివర్సల్ అప్పీల్ ఉండాలి కదా" అనే కోణాన్ని గుర్తుచేసారు.
సోషల్ మీడియాలో ఈ అంశంపై జరిగిన చర్చ చాలా ఆలోచనల్ని రేకెత్తించింది. ఈ నేపథ్యంలోంచి చూసినప్పుడు ప్రముఖ కవి శ్రీ ఇస్మాయిల్ సమకాలీన తెలుగు లాక్షణికుడిగా కనిపించారు.
***

1. Literary theory అంటే ఏమిటి?

Literary theory సాహిత్యంలో ఉండే "సాహిత్యసంబంధి" (Literary) ఏమిటి? అని ప్రశ్నించి దానికి సమాధానాలు రాబడుతుంది. అంటె రసము, ఔచిత్యం, ధ్వని, Tension, Texture, Ambiguity లాంటి ఏ ప్రక్రియ వల్ల ఒక కవిత ఎలా గొప్పకవిత అయ్యిందో/అవ్వగలదో సిద్ధాంతీకరిస్తుంది. లిటరరీ సిద్ధాంతం అంటే సాహిత్యాన్ని అర్థం చేసుకోవటానికి, విశ్లేషించటానికి, సృజించటానికి ఉపయోగపడే ఆలోచనలు, పద్ధతులు

Literary Criticism సాహిత్యాన్ని విశ్లేషిస్తుంది, తూకంవేస్తుంది మంచి చెడ్డలు విడమరచి చెపుతుంది. ఈ విమర్శలో ఒక కవిత ఎందువల్ల మంచికవితో లేక అకవితో పై సిద్ధాంతాల ఆధారంగా నిరూపిస్తుంది. ఎక్కడ

రసభంగం జరిగింది, ఎక్కడ ఔచిత్యదోషం ఉంది, ఉద్దేశించిన ధ్వనికి ఎలా అన్వయం కుదరలేదు అనే విషయాలను విపులీకరిస్తుంది.

Literary theory, Literary Criticism లు పరస్పరాధారితాలు. ముందు theory పుడుతుంది, దానికనుగుణంగా విమర్శ జరుగుతుంది. ఉదాహరణకు సాహిత్యమనేది ఒక సాంఘిక కార్యక్రమమని, కవి సామాజిక మార్పుకు దోహదపడాలనే మార్క్సిజసిద్ధాంతం మొదటగా పుట్టింది. ఆ సిద్ధాంతాన్ని ఉపయోగించుకొని ఒక కవితలో "సామాజిక ప్రయోజనం" ఏమేరకు ఉంది అంటూ విమర్శ సాగుతుంది. అలాగన్నమాట.
నిజానికి ఈ సిద్ధాంతకర్తకు, విమర్శకుడి కన్నా ముందు సృజనకారుడు అనే వాడు ఒకడుంటాడు. వాడికీ గొడవలేమీ పట్టవు. వాడిమానాన వాడు రాసుకొంటూ పోతాడు. వాడు రాసినవాటిలోంచే ఈ సిద్ధాంతాలు, విమర్శలు పుట్టుకొస్తాయి.
***

2. దేశీయ లాక్షణిక సిద్ధాంతాలు

సాహిత్యం ఎలా ఉండాలి ఏవేం అంశాల వలన ఒక రచన సాహిత్యవిలువలను పొందుతుంది అనే విషయాలను లోతుగా శోధించి, కొన్ని ప్రతిపాదనలను చేసారు మన పూర్వీకులు. ప్రాచీన భారతీయ సిద్ధాంతాలలో ప్రధానంగా అలాంటివి ఆరింటిని గుర్తించవచ్చు

- **భరతుని రస సిద్ధాంతం:** రసాత్మకమైనదే కావ్యమని ప్రతిపాదిస్తుంది.
- **భామహుని అలంకార సిద్ధాంతం:** కావ్యానికి అలంకారాలు ప్రధానం అంటుంది
- **వామనుడి రీతి సిద్ధాంతం:** మంచి కావ్యానికి మంచి గుణాలుండాలంటుంది.
- **ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతం**: వాచ్యంగా చెప్పిన విషయం కన్నా చెప్పకుండా వదిలేసిన విషయం ప్రధానమంటుంది.

- **కుంతకుని వక్రోక్తి సిద్ధాంతం**: వక్రోక్తి అంటే అలంకారములతో నర్మగర్భంగా చెప్పటం. ఇది ఆనందవర్ధనుని ధ్వనిని పోలి ఉంటుంది.
- **క్షేమేంద్రుని ఔచిత్య సిద్ధాంతం**: ఏది దేనికి తగి ఉంటుందో దాన్ని ఔచిత్యం అంటారు. కావ్యానికి ఔచిత్యం ఉండాలంటుందీ సిద్ధాంతం.

ఇరవయ్యోశతాబ్దంలో పాశ్చాత్య Literary theory లలో అనేక దృక్పథాలు ప్రవేశించి Literary criticism ను నడిపించాయి. దేశీయ లాక్షణిక సిద్ధాంతాలకు పాశ్చాత్య సిద్ధాంతాలకు పొంతన ఉండదు. భారతీయ, పాశ్చాత్య సంస్కృతులు పూర్తిగా భిన్నమైనవి కనుక ఈ రెండిటి మధ్య పోలికలు తేవటం దాదాపు అసాధ్యం.

మొదట్లో అరిస్టాటిల్ లాంటివారు జీవితాన్ని అనుకరించేదే కళ అన్నారు. తరువాత మిల్టన్ కాలంలో చందస్సును అనుసరించి చెప్పటమే సాహిత్యం అన్నారు కాల్పనికతే (romanticism) సాహిత్యమని షెల్లీ, కీట్స్ కవిత్వం చెప్పింది.

3. ఆధునిక సిద్ధాంతాలు

- అభ్యుదయ, సామాజిక ప్రయోజనం కలిగి ఉండటం (మార్క్సిస్ట్ సిద్ధాంతం)
- భిన్నత్వాలను celebrate చేస్తూ చరిత్రను నిరాకరించటం ద్వారా స్వీయ అస్తిత్వాన్ని ప్రకటించుకోవటం (పోస్ట్ మోడర్న్)
- మనో వైజ్ఞానిక అంశాలను పొదువుకోవటం (ఫ్రాయిడియన్)
- స్త్రీవాద (gender and Queer theories)
- సాంస్కృతిక వైవిధ్యాలను ప్రతిబింబించటం (Cultural theory)
- పాఠంలోనే అన్ని అర్థాలు ఉంటాయి అనే ప్రతిపాదన (Structuralism)
- పాఠం వెలుపల సోషల్ పొలిటికల్, హిస్టారికల్ కారణాల వల్ల చాలా కనిపించని అర్థాలు ఉంటాయి అనే ప్రతిపాదన (Post structuralism)

- రచనలో బహుళార్ధాలను వెతకటం (Deconstruction)
- వలసపాలనానంతర ప్రభావం (Post Colonial)-- లాంటి రకరకాల లిటరరీ సిద్ధాంతాలు సాహిత్యంలో "సాహిత్యసంబంధి" ఏదో తేల్చి చెప్పటం కొరకు ప్రతిపాదించబడ్డాయి. ఒక్కొక్కటీ అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్న రీతిలో సాగుతాయి.

పైన చెప్పిన ఆధునిక లిటరరీ థీరీలను గమనిస్తే, భారతదేశానికి సంబంధించి ఎప్పుడో వందల సంవత్సరాలక్రితం ఏర్పరచిన లాక్షణిక సిద్ధాంతాలే తప్ప ఆధునిక కాలంలో మనం సృష్టించుకొన్న ఆధునిక దేశీయ సాహిత్య సిద్ధాంతాలు ఏమున్నాయి అని ప్రశ్నించుకోవటం సందర్భోచితమే కాదు అవసరం కూడా. ఆమేరకు లక్ష్మి నరసయ్య గారు చెప్పిన దళిత,బహుజన ఈస్థటిక్స్ కొంతమేరకు ఆ లోటును తీర్చిందని భావించవచ్చు.

మన తరంలో తెలుగులో అంత స్పష్టంగా కవిత్వానికి చక్కని నిర్వచనాన్ని, అసలు ఏది కవిత్వం అన్నదానికి సమాధానాన్ని, కవిత్వపు పరిధులు, బలహీనతలను విస్పష్టంగా చెప్పిన ఒక సిద్ధాంతకర్తగా శ్రీ ఇస్మాయిల్ కనిపిస్తారు. ఈయన వెలిబుచ్చిన అభిప్రాయాలపై పాశ్చాత్యప్రభావం లేదని చెప్పలేం అయినప్పటికీ ఇస్మాయిల్ గారి అభిప్రాయాలు స్వతంత్రంగా, స్థానీయంగా ఉండటం గమనించవచ్చు.

4. సమకాలీన లాక్షణికుడు - శ్రీ ఇస్మాయిల్

తెలుగుకు సంబంధించినంత వరకూ కవిత్వాన్ని నిర్వచించి, కొన్ని లక్షణాలను ప్రతిపాదించిన ఆధునిక కవులలో ఇస్మాయిల్ కనిపిస్తారు. నేనొక లాక్షణిక సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నాను అని ఆయన ఎక్కడా చెప్పుకోకపోయినా ఆయన వదిలివెళ్ళిన ప్రతిపాదనలు, చేసిన చర్చలు, వాదప్రతివాదనలను ఈ రోజు మనముందే ఉన్నాయి. వాటి ద్వారా, ఇస్మాయిల్ తనజీవితకాలమంతా తపస్సుచేసి ఆధునిక కవిత్వంలోని "సాహిత్యసంబంధి" లక్షణాలను నిర్వచించారని, కవిత్వాన్ని విశ్లేషించటానికి కావాల్సిన పనిముట్లను గుర్తించారని తెలుసుకోవచ్చు.

.

ఒక లాక్షణికుడిగా ఇస్మాయిల్ చేసిన ప్రతిపాదనలు

1. కవిత్వంలో నిశ్శబ్దం: మన చుట్టూ ఉన్న అనుభవిక ప్రపంచాన్ని ఆవిష్కరించటమే కవిత్వ లక్ష్యం. అనుభవాన్ని అనుభవంగానే ప్రత్యక్షం గా అందించటం కవిత్వం పని. అనుభూతి సామాన్య భాషకు అందదు. ఆ అనిర్వచనీయమైన ఆ నిశ్శబ్దాన్ని వాక్యాలలోకి ప్రవేశపెట్టటమే కవిత్వ లక్షణం. కవిత్వానికి శబ్దమెంత ముఖ్యమో నిశ్శబ్దం కూడా అంతే. (ఇది కొంతమేరకు ధ్వని సిద్ధాంతానికి దగ్గరగా ఉంటుంది. శబ్దం అంటే ఒక కవితలో పైకి చెపుతున్న విషయంగాను, నిశ్శబ్దం అంటే అన్యాపదేశంగా చెపుతున్న లేదా చెప్పకుండా నిశ్శబ్దంగా ఉంచిన విషయంగాను అర్ధం చేసుకోవాలి)

2. కవిత్వం హృదయ సంబంధి: కవిత్వం హృదయ సంబంధి. ఆలోచనా వ్యవస్థ బుద్ధికి సంబంధించినది. కవిత్వాన్ని బుద్ధి (Reason) శాసించలేదు. దాని సామ్రాజ్యమే వేరు. కవిత్వానికి "కరుణ ముఖ్యం".

అసలు సృజనాత్మకతకి మూలమేమిటి? కవి యొక్క దర్శనం (vision). ఇది పూర్తిగా వైయక్తికమైనది. ఏ కవి దర్శనం వానిది. దీన్నించే అతని కవిత్వం ఉద్భవిస్తుంది. కనక, కవి నిబద్ధుడై ఉండవలసింది తన సొంత దర్శనానికే!

కవిత్వం తల్లివేరు కవి అంతర్లోకమూ, బహిర్లోకమూ కలిసేచోట తన్ని ఉంటుంది.

3. కవిత్వం చేసే పని చదువరి మనస్సులో దీపం వెలిగించడం: కవిత్వం చేసే పనల్లా చదువరి మనస్సులో దీపం వెలిగించడమే. దీని వల్ల అతని అవగాహన పరిధి విస్తరిస్తుంది. తన మనస్సులో వెలిగిన దీపం వెలుతురు తన దారి తను వెతుక్కోవడానికి సహాయపడుతుంది. ఫలానా దారినే నడవమని ఒకరు చెబితే వినడు మనిషి. అది తనకు తోచాలి. తన దారేదో తను నిర్ణయించుకోవాలి. ఈ నిర్ణయానికి కవిత్వం తోడ్పడుతుంది.

“కళ కళ కోసమే” అనే వాదనా, “కళ సాంఘిక రాజకీయ ప్రయోజనాల కోసం” అనే వాదనా – రెండూ అతి వాదాలే! ఏదో ఒక ప్రయోజనం లేకుండా ఏదీ వుండదు. ఐతే దేని ప్రయోజనం దానికుంటుంది. ఇది గుర్తించడం ముఖ్యం. ప్రపంచాన్ని అవగాహన చేసికోవటమూ, తద్వారా ప్రపంచంతో అనుభౌతిక అనుసంధానం (emotional adjustment) సాధించటమూ – అనాది నుంచీ కళా ప్రయోజనమని ఇస్మాయిల్ గారి ప్రతిపాదన.

4. భాషని శుభ్రపరచటం: నేను (ఇస్మాయిల్) కవిత్వంలో ఒక ముఖ్యమైన పని చేయడానికి పూనుకున్నాను. భాషని శుభ్రపరచడానికి ప్రయత్నించాను. చాలా మాటలకు మాసిన రంగులు, పాత వాసనలు ఉంటాయి. అలాంటి మాటల్ని కవిత్వంలో వాడలేదు. పాత కావ్యాల్లోనివి, పురాణాల్లోని పదాలు, సమాసాలు, పేర్లూ, కథలూ నా కవిత్వం జోలికి రాకుండా జాగ్రత్తపడ్డాను. నా స్వంతమైన, సరికొత్త అనుభవాల్ని వ్యక్తపరచటానికి, వ్యావహారికప్రపంచంలోని సరికొత్త మాటల్నే కోసుకొచ్చి వాడుకున్నాను.

5. కవిత్వానికి లేబుల్స్ ఉండకూడదు: కవిత్వానికి లేబిల్స్ అంటించడం నాకిష్టం ఉండదు. ఆలోచన నుంచి తప్పించుకొనే మార్గాలు లేబిల్స్. అర్థం చేసుకొనే కష్టానికి పాల్పడకుండా, తేలిగ్గా కొట్టిపారెయ్యడానికి లేబిల్స్ ఉపయోగిస్తారు. ‘బూర్జువా, శ్రామికవర్గం, రివిజనిస్టు లాంటి లేబిల్స్ అంటించి ఇక ఆ విషయం గురించి ఆలోచించడం మానేయవచ్చు.

***

పైన చెప్పిన అయిదు పాయింట్లు ఆధునిక కవిత్వాన్ని అర్థం చేసుకోవటానికి, విశ్లేషించటానికి దోహదపడే అంశాలు. పై అయిదు పాయింట్లు స్వేచ్ఛాప్రతిపాదనలు.

కవిత్వంలో నిశ్శబ్దం అనే ప్రతిపాదనకు ధ్వనిసిద్ధాంతం మూలాలు కనిపిస్తున్నా, చెప్పిన విధానం కొత్తది.

కవిత్వం హృదయసంబంధి అన్నటువంటి మాట emotions recollected in tranquility అన్న మాటకు దగ్గరగా అనిపించవచ్చు.

కవిత్వం పూర్తిగా వైయక్తికఅనుభవంగా, దర్శనంగా ఆమేరకు తన సృజనను కొనసాగించటం ఇస్మాయిల్ నిబద్ధతగా భావించాలి. సాహిత్యప్రయోజనం ఆనందోపదేశాలు అని మనవాళ్లు, పాశ్చాత్యులు అంగీకరించారు. ఆ మాటకు భిన్నంగా కవిత్వం చదువరి మనస్సులో దీపం వెలిగించడం అనటం నవ్యమైన ప్రతిపాదన

అదే విధంగా భాషను శుభ్రపరచటం తెలుగుకు మాత్రమే అన్వయించబడే ఒక విషయంగా భావించవచ్చు. ఈ ప్రతిపాదనకు మూలాలు వాడుకభాషోద్యమంలో ఉంటాయి. అలాంటి క్లిష్టపదాలను వాడటం గురించి, డెడ్ మెటఫర్లను ఒదిలించుకోవటం గురించి ఈ ప్రతిపాదన మాట్లాడుతుంది.

కవిత్వానికి లేబుల్స్ ఉండకూడదు అన్నటువంటి ప్రతిపాదనకూడా పూర్తిగా ఆధునికమైనదే. కామెడిలని, ట్రాజెడీలని సాహిత్యాన్ని లేబ్లింగ్ చేసే పద్ధతి పాశ్చాత్యులది. దేశీయమైన ప్రాచీన సాహిత్యంలో ఈ పద్ధతిలేదు. ఒక కావ్యం జీవితసామస్త్యాన్ని ప్రతిబింబించేవిధంగా ఉండటంచే లేబ్లింగ్ అవసరపడలేదు భారతీయ లక్షణకారులకు. ఆధునిక కాలంలో కవిత్వాలకు వేసే లేబ్లింగ్ వలన జరిగే నష్టం గురించి మాట్లాడటం కూడా "సాహిత్య సంబంధి" కి లేబుల్స్ తో పనిలేదు అని చెప్పటమే.


.

ఈ అయిదు ప్రతిపాదనలతో కూడిన "Ismayil Literary theory" సాహిత్యంలో ఉండే "సాహిత్యసంబంధి" (Literary) ని నిర్వచిస్తుంది.

***

అద్దేపల్లి రామమోహనరావు

(1936 – 2016)



అభ్యుదయ, విప్లవ కవిత్వాల్లో అద్దేపల్లి గారు పోషించిన పాత్ర, వారి సాహిత్య విమర్శలో ఉన్న పదును ఈ వ్యాసాలలో నిక్షిప్తమై ఉన్నాయి.

అలుపులు అలకలు లేని అద్దేపల్లి....

“శయనిస్తున్న అతనెలా ఉన్నాడు? యోధునిలాగా లేక కవిలాగ? హ్మ్...... కవిత్వ యోధునిలా” --- జె.డి. రోబ్

ఓ మాస్టారికి ఒక కిళ్ళీ కొట్టు వద్ద ఖాతా ఉండేది. అయిదేళ్ళు గడిచాకా, ఓ మిత్రుడు ఆ కొట్టు యజమానికి ‘ఈ మాస్టారే ప్రముఖ కవి అద్దేపల్లి రామమోహనరావు” అని పరిచయం చేసాడు. ఆ కొట్టు యజమాని ఓ బైండు చేసిన పుస్తకాన్ని తీసి చూపిస్తూ మనస్సు బాగోనప్పుడల్లా ఈ పుస్తకాన్ని చదువుతుంటానని చెప్పాట్ట. ఆ పుస్తకం పేరు “అంతర్జ్వాల”. అది శ్రీ అద్దేపల్లి రచన. ఒక కవికి ఇంతకు మించిన పురస్కారం ఏ అకాడమీలు, యూనివర్శిటీలు, ప్రభుత్వాలు ఇవ్వగలవు?

యాభై ఏళ్ల సాహితీప్రస్థానంలో సుమారు 30 పుస్తకాల్ని వెలువరించి, ఆరు వందలకు పైగా ముందుమాటలు వ్రాసి, వివిధ సభల్లో రెండువేలకు పైగా అధ్యక్షోపన్యాసాలు ఇచ్చి, ఎన్నో వందల పుస్తకాలను సమీక్షించి, కొన్ని వందల తెలుగు గజల్స్ ను వ్రాసి, గానం చేసి- తెలుగు సాహితీలోకంలో ఒక కవిత్వయోధునిలా జీవించిన శ్రీ అద్దేపల్లి రామమోహనరావు జీవిత చరమాంకంలో కూడా ఒక యోధునిలానే నిష్క్రమించారు.

గత మూడునెలలుగా ఆయన అస్వస్థతకు గురయ్యారని కాకినాడ సాహితీమిత్రుల మధ్య గుసగుసలుగానే ఉండింది. కానీ ఇంత త్వరగా విడిచిపోతారాని ఎవరూ అనుకోలేదు.

తన అనారోగ్యం గురించి ఎవరికి తెలియనివ్వలేదు శ్రీ అద్దేపల్లి. ఎవరినీ ఎక్కువగా కలిసే వారు కాదు. గతమూడునెలలుగా ఎవరైనా ఆయనను కలిసినా అస్వస్థత ప్రస్తావన లేకుండానే మాట్లాడేవారు. ఇవతలి వ్యక్తికి

తెలిసినా, ఆయన ధోరణిని బట్టి, తెలియనట్టుగానే మాట్లాడాల్సివచ్చేది. అలాగని నిర్వేదంలో పడిపోయారా అంటే అదీకాదు, మరణానికి వారంరోజుల ముందు వరకూ కూడా స్వయంగా ఆటో ఎక్కి రేడియేషన్ చేయించుకొని వచ్చిన వ్యక్తి. ఒక సాహితీ మిత్రునికి ఫోన్ చేసి, ఈ సంవత్సరం ఎలాగైనా "సాహితీ స్రవంతి" పత్రికను ప్రారంభించాలి అని దిశానిర్ధేశం చేసిన వ్యక్తి శ్రీ అద్దేపల్లి. "మీరు రేడియేషన్ చేయించుకొన్నారు కదా జాగ్రత్తగా ఉండాలి" అని కుటుంబసభ్యులొకరు అన్నప్పుడు, "అన్ని సిట్టింగులు అయిపోయాయి, రేడియేషన్ అన్న మాట ముగిసిపోయిన అధ్యాయం, ఇకదాని గురించి మాట్లాడకండి" అని వారికే తిరిగి ధైర్యం చెప్పిన వ్యక్తిత్వం శ్రీ అద్దేపల్లిది. మరణాన్ని కూడా ప్రశాంతంగా స్వీకరించాలంటే గొప్ప రుషిత్వం ఉండాలి.

కవిగా, విమర్శకునిగా, వక్తగా, వ్యక్తిగా ఆయన పోషించిన వివిధ పాత్రలను తెలుసుకోవటం ద్వారా శ్రీ అద్దేపల్లి చేసిన సాహిత్యకృషిని అర్థం చేసుకొనవచ్చును.

శ్రీ అద్దేపల్లి కి ప్రాచీన సాహిత్యంపై గొప్ప పట్టు ఉండేది . మొదట్లో చందోబద్ధమైన కొన్ని వందల పద్యాల్ని రచించారు. 1960 లో తొలికవిత కృష్ణాపత్రికలో అచ్చయింది. కాలక్రమేణా తాను విశ్వసించే హేతువాద దృక్పధం, అభ్యుదయత, ప్రగతిశీల భావాలకు వచనకవిత్వమే సరైనదని అనుకొని వచన కవితామార్గాన్ని ఎంచుకొన్నారు. ప్రపంచీకరణ ప్రభావం వలన ఛిధ్రమౌతున్న మానవజీవనంపై కవిత్వం వ్రాసిన తొలి తెలుగుకవి శ్రీ అద్దేపల్లి. వీరి కవిత్వ సంపుటాలలో అంతర్జ్వాల (1970), రక్త సంధ్య (1978), గోదావరి నా ప్రతిబింబం (1992), పొగచూరిన ఆకాశం, సంఘం శరణం గచ్చామి, మెరుపు పువ్వు, గీటురాయి వంటివి ప్రముఖమైనవి. మినీ కవితల ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచి గొప్ప ప్రాచుర్యాన్ని కలిగించారు శ్రీ అద్దేపల్లి. తెలుగులో అనేక వందల గజల్ లను రచించి వాటిని గొప్ప రాగయుక్తంగా ఆలపించి అనేక సభలను రంజింపచేసేవారు. వీరి అనేక కవితలు వివిధ భాషలలోకి

అనువదింపబడ్డాయి. కవిగా శ్రీ అద్దేపల్లి తెలుగు సాహితీలోకంలో ఎప్పటికీ చిరస్మరణీయుడే.

విమర్శకునిగా శ్రీ అద్దేపల్లి పాత్ర గణనీయమైనది. శ్రీశ్రీ మహాప్రస్థానంపై వీరి మొదటి విమర్శనా గ్రంథం వచ్చి పలువురి ప్రసంశలు పొందింది. ఈ వార్తవిన్న శ్రీశ్రీ యే స్వయంగా “సరోజినీ ఈ విషయం విన్నావా, నా పుస్తకం మీద సమీక్షా గ్రంథం వస్తోంది” అని చెప్పటం ఒక మధురమైన ఘట్టం. కుందుర్తి వచన కవితా వైభవం, స్త్రీవాద కవిత్వం-ఒక పరిశీలన, మహాకవి జాషువా కవితా సమీక్ష, తెలుగు కవిత్వంపై ఆధునికత, అభ్యుదయ విప్లవ కవిత్వాలు-సిద్ధాంతాలు, శిల్పరీతులు వంటివి శ్రీ అద్దేపల్లి వెలువరించిన వివిధ విమర్శనా గ్రంధాలు. మంచిని విస్తారంగా చర్చించి, చెడును సూచనప్రాయంగా ఎత్తిచూపటం శ్రీ అద్దేపల్లి విమర్శనా శైలి.

వక్తగా శ్రీ అద్దేపల్లి సమకాలీన సాహితీవేత్తలెవరూ అందుకోలేనంత ఎత్తులో ఉంటారు. సభలకు ఎవరైనా పిలిస్తే దూరభారాలకు వెరవకుండా, తప్పనిసరిగా హాజరయ్యి, ఆ సంస్థలకు, అక్కడి యువకవులకు ఎంతో స్పూర్తిని, ఉత్తేజాన్ని నింపే గొప్ప ఉపన్యాసాలు ఇచ్చేవారు. రిజర్వేషన్ దొరకకపోతే జనరల్ భోగీలో ప్రయాణించైనా సరే, వస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకొనేవారు శ్రీ అద్దేపల్లి. ఈ లక్షణాన్ని గుర్తించిన తెలుగు సాహితీలోకం శ్రీ అద్దేపల్లికి “సాహితీ సంచార యోధుడు” అన్న బిరుదును ఇచ్చి సత్కరించింది. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలపై లోతైన అవగాహనతో వీరు చేసే అనర్ఘళమైన ఉపన్యాసాలు, చక్కని ఉటంకింపులతో, చలోక్తులతో సాగి సభికులను రంజింపచేసేవి. వీరు గత ముప్పై ఏళ్ళుగా ఇచ్చిన ఉపన్యాసాలు రెండువేలకు పైమాటే.

వ్యక్తిగా శ్రీ అద్దేపల్లి స్నేహశీలి, నిరాడంబరుడు, భోళాశంకరుడు, నిరంతర సాహితీకృషీవలుడు. సమయపాలన విషయంలో శ్రీ అద్దేపల్లి నిక్కచ్చిగా ఉండేవారు. వీరు అధ్యక్ష్యత వహించిన సభలలో కాలం తూకం వేసినట్టు నడిచేది. తనకన్నా చిన్నవారిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని వారి

కవిత్వంలోని గుణగణాలను విప్పిచెప్పి ప్రోత్సహించేవారు. ఎవరైనా మంచి వాక్యం వ్రాస్తే భలే ఉంది అంటూ వెన్నుతట్టి మెచ్చుకొనేవారు. శ్రీ అద్దేపల్లి అద్యక్షత వహించిన ఒక సభలో నేను నా కవిత వినిపించి వెళిపోతుంటే, నన్ను ఆపి --- బొల్లోజు బాబా కవిత్వం వాచ్యంగా ఉండదు ధ్వని ప్రధానంగా ఉంటుంది, ఇప్పుడు చదివిన కవితా పంక్తులలోని సొబగులు ఇవి అంటూ విశ్లేషించి, అభినందించటం--- నేను ఎన్నటికీ మరచిపోని ఒక తీపి జ్ఞాపకం.
తెలుగు కవిత్వయోధుడు శ్రీ అద్దేపల్లి రామమోహనరావు ఆత్మకు శాంతి కలగాలని కోరుకొంటూ.......

జనవరి, 2016

సమగ్ర కళా విమర్శకుడు - శ్రీ అద్దేపల్లి రామమోహన రావు - సెప్టెంబరు 2020

కవి చేసిన సృజనలోని గుణదోష విచారణ చేయటాన్ని విమర్శ అంటారు. ఆధునిక విమర్శకులలో కట్టమంచి, రాళ్ళపల్లి, విశ్వనాథ, శ్రీశ్రీ కోవలో నిలిచే వ్యక్తి శ్రీ అద్దేపల్లి రామమోహన రావు గారు.
శ్రీ అద్దేపల్లి కవిగా ఎంత లబ్ద ప్రతిష్టులో విమర్శకునిగా కూడా అంతే గొప్ప ప్రతిభావంతులు. వీరు సాహిత్యవిమర్శను ఇలా నిర్వచించారు.

"విమర్శ స్థూలంగా రెండు విషయాలమీద ఆధారపడి ఉంటుంది. మొదటిది కవితా వస్తువు. రెండోది శిల్పం. ఒట్టి వస్తువు మీద మాత్రమే దృష్టి ఉంటే, దానిలో వాచ్యత మాత్రమే ఉంటుంది. ఒట్టి శిల్పం మీద మాత్రమే దృష్టి ఉంటే

వ్యక్తికి గాని సమాజానికి గానీ సరైన ప్రయోజనం ఉండదు. అందువల్ల రెంటి మధ్యా సమగ్రమైన సమ్మేళనం ఉంటే అందులో ప్రయోజనం ఉంటుంది. వస్తువు శిల్పమూ ఎక్కడ కలిసిపోతాయో అది గొప్ప కవిత్వం. వస్తువును బాగా చెప్పేదే శిల్పం అవుతుంది. శిల్పం లేని వస్తువే గొప్పదనే వాదానికి పెద్దగా ప్రాముఖ్యం లేదు" అంటారు.

ఒక కవిని అంచనా వేయటానికి ఎంతో సహాయపడతాయి పై వాక్యాలు. అవి శ్రీ అద్దేపల్లి వారి సాహిత్యజీవితాన్ని కూడా పట్టిచూపుతాయి . విమర్శకునిగా శ్రీ అద్దేపల్లి విమర్శనావ్యక్తిత్వం ఆవిష్కృతమౌతుంది పై మాటలలో.

విమర్శకునిగా శ్రీ అద్దేపల్లి వెలువరించిన పుస్తకాలు, వారు వెలిబుచ్చిన అభిప్రాయాలు.

1. శ్రీశ్రీ కవితా ప్రస్థానం

శ్రీశ్రీ మహాప్రస్థానంపై వ్రాసిన "శ్రీశ్రీ కవితా ప్రస్థానం" అనే సమీక్షాగ్రంథం శ్రీ అద్దేపల్లి వారి మొదటి విమర్శనా రచన. ఈ పుస్తకంపై రాచమల్లు రామచంద్రా రెడ్డి చేసిన ప్రతివిమర్శ, దానికి అద్దేపల్లి వారు ఇచ్చిన సమాధానం ఆ పై నడచిన చర్చ - అప్పట్లో తెలుగు సాహిత్యప్రపంచంలో గొప్ప సంచలనం సృష్టించింది. శ్రీశ్రీ కవిత్వాన్ని విశ్లేషించేటపుడు "అక్షరాక్షర పరిశీలన" అనే పదం వాడారు. ఇది అద్దేపల్లి వారు సృజించిన పదమే. శ్రీశ్రీ మహాప్రస్థానాన్ని వర్ణిస్తూ "కాల్పనికతకీ, అభ్యుదయానికీ మధ్య ఎర్రని రేఖ" అంటారు. అద్దేపల్లి ప్రతిపాదించిన ఈ మాట నేటికీ ఎంతో విలువైనదిగా భావించవచ్చు. అద్దేపల్లి వారి గొప్పతనం ఎక్కడ ఉందంటే - ఆ తదనంతర కాలంలో శ్రీశ్రీపై చేసిన విమర్శలో ఉండిన "నా లోపాలు కూడా నాకు తెలిసినై" అని అంగీకరించటం. అది అద్దేపల్లి నిత్యచలనశీలతకు సంకేతం. ఇలాంటి వ్యక్తిత్వం విమర్శకులందరికీ గొప్ప ఆదర్శనీయం.

2. మహాకవి జాషువా కవితా సమీక్ష

జాషువా వ్రాసిన పుస్తకాలపై అద్దేపల్లి వ్రాసిన విశ్లేషణా వ్యాసాల గ్రంథం పేరు "మహాకవి జాషువా కవితా సమీక్ష". ఈ పుస్తకంలో జాషువా శైలి, శిల్పం, సామాజికత లాంటి అంశాలపై లోతైన చర్చ చేసారు అద్దేపల్లి. సాధారణంగా

కులప్రాతిపదికపై జాషువా సాహిత్యాన్ని పరిశీలించటం అందరూ చేస్తారు. కానీ ఎవరూ అంతవరకూ చెప్పని విషయాలను చెప్పటం విమర్శకునిగా అద్దేపల్లి ప్రత్యేకత. పిరదౌసి, ముంతాజ్ మహల్ కావ్యాలలో కథాశిల్పాన్ని చెప్పటం, స్వయంవరం పుస్తకంలో ఉండే రాజకీయ వ్యంగ్యాన్ని గురించి విశ్లేషించటం ఈ కోవకు చెందుతాయి.

భూస్వామ్య భావధారకు ఫలితమైన సమాజదురాచారాలను వ్యతిరేకించటమే జాషువా ప్రగతిశీలత అని; జాషువా గాంధీ సిద్ధాంతాన్ని, మానవతా సూత్రాల్ని, కరుణ రస ప్రాధాన్యాన్ని విశ్వసించి రచనావ్యాసంగం సాగించారు అన్న అద్దేపల్లి అభిప్రాయాలు జాషువాను అర్థం చేసుకోవటంలో దోహదపడతాయి.

3. అనుభూతి వాదం ప్రతిపాదన

ప్రముఖ కవి తిలక్ ను అనుభూతికవిగా, భావకవిగా అద్దేపల్లి దర్శిస్తారు. “అనుభూతి వాది తిలక్” అనే వ్యాసంలో అనుభవాన్ని, అనుభూతిని వేరుపరచి - అనుభూతి అనేది మనస్సును స్పందింపచేసి ఎక్కువకాలం గుర్తుండిపోయే అంశమంటూ అనుభూతిని నిర్వచిస్తారు. “అనుభూతిని రాస్తున్నట్టి కవులలో ఉపదేశము ఉండదు, ఒక నినాదము ఉండదు. ఒక సిద్ధాంతము ఉండదు. ఇవన్నీ పై పొరలకు సంబంధించినవి. కాని, లోపలి పొరలకు వెళ్ళినపుడు అవి అనుభూతి అవుతుంది” అంటూ అనుభూతి వాదాన్ని విశదపరుస్తారు. తిలక్ కవిత్వంలో కనిపించే వివిధ అనుభూతుల్ని ఉదహరిస్తూ సాగుతుందీ వ్యాసం. ఈ రకమైన కవిత్వాన్ని రాయటాన్ని "అనుభూతివాదం" అనొచ్చని ప్రతిపాదిస్తారు అద్దేపల్లి.

……

తెలుగు సాహిత్యచరిత్రలో ప్రధమంగా అనుభూతిని నిర్వచించటం దాని ఆధారంగా కవిత్వాన్ని విశ్లేషించటం, అట్టి కవిత్వానికి అనుభూతి వాదమని పేరుపెట్టటం చేసింది శ్రీ అద్దేపల్లే. భావకవిగా తిలక్ అనే మరో వ్యాసంలో భావకవిత్వం సౌందర్యప్రధానమని, తిలక్ శైలిలోనే గొప్ప సౌందర్యం ఉంటుందని అదే విధంగా తిలక్ లో అభ్యుదయ భావాలుకూడా హెచ్చుగానే ఉన్నాయని నిరూపిస్తారు అద్దేపల్లి.

……

“కృష్ణ శాస్త్రి కవిత్వంలో అనుభూతి ఒక వేదనా స్పర్శతో కూడి ఉంటుంది” అంటారు అద్దేపల్లి. అంతే కాక ఒక వ్యాసంలో “కృష్ణ శాస్త్రి కృష్ణ పక్షం, ఊర్వసి, ప్రవాసం - ఈ మూడు వ్రాసి ఉండకపోయినా, ఒక్క “అన్వేషణము” అనే ఖండిక వ్రాస్తే చాలు, మహాకవిగా నిలబడిఉంటాడు” అంటూ చేసిన ఒక సాహసోపేతమైన వ్యాఖ్య దాన్ని సహేతుకంగా సమర్ధించిన విధానము విమర్శకునిగా అద్దేపల్లి ప్రదర్శించిన అసాధారణమైన సాధికారిక ప్రజ్ఞ.

4. మిని కవిత - శిల్పం శైలి.

ఒకనాటి తెలుగు కవిత్వలోకంలో మిని కవితా ఉద్యమం ఒక ప్రభంజనం. ఆ ఉద్యమాన్ని దాదాపు చేయిపట్టుకొని ముందుకు తీసుకెళ్ళి ప్రచారం చేసిన వారిలో శ్రీ అద్దేపల్లి ప్రముఖులు. "మినికవిత" అనే పుస్తకంలో మినీ కవితా శిల్పాన్ని, శైలిని సోదాహరణంగా చర్చించారు అద్దేపల్లి. "ఒకే ఒక్క భావాన్ని సాధ్యమైనంత శక్తిమంతంగా, హృదయంలో ముద్రపడేటట్లు, ధ్వనిపూర్వకంగా చెప్పటానికి మినీకవిత ఉపకరిస్తుంది, మిని కవితకు ఉచ్ఛ్వాసం క్లుప్తత, నిశ్వాసం ధ్వని” అంటూ శ్రీ అద్దేపల్లి ఇచ్చిన నిర్వచనాన్ని నేడు వస్తున్న ఏ రకపు కవితకైనా అన్వయించుకోవచ్చు.

రుబాయీలు, గాలిబ్ గీతాలు, గురజాడ, శ్రీశ్రీ కవితలను ఉదహరిస్తూ మినికవిత్వం అనేది ఎప్పటినుంచో ఉన్న ప్రక్రియేనని నిరూపించే ప్రయత్నం చేస్తారు అద్దేపల్లి.

కొత్తగా ఒక సాహిత్య ప్రక్రియ మొలకెత్తుతున్నప్పుడు దానిని స్వాగతించి, ఆ ప్రక్రియకొక సైద్ధాంతిక నేపథ్యాన్ని అందించటం విమర్శకుల బాధ్యత. మినికవితోద్యమ సందర్భంగా అద్దేపల్లి ఆ పనిని ఈ పుస్తకం ద్వారా సమర్ధవంతంగా నెరవేర్చారు.

5. దృష్టిపథం - అస్తిత్వ వాదాలపై విశ్లేషణ

వివిధ అస్తిత్వవాదాలు తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేస్తున్న సందర్భంలో దళిత, బహుజన, స్త్రీవాద రచనలపై వ్రాసిన విశ్లేషణాత్మక వ్యాససంపుటి “దృష్టిపథం”. ఈ పుస్తకంలో దళితవాద, స్త్రీవాద, పోస్ట్ మోడర్నిజం పుట్టుపూర్వోత్తరాలను లోతుగా చర్చించి, వాటి అవసరతను, బాధ్యతలను

గుర్తుచేస్తారు. ఈ సంపుటిలో బొజ్జాతారకం గారు వ్రాసిన "నదిపుట్టిన గొంతుక" లోని తాత్వికధార తెలుగు ఆధునిక దళిత అస్తిత్వవాదానికి పునాదిగా నిలిచింది అని చేసిన ప్రతిపాదన అపూర్వమైనది.

....

ఈ పుస్తకంలో శ్రీ అద్దేపల్లి - ఫ్యూడల్ వ్యవస్థలో స్త్రీ బానిస అయితే బూర్జువా వ్యవస్థలో ఒక వస్తువు; పోస్ట్ మోడర్నిజం ఒక అవాంఛనీయ ధోరణి; దళితకవిత్వం ఒక ఉద్యమ కవిత్వంగా మారుతుందని మొదట్లోనే అంచనా వేయటం -లాంటివి వీరి సామాజిక అవగాహనకు నిదర్శనం.

తెలుగు సాహిత్యవిమర్శనా పుస్తకాలలో దృష్టిపథం అత్యంత విలువైనది, ఆధునిక తెలుగు కవిత్వరీతులను అధ్యయనం చేయటానికి ఇదొక దిక్సూచి.

6. అభ్యుదయ విప్లవ కవిత్వాలు-సిద్ధాంతాలు; శిల్పరీతులు

శ్రీ అద్దేపల్లి గారు తమ డాక్టరేట్ కొరకు సమర్పించిన సిద్ధాంత గ్రంథం ఇది. తెలుగు సాహిత్యరంగానికి సంబంధించి అభ్యుదయ, విప్లవ కవిత్వాల యొక్క సిద్ధాంత చర్చలు ఎక్కువగా జరిగాయి తప్ప, వాటిలోని శిల్ప సమీక్ష పెద్దగా జరగలేదు. నిజానికి అదొక ఖాళీ ప్రదేశం. దిశానిర్దేశనం చేయటానికి ఎటువంటి పూర్వరచనలు అందుబాటులో ఉండవు. అటువంటి టాపిక్ తీసుకోవటం సాహసోపేతమైన చర్య. ఒక రకంగా సవాలు కూడా. శ్రీ అద్దేపల్లి ప్రతిభ కలిగిన సాహసి కనుక ఈ టాపిక్ ను తమ డాక్టరేట్ కొరకు ఎంచుకొని ఆ లోటును ఈ సిద్ధాంతగ్రంథం ద్వారా సమర్ధవంతంగా పూరించారు.

7. కుందుర్తి కవితా వైభవం

కుందుర్తి ఆంజనేయులు గారి కవిత్వాన్ని సమగ్రంగా చర్చించిన పుస్తకమిది. కుందుర్తి అచ్చమైన ప్రజాకవి అని, కథా కథన పద్ధతిలో ధ్వని మార్గాన్ని అనుసరించిన కవి అని, వ్యంగ్యాన్ని సమర్ధవంతంగా ఉపయోగించుకొన్నాడు అని శ్రీ అద్దేపల్లి చేసిన ప్రతిపాదనలు ఎంతో ఖచ్చితమైనవి, విలువైనవి.

8. సమకాలీనత

సాహిత్య విమర్శకుడు తప్పని సరిగా తనకాలంలో వస్తున్న వివిధ అంతర్జాతీయ రచనలను, వాటిపై వస్తున్న విమర్శను నిత్యం అధ్యయనం చేస్తూ ఉండాలి. ఇది అద్దేపల్లి వారు జీవిత పర్యంతమూ సాగించారు. శ్రీశ్రీని విమర్శించేటపుడు ఆనాటి టి.ఎస్. ఇలియట్ తో పోల్చటం; కృష్ణశాస్త్రిని విశ్లేషించేటపుడు ఠాగూర్ శైలిని ప్రస్తావించటం; తిలక్ వద్దకు వచ్చేటపుడు ఇమేజిస్ట్ సిద్ధాంత సారాంసాన్ని అన్వయం చేయటం; జాషువా కవిత్వాన్ని వివరించాల్సి వచ్చినపుడు భారతీయ భూస్వామ్య, కుల వ్యవస్థలలో అతని కవిత్వ మూలాల్ని అన్వేషించటం; స్త్రీవాదాన్ని, పోస్ట్ మోడర్నిజం, దళిత, మైనారిటీ వాదాల్ని విశ్లేషణ చేసేటపుడు ప్రపంచీకరణ, హ్యూమన్ రైట్స్ పట్ల ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను చర్చించటం - అద్దేపల్లి కాలానుగుణ పరిణామశీలతను, నిరంతర అధ్యయనాన్ని, కాలిక స్పృహను మనకు పట్టిచూపుతాయి.

......

అనేక వందల పుస్తకాలకు అద్దేపల్లి వ్రాసిన ముందుమాటలలో ఎక్కువగా ఆ కవిత్వంలోని మంచిని వెలికితీసి చూపేవారు. ఇది వారి ఔదార్యానికి, ఔచిత్యానికి నిదర్శనం.

......

నలభై ఏళ్ళపాటు సాగిన శ్రీ అద్దేపల్లి విమర్శనాయానాన్ని గమనిస్తే- ఈయన ఆయా కాలాలలో వచ్చిన అన్ని ధోరణులను అధ్యయనం చేసి, వస్తువుతో పాటు కవి భావాల్ని, అతని పదాలకున్న శక్తిని, అతని శైలిని, శిల్పాన్ని మొదలైన అన్నింటిపై లోతైన విశ్లేషణలు చేసిన "సమగ్ర కళా విమర్శకుడు" గా దర్శనమిస్తారు.

ఉపయుక్త గ్రంథాలు

1. అద్దేపల్లి రచనలు సమగ్రపరిశీలన – సిద్ధాంత గ్రంథం శ్రీ వాసా భూపాల్
2. డా. అద్దేపల్లి సారస్వత సమీక్షా దర్శిని
3. డా. అద్దేపల్లి రామమోహన రావు రచనలు
4. సారస్వత వివేచన – రాచమల్లు రామచంద్రారెడ్డి
5. అద్దేపల్లి వైమర్శిక ప్రస్థానం ఆదర్శనీయం – తంగిరాల చక్రవర్తి

శిఖామణి కవితా దర్శనం

మూడున్నర దశాబ్దాల క్రితం "మువ్వల చేతికర్రతో" తెలుగు సాహిత్యలోకంలోకి అడుగుపెట్టారు శిఖామణి. తల్లి చేతి స్పర్శని, చిన్నప్పటి పిప్పరుమెంటు రుచిని, చెక్కిలిపై ఆరిన కన్నీటి చారికను, ఖేదమో మోదమో తెలీని తన్మయత్వాన్ని నింపుకొని వచ్చిన శిఖామణి కవిత్వం ప్రతిఒక్కరిని ఆకట్టుకొంది.

ఈ మూడున్నర దశాబ్దాలలో శిఖామణి 12 కవితా సంపుటులు, 9 విమర్శనా గ్రంధాలు వెలువరించారు. ఇతర భాషలలోకి 5 కవిత్వ సంపుటులుగా వీరి కవిత్వం అనువదింపబడింది. 7 పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. ఆంధ్రదేశంలోని దాదాపు అన్ని సాహిత్య సంస్థలనుండి పురస్కారాలను అందుకొన్నారు. ఒక కవిగా, విమర్శకునిగా, పీఠికా కర్తగా, పరిశోధకునిగా, పరిశోధనా పర్యవేక్షకునిగా, ఒక కవిత్వ కార్యకర్తగా, సాహిత్య సభలలో వక్తగా, పత్రికా సంపాదకునిగా వీటన్నిటికీ మించి మార్దవం నిండిన మనిషిగా- శిఖామణి సహస్ర బాహువులతో ప్రకాశించే కార్తవీర్యార్జునుని గా కనిపిస్తారు.

కవిగా శిఖామణి

జీవితపు రణగొణధ్వనుల మధ్య జారిపోయే సున్నితానుభవాలను నేర్పుగా ఒడిసిపట్టుకోవటం - నడచి వచ్చేసిన మార్గంలోని రాలుపూల పరిమళాల్ని నెమరువేసుకొంటూ కలల మాలలల్లటం - మనిషితనం తగలకపోతుందా అంటూ లోలోపలికి తవ్వుకుంటూ పోయేతత్వం - కాస్త అమాయకత్వం, లోకం మీద ఇంత దయా తప్ప మరే అలంకారాలూ లేకపోవటం - స్వప్నాన్ని కమ్మిచ్చుగుండా సాగదీసి సాగదీసి బంగారు తీగలాంటి ఓ వాక్య చిత్రాన్ని నిర్మించటం - మనచుట్టూ జరుగుతున్న

అన్యాయాలపట్ల ధర్మాగ్రహం ప్రకటించటం- శిఖామణి కవిత్వంలో మనకు అడుగడుగునా కనిపిస్తాయి

జీవితానుభవాల్ని కవిత్వానుభవాలుగా మార్చటంలో శిఖామణి నేర్పరి. అనుభూతికి భాషలోకి అనువదించటం తేలికైన విషయం కాదు. అనుభూతులను వ్యక్తీకరించటానికి ఒక్కోసారి భాష సరిపోదు. ఒక అనుభూతిని అంతే శక్తిమంతంగా చదువరిలో ప్రవేశపెట్టటంలో శిఖామణి ప్రతిభ అనన్యసామాన్యం.

రోడ్డుపై ఎదురయ్యే బిచ్చగాళ్లను విసుక్కొంటూనో, జాలితోనో ఎంతోకొంత దానం చేస్తాం. మనం ఇచ్చిన నాణెం విలువ ఎంతో ఆ కబోది బిచ్చగాడు దాని అంచులను తడుముకొని తెలుసుకొంటాడు. ఆ విషయాన్ని కూడా మనం ఎపుడో ఒకప్పుడు గమనించే ఉంటాం. ఇంతవరకూ ప్రతిఒక్కరకూ ఎదురయ్యే అనుభవమే. కానీ శిఖామణి మరికొంత ముందుకు చూసి, ఆ అనుభూతిని ఒక అర్ధతతో కూడిన చిత్రంగా రూపుకట్టగలిగారు.

ఈ రోజు కబోది బొచ్చెలో
నువ్వు వెయ్యవలసింది
చిల్లర నాణెం కాదు
వాడు నాణెపు అంచులు తడిమి
దాని విలువను తెలుసుకునేటప్పుడు
నాణెపు అంచుకు బదులు
అక్కడ
నీ హృదయపు అంచులు దొరకాలి (హృదయదానం)

మామూలుగా జరిగే దైనందిన సంఘటనలను శిఖామణి అద్భుతంగా కవిత్వం చేస్తారు. ఉదాహరణకు "బొబ్బిలి టు పార్వతీపురం" అనేకవితలో కొన్ని వాక్యాలు ఇలా సాగుతాయి

ఒక అరుణోదయపు వేళ
ఇంటికి వెళ్లగానే

కాళ్లకు నీళ్ళిచ్చినప్పుడే అనుకొన్నాను
బొబ్బిలిలో ఉంటూ కూడా
ఈ కోడలు పిల్ల
మా యానాం చెరువు నీళ్ళు ఎలా తెచ్చిందా అని.

ఇక్కడ మా యానాం చెరువు నీళ్ళు అన్న వాక్యం వల్ల ఒక మామూలు విషయం కవిత్వమైంది. కవిది యానం, కవి చెపుతోన్న కోడలి పిల్లది కూడా యానామే. ఇద్దరూ యానాం చెరువునీళ్లు తాగిన వారే. ప్రస్తుతం ఆ కోడలు పిల్ల యానానికి సుమారు రెండువందల కిలోమీటర్లు దూరంగా బొబ్బిలి లో ఉంటుంది. మరి బొబ్బిలిలో యానాం చెరువు నీళ్ళు ఎలా సాధ్యం? అదే శిఖామణి కవిత్వ రహస్యం. అతని కవిత్వాన్ని చదువుతూంటే ఏదో సొంత ఇంట్లోకి అడుగుపెడుతున్నట్లు, మన ఆత్మలోకంలో మనమే సంచరించుస్తున్నట్లు అనిపించకమానదు.

మిత్రుడు లేని ఊరికి వెళ్లటం అనే అనుభవం చిత్రమైనది. ఆ మిత్రుని జ్ఞాపకాలు ముసురు కొంటాయి. హృదయం భారమౌతుంది. ఆ భారాన్ని మాటల్లో అంత సులభంగా చెప్పలేం. "చానాళ్లకి వెళ్లాను పాల్వంచకి" అనే కవితలో ఆ అనుభవాన్ని అద్భుతంగా పట్టుకొంటారు శిఖామణి.

తీరా వెళ్ళాక తెలిసింది
ఇతఃపూర్వం
అతను కేవలం పాల్వంచలో మాత్రమే ఉండేవాడని
ఇపుడతను
హైదరాబాద్ లోనూ నరసరావు పేటలోను
మహబూబ్ నగర్ లోనూ భద్రాచలంలోనూ
ఎక్కడెక్కడ తన మిత్రులున్నారో
అక్కడక్కడ ఏకకాలంలో ఉంటున్నాడని తెలిసింది
అవును
నిత్యసంచారికి శరీరంతో ఏం పని

చనిపోయిన వ్యక్తులు బ్రతికున్నవారి జ్ఞాపకాలలో జీవిస్తూనే ఉంటారు అన్న సత్యాన్ని పై వాక్యాలలో చెపుతున్నాడు.

ఇదే కవితకు పొడిగింపా అన్నట్లు "నువ్వు గుర్తొస్తావు" అనే కవిత లో- అలా జ్ఞాపకాలలో జీవించి ఉండటం కూడా ఎంతకాలం జరుగుతుంది అని ప్రశ్నించి గొప్ప తాత్వికంమైన సమాధానం చెపుతాడు ఇలా...

//నువ్వైనా ఎందాకా గుర్తొస్తావులే!
నిన్ను గుర్తు పెట్టుకున్నానన్న
గుర్తు నాకున్నంత వరకు.

ఒక శుభోదయాన
నేనెవరో ఇతరులు తప్ప
నన్ను నేను గుర్తు పట్టలేని క్షణాన
నిన్నూ నన్నూ కలిపి గుర్తు పట్టే వ్యక్తి
వ్యక్తంగానో అవ్యక్తంగానో
ఎక్కడో ఉండే వుంటాడు.

ఈ జ్ఞాపకాలన్నీ ఎప్పుడో ఒకప్పుడు ఆగిపోతాయి. అప్పుడు మనల్ని ఇతరులు గుర్తు పెట్టుకుంటారు అనటం జీవన వైచిత్రి.

కవిత్వానికి ఉండాల్సిన లక్షణాల పట్ల ప్రతికవికీ కొన్ని అభిప్రాయాలుంటాయి. అలాగే శిఖామణి కూడా "అప్పట్లో మా నాయన అనేవాడు" అనే కవితలో తన కవిత్వ మూలాలను చెప్పుకొంటాడు.

కవిత్వం రాయగానే సరికాదు
కాస్త జ్ఞానం వుండాలిరా అని
జ్ఞానం దేనికైనా అవసరపడుతుందేమోగానీ
కవిత్వం రాయడానికి కావాల్సింది
కాస్త అమాయకత్వం

లోకం మీద ఇంత దయా
అనుకోంటూను ఇప్పటికీ.//

పైన చెప్పినట్లుగా శిఖామణి కవిత్వంలో. మానవజాతిని కొత్తమలుపులు తిప్పాలనే గొప్ప గొప్ప ఊహలు, కార్యాచరణలు, సిద్ధాంతాలు లాంటి జ్ఞాన ప్రకటనలు ఉండవు. ఉండేదల్లా *ఉత్త హృదయ నివేదనా, ఈ లోకంపట్ల అపారమైన దయ.* పూలకుర్రాళ్లు, అంధ భిక్షకులు, రైళ్లలో యాచకులు, ఆఫీసులో అటెండరు, మేడపై వాలే పావురాలు, మరణించిన బాల్య మిత్రులు, స్నేహితులు వీళ్ళే ఎక్కువగా శిఖామణి కవిత్వానికి వస్తువులు

తెలుగు సాహిత్యంలో శిఖామణి రాసినన్ని ఎలిజీలు వేరే ఎవరూ రాయలేదంటే అతిశయోక్తి కాదు. ఇవన్నీ “స్మరణిక” పేరుతో పుస్తకంగా తీసుకొచ్చారు. దీనిలో మొత్తం 34 వ్యాసాలున్నాయి. శిఖామణి వ్యక్తులను ఎంతగా ప్రేమిస్తాడో, వారితో తనకు గల అనుభవాలను, వారిలోని మంచిని ఎంతెలా గుర్తుపెట్టుకొంటాడో ఈ నివాళి వ్యాసాలను చదివినపుడు అర్ధమౌతుంది. వారు మనకు తెలియని వ్యక్తులైనప్పటికీ గుండె బరువెక్కుతుంది. ఇవన్నీ శిఖామణి “మనిషి” గా జీవించాడు అనటానికి రుజువులు. శిఖామణికి ఈ లోకంపై, మనుషులపై ఎంత దయ, హృదయ వేదన లేకపోతే అంత ఆర్ధ్రంగా వారిగురించి వ్రాయగలడు!

ఒక్క ఉదాహరణ
శిఖామణి బంధువు యొక్క మూడునెలల పసిబిడ్డ చనిపోవటం మీద వ్రాసిన “నిదురించిన చిన్నిముద్దు” అన్న కవితలో

ఈ చిన్నారి శిశువు కోసం తవ్విన గోతిని చూసి
వానలకు పైవర వరకు ఉబికొచ్చిన నూతి నీటిలా
దు:ఖం జీవితపు ఇంత పై పొరల్లోనే ఉంటుందనుకోలేదు”

అన్న అత్యంత విషాదవాక్యాలతో సందర్భాన్ని కళ్లకు కడతాడు కవి. చిన్న పిల్లవానిని ఖననం చేయటానికి

చిన్నగొయ్యి సరిపోయింది అన్న సూచనకూడా గుండెల్ని పిండే ఒక వాస్తవం.

కవిత్వానికి కావాల్సినమరో అంశం అమాయకత్వం అని శిఖామణి అంటారు కానీ, నిజానికి శిఖామణి కవిత్వం పైకి అమాయకంగా కనిపిస్తూ లోపల జీవనతాత్విక సముద్రాలను ఇముడ్చుకొని ఉంటుంది.

ఈ విషయం శిఖామణి వ్రాసిన చిలక్కొయ్య కవితను పరిశీలిస్తే అర్ధమౌతుంది. ఇది ఒక గోడకు ఉండే చిలక్కొయ్య పై వ్రాసిన వస్తుకవితైనప్పటికీ, ఒక సంపూర్ణజీవితాన్ని అంతర్లీనంగా చెపుతూంటుంది. కవి బాల్యంలో చిలక్కొయ్యతో తనకు గల అనుభవాలతో కవిత మొదలౌతుంది.

"చిలక్కొయ్యపై పిచ్చుకలు వాలటం, కవి తల్లిగారు ఉత్త పసుపు పుస్తెలతాడు వేలాడదీయటం, దానికి తగిలించిన సీమవెండి కేరేజీలో చప్పరింపు చప్పరింపుకు రంగులు మారే బిళ్లలను వారి అమ్మగారు దాయటం, మూడో పురుషార్థ సాధనలో ఉన్న దంపతులను ఆ చిలక్కొయ్య నిర్వికారంగా చూడటం, ఈ ఒంటరి ప్రయాణంలో ఈదలేక నిష్క్రమిస్తూ అదే చిలక్కొయ్యకు ఆత్మను తగిలించటం" -ఇవీ ఈ కవితలో కనిపించే వివిధ దృశ్యచిత్రాలు. అతి సామాన్యంగా కనిపించే వాక్యాలతో కవిత మొదలై ముగింపుకు వచ్చేసరికి అవే పదాలు మరో గొప్ప అర్థాన్నిచ్చే విధంగా మారతాయి. కవిత ప్రారంభంలో కనిపించిన కొయ్య చిలుక నెమ్మది నెమ్మదిగా కనుమరుగవుతూ, ఓ జీవితం కనిపించటం మొదలవుతుంది.

శిఖామణి కవిత్వంలో దళిత ఈస్తటిక్స్

శిఖామణి మొదట మనిషి ఆ తరువాత దళితుడు. దళిత కవిత్వం ఉత్తుంగ తరంగంలా తెలుగు సాహిత్యలోకంలో ఎగసినపుడు శిఖామణి ఆ కవిత్వానికి తాను అందించాల్సిన సామాజిక కర్తవ్యాన్ని గుర్తించారు. దళితుల

పక్షన నిలబడి కవిత్వం వ్రాసారు. అంతకు మునుపు దళితుల సమస్యలను కవిత్వీకరించలేదనే విమర్శను నిజాయితీ గా అంగీకరిస్తారు శిఖామణి.

పూల కుర్రాళ్ల గురించీ
గుడ్డి బిచ్చగాళ్ల గురించీ
పుప్పొడి పదాలతో పలవరించిన నేను
పదిరికుప్పం పరాభవాల గురించి
పన్నెత్తు మాటయినా పలకలేకపోయాను. (క్షమాపణ)

ఆ తరువాత కిర్రుచెప్పుల భాష, చూపుడువేలు పాడే పాట కవిత్వ సంపుటులను, దళిత సాహిత్యతత్వం, దళిత సాహిత్యోద్యమం పేర్లతో విమర్శనా గ్రంధాలను వెలువరించారు.

కవిని నేను/వర్ణచాపాన్ని విరగ్గొట్టడానికి వచ్చిన/దళిత కవిని నేను --- అని ప్రకటించుకొన్నాడు (?). శిఖామణి దళిత ఈస్తటిక్స్ దళిత కవిత్వానికి కళాత్మకతను అద్దింది. ఆ విషయంలో శివసాగర్ సరసన స్థానం ఈయతగినవారు శిఖామణి.

శిఖామణి వ్రాసిన “మా బాప్ప”, “నల్లని దానను” కవితలలో దళిత ఈస్తటిక్స్ నిరుపమానంగా వ్యక్తమౌతాయి.

మా బాప్ప
వాడతప్ప వూరు లేని
కులంతప్ప పేరు లేని
శ్రమ తప్ప సుఖం లేని
మా బాప్ప కథ వింటారా?

బాప్పంటే మాటలా
పొడుగాటి బొప్పాయి చెట్టులా
వెనక్కి తిరిగి చూడని యేరులా
ఆకాశాన్ని సవాలు చేసే
సన్నని సరివి చెట్టులా

చేయెత్తు మనిషి
కచ్చా బిగించి
భుజాన కొడవలితో పొలానికి వెళ్తుంటే
తోక మీద నిలబడిన
ఆరడుగుల నల్ల తాచులా
అగుపించేది మా బాప్ప

నలుపంటే నలుపా అది!
గుత్తులుగా విరగకాచిన నేరేడు నలుపు
దుక్కిదున్నిన నల్లరేగడి మడిచెక్క నలుపు
పంటబోదెలో విరబూసిన నల్లకలువ నలుపు
అప్పుడే కోసి ఆరబోసిన మిరపకళ్లంలా
ఆ నల్లని నుదుటిమీద ఎర్రని బొట్టు
రూపుకు నల్లనే కాని
మా బాప్ప మనసు పుచ్చపువ్వు తెల్లన
బూరుగు దూది మెత్తన//
ఊరుతో వైరం వచ్చినప్పుడు
చెంగులో ఇంతకారప్పొడి
చేతిలో హరకెన్ లాంతరుతో
తెల్లవార్లూ ఏటిగట్టున కాపలా తిరిగిన
మా బాప్ప
చుండూరులో ఎందుకు పుట్టలేదా
అనుకొంటాను// (మా బాప్ప)

ఈ కవితలో కనిపించే కచ్చాబిగించటం, కొడవలితో పొలానికి వెళ్లటం, నేరేడు, కలువ, దుక్కిదున్నిన నల్లరేగడి, మిరప కళ్ళం, ఊడ్పుల కాలం, బడిపిల్లల మధ్యాహ్న భోజన పథకం, వెండి కడియాలలో లక్క, ఊరితో వైరం లాంటి దృష్టాంతాలన్నీ దళిత జీవనాన్ని దృశ్యమానం చేస్తూ కవిత సాంద్రతను పెంచుతాయి.

నల్లని దానను అనే కవితలో- నవధాన్యాలలో నాలుగవదానను, హంసలమధ్య పికిలిపిట్టను, చెమ్మసోకితే ఉబ్బిపోతాను, ఆపై స్పృశిస్తే తెల్లగా మెరిసిపోతాను వంటి పైపై పోలికలను బట్టి ఇది మినువులపై చెపుతున్న కవితగా అనిపించినా -- జాత్యాహంకారాన్ని దహించే నీలి అగ్నిశిఖ, ఆఫ్రికానుండి మొహంజొదారో వరకు నిక్షిప్తమైన నలుపు ధాతు శిలాజాలు, వీరబాహుడినుండి మండేలా వరకు సాగిన నల్లరక్తపు వెలిగే పాదముద్రలు, తెల్లజాతిని అబ్బురపరచిన నల్ల మైఖేల్ జాక్సన్ వంటి అనేక మెటఫర్ ల ద్వారా ఒక వర్గదృక్పథాన్ని కవితలో అత్యంత ప్రతిభావంతంగా ప్రవేశపెడతాడు కవి. దళిత ఈస్తటిక్స్ ఈ కవితలో అద్భుతంగా పలుకుతాయి.

శిఖామణి కవిత్వానికి అనుభూతి, మానవత, తాత్వికతలు పుష్కలంగా పొటమరించే అందాలు. ఉపమ, రూపకాలు శిఖామణి కవిత్వానికి మణిపూసలు. "సస్టెయిన్డ్ రిలీజ్ డ్రగ్ లాగ శిఖామణి అక్షరాల్లో కవిత్వం నిలకడగా స్రవిస్తూ ఉంటుంది అంటారు ప్రముఖ విమర్శకుడు శ్రీ కె.శ్రీనివాస్

విమర్శకుడు, సంపాదకుడు, సాహిత్య కార్యకర్త

వివిధ, సమాంతర, దళిత సాహిత్య తత్త్వం, దళిత సాహిత్యోద్యమం, సేతువు, వాగర్థ వంటి పుస్తకాలు శిఖామణిని మనకున్న మంచి విమర్శకునిగా నిరూపిస్తాయి.

ప్రయోగవాది పఠాభి, తెలుగు-మరాఠి దళిత కవిత్వం లాంతి పుస్తకాలు శిఖామణిలోని పరిశోధకుడిని మనకు చూపుతాయి.

విశ్వవిద్యాలయ ఆచార్యుని వృత్తిలో భాగంగా 25 పి హెచ్ డీలు, 42 ఎంఫిల్ లకు శిఖామణి పరిశోధక పర్యవేక్షకుడిగా వ్యవహరించారు. పద్యసాహిత్యం, తులనాత్మక పరిశీలన, ఆధునిక వచనం, కవిత్వం, నాటకం, సంస్కరణలు వంటి ఒకదానికొకటి సంబంధం లేని అంశాలకు పరిశోధక పర్యవేక్షకుడిగా ఉండటం ఒక అరుదైన విషయం.

పుస్తకానికి పీఠిక అనేది ఒక రికమెండేషన్ లెటర్ లాంటిది. శిఖామణికి గారికి ఈ విషయం చాలా బాగా తెలుసు. అందుకనే వీరి పీఠికలలో కవి పట్ల, అతని కవిత్వం పట్ల అవ్యాజమైన ప్రేమను చూపుతారు. వెన్ను తడతారు. లోపాలను సున్నితంగా చెపుతారు. 116 పుస్తకాలకు పీఠికా కర్తగా కూడా శిఖామణి సాహిత్యసేవ గణనీయమైనది.

కవిత్వం వ్రాయటం ద్వారా కవి సమాజం నుంచి ఎంతో గౌరవం, సన్మానాలు పొందుతాడు. కవిత్వాన్ని రాయటమే కాక మోయటం కూడా కవి భాద్యతగా తీసుకోవాలి అనుకొంటాను.

"యానమా నా ఆరో ప్రాణమా" అని పలవరించిన శ్రీ శిఖామణి యానాన్ని తన కవిత్వ కార్యక్షేత్రంగా చేసుకొని గత 2016 నుంచి ప్రపంచ కవితా దినోత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. తెలుగు సాహిత్యంలో లబ్దప్రతిష్టులను యానానికి తీసుకొని వచ్చి పొయెట్రీ వర్క్ షాపు నిర్వహించారు. "శిఖామణి కవితా పురస్కారం" నెలకొల్పి, తెలుగు సాహితీదిగ్గజాలను ఏటా సత్కరిస్తున్నారు. ఆంధ్ర దేశంలో వందలాది సభలలో అలుపెరుగక పాల్గొంటూ సాహిత్యప్రచారం చేస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే "కవి సంధ్య" పత్రికను 2016 నుండి అప్రతిహతంగా ఒంటిచేత్తో నడిపించుకొంటూ రావటం మరొక ఎత్తు. ఈ పనులన్నీ శిఖామణి మంచి కవే కాదు "గొప్ప కవిత్వ కార్యకర్త" కూడా అని నిరూపిస్తాయి.

ఇక చివరగా, శిఖామణి లేని తెలుగు కవిత్వం ఎలా ఉండేదని ప్రశ్నించుకుంటే తెలుగు కవిత్వంలో మానవసంబంధాలను ఆర్ధ్రంగా చెప్పటం అనే అర వెలితిగా ఉండేదేమో అనిపించక మానదు.

మే, 2021

యానాం కవులు

సాహిత్యపరంగా ఘనతవహించిన ఇంజరం, పిఠాపురం, రాజమండ్రి, కోనసీమ వంటి ప్రాంతాలనడుమ ఉన్న యానాం సహజంగానే ఆ వాసనలను పుణికిపుచ్చుకొంది. తెలుగు సాహిత్యానికి వన్నెతెచ్చిన సాహితీవేత్తలలో శ్రీ చెళ్ళపిళ్ల వెంకట శాస్త్రి ప్రముఖమైనవారు. వీరు పదేండ్ల వయసులో విద్యాభ్యాసనిమిత్తమై ఫ్రెంచి యానాం వచ్చారు. 18 ఏండ్ల వయసులో ఉన్నప్పుడు యానాం వెంకటేశ్వర స్వామిపై వ్రాసిన శతకంలో వ్యాకరణ దోషాలున్నాయని స్థానిక పండితులు విమర్శించటంతో, పౌరుషం వచ్చి వారణాసి వెళ్ళి సంస్కృత వ్యాకరణాన్ని నేర్చుకొని వచ్చారట. తరువాత వీరు కాకినాడకు మకాం వెళిపోయారు. యానాంలో పని చేసిన ఫ్రెంచి దేశస్థులలో సొన్నరెట్ మినహా ఎవరూ రచనా వ్యాసంగాన్ని నెరపినట్లు తెలియరాదు.

1908 లో జన్మించిన శ్రీ గెల్లా శ్రీనివాసరావు మంచి కవి. తను వ్రాసిన కవితలను శ్రీ దేవులపల్లి కృష్ణ శాస్త్రికి చూపినపుడు ఆయన వాటిని ఎంతగానో మెచ్చుకొని ప్రశంసించేవారట. 1932 లో జన్మించిన శ్రీ బొల్లోజు బసవలింగం చిన్నవయసులోనే వ్రాసిన "రాణి దుర్గావతి" అనే పద్యకావ్యం పలువురి పండితుల ప్రశంసలు పొందింది. తదుపరి వీరు అనేక నాటకాలు వ్రాసారు.
శ్రీమతి పంతగడ శేషమ్మ గారు యాభైసంవత్సరాల క్రితమే టాగోర్ గీతాంజలి, ఫ్రూట్ గేదరింగ్ పుస్తకాలను తెలుగులోకి అనువదించిన గొప్ప ప్రతిభావంతురాలు. వీరి భర్త శ్రీ పంతగడ బాలకృష్ణ రాసిన సాహిత్యవ్యాసాలు భారతి పత్రికలో వచ్చేవి.

ఫ్రెంచి యానాంలో పండితులకు, విద్వాంసులకు కొదవలేదు. ఇంద్రగంటి విశ్వపతి శాస్త్రి, సమతం కృష్ణయ్య, మహేంద్రవాడ వీర గణపతి శాస్త్రి, వంటెద్దు సుబ్బారాయుడు, శ్రీమతి కందర్ప వెంకట నరసమ్మ వంటి వారు గొప్ప పాండిత్యప్రకర్షను ప్రదర్శించేవారు. శ్రీ టి. శ్రీరామ చంద్రకీర్తి గారు "వెంకటేశ్వర శతకం" వ్రాసారు. యానానికి సమీపాన కల కరప గ్రామానికి చెందిన కోట్ర శ్యామల కామశాస్త్రి కూర్చిన "ఆంధ్ర వాచస్పత్యం" అనే బృహత్ నిఘంటువు

నిర్మాణం ఆర్థిక కారణాలవల్ల మధ్యలో ఆగిపోయినపుడు 1940 లలో యానాం ప్రజలు భూరి విరాళాలు ఇచ్చి ముందుకు నడిపించి తమ సాహిత్యాభిలాషను చాటుకొన్నారు.

ఇక ఆధునిక తెలుగు సాహిత్యరంగానికి యానాం కవులు అందించిన తోడ్పాటు తక్కువేమీ కాదు. శిఖామణి, దాట్ల దేవదానం రాజు, కె. విజయ లక్ష్మి, పి.ఎల్. ఆర్. స్వామి, చెల్లి రాం, బొల్లోజు బాబా, ముమ్మిడి నాగవరప్రసాద్, పొనుగుమట్ల అశోక్ కుమార్ లాంటి యానాం కవులు చేస్తున్న కృషి తెలుగు కవిత్వచరిత్రలో కొన్ని పుటలను సొంతం చేసుకొన్నదనటంలో అతిశయోక్తి లేదు.

శ్రీ శిఖామణి

సమకాలీన తెలుగుకవులలో శిఖామణి మేరుసమానుడు. వీరి మొదటి కవితా సంపుటి "మువ్వల చేతికర్ర" 1987 లో వెలువడింది. ఇది తెలుగుసాహితీలోకంలో అప్పట్లో ఒక సంచలనం. అప్పటివరకూ వచ్చిన అనుభూతి కవిత్వాన్ని శిఖామణి కవిత్వం భూమార్గం పట్టించింది. సామాజిక వాస్తవికతను, వైయక్తిక అనుభూతుల నేపథ్యంలో కరుణ రసార్థ్రంగా ఆవిష్కరించటం శిఖామణీ కవిత్వ విశిష్టత. ఉపమను ఇంత అందంగా, లోతుగా, విస్తృతంగా వాడుకొన్న మరొక ఆధునిక కవి కనిపించరు. శిఖామణి ఇంతవరకు చిలక్కొయ్య, కిర్రుచెప్పుల భాష, నల్లగేటు నందివర్ధనం చెట్టు, తవ్వకం, గిజిగాడు, పొద్దున్నే కవిగొంతు మొదలైన ఎనిమిది కవిత్వసంపుటులు వెలువరించారు.

దళిత సాహిత్యతత్వం, వివిధ, సమాంతర, తెలుగు-మరాఠీ దళితకవిత్వం, వాగర్థ, అభిజ్ఞ, స్మరణిక వంటి అనేక సాహిత్యవిమర్శనా గ్రంథాలను రచించారు. శిఖామణి కవిత్వాన్ని " బ్లాక్ రైన్ బో", "సెలెక్టెడ్ పొయెమ్స్" పేరుతో వేగుంట మోహన ప్రసాద్ ఇంగ్లీషులోకి అనువదించారు. ఎంపిక చేసిన కవితలను హిందీలోకి "ఘుంఘ్రూవాలి ఛడీ" పేరుతో డా.ఎం. రంగయ్యగారు, మళయాళంలోకి ఎల్.ఆర్. స్వామి గారు, కన్నడంలోకి వీరభద్రగౌడ గారు భాషాంతరీకరణ చేసారు. దళిత కవిగా స్పందించాల్సిన సందర్భాలలో స్పందిస్తూనే, విశ్వమానవ కవిగా శిఖామణి తన కవిత్వం,

విమర్శ, పీఠికలు, ఉపన్యాసాల ద్వారా తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేస్తున్నారు.
వీరు ఆంధ్రదేశంలో దాదాపు అన్ని సంస్థలనుండి పురస్కారాలను, సత్కారాలను పొందారు. వీటిలో -ఫ్రీవెర్స్ ఫ్రంట్ అవార్డు, ఉమ్మడిశెట్టి సాహితీ పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం సాహితీపురస్కారం, ఆంధ్రప్రదేష్ ప్రభుత్వ జాషువా పురస్కారం ప్రముఖమైనవి. ప్రస్తుతం యానాం కేంద్రంగా స్వీయసంపాదకత్వంలో “కవి సంధ్య” ద్వైమాసిక కవిత్వ పత్రికను నడుపుతున్నారు.

శ్రీ దాట్ల దేవదానం రాజు

1997 లో “వానరాని కాలం” తో కవిగా సాహితీలోకంలో ప్రవేశించి 2002 లో “దాట్ల దేవదానం రాజు కథలు” పేరుతో కథల సంపుటి తీసుకొచ్చి తన కలానికి రెండువైపులా పదును అని నిరూపించుకొన్న యానాం కవి శ్రీ దాట్ల దేవదానం రాజు. ఇటు కవిత్వాన్ని అటు కథలను చక్కని శైలితో, లోతైన ఆలోచనలతో వెలువరిస్తూ నేడు ఆంధ్రదేశం గర్వించదగిన స్థాయికి చేరి తన యశస్సుతో యానానికి వన్నెతెచ్చిన నిత్య సాహిత్య కృషీవలుడు, యానాం సందర్శించే సాహితీ ప్రియులపాలిట చలివేంద్రం శ్రీ రాజు గారు.

నిర్మలమైన భావధార, చిక్కని అనుభూతి, ఇజాలతో సంబంధం లేని జీవన స్పర్శలు, తేటగా కనిపిస్తూనే లోతుగా తాకే వాక్యాలు రాజుగారి కవిత్వ లక్షణాలు. యానాం సామాజిక, చారిత్రిక నేపథ్యంతో వ్రాసిన “యానాం కథలు”, “కల్యాణపురం” కథాసంపుటుల ద్వారా రాజు గారు తెలుగుసాహిత్యంలో యానానికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టారు.

గుండెతెరచాప, మట్టికాళ్ళు, ముద్రబల్ల, లోపలిదీపం, నదిచుట్టూ నేను, నాలుగోపాదం, పాఠం పూర్తయ్యాక, దోసిలిలో నది వీరి ఇతర కవితాసంపుటాలు. నాలుగోపాదం తమిళ్, కన్నడం, మళయాలం, ఫ్రెంచి భాషలలోకి అనువాదింపబడి మంచి పేరుతెచ్చుకొంది. పుదుచ్చేరి ప్రభుత్వం నుండి కళైమామణి, తెలుగురత్న పురస్కారాల్ని అందుకొన్నారు. దాదేరా పేరుతో సాహిత్య పురస్కారాలను ఏర్పాటు చేసి ప్రతి ఏటా ఒక ఉత్తమ కవికి, కథకునికి పురస్కారాలు అందిస్తున్నారు.

శ్రీమతి కె. విజయలక్ష్మి

చక్కని కవిత్వం, మేలైన అనువాదాలతో శ్రీమతి కె. విజయలక్ష్మి గారు తెలుగు సాహిత్యాన్ని పరిమళింపచేస్తున్నారు. వీరు 2005 లో "కదిలేమేఘం" పేరుతో కవితాసంపుటి తీసుకొచ్చారు. ప్రముఖ తమిళకవి అమృత గణేషన్ పుస్తకాన్ని "ఊయలలో సూర్యుడు" గా తెలుగులోకి అనువదించారు. విజయలక్ష్మిగారి కవిత్వంలో సందేశాత్మక సామాజిక ప్రయోజనం అంతర్లీనంగా కనిపిస్తుంది.
బలహీనవర్గాలపట్ల సహానుభూతి, సమాజపోకడలపై తనదైన వ్యాఖ్యానం, లోతైన వివేచనతో కూడిన హృదయసంస్కారం వీరికవిత్వ లక్షణాలుగా చెప్పుకోవచ్చు. స్త్రీవాదదృక్పథంతో ప్రత్యేకించి కవితలు వ్రాయకపోయినా వీరికవిత్వంలో స్త్రీవాదం స్వాభావికంగా పలుకుతుంది. వృత్తిపరంగా తెలుగు అధ్యాపకురాలు కావటంతో వీరి కవిత్వం చక్కని పదచిత్రాలు, ఉపమానాలు, భాషాగరిమ, భావపటిమలతో ఉంటూ అలరిస్తుంది.

శ్రీ పి. ఎల్. ఆర్ . స్వామి

పి.ఆర్.ఎల్ స్వామి గారు 2005 లో "పొత్తిళ్ళలోంచి" తొలి కవితాసంపుటి వెలువరించారు. తరువాత "కాయితం పడవ" పేరుతో హైకూల సంపుటి తీసుకొచ్చారు. "గుమ్మం తెర" "స్వామినీలు" అనే రెండు పుస్తకాలు ప్రస్తుతం ప్రింటులో ఉన్నాయి.

ఎటువంటి సిద్ధాంతపోకడలకూ పోకుండా తనదైన శైలిలో సామాజికాంశాలను భావవ్యక్తీకరణ చేయటం స్వామి గారి కవిత్వరీతి.
పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి కళైమామణి, తెలుగురత్న పురస్కారాల్ని పొందారు. వచన కవితాధారణ శ్రీ స్వామి గారి ప్రత్యేకత. వివిధ కవుల వందలాది కవితలను ధారణ చేసి భావయుక్తంగా ఆశువుగా చదువుతూ, శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తారు. ఓలేటి పార్వతీశం గారి ప్రోత్సాహంతో దూరదర్శన్ లో కూడా చాలాసార్లు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ రంగంలో వీరు చూపించిన ప్రతిభకు గుర్తింపుగా "వచన కవితధారణా చక్రవర్తి" అన్న బిరుదును పొందారు.

ఇతరుల కవితలను ధారణావధానాలు చేస్తూ, కలకాలం నిలిచిపోయే చక్కని మృధువైన కవిత్వం వ్రాస్తూ స్వామి గారు తన అసమాన ప్రతిభ తో తెలుగు సాహితీలోకంలో సుస్థిరమైన స్థానం సంపాదించుకొన్నారు.

చెల్లి రామ్

సి.హెచ్. రాం "కొయిటా అమ్మకు కన్నీటి ఉత్తరం" పేరుతో కవితా సంకలనం తీసుకు వచ్చారు. పదునైన అభివ్యక్తి, నిశితమైన పరిశీలన, వాక్యవాక్యానా కనిపించే దళిత దృక్పధం రాం కవిత్వానికి చక్కని గుర్తింపు తెచ్చాయి. అంబేద్కరిజాన్ని కవిత్వంలో ప్రతిభావంతంగా ప్రకటించే తెలుగు కవిత్వాన్ని ఎంచవలసి వచ్చినప్పుడు రాం కవిత్వాన్ని ఎవరూ విస్మరించలేరు.
అనాది గాయాల సలపరింతలను పిక్కటిల్లే గొంతుకతో రామ్ కవిత్వం ఎలుగెత్తినా అంతర్లీనంగా కరుణనిండిన తడేదో గుండెను తడుముతూంటుంది. ఆ విలక్షణతే- ఒక్క పుస్తకం మాత్రమే తీసుకొచ్చినా రామ్ కవిత్వానికి తెలుగు సాహిత్యంలో అజరామరమైన స్థానాన్ని కల్పించింది. రామ్ తన కవిత్వ గానాన్ని మరిన్ని సంపుటాలుగా విస్తరింపచేస్తాడని ఆశిద్దాం.

బొల్లోజు బాబా

2009 లో "ఆకుపచ్చని తడిగీతం" గా తెలుగు సాహితీలోకంలోకి ప్రవేశించాడు బొల్లోజు బాబా. శిఖామణి సాంగత్య ప్రభావం తనపై ఉందనే బొల్లోజు బాబా- 2016 లో "వెలుతురు తెర" పేరుతో స్వీయ కవితా సంపుటి, టాగోర్ స్ట్రే బర్డ్స్ ను అనువదించి "స్వేచ్ఛా విహంగాలు" గా తీసుకు వచ్చాడు. వివిధ ప్రపంచ కవుల కవితానువాదాలు, కవిత్వ పరిచయాలు, విమర్శనా వ్యాసాలతో తనకంటూ ఒక గుర్తింపుని తెచ్చుకొంటున్నాడు.

ముమ్మిడి చిన్నారి

ముమ్మిడి చిన్నారి మంచి భావనా పటిమ కలిగిన కవి. అతని కవిత్వంలో అభివ్యక్తి సూటిగా, శైలి సరళంగా, పదచిత్రాలు నూతనంగా ఉంటాయి. స్వతహాగా ప్రముఖ చిత్రకారుడు కావటంతో ఇతని కవిత్వంలో భావచిత్రాలు అందంగా కొత్త వర్ణణల వర్ణాలతో అలరిస్తాయి. కవితకు అనూహ్యమైన ముగింపు నివ్వటం చిన్నారి కవిత్వలక్షణం.

ఇతని డైరీలలో కొన్ని వందల హైకూలు ఉన్నాయి. పేరుగాంచిన ప్రముఖ హైకూ కవుల హైకూలకు ఏమాత్రమూ తీసిపోవవి. ఓ రెండు కవిత్వ సంపుటులకు సరిపడా చక్కని కవితలున్నాయి.
పొగ త్రాగటానికి వ్యతిరేకంగా వ్రాసిన అద్భుతమైన హైకూ శతకం ఇతని డైరీలో నిద్రిస్తుంది. ఒక్కో హైకూ నో స్మోకింగ్ బోర్డుకు చక్కని ప్రత్యామ్నాయంగా వాడుకోదగ్గవి. త్వరలో చక్కని సంపుటితో తన కవిత్వాన్ని తీసుకువస్తాడని భావిద్దాం.

శ్రీ పొనుగుమట్ల అశోక్ కుమార్

అశోక్ కవిత్వంలో సామాజిక స్పృహ సహజధారలా ప్రవహిస్తుంది. లోకంలో కనిపించే అన్యాయాలు, రాజకీయ వికృత క్రీడలపై అశోక్ కుమార్ కలం నిప్పుల వర్షం కురిపిస్తుంది. లోతైన భావనలను గొప్ప వొడుపుతో అక్షరాలలోకి వొంపి అందిస్తాడు. అశోక్ కవిత్వం ఆవేశపరుస్తుంది, ఆలోచింపచేస్తుంది ఒక సామాజిక మార్పుకు ప్రేరణగా నిలుస్తుంది. సామాజిక అనుభవాన్ని కవిత్వం చేయటంలో అశోక్ గొప్ప పరిణితి సాధించాడు. జిల్లాలో జరిగే పలువేదికలలో తన గళాన్ని, దృక్పథాన్ని బలంగా వినిపించే యానాం కవి శ్రీ అశోక్ కుమార్.

శ్రీ ఆకెళ్ల రవిప్రకాష్

తొంభైలలో ప్రముఖ కవి శ్రీ ఆకెళ్ల రవిప్రకాష్ గారు యానం పరిపాలనాధికారిగా సేవలందించారు. అంతవరకూ స్తబ్ధుగా ఉన్న యానాం సాహిత్యవాతావరణాన్ని కాంతివంతం చేసారు. వీరి కృషి కారణంగానే యానాంలో ప్రభుత్వంతరపున ఉగాది ఉత్సవాలు నిర్వహించటం ప్రారంభమైంది. అప్పటిదాకా వేరు వేరు దిక్కులలో ఉన్న యానాం కవులు ఒక వేదికపై కలుసుకొని తమ భావాలను పంచుకోవటం మొదలైంది.

శ్రీ ఆకెళ్ళ రవిప్రకాష్ అప్పట్లో ఇస్మాయిల్, స్మైల్, త్రిపుర, సదాశివరావు వంటి అనేకమంది ప్రముఖ సాహితీవేత్తలను యానానికి ఆహ్వానించి రోజులు, వారాల తరబడి రాచమర్యాదలతో చూసుకొనేవారు. అనేక సాహితీ చర్చలు జరిగేవి. వీటిలో శ్రీ దాట్ల దేవదానం రాజు ఇంకా ఇతర స్థానిక కవులు కూడా పాలుపంచు కొనేవారు. ఆ రకంగా యానానికి సంబంధించి ఆకెళ్ళ రవిప్రకాష్ - కవి, కవిపోషకుడు అయిన కృష్ణదేవరాయల వంటివారు.

యానాంలో పనిచేసిన కాలంలో రవిప్రకాష్ "ఇసకగుడి" కవిత్వ సంపుటిని వెలువరించారు. వీరి కవిత్వం లో అస్పష్టఛాయలు ఉండవు, స్వేచ్ఛగా, పదచిత్రాల సౌందర్యంతో సాంద్రంగా ఉంటుంది. శ్రీ రవిప్రకాష్ ఇంతవరకూ ఓ కొత్త మొహంజొదారో, ఇసకగుడి, ప్రేమప్రతిపాదన వంటి కవితాసంపుటులను వెలువరించారు. జన్మతః యానాం కవి కాకపోయినా శ్రీ రవిప్రకాష్ గారు చేసిన సేవను యానాం సాహితీసమాజం ఎన్నటికీ మరచిపోలేదు.

శ్రీ మధునాపంతుల సత్యనారాయణ మూర్తి , కొండూరి రామరాజు, నృశింహదేవ శ్రీనివాస శర్మ, మొహిబుల్లా ఖాన్, ఐ ఎస్ గిరి తదితర ప్రభృతులు యానాంలో జరిగే సాహితీకార్యక్రమాలలో పాల్గొంటూ ఆయా సభలను దిగ్విజయం చేస్తున్నారు.

శ్రీ పానుగుమట్ల విష్ణుమూర్తిగారు “జనమిత్ర” పత్రిక సంపాదకుడిగా, రచయితగా, అనువాదకునిగా తెలుగుసాహిత్యానికి తమవైన సేవలు అందిస్తున్నారు. ఎనభైలలో కీ.శే. చింతకాయల బాలకృష్ణ “ఈ వేళ” పేరుతో ఒక పత్రిక నడిపారు. (ఈ వ్యాసకర్త మొదటి రచన అందులోనే ప్రచురింపబడింది).

కీ.శే. చెల్లి కృష్ణమూర్తి గారి మనవడు సురేంద్రదేవ్ చెల్లి ఇప్పుడిప్పుడే చక్కని కవిగా పేరుతెచ్చుకొంటున్నాడు. యానాం నుంచి యువకవులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం శ్రీ శిఖామణి, శ్రీ దాట్ల దేవదానం రాజు చేస్తున్న సాహిత్యకృషి, యానాంలో వీరు జరుపుతున్న జాతీయస్థాయి సభలు నేటి యువతరానికి ప్రేరణగా నిలిచి మరింతమంది యువకవులు తయారవుతారని ఆశిద్దాం.

యానాం చరిత్ర పుస్తకాలు

శ్రీ దాట్ల దేవదానంరాజు విస్తృతమైన అధ్యయనం చేసి “యానాం చరిత్ర” పేరుతో యానాం చారిత్రిక, సామాజిక, రాజకీయ స్థితిగతులను గ్రంథస్థం చేసారు. ఆనాటి అనేక అరుదైన ఛాయాచిత్రాలు వీరీ పుస్తకంలో పొందుపరిచారు.

బొల్లోజు బాబా “యానాం విమోచనోద్యమం”, “ఫ్రెంచి పాలనలో యానాం” , ఫ్రెంచి ఇండియా స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ దడాల రఫేల్ రమణయ్య పుస్తకాల ద్వారా యానాం వలసపాలనాచరిత్రను వెలికితీసారు.

శ్రీమతి కె. విజయలక్ష్మి “ పుదుచ్చేరి ఒక చారిత్రిక విజ్ఞానకరదీపిక” పేరుతో పుదుచ్చేరి, మాహె, కారైకాల్, యానం ల చరిత్రను సంక్షిప్తంగా పుస్తకరూపంలోకి తెచ్చారు. ఈ పుస్తకాలు యానాం చారిత్రిక ప్రాధాన్యతను, విశిష్టతను సమగ్రంగా అధ్యయనం చేయటానికి దోహదపడతాయి.

జనవరి, 2017



బయోడేటా

పేరు: బొల్లోజు బాబా

చదువు: M.Sc, M.Phil., B.Ed., NET

తల్లితండ్రులు: బొల్లోజు బసవలింగం, అమ్మాజి

ముద్రిత రచనలు:

1. **యానాం విమోచనోద్యమం** (2007) - యానాంలో 1947 నుంచి 1954 మధ్య ఫ్రెంచి వారి పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్యపోరాటం గురించి.
2. **ఆకుపచ్చని తడిగీతం** 2009 - **కవితా సంకలనం**.
3. **"ఫ్రెంచి పాలనలో యానాం" (2012)** - 1724 లో ఫ్రెంచివారు యానాం వచ్చినప్పటినుంచి 1954 లో వెళ్లిపోయేవరకూ జరిగిన సంఘటనలు, ఆనాటి సామాజిక వ్యవస్థ
4. **"వెలుతురు తెర"** (2016) **కవితా సంపుటి**
5. '**స్వేచ్ఛా విహంగాలు** (2016) రవీంద్రుని స్ట్రే బర్డ్స్ **అనువాదం**
6. **"కవిత్వ భాష"** (2018) పాశ్చాత్య అలంకారలను వివరించే **సాహిత్య వ్యాసాలు**
7. **మూడో కన్నీటి చుక్క** (2019**) కవితా సంపుటి**
8. **మెకంజీ కైఫియ్యతులు - తూర్పుగోదావరి జిల్లా** (2020) కాలిన్ మెకంజీ సేకరించిన తూర్పుగోదావరి జిల్లా కైఫియ్యతులపై విశ్లేషణా వ్యాసాలు
9. **ప్రాచీనపట్టణాలు తూర్పుగోదావరి జిల్లా 2020** (ఉమ్మడి తూర్పుగోదావరి జల్లాలోని చారిత్రిక ప్రాముఖ్యత కలిగిన ప్రాచీనపట్టణాలు
10. **థేరీ గాథలు** – బుద్ధుని సమకాలీనులైన తొలితరం బౌద్ధ భిక్కుణిలు **రాసిన కవితల అనువాదం. (**2022)
11. **ఫ్రెంచి ఇండియా స్వాతంత్ర్య సమరయోధుడు- శ్రీ దడాల రఫేల్ రమణయ్య** జీవితము పోరాటము (2023)
12. **వేదబాహ్యులు** -చరిత్ర వ్యాసాలు వేదాలను విశ్వసించకుండా వెలుపల బతికిన ప్రాచీన మతవిశ్వాసాలు.(2024)

13; **ప్రాచీన గాథలు** -సంగం కవిత్వం, గాథాసప్తశతి, వజ్జాలగ్గం, కువలయమాల అమరుశతకం వంటి ముక్తకకావ్యాలనుంచి ఎంపిక చేసిన పద్యాల **- అనువాద కవిత్వం**.(2024)
14. **హరప్పా నుండి నేటి వరకూ** (2025) చరిత్ర వ్యాసాలు

e.books
వివిధ ప్రపంచకవుల రెండువందలకు పైన కవితల అనువాదాలు
'ఎడారి అత్తరులు' ప్రముఖ సూఫీ కవుల గీతాల అనువాదాలు
రవీంద్రుని క్రిసెంట్ మూన్ అనువాదం
వివిధ పుస్తక పరిచయ వ్యాసాలు
(పై ఇ బుక్స్ https://archive.org/details/@bolloju_baba కలవు)
ప్రసంశలు:

1. ఆకుపచ్చని తడిగీతం పుస్తకానికి శ్రీ శిలపరశెట్టి సాహితీ ప్రత్యేక ప్రశంసా పురస్కారం 2010
2. పాలకొల్లుకు చెందిన శ్రీకళాలయ సాంస్కృతిక సంస్థవారిచే రాష్ట్రస్థాయి సాహితీపురస్కారం -2012
3. ఇస్మాయిల్ సాహితీ పురస్కారం 2017
4. రొట్టమాకు రేవు కవిత్వ అవార్డు 2018
5. పాతూరి అన్నపూర్ణ స్మారక సాహిత్య పురస్కారం 2020
6. పెన్నా సాహిత్య పురస్కారం 2020

బొల్లోజు బాబా

నా పుస్తకాలను ఇక్కడ నుంచి డౌన్ లోడ్ చేసుకొనవచ్చును:

https://archive.org/details/@bolloju_baba

ఇది నా బ్లాగు. నా రచనలు అన్నీ ఇక్కడ చదువుకొనవచ్చును

https://sahitheeyanam.blogspot.com/

ఇది నా ఫేస్ బుక్ పేజ్

https://www.facebook.com/bollojubaba